

'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం.
రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది.
ఈ తృప్తి చాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20+6 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 74

బుధవారం 5-6-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



Smt. Sushma
Academic Director

మా NEET VAIDYAH ప్రోగ్రామ్ మరియు మా విద్యార్థుల అలుపెరుగని పోరాటం ముందు... క్లిష్టతరమైన ఫిజిక్స్, కెమిస్ట్రీ తలవంచకతప్పలేదు



NEET - 2024లో 700 మార్కులు ఆ పైన సాధించిన శ్రీచైతన్య విద్యార్థులు

Marks	Student	Appl.No
711 / 720 MARKS	ISHAAN AJAY KADUSKAR	240410029941 (DLP)
710 / 720 MARKS	KAVYA CHITARA	240411509978 (DLP)
710 / 720 MARKS	DANDU SAIKIRAN REDDY	240410031576
710 / 720 MARKS	GOLLAPUDI DIVYA SRI	240410265743
710 / 720 MARKS	PRIYANSH CHITTORA	240410233462 (DLP)
710 / 720 MARKS	KOSURI SAI LIKITH	240410697638
710 / 720 MARKS	GOLLAPALLI RIJEYA	240410197149
710 / 720 MARKS	BEESETTI JAIDEEP	240410690057
710 / 720 MARKS	JUREDDI MARUTHI	240410278574
710 / 720 MARKS	BHARANIDHARAN	240410376246
710 / 720 MARKS	LIKESH REDDY KATHI	240410015122
710 / 720 MARKS	KONDREDDY HIMAJA	240410231582
710 / 720 MARKS	ANANYA ASHOK RAO	240410252703
710 / 720 MARKS	JOY GUPTA	240410506932 (DLP)
710 / 720 MARKS	CHILAKALA SRAVAN KUMAR	240410359120
710 / 720 MARKS	MOHAMMED AZHAAN SAAD	240410517182
710 / 720 MARKS	NIYATI JAIN	240410631518
710 / 720 MARKS	MANNAT SIDHU	240410006908 (DLP)
710 / 720 MARKS	MUSKU PRIYA HASINI	240410074773
710 / 720 MARKS	POOLA DIVYA TEJA	240410202593
710 / 720 MARKS	PERA SATHVIK	240410343885
710 / 720 MARKS	MEENANSH SURI	240410009445 (DLP)
710 / 720 MARKS	YELLU SRISHANTH REDDY	240410011898
710 / 720 MARKS	NAMBURI AAKARSH VARMA	240410659717
710 / 720 MARKS	ALOOR PRANEETHA	240410195381
710 / 720 MARKS	JYOTIRGAMYA ACHARYA	240410468821 (DLP)
707 / 720 MARKS	VEDANT AMLATHE	240410450196
706 / 720 MARKS	DASARARAJU RAHUL VARMA	240410326616
706 / 720 MARKS	JONNALAGADDA SRI RAM	240410032871
706 / 720 MARKS	ATLURI VENKATA JAYANTH	240410227400
706 / 720 MARKS	NILAY SUCHAK	240410947363 (DLP)
705 / 720 MARKS	ABHIJEET SEVDA	240410002335 (DLP)
705 / 720 MARKS	SONAJOKE RAHUL	240410222723
705 / 720 MARKS	BODLA AASHRITHA	240410097254
705 / 720 MARKS	TIRUMAREDDY RESHMITHA	240410201724
705 / 720 MARKS	MAYANK GUPTA	240410307658 (DLP)
705 / 720 MARKS	KRISH JAIN	240410431792 (DLP)
705 / 720 MARKS	CHITTIBOYINA GURUCHARAN	240410273036
705 / 720 MARKS	RUSHIL PRASHANT WAGH	240411295502 (DLP)
705 / 720 MARKS	JENJETI DEEKSHITHA SAI	240410240763
705 / 720 MARKS	ANAND RAJ	240410502521 (DLP)
705 / 720 MARKS	JENNI BHARGAV SUMANTH	240410011483
705 / 720 MARKS	PAVITHRAN R V	240411425714
705 / 720 MARKS	P SRI VATSAL	240410045022
705 / 720 MARKS	MOHSIN SHAIKH	240410048198
705 / 720 MARKS	GANDI VENKATA RAMANA	240410883873
705 / 720 MARKS	BHUNETI TRIJAL REDDY	240410013506
705 / 720 MARKS	M VEMULA SAI ASHMITHA	240410026387
705 / 720 MARKS	JAYASHETTY ADITYA	240410629351
705 / 720 MARKS	MANAS KASA	240410061877
705 / 720 MARKS	VEERA VENKATA NIKHIL K	240410090633
705 / 720 MARKS	YERRA SIRI PRIYA	240410194208
705 / 720 MARKS	AMATUL MUHAIMIN FATHIMA	240410397306
705 / 720 MARKS	PENNAMADA NEEHARIKA	240410028531
705 / 720 MARKS	AMOGH PAREEK	240410026300 (DLP)
705 / 720 MARKS	P NARENDRA TAGOOR	240410324720
705 / 720 MARKS	MANYA JAIN	240411313079
705 / 720 MARKS	MUSTAFA AHMED	240410817389
705 / 720 MARKS	SARTHAK	240410153637 (DLP)
705 / 720 MARKS	VARNAVI K	240410096360
705 / 720 MARKS	VISWABHARAT VEMPATI	240410404369
702 / 720 MARKS	NALLAPATI VENKATA NITEESH	240410255582
701 / 720 MARKS	KASHISH	240410000563
701 / 720 MARKS	SANNAPUREDDY SAI GANESH	240410319440
701 / 720 MARKS	YALLA HARIKANTH	240410945781
701 / 720 MARKS	NAGA KARTHIK JARUGULLA	240410321593
701 / 720 MARKS	SANUDEEP DASH	240410005588 (DLP)
700 / 720 MARKS	AMEDA REENA REDDY	240410041738
700 / 720 MARKS	KARUMULLA PREETHI	240410295890
700 / 720 MARKS	AKKALA REDDY MANASWITHA	240410656087
700 / 720 MARKS	KUVAL K R	240410030498
700 / 720 MARKS	BERU SHASHANK	240410199084
700 / 720 MARKS	SHAIK FAZAL AHMED	240410114374
700 / 720 MARKS	SURABHI	240410576833 (DLP)
700 / 720 MARKS	GADDAM SHRI VARSHINI	240410596366
700 / 720 MARKS	THANDLE AJAY KUMAR	240411677451
700 / 720 MARKS	MALEKAR NANDITHA	240410604096
700 / 720 MARKS	KAUSHAL MADHAV VENIGALLA	240410535860
700 / 720 MARKS	GARUGU SREE AVINASH REDDY	240410208832
700 / 720 MARKS	CHUNDURU LEKHANA	240410590638
700 / 720 MARKS	YENUGUTALA SAISRUTHI	240410883918
700 / 720 MARKS	PULLA SRUTHI	240410014489
700 / 720 MARKS	SAI AKASH BANDARU	240410141055
700 / 720 MARKS	HASINI TEJOMURTHULA	240410201151
700 / 720 MARKS	MANSI JHA	240410230402 (DLP)
700 / 720 MARKS	JEEVAN S	240410261846
700 / 720 MARKS	V JYOTHSNA PRANEETHA ROYAL	240410359565
700 / 720 MARKS	C SAI SRI KRISHNA HEMANTHA	240410361267
700 / 720 MARKS	M VENKATA SNEHITA REDDY	240410798773
700 / 720 MARKS	VELURI SRIRAM	240410079575
700 / 720 MARKS	HIMAJA ANUMULA	240410436559
700 / 720 MARKS	J CHARAN VIKYATH REDDY	240410049592
700 / 720 MARKS	C VEDANTH SANTOSH	240410349268
700 / 720 MARKS	SAUBHAGYA VARSHNEY	240410002349
700 / 720 MARKS	ANSHUL MANOHAR ANDE	240410160263

Congratulations Students & Parents

Merit concessions based on NEET-2024 Marks in Telangana

Marks range	Concession
>450	90%
440 to 449	80%
430 to 439	70%
420 to 429	60%
410 to 419	50%
400 to 409	40%
390 to 399	30%
380 to 389	20%
<380	10%

Note: above concessions are applicable upto 9th June 24

Knowledge Hub — NEET | IIT JEE | FOUNDATION
Sri Chaitanya Educational Institutions

NEET 2025 COACHING CENTRES

KUKATPALLY : 91774 44352 | DILSUKHNAGAR : 91774 44326
AMEERPET: 95151 11054 | HIMAYATNAGAR : 91774 44341
KONDAPUR : 95151 11428 | TRIMULGHERRY : 91774 44837
www.srichaitanyaknowledgehub.com

VAIDYAH-2025
NEET LONGTERM PROGRAM
ADMISSIONS OPEN

వైద్యరంగంలో సంచలన విజయాలు సాధిస్తూ వేలాదిమంది డాక్టర్లను జాతికి అందించేందుకు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో, సబ్జెక్టుల్లో నిష్ణాతులైన ప్రొఫెసర్లతో, నిరంతర పరిశోధన, విశ్లేషణలు చేసే మేధావి వర్గంతో సృష్టించిన సరికొత్త ప్రోగ్రామ్

శ్రీచైతన్య 'వైద్య-2025' లాంగ్‌టర్మ్ ప్రోగ్రామ్‌తో
మీ డాక్టర్ కలని నిజం చేసుకోండి



OM VATS
Appl. No: 24041050032
715 / 720 MARKS

NEET
లాంగ్ టర్మ్ వైద్య ప్రోగ్రామ్ ద్వారా టాప్ మార్కులు సాధించిన మా విద్యార్థి

Scan QR for NEET Longterm




Extraordinary Performance from Long Term - VAIDYAH 2024

Student Name	Marks in 2023	Marks in 2024	Increase in Marks in NEET-2024	Student Name	Marks in 2023	Marks in 2024	Increase in Marks in NEET-2024
OM Vats	491	715	224	PAPPU AKSHAY	326	627	301
Kashish	528	701	173	ARYAN SATYANARAYAN P	330	650	320
Akala Reddy Manaswitha	510	700	190	YENDRA SNEHA REDDY	332	644	312
METTUPALLY DHARANESH	301	643	342	LANKA NIRDOSH	333	636	303
ERLA JHON VICTOR	309	611	302	KANDUKUR VAISHNAVI	335	651	316
MALLINA LAKSHMI ASRITHA	310	661	351	M VENKATA SAI SATHWIK	335	643	308
MADHIRE HIMADHYUTHI	310	652	342	K NAGA SATYANARAYANA	339	666	327
K VENU GOPAL	310	622	312	NAILAH ATHER KHAN	339	662	323
VALISHETTY AKHIL VARMA	313	658	345	ANURAG RAKESH BASA	341	648	307
JANNU SAI MOUNIKA	315	639	324	NAYANAPATRUNI NEELIMA	349	665	316
VARTHYA SIDDHU	315	626	311	G LAKSHMI AKASH REDDY	354	660	306
EDDANDI RUCHITHA	320	627	307				

HYDERABAD: DILSUKHNAGAR ZONE: BOYS RESIDENTIAL: RV HOUSE-NAGOLE A/C: **9177529351** | RK PURAM SEMI A/C: **8247845513** | **GIRLS RESIDENTIAL:** BANDLAGUDA A/C: **8247008202** | VANASTHALIPURAM SEMI A/C: **9642395095** | DSNR DAYS ZONAL: **9100114830** | **NARAYANAGUDA** NEW LTC CAMPUS: **9154137370** | **KUKATPALLY ZONE: BOYS RESIDENTIAL:** AGASTYA SRI BHAVAN-3 A/C: **9100984961** | AGASTYA SRI BHAVAN-2 SEMI A/C: **9949436457** | VYAS BHAVAN MALLAMPET: **9963964188** | **GIRLS RESIDENTIAL:** SAI SOUDHAM-2 A/C: 9177507382 | LAND MARK NON-A/C: **9701640765** | VIDHATHRI BHAVAN SEMI A/C: **8977002958**, **KPHB RAMAN BHAVAN: 9676990309** | **KUKATPALLY DAY SCHOLAR: 9177111845** | MADINAGUDA: **9177016306** | **SR NAGAR:** AKSARA BHAVAN: **8099287694**

శ్రీచైతన్య
విద్యాసంస్థలు

*T & C apply | Note: Any inadvertent error published in this advertisement could be brought to our notice | Note: The information is as per students feedback



'ఆర్థిక అసమానతలు తొలగకపోతే
రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20+6 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 74

బుధవారం 5-6-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ప్రపంచ చాంపియన్ డింగ్ లిరెన్‌పై ప్రజ్ఞానంద విజయం... వైశాలిపై హంపి గెలుపు

నార్వే ఓపెన్ చెస్ టోర్నీలో భారత యువ గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద సంచలన ప్రదర్శన కొనసాగుతోంది. స్టావెంజర్ నగరంలో జరుగుతున్న ఈ టోర్నీలో ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే), ప్రపంచ రెండో ర్యాంకర్ ఫాబియానో కరువానా (అమెరికా)లపై గెలుపొందిన ప్రజ్ఞానంద ఈసారి ప్రస్తుత ప్రపంచ చాంపియన్, ప్రపంచ ఏడో ర్యాంకర్ డింగ్ లిరెన్‌పై విజయం సాధించాడు. ఏడో రౌండ్‌లో డింగ్ లిరెన్‌తో జరిగిన క్లాసికల్ గేమ్‌ను ప్రజ్ఞానంద 30 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించాడు. విజేతను నిర్ణయించేందుకు వీరిద్దరి మధ్య 'అర్మగెడాన్' గేమ్‌ను నిర్వహించగా... తెల్ల పావులతో ఆడిన ప్రజ్ఞానంద 23 ఎత్తుల్లో డింగ్ లిరెన్‌ను ఓడించాడు. ఏడో రౌండ్ తర్వాత ప్రజ్ఞానంద 11 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్నాడు. మహిళల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి క్లాసికల్ విభాగంలో తొలి విజయం అందుకుంది. భారత్‌కే చెందిన గ్రాండ్‌మాస్టర్ వైశాలితో జరిగిన గేమ్‌లో హంపి 36 ఎత్తుల్లో నెగ్గింది. ఏడో రౌండ్ తర్వాత హంపి 8 పాయింట్లతో ఐదో స్థానంలో ఉంది.





ఫరూఖీ

అఫ్గాన్ అదరహో

- 125 పరుగులతో ఉగాండాపై గెలుపు
- చెలరేగిన గుర్బాజ్, జద్రాన్
- 5 వికెట్లు పడగొట్టిన ఫరూఖీ

గయానా: తొలి టి20 ప్రపంచకప్ ఆడుతున్న ఉగాండాపై అఫ్గానిస్తాన్ ఆల్‌రౌండ్ షోతో పంజా విసిరింది. గ్రూప్ 'సి'లో మంగళవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్ 125 పరుగుల భారీ తేడాతో ఏకపక్ష విజయాన్ని సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన అఫ్గానిస్తాన్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 183 పరుగులు చేసింది. ఓపెనర్లు రహ్మనుల్లా గుర్బాజ్ (45 బంతుల్లో 76; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), ఇబ్రహీం జద్రాన్ (46 బంతుల్లో 70; 9 ఫోర్లు, 1 సిక్స్) తొలి వికెట్‌కు 14.3 ఓవర్లలో 154 పరుగులు జోడించారు. ప్రత్యర్థి బౌలర్లలో క్యెవుటా, మసబా చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన ఉగాండా 16 ఓవర్లలో 58 పరుగులకే కుప్పకూలింది. ఒబుయా (14; 1 సిక్స్), అలీ షా రెండంకెల స్కోర్లు చేయగలిగారు. అఫ్గానిస్తాన్ లెఫ్టార్మ్ పేసర్ ఫజల్ హక్ ఫరూఖీ (4–0–9–5) ఉగాండాను దెబ్బ తీశాడు. ఇన్నింగ్స్ తొలి ఓవర్ వేసిన ఫరూఖీ రెండు వికెట్లు, మళ్లీ 13వ ఓవర్లో మూడు వికెట్లు తీసి ఉగాండా పతనాన్ని శాసించాడు. నవీనుల్, రషీద్ ఖాన్ చెరో 2 వికెట్లు తీశారు.

శుభారంభంపై గురి

నేడు ఐర్లాండ్‌తో భారత్ తొలి పోరు

- పటిష్టంగా రోహిత్ బృందం
- రాత్రి గం. 8 నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

న్యూయార్క్: బంగ్లాదేశ్‌తో వామప్ పాస్ అయిన టీమిండియా ఇప్పుడు సిసలైన పోరాటానికి సిద్ధమైంది. టి20 ప్రపంచకప్‌లో భాగంగా బుధవారం గ్రూప్ 'ఎ'లో జరిగే తమ తొలి పోరులో ఐర్లాండ్‌తో భారత్ తలపడనుంది. రోహిత్ శర్మ బృందం తమ స్థాయికి తగని ప్రత్యర్థిపై అలవోక విజయంతో ప్రపంచకప్ వేటను మొదలుపెట్టాలని పట్టుదలతో ఉంది. ఎలాంటి అలసత్వానికి తావివ్వకుండా చిన్న జట్టయినా గట్టిగానే ఎదుర్కోవాలని భావిస్తోంది. మరోవైపు ఐర్లాండ్‌కు మాత్రం ఇది కొండను 'ఢీ'కొట్టడమే! సూపర్ ఫామ్‌లో, రెండు నెలలుగా ఐపీఎల్‌తో టి20 మ్యాచ్‌లలో తలమునకలైన ఆటగాళ్లున్న జట్టుతో తలపడటం ఐర్లాండ్‌కు ఆషామాషీ కానే కాదు. భారత్‌లాంటి పటిష్టమైన జట్టుకే ఆడటం కష్టంగా ఉన్న డ్రాప్ ఇన్ పిచ్‌లపై ఐర్లాండ్ సంచలనాన్ని ఆశించడం కూడా అత్యాశే అవుతుంది.

కోహ్లినే కొండంత బలం

ఆలస్యంగా జట్టుతో కలిసిన స్టార్ బ్యాటర్, కింగ్ కోహ్లి బంగ్లాతో ప్రాక్టీస్ మ్యాచ్‌లో బరిలోకి దిగలేదు. అంతమాత్రాన ప్రాక్టీస్ లేదనుకుంటే పొరపాటే! ఈ సీనియర్ స్టార్ ఐపీఎల్‌లో ఎవరికీ సాధ్యంకాని రీతిలో ప్రతి మ్యాచ్‌లోనూ నిలకడగా మెరిపించాడు. కెప్టెన్ రోహిత్ కూడా ఫామ్‌లోనే ఉన్నాడు. వీరిద్దరు ఓపెనింగ్ చేస్తే సంజూ సామ్సన్ వన్‌డౌన్‌లో దిగుతాడు. 4, 5 స్థానాల్లో సూర్యకుమార్, రిషభ్ పంత్‌లు చెలరేగితే ఎలాంటి బౌలర్‌కైనా చుక్కలు కనబడటం గ్యారంటీ! బౌలింగ్‌లో అనుభవజ్ఞులైన బుమ్రా, సిరాజ్, స్పిన్నర్లు జడేజా, అక్షర్ పటేల్‌లు అందుబాటులో ఉండటంతో ప్రత్యర్థి జట్టు వీరిని ఎదుర్కొనేందుకు సర్వశక్తులు ఒడ్డకతప్పదు. లోయర్ ఆర్డర్‌లో అదనపు బ్యాటింగ్ అవసరం లేదనుకుంటే అక్షర్ స్థానంలో కుల్దీప్ తుది జట్టులో ఉంటాడు.



రోహిత్

జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), కోహ్లి, సంజూ సామ్సన్/దూబే, సూర్యకుమార్, రిషభ్ పంత్, హార్దిక్ పాండ్యా, జడేజా, అక్షర్ పటేల్, బుమ్రా, సిరాజ్, అర్ష్‌దీప్. ఐర్లాండ్: పాల్ స్టిర్లింగ్ (కెప్టెన్), రాస్ అడైర్, బాల్బిర్నీ, క్యాంఫర్, టెక్టర్, డెలనీ, డాక్‌రెల్, టకెర్, జోష్ లిటిల్, మార్క్ అడైర్, యంగ్.

పిచ్, వాతావరణం

బంగ్లాదేశ్‌తో ఆడిన వార్మప్ వేదికపైనే ఈ మ్యాచ్ జరుగుతుంది. డ్రాప్ ఇన్ పిచ్. బౌలర్లకు అనుకూలంగా ఉంటుంది. పేలవమైన అవుట్‌ఫీల్డ్ వల్ల బ్యాటర్లకు పరుగులు అంత సులువుగా రాకపోవచ్చు. వర్షం ముప్పు లేదు.

ఐర్లాండ్ పోటీ ఏపాటి?

ప్రపథమ టి20 చాంపియన్ (2007) భారత్‌తో చూసుకుంటే ఐర్లాండ్ క్రికెట్ కూనే! అయితే పొట్టి పోరులో ఎవరు ఏ ఓవర్‌లో మెరిపించినా మ్యాచ్ మలుపుతిరగడం ఖాయం. కాబట్టి పాల్ స్టిర్లింగ్ బృందం భారత్ బలాబలాలను దృష్టిలో పెట్టుకొని బరిలోకి దిగుతుంది. హిట్టర్లు, బ్యాటింగ్ ఆల్‌రౌండర్లతో కూడిన ఐర్లాండ్ టీమిండియా ఏమాత్రం అలసత్వం ప్రదర్శించినా వాటిని సానుకూలంగా మలచుకోవాలనే వ్యూహాలతో ఉంది. వార్ వన్‌సైడ్ కాకుండా కాస్త దీటుగా ఎదుర్కోగలిగితే చాలు పరాజయమైన సగం విజయంతో సమానమని జట్టు మేనేజ్‌మెంట్ భావిస్తోంది.

కోకో గాఫ్ తొలిసారి...

ఫ్రెంచ్ ఓపెన్ సెమీఫైనల్లో అమెరికా స్టార్ • డిఫెండింగ్ చాంపియన్ స్వియాటెక్ కూడా

పారిస్: పట్టుదలతో పోరాడిన అమెరికా టెన్నిస్ యంగ్‌స్టార్ కోకో గాఫ్ వరుసగా మూడో గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ మూడో ర్యాంకర్, మూడో సీడ్ కోకో గాఫ్ 4–6, 6–2, 6–3తో ఎనిమిదో సీడ్ ఆన్స్ జబర్ (ట్యునీషియా)పై గెలిచింది. ఐదోసారి ఫ్రెంచ్ ఓపెన్‌లో ఆడుతున్న కోకో గాఫ్ తొలిసారి సెమీఫైనల్లోకి ప్రవేశించడం విశేషం. 2023 యూఎస్ ఓపెన్‌లో విజేతగా నిలిచిన కోకో ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సెమీఫైనల్లో నిష్క్రమించింది. జబర్‌తో గంటా 57 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో కోకో ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసి తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయింది. 21 విన్నర్స్ కొట్టిన ఆమె నెట్ వద్ద 11 పాయింట్లు గెలిచింది. మరో క్వార్టర్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్, ప్రపంచ నంబర్‌వన్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) 6–0, 6–2తో ఐదో సీడ్ వొండ్రుసోవా (చెక్ రిపబ్లిక్)పై అలవోకగా గెలిచి సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. 62 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో స్వియాటెక్ ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది.



కోకో గాఫ్

వైదొలిగిన జొకోవిచ్



పురుషుల సింగిల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ నొవాక్ జొకోవిచ్ (సెర్బియా) మోకాలి గాయంతో ఫ్రెంచ్ ఓపెన్ నుంచి వైదొలిగాడు. సెరున్‌డొలో (అర్జెంటీనా)తో 4 గంటల 39 నిమిషాలపాటు జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో జొకోవిచ్ 6–1, 5–7, 3–6, 7–5, 6–3తో గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. ఈ మ్యాచ్ సందర్భంగా జొకోవిచ్ జారిపడటంతో అతని మోకాలికి గాయమైంది. గాయం తీవ్రత దృష్ట్యా జొకోవిచ్ క్వార్టర్ ఫైనల్లో బరిలోకి దిగకూడదని నిర్ణయం తీసుకొని టోర్నీ నుంచి వైదొలిగాడు.

కొత్త నంబర్‌వన్ సినెర్



ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్, ఇటలీ స్టార్ యానిక్ సినెర్ కొత్త ప్రపంచ నంబర్‌వన్‌గా అవతరించనున్నాడు. జొకోవిచ్ టోర్నీ నుంచి వైదొలగడం... సినెర్ సెమీఫైనల్ చేరుకోవడంతో ఈ ఇటలీ స్టార్ ఈనెల పదో తేదీన విడుదలయ్యే ర్యాంకింగ్స్‌లో అధికారికంగా నంబర్‌వన్ స్థానాన్ని అందుకుంటాడు. క్వార్టర్ ఫైనల్లో సినెర్ 6–2, 6–4, 7–6 (7/3)తో పదో సీడ్ దిమిత్రోవ్ (బల్గేరియా)పై గెలిచి కెరీర్‌లో తొలిసారి ఫ్రెంచ్ ఓపెన్‌లో సెమీఫైనల్లోకి అడుగు పెట్టాడు.

స్కాట్లాండ్, ఇంగ్లండ్ మ్యాచ్ రద్దు

బ్రిడ్జ్‌టౌన్: ఎడతెరిపి లేని వర్షంతో స్కాట్లాండ్, ఇంగ్లండ్ జట్ల మధ్య టి20 ప్రపంచకప్ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. రెండు జట్లకు ఒక్కో పాయింట్ ఇచ్చారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న స్కాట్లాండ్ 6.2 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 51 పరుగులు సాధించింది. ఈ దశలో వర్షం రావడంతో ఆట నిలిచిపోయింది. ఓపెనర్లు మైకేల్ జోన్స్ (20 బంతుల్లో 30 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్), జార్జి మున్సే (19 బంతుల్లో 18 నాటౌట్; 3 ఫోర్లు) దూకుడుగా ఆడారు. వర్షం తగ్గుముఖం పట్టాక మ్యాచ్‌ను 10 ఓవర్లకు కుదించారు. స్కాట్లాండ్ వికెట్ నష్టపోకుండా 90 పరుగులు చేసింది. డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం ఇంగ్లండ్ లక్ష్యాన్ని 10 ఓవర్లలో 109 పరుగులుగా నిర్ణయించారు. స్కాట్లాండ్ ఇన్నింగ్స్ ముగియగానే మళ్లీ వర్షం పడటం, నిర్ణీత సమయం కూడా అయిపోవడంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేశారు. మరోవైపు డాలస్‌లో నెదర్లాండ్స్‌తో గ్రూప్ 'డి' మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన నేపాల్ 19.2 ఓవర్లలో 106 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ రోహిత్ పాడెల్ (35; 5 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు.



ప్రిక్వార్టర్స్‌లో గాయత్రి–ట్రెసా జోడీ

జకార్తా: ఇండోనేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–1000 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్ విభాగంలో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ (భారత్) జోడీ శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో గాయత్రి–ట్రెసా జాలీ ద్వయం 21–15, 21–11తో యు పె చెంగ్–యు సింగ్ సన్ (చైనీస్ తైపీ) జంటను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్, ప్రియాన్షు రజావత్ ముందంజ వేయగా... భారత నంబర్‌వన్ హెచ్‌ఎస్ ప్రణయ్, కిరణ్ జార్జి తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. లక్ష్య సేన్ 21–12, 21–17తో కెంటా సునెయామ (జపాన్)పై గెలుపొందగా... ప్రియాన్షు 21–17, 21–12తో ప్రణయ్‌ను బోల్తా కొట్టించాడు. కిరణ్ జార్జి 21–11, 10–21, 20–22తో హాంగ్ యాంగ్ వెంగ్ (చైనా) చేతిలో పోరాడి ఓడిపోయాడు. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో సుమీత్ రెడ్డి–సిక్కి రెడ్డి (భారత్) ద్వయం 18–21, 21–16, 21–17తో విన్సన్ చియు–జెనీ గాయ్ (అమెరికా) జోడీని ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది.

తొలి రౌండ్‌లోనే ఓడిపోయిన ప్రణయ్, కిరణ్ జార్జి



శ్రీరామ్ బాలాజీతో ఒలింపిక్స్ బరిలోకి బోపన్న

న్యూఢిల్లీ: భారత డబుల్స్ టెన్నిస్ స్టార్, ప్రపంచ నాలుగో ర్యాంకర్ రోహన్ బోపన్న పారిస్ ఒలింపిక్స్‌లో తన భాగస్వామిని ఎంచుకున్నాడు. విశ్వ క్రీడల్లో భారత మూడో ర్యాంకర్ శ్రీరామ్ బాలాజీతో కలిసి పురుషుల డబుల్స్ విభాగంలో పాల్గొంటానని 44 ఏళ్ల బోపన్న అఖిల భారత టెన్నిస్ సంఘానికి, టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్ (టాప్స్) అధికారులకు సమాచారం ఇచ్చాడు. బాలాజీ ఫ్రెంచ్ ఓపెన్‌లో మెక్సికోకు చెందిన మిగెల్ వరేలాతో కలిసి ప్రిక్వార్టర్ ఫైనల్ వరకు చేరుకున్నాడు. పారిస్ ఒలింపిక్స్‌లో టెన్నిస్ ఈవెంట్ ఫ్రెంచ్ ఓపెన్‌లోని మట్టి కోర్టులపైనే జరగనున్నాయి.

సినిమా



• 'అరణ్మనై 4'లో రాశీ, తమన్నా

అందుకే మా కెమిస్ట్రీ కుదిరింది! - తమన్నా

''ఒకే సినిమాలో ఇద్దరు హీరోయిన్లు ఉన్నప్పుడు వారి నటన విషయంలో పోలికలు రావొచ్చు. కొందరు పోటీలు పెట్టి మాట్లాడుతుంటారు. నేను ఈ పోటీని ఆహ్లాదకరంగానే తీసుకుంటాను'' అంటున్నారు హీరోయిన్ తమన్నా. ఈ బ్యూటీ ఇలా అనడానికి కారణం ఉంది. తమన్నా, రాశీ ఖన్నా, సుందర్. సి లీడ్ రోల్స్‌లో నటించిన తమిళ చిత్రం 'అరణ్మనై 4' (తెలుగులో 'బాక్') ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ సినిమాలో రాశీ ఖన్నాతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం గురించి తమన్నా ఓ ఆంగ్ల మీడియా సంస్థతో మాట్లాడారు. ''ఇండస్ట్రీలో పోటీ ఉండొచ్చు. అయితే మనం మనలా పెర్ఫార్మ్ చేయగలిగితే చాలు. 'అరణ్మనై 4' సినిమా కోసం నేను, రాశీ ఓ పాట చేశాం. ఇద్దరం ఒకే ఫ్రేమ్‌లోకి వచ్చాం. అప్పుడు మేం మా డ్యాన్స్ పెర్ఫార్మెన్స్ పైనే ఫోకస్ పెట్టాం. సాంగ్ బాగా రావడానికి రాశీ ఖన్నా తన వంతు కృషి చేసింది. మేం ఇద్దరం ఒకరికొకరం సపోర్ట్ చేసుకోవడం వల్లే మా కెమిస్ట్రీ బాగా కుదిరింది. ఓ కో స్టార్‌గా రాశీ బాగా సపోర్ట్ చేసిందని నాకనిపించింది. ఇలా పోటీ ఆహ్లాదకరంగా ఉంటే మంచిదే'' అని చెప్పుకొచ్చారు తమన్నా.

మనీ కాదు... మానసిక తృప్తి ముఖ్యం - హేషమ్ అబ్దుల్ వహాబ్



'ఖుషి, హాయ్ నాన్న' వంటి చిత్రాల్లోని బీట్స్ ప్రేక్షకుల హార్ట్ బీట్‌ని టచ్ చేశాయి. అందుకే జస్ట్ రెండు మూడు చిత్రాలతో సంగీత దర్శకుడిగా తెలుగు ప్రేక్షకులకు దగ్గర కాగలిగారు హేషమ్ అబ్దుల్ వహాబ్. ఇప్పుడు 'మనమే'కి సంగీతం అందించారు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రంలోని పాటలకు శ్రోతల నుంచి మంచి స్పందన లభించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు హేషమ్. శర్వానంద్, కృతీ శెట్టి జంటగా శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై రామ్‌సే స్టూడియోస్ ప్రొడక్షన్‌లో టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 7న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా 'మనమే' గురించి, ఇతర విశేషాలను సంగీతదర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ ఈ విధంగా పంచుకున్నారు.

• సంగీతానికి ప్రాధాన్యం ఉన్న సినిమా చేయడం ఏ సంగీతదర్శకుడికైనా ఆనందంగా ఉంటుంది. 'మనమే'లో 16 పాటలు ఉన్నాయి. నా గత చిత్రాలకన్నా ఈ చిత్రానికి ఎక్కువ హార్డ్‌వర్క్ చేశాను. ముందు 16 పాటలు ఉంటాయని ఊహించలేదు. కానీ శ్రీరామ్ ఆదిత్య కథని మలిచిన తీరు ఎక్కువ పాటలకు స్కోప్ ఇచ్చింది. ఫస్టాఫ్‌లో పది, సెకండాఫ్‌లో ఆరు పాటలు అవసరం అవుతాయని కంపోజ్ చేసేటప్పుడు అర్థం అయింది. పదకొండు ఫుల్ సాంగ్స్, మిగతావి బిట్ సాంగ్స్‌లా వస్తాయి • నా గత చిత్రం 'హాయ్ నాన్న'లో తండ్రీ కూతురు ఎమోషన్ ఉంటుంది. 'మనమే'లో కూడా పేరెంటింగ్ ప్రాధాన్యమైన అంశం. అయితే రెండు కథలు పూర్తిగా వేరు. 'మనమే'లో పేరెంటింగ్ అనే ఎమోషన్‌తో పాటు ఇంకా చాలా రకాల ఎమోషన్స్ ఉన్నాయి

• 'మనమే'లో 16 పాటలు ఉన్నాయి కాబట్టి మిగతా సినిమాలకన్నా ఎక్కువ పారితోషికం తీసుకున్నారా? అని అడిగితే... ఓ క్రియేటర్‌గా మనీ గురించి కాకుండా మానసిక తృప్తి ముఖ్యం అనుకుంటాను. ఆ విధంగా చూస్తే 'మనమే' నాకు పూర్తి సంతృప్తిని ఇచ్చింది. సంగీతం పట్ల నాకు ఉన్న అవగాహనను పూర్తిగా సద్వినియోగం చేసుకునే అవకాశం దక్కింది. అలాగే నా పనికి తగ్గ పారితోషికం కూడా దక్కింది (నవ్వుతూ). నా గత చిత్రాలు, ఇప్పుడు 'మనమే' వంటి మంచి ప్రాజెక్ట్‌కి చాన్స్ దక్కడం ఆశీర్వాదంలా భావిస్తున్నాను • ఫలానా సినిమాలో ఉన్న అలాంటి బీట్ ఇవ్వండి అంటూ ఇప్పటివరకూ ఏ దర్శకుడూ అడగకపోవడం నా లక్. మంచి ట్యూన్‌ని ఆదర్శంగా తీసుకోవడం తప్పేం కాదు. కానీ నా వరకూ ఒరిజినల్ ట్యూన్స్ ఇవ్వాలనుకుంటాను. ఒకవేళ డైరెక్టర్ అడిగితే... ఆయన చెప్పిన ట్యూన్ కథలోని సందర్భానికి తగ్గట్టుగా ఉందనిపిస్తే అప్పుడు ఇన్‌స్పిరేషన్‌గా తీసుకుని చేయడానికి ట్రై చేస్తాను • ప్రస్తుతం రష్మికా మందన్నా నటిస్తున్న 'గర్ల్ ఫ్రెండ్'కి వర్క్ చేస్తున్నాను. ఫీమేల్ లీడ్ క్యారెక్టర్‌లో సాగే సినిమా చేయడం నాకు ఇదే ఫస్ట్ టైమ్. ఇదో కొత్త అనుభవం. ఇక తెలుగు పరిశ్రమ చాలా గొప్పది. ఎంత మంది వచ్చినా ఇక్కడ అవకాశం ఉంటుంది... ప్రోత్సాహం ఉంటుంది. అందుకే కేరళ నా ఫస్ట్ హోమ్ అయితే హైదరాబాద్ నా సెకండ్ హోమ్ అంటాను.

సీక్వెల్ స్టార్ట్



• రకుల్ ప్రీత్ సింగ్

కొత్త సినిమా సెట్స్‌లోకి అడుగుపెట్టిన ఆనందంలో ఉన్నారు హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్. అజయ్ దేవగన్, రకుల్ ప్రీత్ సింగ్, టబు లీడ్ రోల్స్‌లో నటించిన హిందీ చిత్రం 'దే దే ప్యార్ దే'. అకివ్ అలీ దర్శకత్వంలో రూపొందిన ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ మూవీ 2019లో విడుదలై, మంచి విజయం సాధించింది. దీంతో 'దే దే ప్యార్ దే' సీక్వెల్ 'దే దే ప్యార్ దే 2'ను సెట్స్ పైకి తీసుకుని వెళ్లాలని అజయ్ దేవగన్ చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ఈ సీక్వెల్ చిత్రీకరణ ముంబైలో ప్రారంభమైంది. ప్రస్తుతం అజయ్ దేవగన్, రకుల్ ప్రీత్ సింగ్‌లపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే సీక్వెల్‌కు అకివ్ అలీకి బదులుగా అన్షుల్ శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. ''నా ఫేవరెట్ సినిమా 'దే దే ప్యార్ దే 2' సెట్స్‌లో జాయిన్ అయినందుకు హ్యాపీగా ఉంది'' అని పేర్కొన్నారు రకుల్. ఈ చిత్రంలో అనిల్ కపూర్, మాధవన్ కీలక పాత్రల్లో నటించనున్నారనే టాక్ వినిపిస్తోంది. అయితే తొలి భాగంలో నటించిన టబు సీక్వెల్‌లోనూ నటిస్తారా? ఆమె స్థానంలో మరో నటి ఎవరైనా జాయిన్ అవుతారా? అనే విషయంపై మాత్రం క్లారిటీ రావాల్సి ఉంది. వచ్చే ఏడాది వేసవిలో ఈ సినిమా విడుదల కానుంది.

సత్యభామ హీరోయిజం ఉన్న సినిమా

కాజల్ అగర్వాల్ టైటిల్ రోల్ చేసిన చిత్రం 'సత్యభామ'. ఈ చిత్రంలో కీలకమైన అమరేందర్ పాత్రను నవీన్ చంద్ర చేశారు. 'మేజర్' చిత్ర దర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పకులుగా వ్యవహరించి, ఈ సినిమాకు స్క్రీన్ ప్లే అందించారు. సుమన్ చిక్కాల దర్శకత్వంలో బాబీ తిక్క–శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 7న రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా మంగళవారం విలేకర్ల సమావేశంలో నిర్మాతలు బాబీ తిక్క–శ్రీనివాసరావు మాట్లాడుతూ– ''దాదాపు ఇరవై సంత్సరాల క్రితం ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఓ ఘటనను ఆధారంగా చేసుకుని 'సత్యభామ' సినిమా స్టోరీ లైన్‌ను రెడీ చేశాం. మన నేటివిటీకి తగ్గట్లుగా కథలో మార్పులు చేశాం. మా ప్రొడక్షన్‌లో 'సత్యభామ' మొదటి సినిమా కాబట్టి హీరోయిన్ ఓరియెంటెడ్ మూవీని ఎందుకు చేస్తున్నారని కొందరు అడిగారు. హీరోయిన్ ఓరియెంటెడ్ మూవీస్ అనగానే విజయశాంతిగారి 'కర్తవ్యం' లాంటి మూవీస్ కొన్నే గుర్తొస్తాయి. అలా 'సత్యభామ' కూడా గుర్తుండిపోతుంది. ఈ సినిమాలో కాజల్ పెర్ఫార్మెన్స్ ఆకట్టుకుంటుంది. 'సత్యభామ' సినిమాను చూసి, ఇండస్ట్రీకి చెందిన ఓ పెద్దాయన 'ఇది హీరోయిన్ ఓరియెంటెడ్ మూవీ కాదు. హీరోయిజం ఉన్న మూవీ' అన్నారు. ఈ సినిమాలో కాజల్ చేసిన పోలీసాఫీసర్ పాత్రకు హీరోని పెట్టొచ్చు. కానీ ఓ మహిళా పోలీసాఫీసర్ ఓ కేసును ఎలా సాల్వ్ చేశారన్నది ఆసక్తికరంగా ఉంటుంది'' అని అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ''సత్యభామ' సమయంలో శశికిరణ్ వేరే సినిమాలతో బిజీగా ఉన్నారు. అందుకే ఈ సినిమాకు దర్శకత్వం వహించలేదు. కానీ స్క్రీన్‌ప్లే అందించారు. సుమన్ బాగా డైరెక్ట్ చేశారు. అమ్మాయిల రక్షణకు సంబంధించిన 'షీ సేఫ్' యాప్‌ను కేవలం 5 వేల మంది మహిళలు మాత్రమే డౌన్ లోడ్ చేసుకున్నారు. ఈ యాప్ గురించిన ప్రస్తావన, అవగాహన మా సినిమాలో ఉంటుంది. మా నెక్ట్స్ మూవీని పాన్ ఇండియా స్థాయిలో నిర్మించేలా ప్లాన్ చేస్తున్నాం'' అని చెప్పుకొచ్చారు.



• బాబీ • శ్రీనివాస్

మ్యాజిక్ చూడండి - విశ్వంత్



• విశ్వంత్ దుద్దుంపూడి, విస్మయ

విశ్వంత్ దుద్దుంపూడి, అనురూప్ కటారి హీరోలుగా, విస్మయ శ్రీ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'నమో'. కుందూరు ఆదిత్యా రెడ్డిని దర్శకుడిగా పరిచయం చేస్తూ, ఎ. ప్రశాంత్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 7న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు దర్శకుడు భీమనేని శ్రీనివాసరావు, నిర్మాత బెక్కం వేణుగోపాల్ అతిథులుగా హాజరై, ఈ సినిమా విజయాన్ని ఆకాంక్షించారు. విశ్వంత్ మాట్లాడుతూ– ''నమో' నాకు సినిమా మాత్రమే కాదు... ఓ ఎమోషన్. లాజిక్స్‌ను పక్కనపెట్టి... మ్యాజిక్‌ను చూడండి'' అన్నారు. ''మంచి సబ్జెక్ట్‌కి విశ్వంత్ లాంటి మంచి హీరో దొరకడంతో 'నమో' సినిమాగా మారింది'' అన్నారు ఆదిత్యా రెడ్డి. ''ఆద్యంతం నవ్విస్తూనే, ప్రేక్షకులను అలరించేలా ఈ సినిమా ఉంటుంది'' అన్నారు ప్రశాంత్. అనురూప్, విస్మయ శ్రీ మాట్లాడారు.

అక్టోబరులో వెనమ్ ఆగమనం

హాలీవుడ్ హిట్ ఫ్రాంచైజీ 'వెనమ్' నుంచి వస్తున్న తాజా చిత్రం 'వెనమ్: ది లాస్ట్ డ్యాన్స్'. తొలి, మలి భాగాలు 'వెనమ్ (2018)', 'వెనమ్: లెట్ దేర్ బీ కార్నేజ్ (2021)'లకు ప్రేక్షకుల నుంచి, బాక్సాఫీస్ వద్ద మంచి ఆదరణ లభించింది. ఈ నేపథ్యంలో 'వెనమ్: ది లాస్ట్ డ్యాన్స్'పై అంచనాలు ఉన్నాయి. 'వెనమ్, వెనమ్: లెట్ దేర్ బీ కార్నేజ్' (2021) లలో హీరోగా నటించిన టామ్ హార్డీయే 'వెనమ్: ది లాస్ట్‌డ్యాన్స్' చిత్రంలోనూ నటించారు. 'వెనమ్: ది లాస్ట్ డ్యాన్స్'కు కెల్లీ మార్సెల్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో ఎడ్డీ బ్రాక్ పాత్రలో టామ్ హార్డీ కనిపిస్తారు. ఈ సినిమా ఈ ఏడాది అక్టోబరు 25న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఇక 'వెనమ్' ఫ్రాంచైజీలో 'వెనమ్: ది లాస్ట్ డ్యాన్స్' చివరి చిత్రం అవుతుందనే టాక్ హాలీవుడ్‌లో వినిపిస్తోంది.



• 'వెనమ్: ది లాస్ట్ డ్యాన్స్' పోస్టర్


'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20+6 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 74

బుధవారం 5-6-2024


అస్తిత్వాన్ని వెలికి తీద్దాం... -ఫ్యామిలీలో


రోబోటిక్స్ విజేత... -ఫ్యామిలీలో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

నీట్ ద్వారా ఎంబీబీఎస్‌లో సీట్ రాలేదా?

మన తెలుగు విద్యార్థుల చూపు రష్యా వైపు మళ్ళడానికి కారణం?

- ఎన్ఎంసి చేత గుర్తింపుపొందిన మెడికల్ యూనివర్సిటీలు..
- నామమాత్రమైన ఫీజులు.. ప్రభుత్వ యూనివర్సిటీలు..
- భారతీయులకు ఎంబీబీఎస్‌లో డైరెక్ట్ అడ్మిషన్...
- ఆంగ్లంలోనే విద్యాబోధన..
- భారతదేశం తో సన్నిహిత సంబంధాలు కల మిత్రదేశం..
- ప్రపంచంలోనే అత్యున్నతమైనటువంటి విద్యాబోధన మరియు అతితక్కువ ఫీజు ఒక సెమిస్టర్‌కు కేవలం లక్ష రూపాయలు మాత్రమే.

మన దేశంలో నీట్ లో సీటు రాని తెలుగు విద్యార్థులకు శుభవార్త...

నిద్రాహారాలు మాని ఎంతో కష్టపడి చదివినా నీట్‌లో విజయం సాధించలేదా? భారతదేశంలో ఎంబీబీఎస్‌లో చేయ లేక పోతున్నారా? డాక్టర్ కావాలనే కోరిక తీరని మధ్యతరగతి విద్యార్థులకు అందునా మన తెలుగు విద్యార్థులకు ఎస్.జి. కన్సల్టెన్సీ శుభవార్తని అందిస్తోంది.

సాధారణంగా MBBS పూర్తిచేయాలి అంటే కోట్ల రూపాయలు ఖర్చుపెట్టాల్సి వస్తుంది. కోట్ల రూపాయలను ఖర్చు చెయ్యలేక తల్లిదండ్రులు డీలా పడ్డారు. కానీ ఇప్పుడు ఎటువంటి బాధ అవసరం లేదు.. ప్రతి తల్లిదండ్రులు గర్వంగా తమ పిల్లలను డాక్టర్లుగా చూసుకునే అద్భుతమైన అవకాశం ఇవ్వబోతోంది ఎస్.జి. కన్సల్టెన్సీ. అందుకే మన తెలుగు విద్యార్థులు ఎంతో ధీమాగా, ధైర్యంగా విదేశాలలో ఎంబీబీఎస్ చదువుకునేందుకు సిద్ధం అవుతున్నారు. కానీ వారికి సరైన గైడెన్స్ లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అటువంటి వారికి విదేశాలలో ఎటువంటి కాలేజీని ఎంచుకోవాలి. ఆయా దేశాలలో వున్న సౌకర్యాలు ఎలా ఉన్నాయి.. వేల కిలోమీటర్ల దూరంలో ఉండాల్సిన మన పిల్లలకు ఎటువంటి రక్షణ ఉంటుంది అని అనేక ప్రశ్నలు తల్లిదండ్రులను కలిచివేస్తాయి.. వాటన్నిటికీ ఎస్.జి. కన్సల్టెన్సీ సరైన సమాధానం చెప్పబోతోంది.

విదేశాలలో విద్యారంగం పైన ఎంతో అనుభవం వున్న ఎస్.జి. కన్సల్టెన్సీ ఛైర్మెన్ శ్రీ గరికపాటి సతీష్ బాబు గారు గత



24 సంవత్సరాలుగా వేలాది మంది విద్యార్థులను ఉన్నత విద్యకై విదేశాలకు పంపించారు. సుమారు 4వేల మంది విద్యార్థులను డాక్టర్లుగా, 14వేల మంది విద్యార్థులను USA, UK, ఆస్ట్రేలియా వంటి అభివృద్ధి చెందిన దేశాలకు వివిధ రకాల UG & PG చదువుల కోసం పంపిన ఘనత ఎస్.జి. కన్సల్టెన్సీ అధినేత శ్రీ గరికపాటి సతీష్ బాబు గారికే సొంతం.. నాణ్యమైన, ఉన్నతమైన, వైద్య విద్య ను అభ్యసించేందుకు గైడెన్స్ ఇవ్వడమే లక్ష్యంగా భావించి ఎందరో విద్యార్థులని వారి తల్లిదండ్రులను సంతృప్తి పరిచి దేశంలోనే మన్నన పొందిన మొట్టమొదటి సంస్థ ఎస్.జి. కన్సల్టెన్సీ. శ్రీ గరికపాటి సతీష్ బాబు గారు అనేక దేశాలను పర్యటించి వైద్య విద్యార్థులకు, ఉన్నత ప్రమాణాలు కలిగి, అన్ని విధాలా అనుకూలంగా ఉన్న కళాశాలలను ఎంపిక చేసి వాటిని మన తెలుగు రాష్ట్రాల వారికి పరిచయం చేసారు. అందువలన ఎన్నో వేల మంది మధ్యతరగతి కుటుంబాల తల్లిదండ్రులు వారి పిల్లలు డాక్టర్స్ కావాలనే కలను సాకారం చేసుకోగలిగారు.

- గవర్నమెంట్ అందించే విద్యా దీవెన పథకంలో రూ. 20 లక్షల వరకు అర్హత
- బ్యాంకు లోన్ అవకాశం కలదు



డగిస్తాన్ స్టేట్ మెడికల్ యూనివర్సిటీ ఆల్ ఇండియా ఎక్స్‌క్లూజివ్ రిప్రజెంటేటివ్

అడ్మిషన్ల కొరకు : 8099123456, 9908067067

డగిస్తాన్ స్టేట్ మెడికల్ యూనివర్సిటీ ప్రత్యేకతలు...

- 93 సంవత్సరాల అనుభవం కలిగిన ప్రభుత్వ వైద్య విశ్వవిద్యాలయం.
- వేలాదిమంది భారతీయులను డాక్టర్స్ గా తీర్చిదిద్దిన యూనివర్సిటీ..
- 700 + బోధన సిబ్బంది
- హైదరాబాద్ నుండి కేవలం 6 గంటల ప్రయాణ వ్యవధి కలిగిన యూనివర్సిటీ.
- మొదటి సంవత్సరం నుంచే క్లినికల్స్‌కి అవకాశాలు..
- బాల బాలికలకు వేర్వేరు బోధన గదులు (ఆప్షనల్)
- ప్రతి 12 మంది విద్యార్థులతో ఒక ప్రాక్టికల్స్ గ్రూప్
- 4 : 1 రేషియో లో ఫ్యాకల్టీ - స్టూడెంట్ రేషియో
- హై-టెక్ క్లాస్ రూమ్స్
- వరల్డ్ క్లాస్ సిములేషన్ సెంటర్.
- వరల్డ్ క్లాస్ మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్.
- బాల బాలికలకు వేరువేరు వసతి భవనాలు.

యూనివర్సిటీ ముఖ్యాంశాలు :

- USMLE / PLAB / FMGE (Next) కోచింగ్ మొదటి సంవత్సరం నుంచి ఉంటుంది.
- రష్యా దేశంలోనే మన భారతదేశానికి అతి దగ్గర లో ఉన్న నగరం Dagestan.
- రష్యా దేశం అంతటా మంచు ప్రాంతంగా ఉన్న ఒక్క Dagestan మాత్రం మన దేశాన్ని పోలిన వాతావరణం కలిగి ఉండటం మరో ప్రత్యేకత.
- గత 45 సంవత్సరాలగా అనేకమంది మన దేశం నించి రష్యాకి మెడిసిన్ చదవటానికి వెళ్తున్నారు. ఇప్పటి వరకు అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులను యూనివర్సిటీ లో చేర్పించిన తర్వాత, వారి బాగోగులను పట్టించుకున్న నాథుడే ఉండరు.. అంతేకాకుండా ఆరోగ్యపరంగా సమస్యలు వచ్చినా గాని, భోజన వసతులు గురించి నిర్లక్ష్యం ఉండేది.. కాని మొట్టమొదటి సారిగా మన తెలుగు విద్యార్థులకు కేవలం అడ్మిషన్ తోనే సరిపెట్టకుండా వారి కోసం యూనివర్సిటీ ప్రాంగణంలోనే హాస్టల్స్ ని ఏర్పాటు చేసి.. వారి బాగోగుల కోసం మన తెలుగు వారినే వార్డెన్స్ గా నియమించి స్వచ్ఛమైన తెలుగు భోజనం కోసం మన తెలుగు వంటవారిని నియమించి.. రోజు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి డిన్నర్ అందిస్తున్న ఏకైక సంస్థ ఎస్.జి. కన్సల్టెన్సీ.

గొప్ప డాక్టర్ కావాలి అనే కల వుండి USA, UKలో పీజీ చేయాలనీ, ఇండియాలో ఫస్ట్ అటెంప్ట్‌లో పీజీ సీట్ సాధించాలి.. అనే కోరిక ఉన్న ప్రతి విద్యార్థికి ఇది ఒక సువర్ణ అవకాశం. ఈ అద్భుతమైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటారు అని భావిస్తున్నాము. మీ కలలకు మా సహకారం అందించి మిమ్మల్ని వైద్యులుగా తీర్చిదిద్దుతాం అనే భరోసా ఎస్.జి. కన్సల్టెన్సీ అందిస్తోంది.






చెచెన్ స్టేట్ యూనివర్సిటీ ప్రత్యేకతలు...

- లండన్, న్యూయార్క్ వంటి నగరాలతో పోటీపడి అభివృద్ధి చెందుతున్న చిన్న నగరం చెచెన్...
- మన దేశం నుంచి కేవలం 7గంటల ప్రయాణ వ్యవధి కలిగిన అతి సమీపంలో ఉన్న నగరం..



- ప్రపంచంలోనే అతి తక్కువ కాలేజీ ఫీజు కలిగిన యూనివర్సిటీ (కేవలం సెమిస్టర్‌కి లక్ష రూపాయలు మాత్రమే)
- 5 స్టార్ హోటల్ కి ఏమాత్రం తీసిపోని సౌకర్యాలతో హాస్టల్ సదుపాయం...
- 15 మంది విద్యార్థులకి ఒక గ్రూప్ గా ఉంటారు. 200 మందికి పైగా బోధన సిబ్బందిగా ఉంటారు.
- భారతదేశ వాతావరణాన్ని పోలిన వాతావరణం.. అచ్చమైన తెలుగు భోజన సదుపాయం..
- బాల బాలికలకు వేరు వేరుగా హాస్టల్ సదుపాయం..
- అంతేకాకుండా డిజిటల్ క్లాస్ రూమ్స్, లైబ్రరీ లో అత్యాధునిక స్టిమ్యూలేషన్ సెంటర్స్ మరియు ల్యాబ్స్ వంటి అధునాతన సౌకర్యాలున్నాయి.




నార్త్ ఒస్సటియా స్టేట్ మెడికల్ ఎకాడమీ

- రష్యన్ ఫెడరేషన్‌లోని అత్యుత్తమ మరియు అతిపెద్ద ఫార్మాస్యూటికల్ మరియు ఎంబీబీఎస్ విశ్వవిద్యాలయాలలో ఒకటి.
- 1939 సంవత్సరంలో స్థాపించబడింది.. 85 సంవత్సరాల నాటి ప్రభుత్వ విశ్వవిద్యాలయం.
- రష్యాలోని మన విద్యార్థులకు అనుకూలంగా ఉండే నగరమైన వ్లాడికావ్‌కాజ్‌లో ఉంది.
- ఇంగ్లీష్ మీడియం.
- ప్రతి సంవత్సరం 1000 మందికి పైగా విద్యార్థులు గ్రాడ్యుయేట్ అవుతున్నారు.
- అన్ని విభాగాలు మరియు సౌకర్యాలు ఒకే క్యాంపస్ క్రింద ఉన్నాయి.
- అధిక నాణ్యత గల విద్య మరియు అత్యాధునాతన బోధనా విధానం.
- 5 సంవత్సరాలు + వన్ ఇయర్ ఇంటర్న్‌షిప్.
- తెలుగింటి భోజనం.
- మన విద్యార్థుల కోసం ప్రత్యేకమైన గరల్స్ అండ్ బాయ్స్ హాస్టళ్లు.
- మా భారతీయ కోఆర్డినేటర్లు మరియు వార్డెన్లచే ప్రత్యేక పర్యవేక్షణ.
- తక్కువ ట్యూషన్ ఫీజు.
- అత్యాధునిక మరియు ఆధునిక పరికరాలతో ప్రయోగశాలలు.
- చాలా పుస్తకాలు మరియు ఎలక్ట్రానిక్ రీడింగ్ రూమ్‌తో కూడిన అతిపెద్ద లైబ్రరీ.
- పెద్ద సంఖ్యలో పడకలు ఉన్న అనేక ఆసుపత్రులకు జోడించబడింది.
- ప్రాక్టికల్ ఆధారిత విద్య..



అడ్మిషన్ల కొరకు సంప్రదించండి 8099123456, 9985067067

ADVT


'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20+6 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 74

బుధవారం 5-6-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



రూ. 31 లక్షల కోట్లు ఆవిరి..

బీజేపీకి స్పష్టమైన మెజారిటీ రాదని స్టాక్ మార్కెట్ షాక్‌కు గురైంది. సెన్సెక్స్, నిఫ్టీ మార్కెట్ ఆరంభం నుంచే పతనమయ్యాయి. క్షణాల్లో మదుపరుల సంపద రూ.31 లక్షల కోట్లు ఆవిరైపోయింది. 2000 పాయింట్లు నష్టంతో ప్రారంభమైన సెన్సెక్స్ ఇంట్రాడేలో 6234 పాయింట్లు పతనమైంది. నిఫ్టీ 1,982 పాయింట్లు నష్టపోయింది.

- వివరాలు VIలో




తగ్గిన ఎన్డీఏ బలం.. పవర్ ఖాయం!

హ్యాట్రిక్!

లోక్‌సభ ఎన్నికల్లో అనూహ్య ఫలితాలు..

ఎన్డీఏకు 292, ఇండియా కూటమికి 234



- 240 సీట్లకే పరిమితమైన బీజేపీ
- హిందీ బెల్టులో భారీ ఎదురుదెబ్బ
- మెజారిటీ కంటే 32 స్థానాలు తక్కువ
- ఎన్డీఏ భాగస్వాములపై ఆధారపడాల్సిందే
- పదేళ్ల తర్వాత కేంద్రంలో నిజమైన సంకీర్ణం
- 52 నుంచి 99 స్థానాలకు ఎగబాకిన కాంగ్రెస్
- గేమ్ చేంజర్ యూపీ; బీజేపీకి కేవలం 33 సీట్లు
- 49 సీట్లతో ఆదుకున్న తెలుగు రాష్ట్రాలు, ఒడిశా
- యూపీలో ఎస్పీకి 37, కాంగ్రెస్‌కు 6 స్థానాలు
- కేంద్రంలో అధికారంపై ఇండియా కూటమి కన్ను?
- జేడీ(యూ) సహా ఎన్డీఏ పక్షాలతో మంతనాలు!

న్యూఢిల్లీ

పాలక ఎన్డీఏ కూటమి పదేళ్ల జోరుకు బ్రేకులు
ఎన్డీఏ సారథి బీజేపీ దూకుడుకు ముకుతాడు
విపక్ష ఇండియా కూటమికి నైతిక విజయం
కూటమి సారథి కాంగ్రెస్‌కు పునరుజ్జీవం

లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు విలక్షణమైన తీర్పు వెలువరించారు. గత రెండు ఎన్నికల ఆనవాయితీకి భిన్నంగా బీజేపీని ఈసారి మెజారిటీకి ఓ 32 స్థానాల దూరంలోనే ఉంచారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో సొంతగానే 303 సీట్లు కైవసం చేసుకున్న కమలం పార్టీ ఏకంగా 63 స్థానాలు తగ్గి 240కే పరిమితమైంది. దాంతో నరేంద్ర మోదీ శకం మొదలయ్యాక తొలిసారిగా ప్రభుత్వ ఏర్పాటుకు ఎన్డీఏ భాగస్వాములపై ఆధారపడాల్సిన

మిగతా 6వ పేజీలో ▶

- 'కేంద్రంలో బీజేపీ వరుసగా మూడోసారి అధికారంలోకి వస్తుండడం ఆరు దశాబ్దాల తర్వాత ఇదే మొదటిసారి. 'దేశమే ప్రథమం' స్ఫూర్తితో ఆత్మనిర్భర్ భారత్ దిశగా అసాధారణ నిర్ణయాలు తీసుకుంటాం. మనమంతా కలిసికట్టుగా పనిచేస్తే కీలక నిర్ణయాలు తీసుకోవడంలో భారత్ కొత్త అధ్యాయం లిఖిస్తుంది. ఇది మోదీ గ్యారంటీ' - ప్రధాని నరేంద్ర మోదీ

'అబ్ కీ బార్...' పాచిక పారలేదు

నవీన్ చరిష్మాకు తెర !

బెంగాల్‌లో మళ్లీ దీదీ మేజిక్

ఢిల్లీలో తీన్‌మార్..!

యూపీలో 'కమల' విలాపం

కేరళలో బీజేపీ బోణీ

- లోపలి పేజీల్లో

గత ఎన్నికలతో పోలిస్తే 47 సీట్లు అధికం

పడిలేచిన కాంగ్రెస్!

పోటీ చేసిన 328 స్థానాలకుగాను 99 స్థానాల్లో విజయం

రిజర్వేషన్ల రద్దు, రాజ్యాంగం మార్పు ప్రచారాస్త్రాలుగా 'కమలం'పై ఎదురుదాడి

సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనే బీజేపీ కలలకు బ్రేక్



- 'అబ్ కీ బార్ చార్ సౌ పార్' నినాదంతో బరిలోకి దిగిన బీజేపీని అటు సొంత బలంతో, ఇటు కూటమి పక్షాల సహకారంతో కాంగ్రెస్ తుత్తునియలు చేసింది. అధికారం చేపట్టేందుకు కాంగ్రెస్ ఆమడ దూరంలో ఆగినా పడిలేచిన కెరటంలా సత్తా చాటింది. బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దవుతాయంటూ కాంగ్రెస్ సహా విపక్షాలన్నీ ప్రచారం చేశాయి. బీజేపీ రాజ్యాంగాన్ని మార్చేస్తుందనే ప్రచారం కూడా కలిసొచ్చింది. - వివరాలు 12లో

- 'కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటే లక్ష్యంగా వ్యూహరచన, తీసుకోవాల్సిన నిర్ణయాలపై బుధవారం మా కూటమి పక్షాలు ప్రధానంగా చర్చిస్తాయి. ఈ ఎన్నికలు, దేశం ఒక్కటే విషయాన్ని చెప్పదల్చుకున్నాయి. మోదీ, అమిత్‌షా పాలనలో దేశం మగ్గిపోవాల్సిన పనిలేదని చాటాయి. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం. నేను వయనాడ్, రాయ్‌బరేలీ రెండు స్థానాల్లో గెలిచా.. ఏ స్థానాన్ని వదులుకోవాలో ప్రజలతో మాట్లాడి నిర్ణయిస్తా.' - రాహుల్‌గాంధీ

పాత మిత్రులపై కూటమిలో చర్చ

- బుధవారం ఈ విషయం తేలుస్తామన్న రాహుల్
- నేడు ఇండియా కూటమి సమావేశం

రెండు చోట్లా రాహుల్ గెలుపు..

12 లో

బీజేపీ.. కాంగ్రెస్ చెరో 8

రాష్ట్రంలో హోరాహోరీ పోరాడిన జాతీయ పార్టీలు

హైదరాబాద్ లోక్‌సభ నుంచి ఐదోసారి అసదుద్దీన్ ఎన్నిక

- ఒక్క సీటు కూడా సాధించలేని గులాబీ పార్టీ
- ఉత్తర తెలంగాణ, హైదరాబాద్, శివార్లలో బీజేపీ హవా
- దక్షిణ తెలంగాణపై పట్టు నిలుపుకొన్న హస్తం పార్టీ
- ఐదుగురు సిట్టింగ్ ఎంపీల ఓటమి.. తొలిసారిగా ఎన్నికైన 8 మంది

సాక్షి, హైదరాబాద్/ సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ చెరో 8 స్థానాల్లో విజయం సాధించాయి. హైదరాబాద్ లోక్‌సభ స్థానాన్ని ఎంఐఎం నిలుపుకొంది. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్‌ఎస్ ఒక్క స్థానాన్ని కూడా సాధించలేకపోయింది. ఈ ఎన్నికల్లో వివిధ పార్టీల తరఫున మొత్తం 9 మంది సిట్టింగ్ ఎంపీలు పోటీచేయగా.. వారిలో ఐదుగురు ఓటమి పాలయ్యారు. ఓడినవారిలో నామా నాగేశ్వర్‌రావు, మాలోతు కవిత, రంజిత్‌రెడ్డి, మన్నె శ్రీనివాస్‌రెడ్డి, బీబీ పాటిల్ ఉన్నారు. అసదుద్దీన్, కిషన్‌రెడ్డి, బండి సంజయ్, అరవింద్ మాత్రమే తమ సీట్లను నిలుపుకొన్నారు. ఇక ఈసారి 8 మంది తొలిసారి ఎంపీగా గెలిచి రాష్ట్రం నుంచి లోక్‌సభలో అడుగుపెట్టబోతున్నారు.

దక్షిణ తెలంగాణలో కాంగ్రెస్ పట్టు..

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ దక్షిణ తెలంగాణ ప్రాంతంలో తన పట్టును నిలుపుకోగా.. ఉత్తర తెలంగాణలో బీజేపీ సత్తా

మిగతా 6వ పేజీలో ▶

వికసించిన కమలం

ఈసారి అత్యధికంగా 8 ఎంపీ సీట్లలో గెలిచి సొంత రికార్డు

- వివరాలు 9లో

హస్తం.. పదిలం

అసెంబ్లీ స్థాయిలోనే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓట్లు..

- వివరాలు 9లో

20 ఏళ్ల తర్వాత తొలిసారి..

లోక్‌సభలో బీఆర్‌ఎస్‌కు దక్కని ప్రాతినిధ్యం

- వివరాలు 9లో

మరింత సమర్థ పాలన..



- 'మా వంద రోజుల కాంగ్రెస్ పాలనను ఆశీర్వదిస్తూ 8 లోక్‌సభ స్థానాలతో పాటు కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానంలో విజయం చేకూర్చిన రాష్ట్ర ప్రజలకు ధన్యవాదాలు. మీ ఆశీర్వాదాలు మరింత సమర్థవంత పాలన అందించే ఉత్సాహాన్నిచ్చాయి' - రేవంత్‌రెడ్డి, ముఖ్యమంత్రి

ఫలించిన 'ఉత్తమ్' వ్యూహం



- నల్లగొండ కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌కు 5.59 లక్షల మెజారిటీ
- పోలైన మొత్తం ఓట్లలో 33.50% ఓట్లు హుజూర్‌నగర్, కోదాడ నుంచే
- దేశంలో కాంగ్రెస్ గెలిచిన నియోజకవర్గాల్లో మూడో అతిపెద్ద మెజార్టీగా రికార్డు
- పోల్ మేనేజ్‌మెంట్‌పై ఉత్తమ్ దృష్టి..

- వివరాలు 7లో

ఫీనిక్స్ పక్షిలా పుంజుకుంటాం..



- 'పార్టీ 24 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో అద్భుత విజయాలతో పాటు అనేక ఎదురుదెబ్బలూ తిన్నాం. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే మాకు అతి పెద్ద గౌరవం. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు నిరాశను కలిగించినా ఫీనిక్స్ పక్షి లెక్క తిరిగి పుంజుకుంటాం' - కేటీఆర్, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

- వివరాలు 6లో

ఇదండీ సంగతి



అంత ఆవేశపూరిత రెచ్చగొట్టే స్పీచ్‌లిచ్చినా మనం తప్ప జనం రెచ్చిపోలేదు!

కూటమి భారీ విజయం

ఏపీలో మొత్తం 164 స్థానాలతో ఎన్డీఏ అనూహ్య విజయం

టీడీపీ	జనసేన	బీజేపీ
135	21	8

11 అసెంబ్లీ... 4 పార్లమెంటు స్థానాలతో సరిపెట్టుకున్న వైఎస్సార్‌సీపీ

టీడీపీ-16, బీజేపీ-3, జనసేన-2 స్థానాలతో కూటమికి 21 లోక్‌సభ సీట్లు



విజయ సంకేతం చూపుతున్న టీడీపీ, జనసేన అధ్యక్షులు చంద్రబాబు, పవన్‌కల్యాణ్

- సెఫాలజిస్టులు, సర్వే సంస్థలు ఎవ్వరి అంచనాలకూ అందని ఫలితం
- ఈ ఫలితాలు విస్మయం కలిగించాయన్న సీఎం జగన్
- టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు– జనసేన అధిపతి పవన్ కల్యాణ్ భేటీ
- ప్రభుత్వ కూర్పు, ప్రమాణ స్వీకార తేదీపై చర్చ

10లో

పేదల గొంతుకై నిలుస్తాం

- ఫలితాలు ఆశ్చర్యం కలిగించాయి
- ప్రజల తీర్పును స్వీకరిస్తాం.. వారి కోసం పోరాడతాం
- ప్రభుత్వంలోకి వచ్చిన వారికి అభినందనలు
- విలేకరుల సమావేశంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- అనంతరం ముఖ్యమంత్రి పదవికి రాజీనామా




- ఏం జరిగిందో తెలియదు కానీ, ఏం చేసినా, ఎంత చేసినా ఇంకా 40 శాతం ఓటు బ్యాంకు మాత్రం తగ్గించలేకపోయారు. కచ్చితంగా గుండె ధైర్యంతో నిలబడి మళ్లీ ఇక్కడి నుంచి లేస్తాం. ప్రతిపక్షంలో ఉండటం కొత్తకాదు. పోరాటాలు చేయడం అంతకన్నా కొత్తకాదు. ఈ ఐదు సంవత్సరాలు తప్ప నా రాజకీయ జీవితమంతా ప్రతిపక్షంలోనే గడిపాను. రాజకీయ జీవితంలో ఎవ్వరూ చూడని కష్టాలు అనుభవించాను. ఇప్పుడు అంతకన్నా కష్టాలు పెట్టినా కూడా సిద్ధంగా ఉన్నాం. ఎదుర్కొంటాం. ప్రభుత్వంలోకి వచ్చిన వాళ్లకు ఆల్ ది వెరీ బెస్ట్. - సీఎం వైఎస్ జగన్

10 లో

నీట్ 'ఎస్టీ' టాపర్ మనవాడే

- ఆలిండియా ఫస్ట్ ర్యాంకర్‌గా గుగులోత్ వెంకట నృపేష్
- అలాగే రెండో ర్యాంకర్ లావుడ్య శ్రీరామ్ నాయక్
- తెలంగాణ రాష్ట్రస్థాయి టాపర్‌గా అనురాన్ ఘోష్
- రాష్ట్రం నుంచి 77,849 మంది హాజరు... 47,371 మందికి అర్హత
- జనరల్ కేటగిరీలో అర్హత మార్కు గతేడాది 137... ఇప్పుడు 164



వెంకట నృపేష్

సాక్షి, హైదరాబాద్: వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే 'నీట్' పరీక్షలో ఎస్టీ కేటగిరీలో ఆలిండియా టాప్ ర్యాంకర్‌గా తెలంగాణకు చెందిన గుగులోత్ వెంకట నృపేష్ నిలిచాడు. రెండో ర్యాంకర్‌గా లావుడ్య శ్రీరామ్ నాయక్ ప్రతిభ చాటాడు. టాప్ ర్యాంకర్‌గా నిలిచిన నృపేష్‌కు 720 మార్కులకుగాను, 715 వచ్చాయి. జాతీయస్థాయిలో అతను జనరల్ కేటగిరీలో 167వ ర్యాంకు సాధించాడు. అలాగే తెలంగాణ రాష్ట్రస్థాయి టాపర్‌గా అనురాన్ ఘోష్

మిగతా 7వ పేజీలో ▶

గ్రూప్-1 ప్రిలిమ్స్ వాయిదాకు హైకోర్టు నిరాకరణ

- పరీక్ష వాయిదా కుదరదన్న టీజీపీఎస్సీ తరఫు న్యాయవాది
- పిటిషనర్ల వినతిపత్రాన్ని పరిశీలించి.. చట్టప్రకారం నిర్ణయం తీసుకోవాలని టీజీపీఎస్సీకి హైకోర్టు ఆదేశం

- వివరాలు 7లో

'ఫోన్ ట్యాపింగ్'పై మీ వివరణేంటి?

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు
- ఇది వ్యక్తుల గోప్యతలోకి చొరబడిన అంశమని వ్యాఖ్య
- మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం..

- వివరాలు 7లో

ALPHORES NEET ACADEMY

Makes the NEW HISTORY in NEET-2024 with the National Level Best Marks

Our Academy is De"Sign"ed for Signature victories. It is achieved with great inspiration

NATIONAL LEVEL BEST SCORE

691 / 720

N.HEMANTH





675

K.SUHRUDH RAGHAVA
ALL INDIA RANK-CR



671 MARKS

V. HASINI

THE EXCELLENT ADMINISTRATOR Dr.V.NARENDER REDDY garu, CHAIRMAN, CONVEYING HEARTY WISHES FOR ATTAINING THE NATIONAL TOP SCORES IN NEET-24

650	647	639	619	619	613	613	604
							
D.Poojitha	N.Koushik Reddy	P.Akshara Reddy	V. Srimukhi	Maria Saba	A. Srivardhini	M. Kamalika Preethi	N. Gyanada

598	595	582	579	573	571	566	561	560	560	541	541
A.Amarender	B. Hasitha	K. Srividya	Md. Afzan Khan	N.Sai Prathigna	M. Prathima	P. Srinath	Shaik Umra	Tejashwini	Maheen Nazmeen	S. Saketh Patel	Kamalika

537	533	533	526	523	522	522	522	522	519	516	515	511
Srivennela	Anjana Soumya	B. Amitha	R. Sathwika	Hafsa Riyan	P. Apoorva	B.Krishna Sri	S. Anusha	N. Neethika	Malaha Fathima	D. Roshan Sathwik	A. Nayana Mythri	Nisa Sarwath
509	507	506	501	501	500	499	498	496	496	495	494	494
T. Pearly	A.Sai Nishma	B.Ashritha	Vishal Reddy	Varshitha	A. Archana	Kifah Khatoon	K. Spoorthi	Kavya Sri	D. Dheeraj Yadav	Sriharshini	Ch. Shiva Ganesh	Syeda Azhanawaz Fathima
492	491	490	490	489	488	486	486	485	485	484	483	478
Ch. Nikhil	Mariyan Fathima	Maliha Muskhan	Nishitha	Jyothirmai Reddy	D.Sumagna	Syed Iliyaz Ahmed	E.Jahanavi	R.Swathi	Afifa Samar	P.Sai Harisitha	P. Akshitha	Laxmi bhavana
477	477	476	474	469	469	466	465	464	464	464	463	463
Syed Ayesha Samreen	Sai Shankari	M. Shravya	Vaishnavi	Asna Mahvish	Harsitha	Sana Firdouse	U. Sindhu	P. Nikitha	B.Ashrith Reddy	Abdul Hakeem	Shabhista	Srilakshmi

462	461	460	460	458	455	455	454	452	451	451	450
Zeenath Fathima	P. Niharika	Ramsha Koreen	R. Aksitha Sree	K. Akhela	Ch. Srinidhi	Y.Sai Chandu	Vedika	Syeda Madiha Maryam	Noma Aiman	Haniya Falak	N. Srinithya

Great to share...130+ ALPHORESIANS are likely to get the MBBS Seats

Congratulations! Excellent Scorers & Thanks to PARENTS & TEAM ALPHORES

Superb Scholarship Scheme

Free Coaching for 450+ Scorers

Long Term NEET Coaching Starts from 13.06.2024

ADMISSIONS ARE OPEN

HYDERABAD : 90326 66825 I KARIMNAGAR : 91335 88857 I JAGTIAL : 916020 74447 I HANAMKONDA : 91604 27444
MANCHERIAL : 91602 64443 I NIZAMABAD : 9160191444 I NIRMAL : 96524 44414 I ARMOOR : 91604 63444



"దుఃఖం, అనిత్య, అనాత్మలను పరిశీలనతో అవగాహన చేసుకొని... పొందదగిందీ, అందుకోదగిందీ ఏదీ లేదని తెలుసుకొన్న వ్యక్తి సరైన అర్థంలో పూర్తిస్థాయి బౌద్ధుడు కాగలడు."
– బుద్ధదాస భిక్కు (బౌద్ధ ధర్మం)

సాక్షి
బుధవారం, 5 జూన్ 2024

దక్షిణాదిన 'కమల' హాసం!

కేంద్రంలో వరసగా పదేళ్లు పాలించి మూడోసారి 400 సీట్లతో ఘనమైన హ్యాట్రిక్ నమోదు చేసుకోవాలనుకున్న ఎన్డీఏను ఉత్తరాదిన నిలువరించటంలో, దాన్ని 300 లోపు మెజారిటీకి పరిమితం చేయటంలో 'ఇండియా' కూటమి విజయం సాధించిందని సోమవారం వెల్లడవుతున్న సార్వత్రిక ఎన్నికల ఫలితాల సరళి వెల్లడిస్తోంది. 'జనం మా వైపే మొగ్గు చూపారు. మూడోసారి కూడా పాలించమని ఆశీర్వదించారు' అని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించినా జరిగిందేమిటో కనబడుతూనేవుంది. పూర్తి ఫలితాలు వెల్లడికావటానికి ఇంకా సమయంవున్నా దేశానికి 'కొత్త రోల్ మోడల్'గా బీజేపీ చూపించదల్చుకున్న ఉత్తరప్రదేశ్‌లో ఆ పార్టీ సగం సీట్లపైగా కోల్పోవటం ఖాయమని అర్థమవుతోంది. రామమందిరం నిర్మాణమవుతున్న అయోధ్య... ఫైజాబాద్ ఎంపీ స్థానం పరిధిలోనిదే. అక్కడా, ఇతరచోట్లా బీజేపీకి ఎదురుగాలి వీచటం చిన్నవిషయం కాదు. అయితే ఉత్తరాదిలో ఎన్డీఏకు జరిగిన ఈ నష్టాన్ని భర్తీ చేయటానికి దక్షిణాది సిద్ధపడిందని, తూర్పున ఒడిశా కూడా ముందుకొచ్చిందని ఫలితాలు సూచిస్తున్నాయి. తమిళనాడు ఇందుకు మినహాయింపు. ఆఖరికి ఎప్పుడూ బీజేపీ ఉనికి కనబడని కేరళలో ఆ పార్టీకి ఒక స్థానం రావడం సామాన్యం కాదు. బెంగాల్ మాత్రం బీజేపీని కోలుకోలేని దెబ్బతీసింది. ఉత్తరాదిన మతతత్వ రాజకీయాలపై మబ్బులు విడిపోతున్న వేళ దక్షిణాది ఆ ప్రభావానికి లోనుకావటం ఏపీలో టీడీపీకి కలిసొచ్చివుండొచ్చని కొందరు చేస్తున్న విశ్లేషణ నిజమే కావొచ్చు. ఎందుకంటే కార్గిల్ ఘర్షణల అనంతరం జరిగిన ఎన్నికల్లో బీజేపీకి ఏపీలో మెరుగ్గా స్థానాలు వచ్చాక ఎన్డీఏకు ఈ స్థాయిలో ఆదరణ లభించటం ఇదే మొదటిసారి. కర్ణాటక బీజేపీ కొమ్ముకాయడంలో వింతేమీ లేదు. అది బీజేపీకి గట్టి పట్టున్న ప్రాంతం. గత లోక్‌సభ ఎన్నికల్లో సైతం బీజేపీదే అక్కడ ఆధిక్యత. తెలంగాణలో సైతం ఈసారి దాదాపు సగం స్థానాలతో బీజేపీ జెండా ఎగరటం, ఆ పార్టీ అభ్యర్థులకు మంచి మెజారిటీలు నమోదుకావటం విశేషం. ఈ రెండు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా 'ఆరు గ్యారెంటీల' పేరిట ఇచ్చిన హామీలను నెరవేర్చలేక అధికారంలోవున్న కాంగ్రెస్ సతమతమవుతోంది. బీజేపీ బలం పుంజుకోవటానికి అది తోడ్పడింది.

కానీ వెనకా ముందూ చూడకుండా ఈ వాగ్దానాలనే కాపీకొట్టి జనం ముందుకొచ్చిన తెలుగుదేశానికి ఊహించని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో ఆదరణ లభించింది. అయిదేళ్లక్రితం ఇచ్చిన వాగ్దానాల్లో 90 శాతం పైగా నెరవేర్చి, 'మీ ఇంట్లో మంచి జరిగితేనే నాకు వోటేయండి' అని చెప్పిన వైఎస్సార్ కాంగ్రెస్ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కాదని ఎన్డీఏవైపు జనం మొగ్గుచూపటం వెనక బీజేపీతోపాటు రకరకాల ప్రభావాలు స్పష్టంగానే కనబడుతున్నాయి. చంద్రబాబు విశ్వసనీయత కలిగిన నాయకుడు కాదు. ఆ సంగతిని ఆయన 2014–19 మధ్య పాలించినప్పుడు సైతం నిరూపించుకున్నారు. చేసిన వాగ్దానాల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేక ఏకంగా మేనిఫెస్టోను పార్టీ వెబ్‌సైట్‌నుంచి మాయం చేసిన ఘనుడాయన. ఇప్పుడు కూడా అందుకు భిన్నంగా ఏమీ ఉండబోదు. మేనిఫెస్టో ఆవిష్కరణ రోజున దానిపై ప్రధాని ఛాయాచిత్రం ఉండరాదని బీజేపీ పట్టుబట్టడం, అందుకు అంగీకరించినా దాన్ని చేతితో తాకేందుకు కూడా ఢిల్లీ నుంచి వచ్చిన బీజేపీ నాయకుడు సిద్ధపడని వైనం తాజా వాగ్దానాలకు ఏ గతి పడుతుందో తేటతెల్లం చేశాయి. ఆ సంగతలావుంచి ఎన్నికల ప్రచారపర్వంలోగానీ, అంతకుముందుగానీ ఏమాత్రం ప్రభుత్వ వ్యతిరేకత కనబడనిచోట అధికార పక్షం ఇంత దారుణంగా ఓడిపోవటం వెనక ఈవీఎంల పాత్ర ఉండొచ్చని కొందరు వ్యక్తం చేస్తున్న అనుమానాలూ... చాలాచోట్ల వోటింగ్ శాతం అసాధారణంగా పెరగటంలో మతలబుందని పోలింగ్ రోజున మరికొందరు శంకించటం పూర్తిగా కొట్టిపారేయదగినవి కాకపోవచ్చు. సాధారణంగా ఓడిన పక్షం ఈవీఎంలపై నెపం వేయటం గతంలో చాలాసార్లు జరిగింది. కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, అకాలీదళ్‌లు భిన్న సందర్భాల్లో ఆ పనే చేశాయి. వైఎస్సార్ కాంగ్రెస్ ఇంతవరకూ ఆ మాటనలేదు. కానీ ఆ పార్టీ నేతల స్వరంలో అది అంతర్లీనంగా కనబడుతూనేవుంది. అమెరికాతోసహా సాంకేతికంగా అభివృద్ధి చెందిన అనేక దేశాల్లో ఈవీఎంల విశ్వసనీయతపై సందేహాలు తలెత్తి బ్యాలెట్ పేపర్ వినియోగిస్తున్న తరుణంలో మన దేశంలో మాత్రమే ఇది ఎందుకు కొనసాగాలని చాలామంది ప్రశ్నిస్తూనే ఉన్నారు. ఎలాగోలా గెలవటం తప్ప నైతిక విలువల గురించి అసలు పట్టింపేలేని బాబు చడీచప్పుడూ లేకుండా వోటింగ్ శాతం పెరగటానికీ, ఈవీఎంలను తనకనుకూలంగా మలుచుకోవటానికీ లోపాయకారీగా ఏమైనా చేసివుంటారన్న సంశయాలు ఇందుకే వస్తున్నాయి. ఇదంతా ఒక ఎత్తయితే భూ యజమానులకు తొలిసారిగా హక్కులివ్వటానికి సంకల్పించిన భూహక్కు చట్టం వంటి అత్యుత్తమ చట్టంపై బురదచల్లి, తప్పుడు ప్రచారం నడిపి ప్రజలను భయభ్రాంతుల్ని చేయటంలో బాబు విజయం సాధించారు.

ఎన్నికల్లో గెలుపోటములు సహజం. సత్యం మాత్రమే జయిస్తుందన్నది కూడా వాస్తవమే. కానీ గెలిచేదంతా సత్యం కాదు. నిలకడపై అన్ని నిజాలూ వెల్లడవుతాయి. ఎన్నికల నిర్వహణ తీరు అందరిలోనూ అనుమానాలు రేకెత్తించింది. ఏపీ ఇందుకు స్పష్టమైన ఉదాహరణ. పక్కనున్న తెలంగాణలో వివాదరహితంగా ఎన్నికలు జరగ్గా ఏపీలో బాబు, పవన్‌లు దుర్భాషలతో చెలరేగిపోయారు. వీటిని అరికట్టడానికి ఎన్నికల సంఘం చేసిందేమీ లేదు సరిగదా...టీడీపీ అడిగిన తడవే అన్నీ నెరవేర్చింది. పర్యవసానంగా తటస్థతకు తూట్లుపడ్డాయి. మొత్తానికి ఆరు వారాలపాటు పెళ్లివారి నడకను తలపిస్తూ సాగిన ఎన్నికల కోడ్ దేశవ్యాప్తంగా పాలనను స్తంభింపజేసింది.

నవ భారత నిర్మాణం కోసం...

అభిప్రాయం



డా॥ కత్తి పద్మారావు

రాజ్యాంగమే మనకు దిక్సూచి. రాజ్యాంగమే మనకు ప్రమాణం. రాజ్యాంగం హామీ ఇచ్చిన వ్యక్తిస్వేచ్ఛ, జీవించే హక్కులను కాపాడుకోవాల్సి ఉంది. రాజ్యాంగం భావ ప్రకటన స్వేచ్ఛను ఇచ్చింది. భారతదేశమంతా స్వేచ్ఛగా సంచరించే హక్కు, ఏ ప్రాంతంలో అయినా నివసించే హక్కు కలిగి ఉన్నాం. దోపిడీ నుండి రక్షణ పొందే హక్కును కలిగి ఉన్నాం. బౌద్ధం ప్రవచించిన సామాజిక సమానత్వం తిరిగి సాకారం కావాలి. ప్రజలు సిరిసంపదలతో తులతూగే, సుఖ సంతోషాలతో శాంతమయమైన జీవితాన్ని గడిపే రోజులు మళ్లీ రావాలి. ప్రేమతత్వాన్ని పెంపొందించాలి, ద్వేషాన్ని విడనాడాలి.

అంబేడ్కర్ భారతదేశాన్ని బౌద్ధ భారతంగా గుర్తించారు. బీజేపీ పార్టీ రాముడు అని నినాదం చేస్తే, ఆమ్ ఆద్మీ పార్టీ వాళ్ళు ఆంజనేయుడు అన్నారు. కొందరు రామరాజ్యం కావాలి అంటే, ఇంకొందరు కృష్ణరాజ్యం కావాలి అన్నారు. కానీ ఈరోజు కావాల్సింది బౌద్ధ రాజ్యం. బౌద్ధంలో సామాజిక సమానత్వం ఉంది. బౌద్ధ సూత్రాలతోనే అంబేడ్కర్ రాజ్యాంగం రచించారు.

'మన ఉద్యమాలు హిందువుల మనసులను మార్చలేకపోయాయి. మనం ఆశించిన సమానత్వాన్ని అందుకోలేకపోయాం. వర్ణ వ్యవస్థకు, అస్పృశ్యతకు మూలమైన హిందూమతంలో కొనసాగేకంటే ఆ మతానికి స్వస్తి చెప్పి మరో మతాన్ని స్వీకరించడం మేలు. దురదృష్టవశాత్తూ నేను హిందువుగా జన్మించాను. అది నా చేతిలో లేదు. కానీ నేను హిందువుగా మరణించను' అని అంబేడ్కర్ ప్రకటించారు. ఈ ప్రకటన హిందువుల గుండెల్లో ఆందోళన రగిలించింది. అంబేడ్కర్ హిందూ మతాన్ని విడనాడేందుకు నిర్ణయం తీసుకున్నారని తెలిసిన హైందవేతర మతాధిపతులు అంబేడ్కర్‌ను తమ తమ మతాలను స్వీకరించాల్సిందని రాయబారాలు సాగించారు.

ఆ సమయంలో ఇటలీ బౌద్ధ భిక్షువు లోక్‌నాథ్ శ్రీలంక వెళ్తూ బొంబాయిలోని రాజగృహ గ్రంథాలయంలో అంబేడ్కర్‌ను కలుసుకొని బౌద్ధ మత విశిష్టత గూర్చి సుదీర్ఘ చర్చలు జరిపారు. భారత దేశంలో అస్పృశ్యులకు స్వాతంత్ర్యాన్నీ, సమానత్వాన్నీ అందివ్వగలిగేది బౌద్ధమేననీ, అందుకు బౌద్ధాన్ని ప్రచారం చేయమనీ కోరారు. శ్రీలంక చేరుకున్న తర్వాత కూడా ఒక ఉత్తరాన్ని రాశారు. "...ఈ ఉత్తరాన్ని ముగించే ముందు నేను మీతో మీ గ్రంథాలయంలో మాట్లాడిన విషయాన్ని మరొక్క మారు గుర్తుకు తెనివ్వండి. డాక్టర్ అంబేడ్కర్! మీ భుజస్కంధాలపై ఎంతో బాధ్యత ఉంది. పీడిత ప్రజానీకానికి ఆనందమైన జీవితాన్ని అందించినా లేక వారిని దుఃఖంలో ముంచినా అంతా మీపై ఆధారపడి ఉంది. వారి భవిష్యత్ అంతా మీ చేతుల్లో ఉంది. మీరు మరో సామాన్యమైన మతాన్ని స్వీకరించినట్లయితే మీరే కాకుండా కోట్లాది ప్రజలు నష్టపోతారు. వారిని బౌద్ధమతం వైపు నడిపించండి. బౌద్ధమతం గురించి మీరు ప్రశంసించిన మాటలు నాకింకా



బాగా గుర్తున్నాయి. మీ గ్రంథాలయ గోడపై ధ్యాన నిమగ్నంలో ఉన్న అత్యంత సౌందర్యవంతమైన బుద్ధుని చిత్రపటం నాకళ్ళ ఎదుటే వున్నట్లు కనిపిస్తుంది' అంటూ భిక్కు లోక్‌నాథ్ రాశారు. అంబేడ్కర్ బౌద్ధమతం తీసుకోవటం వెనుక లోక్‌నాథ్ ప్రభావం కూడా ఉంది.

నిజానికి బౌద్ధం గొప్ప చారిత్రక, రాజకీయ ధర్మం. శాతవాహన, ఇక్ష్వాకు రాజకుటుంబాల్లోని స్త్రీలు బౌద్ధం పట్ల మక్కువజూపి లెక్కలేనన్ని బౌద్ధచైత్యాల్ని, మండపాల్ని, విహారాల్ని నిర్మించారు. నాగార్జున కొండలో బయల్పడిన ప్రాకృత శాసనాలను పరిశీలిస్తే, ఆ కాలపు ప్రజలు సిరిసంపదలతో తులతూగి, సుఖ సంతోషాలతో, శాంతమయమైన జీవితాన్ని గడిపారని తెలుస్తుంది. వర్తకులు, కళాకారులు, భూస్వాములు, సైనికులు, ఉన్నతోద్యోగులు, ఒకరేమిటి వివిధ వృత్తులవారు ఒక్కటై బౌద్ధారాధనలో అంకిత భావంతో అమితోత్సాహంగా పాలు పంచుకొన్నారు. దీనికి అప్పటి సాంఘిక, ఆర్థిక పరిస్థితులు అనుకూలించి తెలంగాణా, ఆంధ్ర ప్రాంతాల్లో బౌద్ధం విస్తరించటానికి తోడ్పడినాయి.

అంబేడ్కర్‌కు ఈ చరిత్రంతా తెలుసు. అందుకే ఆయన బౌద్ధాన్ని ఒక జీవన విధానంగానే కాక, ఒక దేశీయ విధానంగానూ భావించారు. నిజానికి మనది బౌద్ధ భారతం. మన రాజముద్ర ఏది? బౌద్ధ చక్రవర్తి అశోకుడు చెక్కించిన సారనాథ్‌లోని నాలుగు తలల సింహ స్తూపం, 24 ఆకులు గల ధర్మ చక్రాలతో కూడిన ముద్రే కదా! ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముద్ర ఏదీ? విదికుడనే చర్మకారుడు క్రీస్తు శకం 12 శతాబ్దంలో అమరావతి స్తూపంపై చెక్కిన పూర్ణ ఘట శిలాఫలకమే కదా! మనం వాడే ధర్మం అనే పదం ఎక్కడిది? బుద్ధుడు నైతిక విలువలకు చిహ్నంగా బోధించిన 'ధమ్మ' పదం నుంచి వచ్చిందే కదా!

దక్షిణ భారతంలో ప్రసిద్ధులైన అనేకమంది మేధావులు బౌద్ధం నుండి వచ్చినవారే. నాగార్జునుడు, ఆర్యదేవ, భవ్య, దిజ్ఞాగ, ధర్మకీర్తి, వసుబంధు, బుద్ధపాలిత, భావవివేక, అసంగ తదితర తత్వవేత్తలు అందరూ బౌద్ధులే. బౌద్ధం ప్రేమ తత్వాన్ని బోధించింది. ద్వేషాన్ని తొలగించింది. బౌద్ధ భారత నిర్మాణంలోనే 'కుల నిర్మూలన' జరుగుతుందని అంబేడ్కర్ బోధించారు. నిజానికి భారత రాజ్యాంగం అంతా బౌద్ధ సాంస్కృతిక జ్ఞాన వికాసంతో నిండి ఉంది. నిజానికి మత భావకులు ప్రేమను, నైతికతను, జ్ఞాన సంపదను చెప్పవలసిందిపోయి పరలోక రాజ్యాల గురించి బోధిస్తున్నారు.

ఇటువంటి పరిస్థితుల్లో రాజ్యాంగంలోని వ్యక్తి స్వేచ్ఛ, జీవించే హక్కులను కాపాడుకోవాల్సి ఉంది. భారత రాజ్యాంగం అంతా అహింసా సూత్రాలతో నడుస్తుంది. అంటరానితనం నిషేధించబడింది. భావ ప్రకటన స్వేచ్ఛను ఇచ్చింది. భారతదేశమంతా స్వేచ్ఛగా సంచరించే హక్కు, భారత భూభాగంలో ఏ ప్రాంతంలో అయినా నివసించే హక్కు కలిగి ఉన్నాం. దోపిడీ నుండి రక్షణ పొందే హక్కును కలిగి ఉన్నాం. రాజ్యాంగాన్ని పరిశీలిస్తే అంబేడ్కర్ బౌద్ధ ధమ్మపథ సారాన్ని అంతా ఎలా అందులోకి ఇమిడ్చారో మనకు అర్థమౌతుంది. అంబేడ్కర్ భారతదేశ చరిత్రను, సంస్కృతిని, నీతిశాస్త్రాన్ని, అహింసా ధర్మాన్ని, ప్రేమతత్వాన్ని, కరుణ భావాన్ని రాజ్యాంగంలో పొందుపరిచి బౌద్ధ భారత నిర్మాణానికి పునాదులు వేశారు. ఈనాడు ప్రజలు, మేధావులు, ఆలోచనాపరులు, లౌకిక వాదులు, సాంస్కృతిక వాదులు అందరం అంబేడ్కర్ స్ఫూర్తితో బౌద్ధ భారత నిర్మాణానికి తిరిగి పూనుకుందాం. అప్పుడే భారతదేశంలో క్రాంతి, శాంతి, అహింస, నైతికత, ఉత్పత్తి, ప్రేమ సమతుల్యం అవుతాయి.

వ్యాసకర్త దళితోద్యమ నాయకుడు | 98497 41695

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

వక్రోక్తి



మూడోసారి కాంగ్రెస్ ప్రతిపక్షంలో కూర్చోనుంది. అయినప్పటికీ దాని మద్దతుదారులు సంతోషంగా ఉన్నారు. మూడోసారి బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది. అయినప్పటికీ దాని మద్దతుదారులు నిరాశలో ఉన్నారు.

– ఆనంద్ రంగనాథన్, రచయిత

చేదు నిజం



పంజాబ్‌లోని ఖడూర్ సాహిబ్ నియోజకవర్గం నుంచి జైలులో ఉన్న ఖలిస్తానీ వేర్పాటువాద నాయకుడు అమృత్‌పాల్ సింగ్ గెలిచారు. ఇది నిజంగా ఆందోళన కలిగించే అంశం.

– అన్షుల్ సక్సేనా, జర్నలిస్ట్

క్షేత్ర వాస్తవం



చాలామంది క్షేత్రస్థాయి విలేఖరులు, ఇంకా ఎన్నికల సరళిని దగ్గరగా చూసినవాళ్లం ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను చూసి షాక్ అయ్యాం. క్షేత్రస్థాయిలో కనబడుతున్న దానితో అవి పొసగ లేదు. మళ్లీ మీరే స్వయంగా మీ కళ్లతో చూసినదాన్ని సందేహిస్తున్నారు!

– విక్రమ్ చంద్ర, సంపాదకుడు

సూచనలు వింటేనా?



బీజేపీకి 220 సీట్లు మాత్రమే వస్తాయన్న నా అంచనా వాస్తవానికి దగ్గరగా ఉంది. నా సూచనలను అనుసరించి ఉంటే బీజేపీ 300 స్థానాలు సాధించివుండేది. దురదృష్టవశాత్తూ, మోదీ నియంతృత్వపు మైండ్‌సెట్ బీజేపీని అగడ్తలో పడేసింది. ఇప్పుడు దాన్ని అది ఎక్కాల్సివుంది.

– సుబ్రహ్మణ్య స్వామి, కేంద్ర మాజీ మంత్రి

యూపీలో ఎందుకిలా?



ఉత్తరప్రదేశ్ నుంచి ఒక నాయకుడు యోగీ ఆదిత్యనాథ్‌ను బీజేపీ లోక్‌సభ టికెట్ కోసం సంప్రదించానని నాతో చెప్పారు. కానీ ఆయన యోగీజీని సంప్రదించినప్పుడు, "నేను సిఫారసు చేస్తే, ఢిల్లీ నాయకత్వం నుంచి మీకు కచ్చితంగా టికెట్ రాదు" అని యోగీజీ అన్నారట. ఆయన చెబితే అప్పుడు నేను నమ్మలేదు.

– వైభవ్ సింగ్, ఆంట్రప్రెన్యూర్

ఆయనేనా పీఎం?



ఇందులో పొరపడొద్దు. మోదీ ఓట్లు అడిగారు. కేవలం ఆయన పేరు మీద అడిగారు. తనకోసం అడిగారు. ఇది పూర్తిగా ఆయన ఓటమి. తరువాతి ప్రభుత్వాన్ని నడిపే నైతిక, రాజకీయ, రాజ్యాంగ హక్కును ఆయన కోల్పోయారు.

– ఆశుతోష్ భరద్వాజ్, సంపాదకుడు

సారాంశం



ఈ ఎన్నికలను చూసిన తర్వాత గ్రహించాల్సిన విషయాలు: 1. ఎన్నికలు పారదర్శకంగా జరిగాయి. 2. ఈవీఎంల రిగ్గింగ్ జరగలేదు. 3. పౌర యుద్ధం చేస్తామనడం మూర్ఖత్వం– ఇది యుద్ధం కాదు, ఎన్నికలు. 4. ఎగ్జిట్ పోల్స్ గొప్ప వినోదం కలిగించాయి. కానీ వాస్తవమైనది అసలు ఫలితం. 5. మళ్లీ మనం సంకీర్ణాల యుగానికి వచ్చాం – కాబట్టి ఆర్థికంగా, రాజకీయంగా తీవ్రమైన సంస్కరణల గురించి ఇక మరిచిపోవచ్చు.

– సుశాంత్ సరీన్, సీనియర్ ఫెలో

వైజ్ఞానిక వేగుచుక్కలు

తొలి వెలుగు దివిటీలు

బీఎస్సీ డిగ్రీ పొందిన తొలి భారతీయ మహిళ ఈకే జానకీ అమ్మాళ్. ఈమె 1921లో మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాల నుంచి బాటనీలో పట్టభద్రులయ్యారు. తర్వాత 12 ఏళ్లకు బొంబాయి యూనివర్సిటీ నుంచి కమలా సాహ్ని, తర్వాతి సంవత్సరం ఢిల్లీ యూనివర్సిటీ నుంచి రాధా పంత్ బీఎస్సీ డిగ్రీ పొందిన మహిళలు. అయితే వైద్యశాస్త్రంలో మాత్రం కాస్త ముందుగానే అంటే 1886లో కాదంబినీ గంగూలీ కలకత్తా మెడికల్ యూనివర్సిటీ, ఆనందీ బాయి జోషీ పెన్సిల్వేనియా ఉమెన్స్ మెడికల్ కాలేజీ నుంచి వైద్యశాస్త్రంలో పట్టాలు పొందిన తొలితరం భారతీయ మహిళలు.



ఆనందీ బాయి జోషీ

ఈ రెండు విజ్ఞాన ప్రవంతుల మధ్య మూడున్నర దశాబ్దాల ఎడం ఉండటమెందుకు? సిపాయిల తిరుగుబాటుగా బ్రిటిష్ వారు పిలిచిన భారత ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం మొదలైన 1857 లోనే తొమ్మిది నెలల వ్యవధిలో కలకత్తా, బొంబాయి, మద్రాసులలో విశ్వవిద్యాలయాలు తొలిసారిగా ఏర్పడ్డాయి. 1884లో లార్డ్ డఫ్రిన్ భారతదేశపు వైస్రాయ్ అయ్యారు. లేడీ డఫ్రిన్‌గా పిలవబడిన హ్యారియట్ జార్జినా రోవాన్ హామిల్టన్ చొరవతో 1885లో ఏర్పడిన ఈ ఫండ్ ద్వారా మనదేశ మహిళలు వైద్యులుగా, సహాయకులుగా, నర్సులుగా తర్ఫీదు పొందడానికీ, చదువుకోడానికీ వీలైంది. డఫ్రిన్ ఫండ్ వల్ల భారతీయ యువతులు ఇంగ్లాండులో వైద్యశాస్త్రం చదువుకోవడానికీ; అలాగే ఇంగ్లాండ్, ఇతర ఐరోపా నుంచి మహిళలు భారతదేశానికి వచ్చి వైద్యం చేయడానికీ వీలైంది.

ఈ ఫండ్‌కు కశ్మీరు, దర్భంగా వంటి సంస్థానాధీశులు ఆర్థిక సాయం చేశారు. అలాగే బ్రిటిష్ ప్రముఖులతో పాటు మహారాజా జ్యోతీంద్ర మోహన్ ఠాగూర్, సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్, సర్ దిన్షా మానేక్ జీ పేటిట్ వంటి భారతీయులు కూడా ఎంతో తోడ్పడ్డారు. అయితే లేడీ డఫ్రిన్ స్పందించే గుణం, చొరవ కారణంగానే ఈ ఫండ్ రూపుదిద్దుకుని కొనసాగింది. 1908 నాటికి దీని ద్వారా కేవలం 43 మంది మాత్రమే యోగ్యులైన మెడికల్ ప్రొఫెషనల్స్ తయారు అయ్యారనీ, వారిలో కేవలం 11 మంది మాత్రమే పట్టభద్రులనీ తెలుస్తోంది. ఈ ఫండ్ ద్వారానే 1886లో తొలి భారతీయ వైద్యశాస్త్ర మహిళా పట్టభద్రులు తయారయ్యారు. 2005లో 'డఫ్రిన్ ఫండ్ యాక్ట్ –1857' రద్దయ్యింది.

భారతీయ వైద్యరంగానికి మహిళల అవసరం చాలా ఉన్నందున, క్రమంగా జీవశాస్త్రాల పట్ల కూడా మహిళలకు ఆసక్తి పెరిగింది. అయితే మహిళలు సైన్స్ చదువుకోవడానికి అవకాశం పెద్దగా ఉండేది కాదు. దాంతో అరకొర అవకాశాలు, అంతకుమించిన వివక్ష ఉన్న పరిస్థితుల్లో భారతీయ మహిళలు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో తొలి అడుగులు వేశారు.

– డా॥ నాగసూరి వేణుగోపాల్
విశ్రాంత ఆకాశవాణి అధికారి | 94407 32392

నిశ్శబ్ద పర్యావరణ సంక్షోభం

సందర్భం



డా॥ కె. శశిధర్

పర్యావరణం నేడు గతంలో ఎన్నడూ లేనంత అతిపెద్ద సంక్షోభాన్ని ఎదర్కొంటోంది. ఇందుకు కారణం మానవుని స్వార్థపూరిత చర్యలే. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, కాలుష్యం వల్ల సమస్త జీవులే కాకుండా, పరిణామ క్రమంలో ఎంతో విలువైన పాత్ర పోషించిన భూమి, అడవులు, గాలి వంటి సహజ వనరులు తమలోని సహజత్వాన్ని కోల్పోతున్నాయి.

అత్యంత వేగంగా క్షీణిస్తున్న భూ వనరులను సంరక్షించుకోడానికి ప్రపంచ దేశాలను సమాయత్తం చేసేందుకు వీలుగా 2024 సంవత్సరపు ప్రపంచ పర్యావరణ దిన వేడుకలను 'మన భూమి... మన భవిష్యత్తు' అనే నినాదంతో జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితికి అనుబంధంగా ఉన్న యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంటల్ ప్రోగ్రామ్ (యూఎన్ఈపీ) కోరింది. భూమిని క్షీణత నుండి కాపాడుకోడానికీ, ఇప్పటికే క్షీణతకు గురైన భూమిని శుద్ధి చేసి తిరిగి పునరుద్ధరించుకోడానికీ ప్రపంచ దేశాలన్నీ చిత్తశుద్ధితో కృషి చెయ్యాలని ఈ సంస్థ ప్రపంచ దేశాలను కోరింది.



కాలుష్యం, భూతాపం వంటి పర్యావరణ సమస్యల వల్ల విశ్వవ్యాప్తంగా ఏటా లక్షల ఎకరాల్లో భూమి బీడు బారుతోంది. మానవ ప్రేరిత చర్యల వల్ల ఏటా కనీసం 1.6 బిలియన్ హెక్టార్ల భూమి క్షీణతకు గురవుతోందనీ, ఇది సుమారు 3.2 బిలియన్ల ప్రజల జీవితాలపై తీవ్రమైన ప్రభావాన్ని కలిగిస్తుందనీ పర్యావరణ వేత్తలు అంచనా వేస్తున్నారు. పర్యావరణ వ్యవస్థలలో మార్పులు రావటం వల్ల సంభవిస్తున్న వర్షాభావ పరిస్థితుల వల్ల భూగర్భ జలాలు అడుగంటి పోవటం, పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల పోషకాలు నశించి పోవటం వల్ల భూమి పెద్ద ఎత్తున క్షీణతకు గురై ఎడారిగా మారిపోతోంది. గడిచిన పదేళ్లలో సుమారు 15 లక్షల హెక్టార్ల సాగుభూమి ఎడారిగా మారిపోయిందని అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ టు కంబాట్ డిసర్టిఫికేషన్ (యూఎన్‌సీసీడీ) సంస్థ తాజాగా విడుదల చేసిన ఒక నివేదిక ప్రకారం మానవ ప్రేరిత చర్యల వల్ల ప్రపంచ వ్యాప్తంగా 100 దేశాల్లో విస్తరిస్తున్న ఎడారీకరణ వల్ల 1 బిలియన్ ప్రజలు తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని పేర్కొంది. పరిస్థితులు ఇదేవిధంగా కొనసాగితే రానున్న పదేళ్ల కాలంలో 40 శాతానికి పైగా భూమి తన జీవత్వాన్ని కోల్పోయి, క్షీణతకు గురై ఎడారిగా మారిపోతుందని ఆ నివేదిక అంచనా వేస్తోంది.

భూక్షీణత వల్ల 2050 నాటికి ప్రపంచ జనాభాలో మూడొంతుల మంది తీవ్రమైన కరువు బారిన పడతారనీ, దీంతో కోట్లాది మంది ప్రజలు పర్యావరణ శరణార్థులుగా మారి పొట్ట చేత బట్టుకుని ఇతర ప్రాంతాలకు, ఇతర దేశాలకు వలస పోవాల్సి వస్తుందనీ యూఎన్‌సీసీడీ సంస్థ హెచ్చరిస్తోంది.

భూమిని తల్లిగా భావించి పూజించే భారతదేశంలో కూడా భూమి అత్యంత వేగంగా క్షీణతకు గురై నిర్జీవంగా మారిపోతోంది. వాతావరణ మార్పులు, మానవ ప్రేరిత చర్యల వల్ల దేశంలో 32 శాతం భూమి క్షీణతకు, 25 శాతం భూమి ఎడారీకరణకు గురవుతుందని భారత కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ అధికారిక గణాంకాలు తెలియ చేస్తున్నాయి.

యూఎన్‌సీసీడీ భారతదేశంలో 2015 నుండి 2019 వరకూ అంటే నాలుగు ఏళ్ల కాలంలో సుమారు 30.51 మిలియన్ హెక్టార్ల భూమి క్షీణతకు గురై బీడు బారిపోయిందని అంచనా వేసింది. ఈ నివేదిక ప్రకారం 2019 నాటికి దేశ విస్తీర్ణంలో 9.45 శాతం భూమి క్షీణతకు గురయ్యింది. 2023లో విడుదల చేసిన తాజా నివేదికలో భారతదేశ జనాభాలో దాదాపు 18.39 శాతం మంది ప్రజలు భూ క్షీణత, ఎడారీకరణ వల్ల అనేక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది.


భారతదేశంలో ఎడారీకరణకు, భూమి క్షీణతకు హరిత విప్లవం పేరుతో అనుసరించిన విధానాలు కూడా ఒక కారణమే. సాంద్ర వ్యవసాయానికి అవసరమైన నీటిని విచక్షణారహితంగా భూమి నుంచి తోడటం, పెద్దయెత్తున రసాయనిక ఎరువుల వినియోగం, ఏకరూపక వ్యవసాయ సంస్కృతి వంటి హరితవిప్లవ విధానాలే పుడమితల్లి పాలిట శాపాలుగా మారాయి. అలాగే అభివృద్ధి పేరుతో పెద్దయెత్తున జరుగుతున్న అడవుల విధ్వంసం, అడ్డు అదుపూ లేకుండా సాగుతున్న పట్టణీకరణ వంటి అంశాలు పరిస్థితిని మరింత విషమం చేస్తున్నాయి.

అయితే వేగంగా విస్తరిస్తున్న ఎడారీకరణ, భూ క్షీణతను సమర్థంగా ఎదుర్కోడానికి ఇప్పటికీ భారతదేశానికి ఒక స్పష్టమైన, సమగ్రమైన విధానమంటూ లేకపోవటం విచారకరం. 2030 నాటికి ప్రపంచ వ్యాప్తంగా తక్కువలో తక్కువగా 1.5 బిలియన్ హెక్టార్ల భూమిని శుద్ధి చేసి తిరిగి పునరుద్ధరించుకోవాలని ప్రపంచ దేశాలన్నీ ప్రతిజ్ఞ చేశాయి. ఆ సంకల్పం సాకారమయ్యే దిశగా ఈ పర్యావరణ దినోత్సవం ప్రపంచ దేశాలనూ, ప్రజలనూ సమాయత్తం చేస్తుందని ఆశిద్దాం.

వ్యాసకర్త 'సీడ్' వ్యవస్థాపక కార్యదర్శి | 94919 91918
(నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం)

గౌరవం ఆశిస్తే...

బయటి నుంచి ఇంటికి వచ్చిన వ్యక్తి ఓ రోజు విపరీతంగా బాధపడసాగాడు. రోజూ నమస్కరించే ఓ తెలిసినవాడు ఆ రోజు నమస్కరించకపోవడమే ఈ బాధకు కారణం. తనంటే గౌరవం తగ్గిందా? తాను అతడు ఇచ్చే గౌరవానికి తగనా అనుకుంటూ మథన పడుతున్నాడు. ఇతరులు మనల్ని గౌరవించాలి అనే భావన వలనే ఎవరైనా ఇటువంటి బాధకు గురవుతూ ఉంటారు. అయితే మనల్ని ఇతరులు గౌరవించాలని ఆశించడంలో తప్పులేదు. కానీ మనం కూడా అలాగే గౌరవించాలి కదా!



జ్యోతిర్మయం

చాలా సందర్భాల్లో చిన్నపాటి ఆశించడాలే పెను దుఃఖానికి కారణమవుతాయి. లేనిపోని సమస్యలు సృష్టిస్తాయి. ఇందుకు మహాభారత యుద్ధమే ఓ ఉదాహరణ. పాండవుల కోసం మయుడు నిర్మించిన ఓ అద్భుత భవనాన్ని చూడడానికి దుర్యోధనుడు వచ్చాడు. మయసభను సందర్శించిన సమయంలో మయుని చమత్కార నిర్మాణ శైలి వల్ల ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు భ్రమించి దుర్యోధనుడు తబ్బిబ్బవుతూ ఉంటాడు. ద్వారబంధానికి గుద్దుకోవడం, జారి నీళ్లలో పడిపోవడం వంటి సంఘటనలు జరుగుతాయి. ఆ సమయంలో అది చూసి ద్రౌపది పగలబడి నవ్వింది. ఆ నవ్వు కురుక్షేత్ర సంగ్రామానికి మూలమైంది. ఆ నవ్వుకు ప్రతీకారం ద్రౌపదీ వస్త్రాపహరణానికి దారి తీసింది. కలలో కూడా ఇలా జరుగుతుందని ఎవరూ అనుకుని ఉండరు. అభిమానధనుడైన దుర్యోధనుడు ఇతరుల నుంచి గౌరవాన్ని పొందాలనుకుంటాడే కాని పరిహాసాలు కాదు కదా! ఇతరులను అవమానించాలని మంచివారు ఎవరూ అనుకోరు. మరీ ముఖ్యంగా ద్రౌపది వంటి సాధ్వి అసలు అనుకోదు. కొన్ని సంఘటనలు చూసినప్పుడు నవ్వడం మానవసహజం. ఆమె కూడా అందుకే అప్రయత్నంగా నవ్వింది. కానీ దీన్ని దుర్యోధనుడు అవమానంగా భావించాడు. దురహంకారం మూర్తీభవించినవారు అంతకన్నా ఎలా అర్థం చేసుకుంటారు?

– యామిజాల జగదీశ్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ-మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.



గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, తిథి: బ.చతుర్దశి రా.7.15 వరకు, తదుపరి అమావాస్య, నక్షత్రం: కృత్తిక రా.9.05 వరకు, తదుపరి రోహిణి, వర్జ్యం: ఉ.9.35 నుండి 11.07 వరకు, దుర్ముహూర్తం: ఉ.11.32 నుండి 12.24 వరకు, అమృత ఘడియలు: రా.6.55 నుండి 8.25 వరకు; రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు, యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు, సూర్యోదయం: 5.28, సూర్యాస్తమయం: 6.27, మాసశివరాత్రి.

భవిష్యత్తు బీజేపీదే!

ఏలేటి మహేశ్వరరెడ్డి

సాక్షి, హైదరాబాద్: తాజాగా వెలువడిన పార్లమెంట్ ఎన్నికల ఫలితాలతో తెలంగాణలో బీజేపీ పెరుగుదల స్పష్టంగా కనిపిస్తోందని ఆ పార్టీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వరరెడ్డి అన్నారు. 2014లో ఒక ఎంపీ సీటు, 2019లో నాలుగు సీట్లు 2024లో 8 ఎంపీ సీట్లు గెలిచామంటే ప్రధాని మోదీ చరిష్మా వల్లేనన్నారు. ఇక వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ క్లీన్‌స్వీప్ చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం బీజేఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ప్రజలే కాదు, యావత్ దేశ ప్రజలు ప్రధాని మోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని ఈ ఫలితాలు రుజువు చేశాయన్నారు. బీజేపీ గెలిస్తే రిజర్వేషన్లను రద్దు చేస్తుందని, కేంద్ర మంత్రి అమిత్ షా చెప్పినట్లుగా కాంగ్రెస్ వీడియా మార్ఫింగ్ చేసినా, ఆ కుట్రలను ప్రజలు తిప్పికొట్టి ఆ పార్టీకి బుద్ధి చెప్పారన్నారు. తెలంగాణలో ఎన్ని జిమ్మిక్కులు చేసిన కాంగ్రెస్ నేతలు చెప్పిన సీట్లకంటే తక్కువే గెలిచారన్నారు. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఎన్నికలు రాష్ట్ర ప్రభుత్వ పాలనకు రెఫరెండమ్ అని, 14 సీట్లలో గెలుస్తామని చెప్పారని, ఇప్పుడు 8 సీట్లకే ప్రజలు కాంగ్రెస్‌ను పరిమితం చేశారని ఎద్దేవా చేశారు. దీనిని బట్టి రేవంత్ పాలనపై ఆరు నెలల్లోనే ప్రజలకు విశ్వాసం పోయిందని తేలిందన్నారు.

కంటోన్మెంట్‌లో కాంగ్రెస్ గెలుపు

బీజేపీ అభ్యర్థి వంశ తిలక్‌పై 13,206 ఓట్ల మెజారిటీతో విజయం సాధించిన శ్రీగణేశ్


శ్రీగణేశ్‌ను అభినందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి ఎన్. శ్రీగణేశ్ విజయం సాధించారు. సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి డాక్టర్ టీఎన్ వంశ తిలక్‌పై 13,206 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. గత నెల 13న జరిగిన ఉపఎన్నికలో 1,30,929 ఓట్లు పోలయ్యాయి. ఇందులో కాంగ్రెస్ అభ్యర్థి ఎన్. శ్రీగణేశ్ 53,651 ఓట్లు దక్కించుకొని విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి డాక్టర్ టీఎన్ వంశ తిలక్ 40,445 ఓట్లతో ద్వితీయ స్థానంలో నిలవగా, బీఆర్ఎస్ అభ్యర్థి జి. నివేదిత కేవలం 34,462 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. గత నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున పోటీ చేసిన లాస్య నందిత విజయం సాధించారు. గత ఫిబ్రవరిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె మరణించడంతో ఉప ఎన్నిక జరిగింది. లాస్య నందిత స్థానంలో ఆమె అక్క నివేదితకు బీఆర్ఎస్‌కు టికెట్ కేటాయించింది. గత ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీ చేసి రెండో స్థానంలో నిలిచిన శ్రీగణేశ్, కాంగ్రెస్‌లో చేరి పార్టీ టికెట్ దక్కించుకున్నారు.

3.. 2.. 1 : తొలినాళ్లలో కాంగ్రెస్ యువనేతగా రాజకీయాల్లోకి వచ్చిన నారాయణన్ శ్రీగణేశ్, 2014 అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఆశించి భంగపడ్డారు. అనంతరం శ్రీగణేశ్ ఫౌండేషన్ స్థాపించి కంటోన్మెంట్‌లో తన సేవాకార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. 2018 అసెంబ్లీ ఎన్నికలో మరోసారి కాంగ్రెస్ టికెట్ కోసం యత్నించినా, దక్కలేదు. ఆఖరి నిమిషంలో బీజేపీ టికెట్ కేటాయించడంతో పోటీ చేసి 15వేల పైచిలుకు ఓట్లు సాధించి మూడో స్థానంలో నిలిచారు. అనంతరం బీఆర్ఎస్‌లో చేరారు. 2023 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి బీజేపీ తరఫున పోటీ చేసి 41,888 ఓట్లతో రెండోస్థానం దక్కించుకున్నారు. ఉపఎన్నిక రావడంతో సీఎం రేవంత్ రెడ్డి పిలుపు మేరకు శ్రీగణేశ్ సొంతగూటికి చేరుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఎట్టకేలకు విజయం అందుకున్నారు. దీంతో శ్రీగణేశ్‌ను 3.. 2.. 1గా ఆయన అభిమానులు అభివర్ణిస్తూ ఉండటం గమనార్హం.

రేవంత్‌ను కలిసిన శ్రీగణేశ్: ఉప ఎన్నికల్లో విజయం సాధించిన శ్రీగణేశ్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. మంగళవారం సాయంత్రం ఆయన జూబ్లీహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రేవంత్ ఆయనను అభినందించారు.

అసెంబ్లీలో కాంగ్రెస్‌కు పెరిగిన బలం

సాక్షి, హైదరాబాద్: శాసనసభలో కాంగ్రెస్ బలం పెరిగింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నికలో విజయం సాధించడంతో రాష్ట్రంలో కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేల సంఖ్య 65కి పెరిగింది. అదే సమయంలో బీఆర్ఎస్ బలం మరింత తగ్గినట్లయింది. కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా గెలిచిన లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మరణించడంతో జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన శ్రీగణేశ్ బీజేపీ అభ్యర్థి వంశ తిలక్‌పై 13 వేల పైచిలుకు ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఇక్కడ బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన నందిత సోదరి నివేదిత మూడోస్థానానికి పరిమితమయ్యారు. కాగా, కంటోన్మెంట్‌లో విజయంతో కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేల సంఖ్య 65కి పెరగ్గా, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ముగ్గురు ఎమ్మెల్యేలతో ఆ సంఖ్య 68కి చేరింది. మిత్రపక్షం సీపీఐ నుంచి గెలిచిన కూనంనేని సాంబశివరావు కాంగ్రెస్ పార్టీకి అదనపు బలం. కంటోన్మెంట్‌లో సిట్టింగ్ స్థానాన్ని కోల్పోవడం, ముగ్గురు ఎమ్మెల్యేల ఫిరాయింపుతో అసెంబ్లీలో బీఆర్ఎస్ బలం 39 నుంచి 35కి తగ్గింది.

నేడు 'పట్టభద్రుల' ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల కౌంటింగ్ బుధవారం ప్రారంభం కానుంది. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమై రెండు రోజులపాటు కొనసాగే అవకాశం ఉంది. వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉమ్మడి జిల్లాల పరిధిలోని 605 పోలింగ్ స్టేషన్ల పరిధిలో మొత్తం 52 మంది అభ్యర్థులకు వచ్చిన ఓట్లను మూడు విడతల్లో లెక్కించనున్నారు. బ్యాలెట్ పద్ధతిలో ఈ ఎన్నికలు నిర్వహించినందున ఓట్ల లెక్కింపు ప్రక్రియ సుదీర్ఘంగా సాగనుంది. బుధవారం ఉదయం 8 గంటలకు ఈ ప్రక్రియ ప్రారంభం అవుతుంది. నాలుగు హాళ్లలో 96 టేబుళ్లపై పోలైన 3,36,013 ఓట్ల లెక్కింపు చేపడతారు.

ప్రత్యామ్నాయ శక్తిగా బీజేపీ: కిషన్‌రెడ్డి


సికింద్రాబాద్ ర్యాలీలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తమ పార్టీపై కాంగ్రెస్ విష ప్రచారం చేసినా తెలంగాణ ప్రజలు విశ్వసించలేదని, రాష్ట్రంలో పార్టీ బలాన్ని పెంచుకుందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తారని తప్పుడు ప్రచారం చేసినప్పటికీ ప్రజలు నమ్మలేదని, పొత్తు లేకుండా సొంతంగా పోటీచేసి తెలంగాణలో 8 స్థానాలు సాధించామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించి కాంగ్రెస్ పార్టీని ప్రజలు గెలిపించారని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ఆరు నెలలుగా బీఆర్ఎస్ సర్కార్ చేసినట్టే చేస్తోందని మండిపడ్డారు. ఇలాంటి పరిస్థితుల్లో తెలంగాణ ప్రజలకు ఒక ఆశాదీపంగా బీజేపీ కనిపించిందన్నారు. పార్లమెంట్ ఫలితాలు వెలువడ్డాక మంగళవారం రాత్రి పార్టీ కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ప్రజల గొంతుకగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని, తెలంగాణలో బీజేపీ రాజకీయ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతుందని ధీమాను వ్యక్తం చేశారు. 'బీజేపీని ప్రజలు ఆశీర్వదించారు. మోదీ పట్ల సంపూర్ణ విశ్వాసం ఉంచారు. మేము ఓటమి పొందిన సీట్లలో కూడా మా పార్టీకి గతంకన్నా ఎక్కువగా ఓట్లు వచ్చాయి'అన్నారు. 'బీఆర్ఎస్ పూర్తిగా తుడిచి పెట్టుకుపోయింది. ఆ పార్టీ కంచుకోట మెదక్‌లో కూడా బీజేపీ జెండా ఎగురవేసింది'అని చెప్పారు. 'ఈ ఎన్నికలు రెఫరెండం అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.. 50 శాతం సీట్లు కూడా రాలేదు... ప్రజలకు ఇప్పుడు ఏం చెబుతారు'అని ఆయన ప్రశ్నించారు. బీజేపీని ఆదరించిన ఓటర్ మహాశయులకు కృతజ్ఞతలు చెప్పారు.

బీజేపీని మరింత బలోపేతం చేస్తాం..

సికింద్రాబాద్: రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీ బలీయమైన శక్తిగా ఎదుగుతుందని కిషన్‌రెడ్డి ప్రకటించారు. సికింద్రాబాద్ నుంచి రెండోసారి విజయం సాధించిన కిషన్‌రెడ్డి మంగళవారం సాయంత్రం ఓయూలోని కౌంటింగ్ కేంద్రానికి వచ్చారు. పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికల అధికారి నుంచి ధృవీకరణ పత్రం అందుకున్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 8 పార్లమెంట్ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించడం గొప్ప పరిణామమని, ఇంకొన్ని సీట్లు గెలవాల్సి ఉన్నప్పటికీ విపక్షాల ఒత్తిళ్ల కారణంతో చేజారాయన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర పార్టీపైనే ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

నన్ను ఓడించాలని కుట్ర చేస్తే..
కేసీఆర్ అడ్రస్ గల్లంతైంది!

- కరీంనగర్ ప్రజలకు రుణపడి ఉంటా
- ఎన్నికల ఫలితాల అనంతరం బండి సంజయ్


తల్లి ఆశీర్వాదం తీసుకుంటున్న బండి సంజయ్

కరీంనగర్‌టౌన్: 'బండి సంజయ్ గలీజోడు.. ముస్లింలంతా ఏకమై నన్ను ఓడించాలని కేసీఆర్ పిలుపునిచ్చిండు. ఏమైంది? అందరూ ఏకమై నన్ను భారీ మెజారిటీతో గెలిపించారు. కేసీఆర్ అడ్రస్సే గల్లంతు చేశారు'అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. మంగళవారం ఎన్నికల ఫలితాల ప్రకటన అనంతరం సంజయ్ కరీంనగర్‌లోని ఓట్ల లెక్కింపు కేంద్రానికి వెళ్లి రిటర్నింగ్ అధికారి నుంచి గెలుపు ధ్రువీకరణపత్రం అందుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తనను ఓడించేందుకు ఒకవర్గం ఓట్లను ఏకం చేయాలనుకున్న కేసీఆర్, కాంగ్రెస్ నేతలు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు తిప్పి కొట్టారని అన్నారు. ప్రజలు తనను అత్యధిక మెజారిటీతో గెలిపించారని, కరీంనగర్ ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హవాతోనే తనకు ఇంతటి మెజారిటీ దక్కిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇకనైనా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేనిపక్షంలో ప్రజల పక్షాన పోరాడి ఆ పార్టీ అంతు చూస్తామని హెచ్చరించారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధి కోసం గతం కన్నా ఎక్కువ నిధులు తీసుకొస్తానని, మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాగా, ఓట్ల లెక్కింపు కేంద్రానికి వెళ్లేముందు, ఆ తర్వాత గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకున్న అనంతరం ఇంటికి చేరుకుని సంజయ్ తన తల్లి ఆశీర్వాదాన్ని తీసుకున్నారు. ఆయన గెలుపు సందర్భంగా కార్యకర్తలు భారీ ర్యాలీ తీశారు. కుటుంబ సభ్యులతో కలసి సంజయ్ ఈ సంబరాల్లో పాల్గొన్నారు.

హ్యాట్రిక్!

▶ మొదటి పేజీ తరువాయి

పరిస్థితిలో పడింది. ఎన్డీఏ కూటమి కూడా కనాకష్టంగా మెజారిటీ మార్కు 272ను దాటింది. 2019లో 353 సీట్లు రాగా ఈసారి 292కే పరిమితమైంది. మరోవైపు 2019లో కేవలం 52 సీట్లతో కుదేలైన కాంగ్రెస్ బలం ఈసారి దాదాపు రెట్టింపైంది. 99 సీట్లలో గెలిచి సత్తా చాటింది. కాంగ్రెస్ సారథ్యంలో ఇండియా కూటమి కూడా అంచనాలకూ మించి రాణించింది. 234 సీట్లు కైవసం చేసుకుని గౌరవప్రదమైన స్థానంలో నిలిచింది. అత్యంత కీలకమైన ఉత్తరప్రదేశ్‌లో బీజేపీకి అనూహ్యంగా కోలుకోలేని ఎదురుదెబ్బ తగిలింది. 2019లో 62 సీట్లు నెగ్గిన పార్టీ ఈసారి ఏకంగా సగానికి సగం సీట్లు కోల్పోయి 33కే పరిమితమైంది. గత ఎన్నికల్లో చతికిలపడ్డ అఖిలేశ్ సారథ్యంలోని సమాజ్‌వాదీ పార్టీ అక్కడ 38 స్థానాలతో దుమ్ము రేపింది. పశ్చిమబెంగాల్లో కూడా బీజేపీ అంచనాలను అందుకోలేక 12 స్థానాలతో సరిపెట్టుకుంది. మమతా సారథ్యంలోని తృణమూల్ కాంగ్రెస్ 29 సీట్లతో సత్తా చాటింది. స్మృతీ ఇరానీతో పాటు పలువురు కేంద్ర మంత్రులు ఓటమి చవిచూశారు. ఈసారి లోక్‌సభ ఫలితాలను ఏ ఎగ్జిట్ పోల్ సర్వే కూడా ప్రతిఫలించలేకపోవడం విశేషం. మొత్తమ్మీద కేంద్రంలో పదేళ్ల ఏక పార్టీ పాలనకు కాలం చెల్లి తిరిగి నిజమైన సంకీర్ణ శకానికి తెర లేచింది. విపక్ష కూటమి కూడా పదేళ్ల తర్వాత గణనీయ శక్తిగా రూపుదిద్దుకుంది. అంతటితో ఆగకుండా కేంద్రంలో అధికారం పైనా కన్నేసినట్టు సంకేతాలు వెలువడుతున్నాయి...!

ఆకట్టుకున్న ఇండియా కూటమి

ఏడు విడతల్లో సుదీర్ఘంగా సాగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ జూన్ 1తో ముగియడం తెలిసిందే. దేశమంతా ఉత్కంఠగా ఎదురు చూసిన ఓట్ల లెక్కింపు మంగళవారం ఉదయం 8 గంటలకు మొదలైంది. ఎన్డీఏ కూటమి ఆధిపత్యం 300లోపు స్థానాలకు పరిమితం కాగా ఇండియా కూటమి తొలి రౌండ్ నుంచే అనూహ్య రీతిలో ముందంజ వేసింది. క్రమంగా పుంజుకుంటూ 200 స్థానాలు దాటేసింది. చూస్తుండగానే 234కు చేరి పరిశీలకులను కూడా ఆశ్చర్యపరిచింది. ప్రధాని మోదీ వారణాసిలో తొలి రౌండ్లో వెనకబడ్డారు! చివరికి ఆయన నెగ్గినా మెజారిటీ మాత్రం బాగా తగ్గింది. 2019లో 4.79 లక్షల మెజారిటీ రాగా ఈసారి లక్షన్నర పై చిలుకుతో సరిపెట్టుకున్నారు. బీజేపీలో మోదీ కంటే కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్‌లకు ఎక్కువ మెజారిటీ రావడం విశేషం. మరోవైపు రాహుల్‌గాంధీ మాత్రం పోటీ చేసిన రెండు స్థానాల నుంచీ భారీ విజయం సాధించారు. ఆయనకు కేరళలోని వాయనాడ్‌లో 3.64 లక్షలు, యూపీలోని రాయ్‌బరేలీలో 3.9 లక్షల మెజారిటీ రావడం విశేషం.

కీలక రాష్ట్రాల్లో బీజేపీ కుదేలు

కీలకమైన యూపీలో ఈసారి బీజేపీకి ఏకంగా 29 సీట్లకు కోత పడింది! మహారాష్ట్రలోనూ గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అక్కడి 48 స్థానాల్లో 2019లో 43 సీట్లు ఒడిసిపట్టిన ఎన్డీఏ ఈసారి కేవలం 17కు పరిమితమైంది! బీజేపీ బలం 23 నుంచి ఏకంగా 9కి తగ్గింది. అక్కడ కాంగ్రెస్ సీట్ల సంఖ్య 1 నుంచి ఏకంగా 13కు పెరిగింది. దాని భాగస్వాములైన శివసేన (యూబీటీ) 9, ఎన్సీపీ (ఎస్పీ) 8 సీట్లు గెలుచుకున్నాయి! బిహార్లోనూ ఎన్డీఏకు 9 సీట్లకు కోతపడింది. బీజేపీ 12, భాగస్వాములు జేడీ(యూ) 12, ఎల్జేపీ(ఆర్వీ) 5 సీట్లలో నెగ్గాయి. 2019లో క్లీన్‌స్వీప్ చేసిన రాజస్తాన్ (25)లో కూడా బీజేపీకి ఈసారి 11 సీట్లకు కోత పడింది. కర్నాటకలోనూ పార్టీ బలం 25 నుంచి 17కు తగ్గింది. బెంగాల్లో 6 స్థానాలు తగ్గాయి. మరో క్లీన్‌స్వీప్ రాష్ట్రం హరియాణా (10)లోనూ ఈసారి బీజేపీ ఐదే గెలిచింది. మధ్యప్రదేశ్‌లో మాత్రం మొత్తం 29 సీట్లూ నెగ్గి క్లీన్‌స్వీప్ చేసింది. గుజరాత్‌లో ఒక్కటి మినహా 24 సీట్లు గెలుచుకుంది. తూర్పు రాష్ట్రం ఒడిశా బీజేపీ నెత్తిన పాలు పోసింది. అక్కడి 21 లోక్‌సభ స్థానాల్లో బీజేపీకి ఏకంగా 20 దక్కాయి! ఏపీలో కూడా ఎన్డీఏ కూటమికి 21 సీట్లు దక్కాయి. తెలంగాణలోనూ 2019లో 4 సీట్లలో నెగ్గిన బీజేపీ ఈసారి 8 స్థానాలు గెలుచుకుంది. అయితే కేరళలో తొలిసారి బోణీ కొట్టినా తమిళనాట మాత్రం సున్నా చుట్టింది. మరోవైపు ఇండియా కూటమి కీలక రాష్ట్రాల్లో దుమ్ము రేపింది. తమిళనాట మొత్తం 39 స్థానాలూ కూటమి ఖాతాలోనే పడ్డాయి! యూపీలో 2019లో కేవలం 5 స్థానాలతో సరిపెట్టుకున్న ఎస్పీ ఈసారి ఏకంగా 37 సీట్లు ఒడిసిపట్టింది. రాష్ట్రంలో కాంగ్రెస్ బలం కూడా 1 నుంచి 7కు పెరిగింది. బెంగాల్లో టీఎంసీకి 7 సీట్లు, బిహార్లో కూటమికి 9 స్థానాలు పెరిగాయి. రాజస్తాన్లో 2019లో సున్నా చుట్టిన కాంగ్రెస్ ఈసారి 8 సీట్లు నెగ్గింది. హరియాణాలోనూ 5 స్థానాలు దక్కించుకుంది. కర్నాటకలో పార్టీ స్థానాలు ఒకటి నుంచి 8కి పెరిగాయి.



మంగళవారం పార్లమెంట్ ఎన్నికల ఫలితాల అనంతరం ఢిల్లీలోని బీజేపీ కార్యాలయంలో విజయ సంకేతం చూపుతున్న ప్రధాని నరేంద్ర మోదీ, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా, అమిత్‌షా

హస్తినలో నంబర్‌గేమ్!

- మోదీ కాళ్ల కిందకు నీళ్లు?
- ఆయనపై ఎన్డీఏలో అభ్యంతరాలు
- జాతీయ మీడియాలో వార్తలు

దేశవ్యాప్తంగా సాధించిన అనూహ్య ఫలితాలతో జోష్‌లో ఉన్న ఇండియా కూటమి ఏకంగా కేంద్రంలో అధికారంపై కన్నేసినట్టు వార్తలొస్తున్నాయి! ఈ దిశగా జేడీ(యూ)తో పాటు పలు ఇతర ఎన్డీఏ భాగస్వాములతో ఇప్పటికే కాంగ్రెస్ నేతలు మంతనాలు జరుపుతున్నట్టు చెబుతున్నారు. బీజేపీ కూడా ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తోందని సమాచారం. ఎన్డీఏ కూటమి సుస్థిరత కోసం పలు ఇండియా కూటమిలోని పక్షాలతో పాటు స్వతంత్రులు, ఇతర పార్టీలతోనూ బీజేపీ పెద్దలు ఇప్పటికే జోరుగా సంప్రదింపులకు సాగిస్తున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మొత్తమ్మీద హస్తినలో జోరుగా నంబర్‌గేమ్ సాగుతోందంటూ వస్తున్న వార్తలతో జాతీయ రాజకీయాలు ఒక్కసారిగా రంజుగా మారాయి. ఎన్డీఏనే వరుసగా మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేసినా, ప్రధానిగా మోదీ అభ్యర్థిత్వానికి జేడీ(యూ) వంటి భాగస్వామ్య పక్షాలు సుతరామూ అంగీకరించకపోవచ్చని జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి! ఈ నేపథ్యంలో హస్తినలో రాజకీయ పరిణామాలు ఎలాంటి మలుపు తీసుకుంటాయన్నది అత్యంత ఆసక్తికరంగా మారింది.

18వ లోక్‌సభలో పార్టీల బలాబలాలు (మొత్తం స్థానాలు: 543)

పార్టీ	సీట్లు	పార్టీ	సీట్లు
ఎన్డీఏ	292	జేడీ(ఎస్)	2
బీజేపీ	240	ఆరెల్డీ	2
టీడీపీ	16	ఎన్సీపీ	1
జేడీ(యూ)	12	అప్నాదళ్	1
		ఏజీపీ	1
శివసేన	7	యూపీపీఎల్	1
ఎల్జేపీ (ఆర్వీ)	5	ఏజేఎస్‌యూపీ	1
జనసేన	2	హెచ్ఏఎం(ఎస్)	1
ఇండియా కూటమి : 234			
కాంగ్రెస్	99	ఐయూఎంఎల్	3
ఎస్పీ	37	సీపీఐ	2
టీఎంసీ	29	సీపీఐ(ఎంఎల్)(ఎల్)	2
డీఎంకే	22	ఎన్సీ	2
శివసేన (యూబీటీ)	9	వీసీకే	2
ఎన్సీపీ (ఎస్పీ)	8	ఆరెస్పీ	1
ఆర్జేడీ	4	కేసీ	1
సీపీఎం	4	ఆరెల్టీపీ	1
ఆప్	3	బీఏడీవీపీ	1
జేఎంఎం	3	ఎండీఎంకే	1
ఇతరులు : 17			
వైఎస్సార్‌సీపీ	4	వీఓటీపీపీ	1
మజ్లిస్	1	జెడ్‌పీఎం	1
అకాలీదళ్	1	ఎస్‌కేఎం	1
ఏఎస్‌పీకేఆర్	1	స్వతంత్రులు	7

ఓట్ల శాతం ఇలా...

బీజేపీ ఈసారి 36.58 శాతం ఓట్లు సాధించింది. ఇది 2019తో పోలిస్తే 0.72 శాతం తక్కువ. 2019 కంటే ఎక్కువ స్థానాల్లో పోటీ చేసినా పార్టీ ఓట్ల శాతం తగ్గిపోవడం విశేషం. కాంగ్రెస్ ఓట్ల శాతం మాత్రం 19.46 నుంచి 21.22కు పెరిగింది. యూపీలో దుమ్ము రేపిన సమాజ్‌వాదీ పార్టీ ఓట్ల శాతం 2.55 నుంచి 4.59కు పెరిగింది. మాయావతి సారథ్యంలోని బీఎస్పీ ఓట్ల శాతం మాత్రం 2.04 నుంచి 1.58కు తగ్గిపోయింది. పశ్చిమబెంగాల్లో తృణమూల్ కాంగ్రెస్ ఓట్ల శాతం 4.06 నుంచి 4.38కు పెరిగింది. జేడీ(యూ) ఓట్ల శాతం 1.45 నుంచి 1.25కి తగ్గింది. ఆప్ ఓట్ల శాతం 0.44 నుంచి 1.11కు పెరిగింది. దక్షిణాదిన తమిళనాడులో పాలక డీఎంకే ఓట్ల శాతం 2.34 నుంచి 1.82కు తగ్గింది.

తెలంగాణలో మా సీట్లు డబుల్: మోదీ

ఏపీ ఫలితాలపై చంద్రబాబుకు శుభాకాంక్షలు



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో బీజేపీ స్థానాలు రెట్టింపయ్యాయని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. మంగళవారం పార్టీ ప్రధాన కార్యాలయంలో మాట్లాడిన మోదీ ఏపీ, ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో ఎన్డీఏకు ప్రజలు సంపూర్ణ మద్దతు ఇచ్చారంటూ అక్కడి ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఇక ఏపీలో చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ కూటమి అద్భుతమైన ప్రదర్శన కనబరిచిందన్నారు. ఈ మేరకు చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు ప్రధాని ఎక్స్‌లో ఏపీలో అద్భుతమైన విజయం సాధించినందుకుగాను చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌తోపాటు టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలకు అభినందనలు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో అన్ని రంగాల అభివృద్ధికి కృషిచేస్తాం'. అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

మీ ఆశీర్వాదం ఆత్మస్థైర్యాన్ని పెంచింది

లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై సీఎం రేవంత్ స్పందన



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో 100 రోజుల కాంగ్రెస్ పాలనను ఆశీర్వదిస్తూ 8 లోక్‌సభ స్థానాలతో పాటు కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానంలో విజయం చేకూర్చిన రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. 'మీరు అందించిన ఆశీర్వాదాలు మా ఆత్మస్థైర్యాన్ని పెంచాయి. మరింత మెరుగైన పాలన అందించేందుకు ఉత్సాహాన్నిచ్చాయి. తెలంగాణలో ప్రజల మద్దతు కాంగ్రెస్ పార్టీకే ఉందన్న విషయాన్ని ఈ ఫలితాలు మరోమారు రుజువు చేశాయి. కాంగ్రెస్ పార్టీ విజయం కోసం పనిచేసిన కార్యకర్తలు, నాయకులందరికీ అభినందనలు. ఇది కార్యకర్తల విజయం. రేపటితో ఎన్నికల కోడ్ ముగుస్తోంది. మళ్లీ ప్రజాప్రభుత్వ పాలన మొదలవుతుంది. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అద్భుత పాలన అందిస్తాం'అని మంగళవారం ఒక ప్రకటనలో సీఎం వెల్లడించారు.

అభివృద్ధి పథం వైపు సాగుదాం: ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో విజయం సాధించిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ మేరకు రేవంత్‌రెడ్డి మంగళవారం ఓ ట్వీట్ పెట్టారు. 'ఇరు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలను కొనసాగిస్తూ.. సమస్యలను పరిష్కరించుకుంటూ, అభివృద్ధి పథం వైపు సాగుదాం'అని రేవంత్‌రెడ్డి తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

ఫలితాలు నిరాశను కలిగించినా ఫీనిక్స్ పక్షిలా పుంజుకుంటాం: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల ఫలితాలు నిరాశను కలిగించినా ఫీనిక్స్ పక్షి లెక్క తిరిగి పుంజుకుంటాం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఫలితాలు వెలువడిన తరువాత ఆయన 'ఎక్స్'వేదికగా తన స్పందన తెలియజేశారు. తమ పార్టీ 24 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో ఎన్నో రకాల ఎత్తుపల్లాలను చూశామని, అద్భుతమైన విజయాలతోపాటు అనేక ఎదురుదెబ్బలు కూడా ఎదుర్కొన్నామని పేర్కొన్నారు. 'తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే మాకు అతి పెద్ద గౌరవం. ఒక ప్రాంతీయ పార్టీగా వరుసగా రెండుసార్లు అద్భుతమైన మెజార్టీలతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నాం. 2014లో 63 సీట్లతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే 2018లో 88 స్థానాలతో రెండోసారి ప్రభుత్వాన్ని విజయవంతంగా ఏర్పాటు చేశాం. ప్రస్తుతం శాసనసభలో 39 సీట్లతో ఒకటింట మూడు స్థానాలతో ప్రధాన ప్రతిపక్షంగా కొనసాగుతున్నాం'అని వ్యాఖ్యానించారు.

బీజేపీ, కాంగ్రెస్.. చెరో ఎనిమిది!

▶ మొదటి పేజీ తరువాయి

చాటింది. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో ఉన్న మొత్తం 5 లోక్‌సభ సీట్లనూ కాంగ్రెస్ గెలుచుకుంది. ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని నాలుగు లోక్‌సభ స్థానాల్లో బీజేపీ మూడింటిని గెలుచుకుని ఆ ప్రాంతాల్లో ఆధిపత్యం చాటింది. హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి ఎంఐఎం అధినేత, సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వరుసగా ఐదోసారి విజయం సాధించడంతో పాత నగరంపై ఆ పార్టీ పట్టు నిలుపుకొంది. ఉమ్మడి మహబూబ్‌నగర్, కరీంనగర్, మెదక్ జిల్లాల్లో రెండేసి చొప్పున మొత్తం ఆరు లోక్‌సభ సీట్లు ఉండగా.. కాంగ్రెస్, బీజేపీ చెరో మూడు సీట్లను దక్కించుకున్నాయి. అదీ ప్రతి జిల్లాలో చెరో సీటు సాధించడం గమనార్హం. ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లోని రెండు సీట్లనూ బీజేపీ కైవసం చేసుకుంది.

పట్టుపెంచుకున్న ఇరు పార్టీలు..

2019 లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో 4 స్థానాలను గెలిచిన బీజేపీ.. ఈసారి తన బలాన్ని 8 సీట్లకు పెంచుకుంది. కాంగ్రెస్ కూడా 3 సీట్ల నుంచి 8 సీట్లకు బలాన్ని పెంచుకుంది. గత ఎన్నికల్లో 9 సీట్లు గెలిచిన బీఆర్ఎస్ ఈసారి ఖాతా తెరవలేకపోయింది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో 64 సీట్లు గెలిచి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి.. ఆ ఎన్నికల్లో కేవలం 8 అసెంబ్లీ స్థానాలే గెలిచిన బీజేపీ లోక్‌సభ ఎన్నికల్లో గట్టిపోటీ ఇచ్చి సమఉజ్జీగా నిలిచింది. అసెంబ్లీ ఎన్నికల్లో 39 స్థానాలను గెలుచుకున్న బీఆర్ఎస్ ఒక్క లోక్‌సభ సీటు గెలవలేదు.

గత, ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో ప్రధాన పార్టీలకు వచ్చిన సీట్లివీ..

పార్టీ	2014	2019	2024
కాంగ్రెస్	2	3	8
బీజేపీ	1	4	8
ఎంఐఎం	1	1	1
బీఆర్ఎస్	11	9	0

నియోజకవర్గాల వారీగా గెలుపోటముల తీరు ఇదీ..

నల్లగొండ: రికార్డు స్థాయి మెజారిటీ

నల్లగొండ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ పార్టీ తమ పట్టు నిలుపుకొంది. కౌంటింగ్ ఆద్యంతం ఆ పార్టీ అభ్యర్థి, మాజీ మంత్రి జానారెడ్డి కుమారుడు కుందూరు రఘువీర్‌రెడ్డి స్పష్టమైన ఆధిక్యత చూపారు. చివరికి ఏకంగా రికార్డు స్థాయిలో 5,59,906 ఓట్ల మెజారిటీ సాధించారు. తొలిసారి ఎంపీగా ఎన్నికయ్యారు. బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి రెండో స్థానంలో నిలిచారు.

భువనగిరి: అంతా తొలిసారి ఎంపీలే..

ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో తమకు ఉన్న పట్టును కాంగ్రెస్ పార్టీ మరోసారి నిలుపుకొంది. భువనగిరి లోక్‌సభ స్థానంలో ఆ పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సమీప బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌పై 2,22,170 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. కిరణ్‌కుమార్ రెడ్డి తొలిసారి లోక్‌సభలోకి అడుగుపెట్టబోతున్నారు. ఈ సెగ్మెంట్‌లో ఇంతకు ముందు ఎన్నికల్లో పోటీచేసి గెలిచిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా తొలిసారిగా ఎంపీలు అయిన వారే కావడం విశేషం.

నాగర్ కర్నూల్: మళ్లీ 'చేతి'కి..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి 94,414 ఓట్ల మెజారిటీతో సమీప బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్‌పై గెలుపొందారు. మల్లు రవి 1991, 1998 ఎన్నికల్లో ఇక్కడి నుంచే ఎంపీగా గెలవడం గమనార్హం. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత విజయం సాధించారు. ఇక ఇక్కడ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మూడో స్థానానికి పరిమితమయ్యారు.

పెద్దపల్లి: మళ్లీ కాంగ్రెస్ ఖాతాలోకి..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పెద్దపల్లి లోక్‌సభ స్థానాన్ని కాంగ్రెస్ తిరిగి చేజిక్కించుకుంది. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ 1,31,364 ఓట్ల మెజారిటీతో బీజేపీ అభ్యర్థి గోమాసె శ్రీనివాస్‌పై విజయం సాధించారు. కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి(కాకా) మనవడు, చెన్నూర్ ఎమ్మెల్యే జి.వివేక్ తనయుడే గడ్డం వంశీకృష్ణ. ఈయన తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసి ఎంపీ అయ్యారు. ఇక్కడ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ మూడోస్థానానికి పరిమితం అయ్యారు.

వరంగల్: పార్టీ మారి పోటీచేసినా..

2009లో జరిగిన పునర్విభజనలో వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం ఏర్పాటైంది. 2009లో కాంగ్రెస్ గెలవగా తర్వాత వరుసగా బీఆర్ఎస్ అభ్యర్థులే విజయం సాధించారు. మళ్లీ ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి కడియం శ్రీహరి కుమార్తె కడియం కావ్య గెలిచారు. ఆమె బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్‌పై 2,20,339 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. వాస్తవానికి ఈ ఎన్నికల్లో కావ్యకు బీఆర్ఎస్ పార్టీ టికెట్ ఇస్తున్నట్టు ప్రకటించింది. కానీ ఆమె కాంగ్రెస్‌లో చేరి ఆ పార్టీ తరఫున పోటీ చేసి గెలిచారు. అరూరి రమేష్ కూడా ఎన్నికల ముందే బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరి పోటీ చేయడం గమనార్హం.

మహబూబాబాద్: సెగ్మెంట్ చరిత్రలో అధిక మెజారిటీ

మహబూబాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి పి.బలరాం నాయక్ 3,49,165 ఓట్ల మెజారిటీతో బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ మాలోతు కవితపై విజయం సాధించారు. 1957 నుంచీ కొనసాగిన మానుకోట పాత పార్లమెంట్ స్థానంలోగానీ, 2009 తర్వాత కొత్తగా ఏర్పడిన మహబూబాబాద్ పార్లమెంట్ స్థానంలోగానీ.. ఇదే అత్యధిక మెజారిటీ కావడం గమనార్హం. 2009లో కాంగ్రెస్ తరఫున ఇదే లోక్‌సభ స్థానం నుంచి గెలిచిన బలరాంనాయక్ కేంద్ర మంత్రిగా కూడా పనిచేశారు. 2014, 2019 ఎంపీ ఎన్నికల్లో ఓటమి పాలైన ఆయన.. ఈసారి మళ్లీ గెలిచారు.

ఖమ్మం: ఆద్యంతం కాంగ్రెస్ ఆధిక్యమే..

తొలి రౌండ్ నుంచి చివరిదాకా కాంగ్రెస్ ఆధిక్యమే కొనసాగింది. చివరికి 4,67,847 ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి విజయం సాధించారు. ఆయన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వియ్యంకుడు కావడం గమనార్హం. బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వర్‌రావు రెండో స్థానంలో నిలిచారు. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో 1952 నుంచి ఇప్పటివరకు జరిగిన 18 ఎన్నికల్లో.. ప్రస్తుతం రామసహాయం రఘురాంరెడ్డి సాధించిన మెజారిటీయే రికార్డు. ఇక్కడ బీజేపీ ఓటు బ్యాంక్ పెంచుకుంది. ఇక్కడ 2019 ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి 20,488 ఓట్లే రాగా.. ఈసారి ఆ పార్టీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు 1,18,636 ఓట్లు సాధించారు.

జహీరాబాద్: ఇక్కడా హస్తం హవా

ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని జహీరాబాద్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్ 46,174 ఓట్ల మెజారిటీతో బీజేపీ అభ్యర్థి/సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్‌పై విజయం సాధించారు. సురేశ్ షెట్కార్ ఇదే సెగ్మెంట్ నుంచి 2009లో ఎంపీగా గెలిచారు. ఇక్కడ బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీ అయిన బీబీ పాటిల్ ఎన్నికల ముందే బీజేపీలో చేరి ఆ పార్టీ తరఫున బరిలోకి దిగారు. రెండు జాతీయ పార్టీల అభ్యర్థుల మధ్య గట్టిపోటీనే జరిగింది. ఇక బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ మూడో స్థానంలో నిలిచారు.

నిజామాబాద్: పోటాపోటీ మధ్య కమలానికి..

ఇందూరు గడ్డపై మళ్లీ కాషాయ జెండా రెపరెపలాడింది. బీజేపీ, కాంగ్రెస్ మధ్య పోటాపోటీ కొనసాగిన నిజామాబాద్ లోక్‌సభ స్థానంలో బీజేపీ అభ్యర్థి ధర్మపురి అరవింద్ కాంగ్రెస్ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డిపై 1,09,241 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. నిజామాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకుగాను.. అరవింద్‌కు బాల్కొండ, ఆర్మూర్, కోరుట్ల, నిజామాబాద్ రూరల్‌లలో ఆధిక్యత వచ్చింది. జీవన్‌రెడ్డికి జగిత్యాల, నిజామాబాద్ అర్బన్, బోధన్ సెగ్మెంట్లలో ఆధిక్యత వచ్చింది.

కరీంనగర్: పట్టు పెంచుకున్న జాతీయ పార్టీలు

తొలి నుంచీ బీఆర్ఎస్‌కు ఆయువుపట్టుగా ఉన్న కరీంనగర్ లోక్‌సభ స్థానంలో జాతీయ పార్టీలు పట్టుపెంచుకున్నాయి. ఇక్కడ 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 4,98,276 ఓట్లు, బీఆర్ఎస్‌కు 4,08,768 ఓట్లు, కాంగ్రెస్‌కు 1,79,258 ఓట్లు రాగా.. ప్రస్తుతం బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ 5,85,116 ఓట్లతో విజయం సాధించారు. క్రితంసారితో పోలిస్తే 86,840 ఓట్లు పెరిగాయి. కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు 3,59,907 ఓట్లు తెచ్చుకున్నారు. అంటే కాంగ్రెస్‌కు 1,80,649 ఓట్లు అదనంగా వచ్చాయి. ఈసారి బీఆర్ఎస్‌కు 2,82,163 ఓట్లు వచ్చాయి. 1.25 లక్షలకుపైగా ఓట్లు తగ్గాయి.

మహబూబ్‌నగర్: కౌంటింగ్ ఆద్యంతం ఉత్కంఠ

మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గంలో ఓట్ల లెక్కింపు ఆద్యంతం ఉత్కంఠగా సాగింది. బీజేపీ అభ్యర్థి డీకే అరుణ, కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి మధ్య విజయం దోబూచులాడింది. చివరికి డీకే అరుణ 4,500 ఓట్ల స్వల్ప మెజారిటీతో గట్టెక్కారు. గతంలో రాష్ట్ర మంత్రిగా వ్యవహరించిన డీకే అరుణ లోక్‌సభకు ఎన్నికవడం ఇదే తొలిసారి. అయితే ఈ లోక్‌సభ ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ అసెంబ్లీ స్థానం పరిధిలో కాంగ్రెస్ కంటే బీజేపీకి ఎక్కువ ఓట్లు రావడం చర్చనీయాంశంగా మారింది.

మల్కాజిగిరి: దేశంలోనే పెద్ద సెగ్మెంట్.. తొలిసారి బీజేపీ విజయం

దేశంలోనే అత్యధిక ఓట్లున్న లోక్‌సభ సెగ్మెంట్ మల్కాజిగిరిలో తొలిసారి కాషాయ జెండా ఎగిరింది. ఆ పార్టీ అభ్యర్థి ఈటల రాజేందర్ సమీప కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డిపై 3,91,475 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు. బీఆర్ఎస్‌లో ప్రముఖ నేతగా కొనసాగి, రాష్ట్ర మంత్రిగా కూడా పనిచేసిన ఈటల తొలిసారి ఎంపీ అయ్యారు.

చేవెళ్ల: కొండా వశం

చేవెళ్ల లోక్‌సభ సెగ్మెంట్‌లో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఘన విజయం సాధించారు. ఆయన 2014లో ఇక్కడి నుంచి బీఆర్ఎస్ తరఫున ఎంపీగా గెలిచారు. 2019లో కాంగ్రెస్ నుంచి పోటీచేసి ఓటమి పాలయ్యారు. ఇక ప్రస్తుతం బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరి పోటీ చేసిన సిట్టింగ్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి రెండో స్థానంలో నిలిచారు. బీఆర్ఎస్ మూడో స్థానానికి పరిమితమైంది. చేవెళ్ల సెగ్మెంట్‌లో ఏకంగా 43 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు.

మెదక్: గులాబీ కంచుకోటలో కమలం

బీఆర్ఎస్ పార్టీకి మొదటి నుంచీ కంచుకోటగా ఉన్న మెదక్‌లో బీజేపీ విజయం సాధించింది. ఇక్కడ కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య హోరాహోరీ పోరు సాగింది. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు 39,139 ఓట్ల మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్‌పై గెలిచారు. ఇంతకుముందు ఎమ్మెల్యేగా పనిచేసిన రఘునందన్‌రావు తొలిసారిగా ఎంపీ అయ్యారు. కాంగ్రెస్ అభ్యర్థి కంటే సుమారు 35 వేల ఓట్లు తక్కువగా వచ్చిన బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మూడో స్థానానికి పరిమితం అయ్యారు.

ఆదిలాబాద్: మళ్లీ కమలమే!

ఆదిలాబాద్ లోక్‌సభ స్థానంలో కమలం పార్టీ మళ్లీ వికసించింది. ఆ పార్టీ అభ్యర్థి గొడం నగేశ్.. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణపై 90,652 ఓట్ల మెజారిటీతో గెలిచారు. 2014లో బీఆర్ఎస్ తరఫున ఎంపీగా గెలిచిన ఆయన.. ఇప్పుడు బీజేపీ నుంచి పోటీ చేసి గెలుపొందారు. బీఆర్ఎస్ ఇక్కడ కూడా మూడో స్థానంలో నిలిచింది. ఇక్కడ కౌంటింగ్ తొలుత ఉత్కంఠగా సాగింది. బీజేపీ అభ్యర్థి తొలి నుంచీ ఆధిక్యంలో ఉన్నా.. కొన్ని రౌండ్లలో కాంగ్రెస్ అభ్యర్థి స్వల్ప ఆధిక్యత సాధించారు. చివరికి నగేశ్ గెలిచారు.

హైదరాబాద్: ఐదోసారి లోక్‌సభకు అసదుద్దీన్

హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ వరుసగా ఐదోసారి విజయం సాధించారు. ఆయన సమీప బీజేపీ అభ్యర్థి కె.మాధవీలతపై 3,38,087 ఓట్ల మెజారిటీ సాధించారు. ఎన్నికల్లో తన ప్రచార, వ్యవహార శైలితో జాతీయ మీడియాను కూడా ఆకర్షించిన మాధవీలత ఊహించిన స్థాయిలో పోటీ ఇవ్వలేకపోయారు. 2019లో 2.82 లక్షల ఓట్ల మెజారిటీతో అసదుద్దీన్ గెలవగా.. మెజారిటీ మరో 50వేలకుపైగా పెరిగింది.

సికింద్రాబాద్: ఓట్లు మరింత పెంచుకున్న బీజేపీ

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని సికింద్రాబాద్ లోక్‌సభ సెగ్మెంట్‌లో బీజేపీ తన ఓట్లశాతాన్ని మరింత పెంచుకుంది. బీజేపీ నుంచి పోటీ చేసిన సిట్టింగ్ ఎంపీ, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌పై 49,944 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. గత లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్‌లో బీజేపీకి 42.05 శాతం ఓట్లురాగా.. ఈసారి 45.15శాతం వచ్చాయి.

కౌంటింగ్ వేళ మీమ్స్ సందడి

- ఎన్డీఏకి బాబు, నితీష్ వెన్నుపోటు పొడిస్తే?
- సోషల్ మీడియాలో నెటిజన్ల హాస్య చతురత

న్యూఢిల్లీ: ఎన్నికల ఫలితాలు నేతలు, ఓటర్లలో ఉత్కంఠను పెంచుతున్న వేళ.. కొందరు నెటిజన్లు సోషల్ మీడియాలో మీమ్స్‌తో సందడి చేశారు. పలు చిత్రాల్లు, టీవీ షోల్లోని క్లిప్‌లకు క్యాప్షన్లను జోడించి హాస్యాన్ని పండించారు.

బీజేపీకి బాబు వెన్నుపోటా?

కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటుకు జేడీయూ, టీడీపీ కీలకం అని ఫలితాలు స్పష్టం చేస్తుండడం తెలిసిందే. దీంతో Vk18xCr7 అనే యూజర్ రాజమౌళి తీసిన బాహుబలి సినిమాలో బాహుబలిని కట్టప్ప వెనుక నుంచి కత్తిపోటు పొడిచే సీన్‌ను షేర్ చేశారు. ''నితీష్ కుమార్, చంద్రబాబు నాయుడు ఎన్డీఏని వెన్నుపోటు పొడిస్తే అది కూడా సినిమానే అవుతుంది''అని పేర్కొన్నారు.

పల్టూరామ్

పనిలో పనిగా బీహార్ సీఎం, జేడీ(యూ) అధినేత నితీశ్ కుమార్‌పైనా కొందరు మీమ్స్ పేల్చారు. ఎన్నికల ముందు బీజేపీతో జట్టు కట్టిన సందర్భంగా నితీశ్ కుమార్ మాట్లాడుతూ.. ''మేము (బీజేపీ-జేడీయూ) గతంలోనూ కలసి ఉన్నామని ఇప్పటికే చెప్పా. మధ్యలో రెండు సార్లు ఇక్కడి నుంచి అక్కడికి వెళ్లా. ఇప్పుడు మరోసారి ఇక్కడకు (ఎన్డీఏ గూటికి) వచ్చా''అని చెప్పడం గుర్తుండే ఉంటుంది. దీన్ని నెటిజన్లు తమ పోస్టుల ద్వారా గుర్తు చేసుకున్నారు. మనోజ్ఞలోయివాల్ అనే యూజర్ ఇందుకు సంబంధించి ఫొటో షేర్ చేస్తూ.. నితీష్ ప్రతి ఒక్కరికీ చెందుతారు అంటూ.. మరోసారి కూటమి మారే అవకాశం ఉందా? అంటూ ప్రశ్నార్థకం వేశారు. ఇదే ఫొటోని మరో యూజర్ షేర్ చేస్తూ.. 'బీజేపీకి సబ్సే బడీ చింత' (బీజేపీకి ఇప్పుడు ఇదే పెద్ద ఆందోళన) అని పేర్కొన్నారు.

ఎగ్జిట్ పోల్స్ భరతం పడతా!

ఎగ్జిట్ పోల్స్ ఇచ్చిన వారిని అన్వేషించే పనిలో ఉన్నానంటూ.. గ్యాంగ్‌స్టర్ సినిమా 'గ్యాంగ్స్ ఆఫ్ వాసేపూర్' నుంచి స్క్రీన్‌ను మరొక యూజర్ షేర్ చేశారు. అందులో మనోజ్ బాజ్‌పేయి గన్‌తో ప్రత్యర్థులపై దాడికి వెళుతుండడం కనిపిస్తుంది. హెరా ఫెరి సినిమాలో అక్షయ్ కుమార్, సునీల్ శెట్టి, పరేష్ రావల్ ముగ్గురూ త్వరితగతిన డబ్బు సంపాదించేందుకు ప్రణాళిక రూపొందించిన సమయంలో పరేష్ రావల్ వణుకుతూ.. మేరా తో ఐసా ధక్ ధక్ హోరహా హై (నా గుండె వేగంగా కొట్టుకుంటోంది) అంటున్న సన్నివేశాన్ని ఎక్స్ ప్లాట్‌ఫామ్‌లో ఒక యూజర్ పంచుకున్నారు. ఫలితాల సమయంలో కొందరు ఎదుర్కొంటున్న పరిస్థితిని తన పోస్ట్‌తో గుర్తు చేశారు.

టుబుక్కు జరజర..

ఆర్‌జేదీక్షిత అనే ఎక్స్ యూజర్ గడ్డి వాలుపై జారిపోతున్న రెండు పాండా పిల్లల ఫొటోను పోస్ట్ చేసి.. ''ఈ రోజు నిఫ్టీ-సెన్సెక్స్''అనే క్యాప్షన్ పెట్టడం కనిపించింది. షాహిద్ కపూర్ నటించిన 'చుప్ చుప్‌కే' సినిమాలోని స్క్రీన్‌గ్రాబ్‌ను పోస్ట్ చేస్తూ ''ఇన్వెస్టర్లు ఈ రోజు తమ పోర్ట్‌ఫోలియోని ఇలా చూస్తున్నారు'' అంటూ మరో ఎక్స్ యూజర్ క్యాప్షన్ పెట్టారు. బీజేపీకి సంపూర్ణ మెజారిటీ రాకపోవడంతో ఇన్వెస్టర్ల అమ్మకాల ఒత్తిడికి స్టాక్ మార్కెట్ భారీ నష్టాలు చూస్తుండడంతో ఇలా స్పందించారు.

క్లుప్తంగా...

ఎన్‌హెచ్‌ఆర్సీ తాత్కాలిక చైర్‌పర్సన్‌గా సాయని విజయభారతి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణకు చెందిన న్యాయవాది సాయని విజయభారతి జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ) తాత్కాలిక చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. విజయభారతి నియామకం జూన్ 2 నుంచే అమలులోకి వస్తుందని, తదుపరి కొత్త చైర్‌పర్సన్‌ను నియమించే వరకూ ఆమె ఈ పదవిలో కొనసాగుతారని పేర్కొంది. తెలంగాణకు చెందిన విజయభారతి ప్రస్తుతం ఎన్‌హెచ్‌ఆర్సీలో సభ్యురాలిగా ఉన్నారు. ఆమె గతంలో తెలంగాణ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీసు చేశారు. మహిళల సమగ్రత, సాధికారతపై పనిచేస్తున్న అంజనీ మఠం సేవా ట్రస్ట్, సంవర్ధినీ న్యాస్, ప్రజ్ఞాభారత్ సహా పలు సంస్థల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. పలు సమస్యలు, హక్కులపై అవగాహన కల్పించేందుకు కళాశాలల్లో విద్యార్థినులకు 100కు పైగా వర్క్‌షాపులు నిర్వహించారు.

‘నిర్ణయాత్మక శక్తిగా మారిన ఓబీసీ ఓటర్లు’

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో ఓబీసీలు, అట్టడుగువర్గాల ప్రజలు రాజ్యాంగ రక్షణ, ప్రాథమిక హక్కుల పరిరక్షణ కోసం ఇండియా కూటమికి అండగా నిలిచారని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశ రక్షణ, సుస్థిర అభివృద్ధితో పాటు ప్రజలు సామాజిక న్యాయాన్ని కూడా కోరుకుంటున్నారని, ఈ ఎన్నికల ఫలితాలతోనైనా బీజేపీ ఈ వాస్తవాన్ని గ్రహించాలని బీజేపీ అధినాయకత్వానికి ఆయన సూచించారు.

9న జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు

సాక్షి, హైదరాబాద్: దేశంలోని ఐఐటీల్లో ప్రవేశానికి ఈ నెల 2వ తేదీన నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (జేఈఈ అడ్వాన్స్‌డ్–2024) రెస్పాన్స్ షీట్ బుధవారం విడుదల కానుంది. అడ్వాన్స్‌డ్ నిర్వహించిన మద్రాస్ ఐఐటీ ఈ విషయాన్ని వెల్లడించింది. దీనిపై అభ్యంతరాలుంటే సంబంధిత అధికారిక వెబ్‌సైట్‌కు తెలియజేయాల్సి ఉంటుంది. వీటిని పరిశీలించిన అనంతరం ఈ నెల 9వ తేదీన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు విడుదల చేసే వీలుంది. దేశవ్యాప్తంగా అడ్వాన్స్‌డ్ కోసం 2.5 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 2 లక్షల మంది వరకూ పరీక్ష రాశారు.

నీట్–2024 ఫలితాల్లో శ్రీచైతన్య హవా

సాక్షి, హైదరాబాద్: నీట్–2024 ఫలితాల్లో శ్రీచైతన్య రికార్డు సృష్టించింది. 720కి 720 మార్కులతో ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 9 ఫస్ట్ ర్యాంకులు సాధించి శ్రీచైతన్య ఆధిపత్యాన్ని సాధించిందని ఆ విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ తెలిపారు. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో వి.కల్యాణ్, పవన్‌కుమార్ రెడ్డి, ముఖేశ్ చౌదరి, భానుతేజసాయి, ఇరాన్ ఖ్వాజీ, దర్శ్ పగ్దార్, ఇషా కొఠారి, ఆదర్శ్ సింగ్ మోయల్, ఆమీనా ఆరిఫ్ కడివాలా ఆలిండియా ఓపెన్ కేటగిరీలో ఫస్ట్ ర్యాంకులు సాధించి సత్తాచాటారని పేర్కొన్నారు. 720 మార్కులతో 9 మంది, 715 మార్కులు ఆపైన 28 మంది, 710 మార్కులు ఆపైన 55 మంది, 700 మార్కులు ఆపైన 124 మందికి పైగా శ్రీచైతన్య విద్యార్థులు సాధించారన్నారు. నీట్ ప్రవేశాల కోసం దేశవ్యాప్తంగా విద్యార్థులు శ్రీచైతన్యనే కోరుకుంటున్నారని వెల్లడించారు. విజయాలు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, సిబ్బందిని అభినందించారు.

నీట్ ఫలితాల్లో నారాయణ జయభేరి

సాక్షి, హైదరాబాద్: నీట్–2024 ఫలితాల్లో నారాయణ విద్యార్థులు విజయదుందుభి మోగించారు. 720 మార్కులకు 720 ఆలిండియా ఓపెన్ కేటగిరీల్లో 8 ఫస్ట్ ర్యాంకులు సాధించి తమ విద్యాసంస్థ ప్రతిభ చాటిందని నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్లు పి.సింధూర నారాయణ, పి.శరణినారాయణ తెలిపారు. సామ్ శ్రేయాస్ జోసెఫ్, కె.సందీప్ చౌదరి, షాహ్, ఆదిత్యకుమార్, శశాంక్ శర్మ, ఈషా కొఠారి, ప్రాచిత, దర్శ్‌పగ్దార్ మొత్తం 8 మంది విద్యార్థులు ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 1వ ర్యాంకు సాధించారన్నారు. అలాగే 715 మార్కులు సాధించిన వారిలో 13 మంది నారాయణ విద్యార్థులుండగా.. 710 మార్కులు సాధించిన వారిలో 20 మంది విద్యార్థులున్నారని వెల్లడించారు. విజయం సాధించిన విద్యార్థులకు, అధ్యాపకులకు డైరెక్టర్ సింధూర నారాయణ అభినందనలు తెలిపారు.

నీట్ ఫలితాల్లో ఎస్ఆర్ విద్యార్థుల ప్రతిభ

విద్యారణ్యపురి: దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన నీట్–2024 ప్రవేశ ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను చాటారని ఎస్ఆర్ ఆ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థలకు చెందిన శ్రుతా కీర్తి 720 మార్కులకు గాను 662, పి.హర్షితా 652 మార్కులు సాధించి ఎస్ఆర్ కీర్తి ప్రతిష్టతను జాతీయ స్థాయిలో నిలబెట్టారన్నారు. అలాగే కె.రమేశ్ 630, ఎం.కీర్తి 626, టి.శాలిని 621, వి.సాయిప్రసాద్ 621 మార్కులు సాధించారని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో వస్తున్న మార్పులను గమనిస్తూ విద్యార్థులకు సృజనాత్మకతతో కూడిన విద్యను అందిస్తున్నామని వారు వెల్లడించారు.

ఫలించిన ‘ఉత్తమ్’ వ్యూహం

- నల్లగొండ కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌కు 5.59 లక్షల మెజారిటీ
- పోలైన మొత్తం ఓట్లలో 33.50% ఓట్లు హుజూర్‌నగర్, కోదాడ నుంచే
- దేశంలో కాంగ్రెస్ గెలిచిన నియోజకవర్గాల్లో మూడో అతిపెద్ద మెజార్టీగా రికార్డు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ/సాక్షి, హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వ్యూహం ఫలించింది. కాంగ్రెస్ పార్టీ దేశ వ్యాప్తంగా గెలిచిన నియోజకవర్గాల్లో రెండో అతి పెద్ద మెజార్టీని కైవసం చేసుకుని నల్లగొండ లోక్‌సభ స్థానం రికార్డు సృష్టించింది. అసోంలోని ధుబ్రీ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి రకీబుల్ హసన్‌కు 9.8 లక్షలకు పైగా మెజార్టీ రాగా, ఆ తర్వాత కేరళలోని తిరువల్లూర్‌లో శశికాంత్ సెంథిల్ 5.7 లక్షల మెజార్టీ సాధించారు. ఆ తర్వాత నల్లగొండలోనే రఘువీర్‌రెడ్డి 5.59 లక్షల అత్యధిక మెజార్టీ సాధించగలిగారు.



పోల్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి

నల్లగొండ పార్లమెంట్ స్థానానికి ఎన్నికల ఇన్‌చార్జిగా వ్యవహరించిన ఉత్తమ్ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి గెలుపు కోసం ప్రత్యేక వ్యూహం రచించారు. రఘువీర్‌రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించినప్పటి నుంచే క్షేత్ర స్థాయిలో పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి కేంద్రీకరించారు. దాదాపు నెలరోజులకు పైగా నియోజకవర్గంలోనే పనిచేసి కేడర్‌ను కదిలించగలిగారు. ఎప్పటికప్పుడు సమీక్షలు, పార్టీ మండల, గ్రామ స్థాయి నేతలతో సమావేశాలు నిర్వహిస్తూ తనదైన శైలిలో గెలుపు వ్యూహాన్ని అమలు చేశారు. ఎక్కడికక్కడ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మిగతా నియోజకవర్గాల్లో ఆయా ఎమ్మెల్యేలు బాధ్యత తీసుకోగా.. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న హుజూర్‌నగర్‌తో పాటు తన సతీమణి పద్మావతి రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న కోదాడ నియోజకవర్గం నుంచి మెజారిటీ ఓట్లు వచ్చేలా ఉత్తమ్ కసరత్తు చేశారు. దీంతో గత అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే ఈసారి కూడా ఆ రెండు నియోజక వర్గాల్లో కాంగ్రెస్ హవా కొనసాగింది. నల్లగొండ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలతో పోలిస్తే హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో రఘువీర్‌కు అత్యధికంగా ఓట్లు లభించాయి. కోదాడ నియోజక వర్గంలో కాంగ్రెస్‌కు 1,25,472 ఓట్లు రాగా, హుజూర్‌నగర్‌లో 1,33,198 ఓట్లు వచ్చాయి. పోలైన మొత్తం ఓట్లలో 33.50 శాతం ఓట్లు ఈ రెండు నియోజకవర్గాల్లోనే లభించడం విశేషం. దేవరకొండ, మిర్యాలగూడ, సాగర్, సూర్యాపేట, నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గాలను మించి ఈ రెండు నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు ఓట్లు వచ్చాయి. హుజూర్‌నగర్‌లో 1.05 లక్షలు, కోదాడలో 95 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీ లభించింది. హుజూర్‌నగర్‌లో వచ్చిన మెజార్టీ రాష్ట్రంలోని ఏ అసెంబ్లీ పరిధిలోనూ రాకపోగా, దేశంలోని టాప్–5 స్థానాల్లోనూ హుజూర్‌నగర్ ఉంటుందని టీపీసీసీ అంచనా వేస్తోంది.

అత్యధిక మెజార్టీపై ఉత్తమ్ హర్షం

హుజూర్‌నగర్: నల్లగొండ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డి దాదాపు 5.50 లక్షలకు పైగా మెజార్టీతో విజయం సాధించడంపై ఉత్తమ్‌కుమార్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 1.05 లక్షల మెజార్టీ, తన సతీమణి పద్మావతి ఎమ్మెల్యేగా ఉన్న కోదాడ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 95 వేల మెజార్టీని ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థికి ఇచ్చారని ఆనందం వ్యక్తం చేశారు. భారీ మెజార్టీ ఇచ్చిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నల్లగొండ లోక్‌సభ స్థానంలోని అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఓట్లు

అసెంబ్లీ నియోజకవర్గం	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ
కోదాడ	1,25,472	28,134	22,378
హుజూర్‌నగర్	1,33,198	27,151	21,677
దేవరకొండ	1,00,079	41,400	30,526
మిర్యాలగూడ	99,490	28,981	36,810
నాగార్జునసాగర్	1,07,192	30,604	24,988
సూర్యాపేట	1,02,209	33,953	31,397
నల్లగొండ	1,04,630	23,801	51,451



గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న రఘువీర్ రెడ్డి. చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ హరిచందన, మాజీ మంత్రి జానారెడ్డి తదితరులు

రఘువీర్‌రెడ్డి రికార్డు మెజారిటీ

- నల్లగొండ ఎంపీ స్థానంలో 5,59,906 ఓట్ల తేడాతో గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థి
- తెలంగాణలో ఇంతకుముందు అత్యధిక మెజారిటీ కేసీఆర్ పేరిట..
- 2014లో మెదక్ ఎంపీగా 3,97,029 ఓట్ల మెజారిటీ సాధించిన బీఆర్ఎస్ అధినేత
- ఉమ్మడి రాష్ట్రంలో 1991లో నాటి ప్రధాని పీవీకి అత్యధికంగా 5,80,297 ఓట్ల మెజారిటీ

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీ రికార్డు నమోదైంది. నల్లగొండలో కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డికి 7,84,337 ఓట్లురాగా.. సమీప బీజేపీ అభ్యర్థి సైదిరెడ్డికి 2,24,431 ఓట్లు వచ్చాయి. అంటే రఘువీర్‌రెడ్డి 5,59,906 ఓట్ల మెజారిటీ సాధించారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో ఇదే అత్యధిక మెజారిటీ. ఇంతకుముందు 2014 లోక్‌సభ ఎన్నికల్లో మెదక్ ఎంపీగా గెలిచిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు 3,97,029 ఓట్ల మెజారిటీ లభించింది. అయితే ఆ ఎన్నికల్లో ఎమ్మెల్యేగానూ గెలిచిన ఆయన ఎంపీ పదవికి రాజీనామా చేశారు. ఇక అదే ఎన్నికల్లో వరంగల్ నుంచి గెలిచిన కడియం శ్రీహరి (బీఆర్ఎస్) 3,92,574 ఓట్ల మెజారిటీతో రెండో స్థానంలో నిలిచారు. 2019 ఎన్నికల్లో వరంగల్ ఎంపీగా విజయం సాధించిన పసునూరి దయాకర్‌కు 3,50,298 ఓట్ల మెజారిటీ దక్కింది. ఇప్పుడు వాటిని బ్రేక్ చేస్తూ రఘువీర్‌రెడ్డి భారీ మెజారిటీ సాధించారు.

ఉమ్మడి రాష్ట్రంలో పీవీ..

ఉమ్మడి రాష్ట్రంలో పరిశీలిస్తే.. అత్యధిక మెజారిటీ మాజీ ప్రధాని, కాంగ్రెస్ నేత పీవీ నర్సింహారావు పేరిట ఉంది. 1991 లోక్‌సభ ఉప ఎన్నికల్లో అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు నంద్యాల నుంచి పోటీ చేసి 5,80,297 ఓట్ల మెజారిటీ సాధించారు. తర్వాత 2011 కడప లోక్‌సభ ఉప ఎన్నికలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 5,45,672 ఓట్ల భారీ మెజారిటీ సాధించారు.

‘మార్పునకు సమయమిదేనని రుజువైంది’

ముంబై: దేశంలో రాజకీయ మార్పునకు అనువైన సమయం ఇదేనని లోక్‌సభ ఎన్నికల ఫలితాలను బట్టి తాజాగా రుజువైందని ఎన్సీపీ(ఎస్పీ)చీఫ్ శరద్ పవార్ వ్యాఖ్యానించారు. అయితే, ప్రతిపక్ష ఇండియా కూటమి కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశాలు లేవని ఆయన పేర్కొన్నారు. మంగళవారం శరద్‌పవార్ మీడియాతో మాట్లాడారు. ‘మల్లికార్జున ఖర్గే, సీతారాం ఏచూరిలతో మాట్లాడాను. బుధవారం ఢిల్లీలో కూటమి నేతలం సమావేశమవుతున్నాం. కూటమి భవిష్యత్ కార్యాచరణపై ఏకాభిప్రాయంతో కూడిన నిర్ణయం సాయంత్రం కల్లా వెలువడే అవకాశముంది’ అని తెలిపారు. కాగా, నితీశ్ కుమార్, చంద్రబాబుతో తాను మాట్లాడినట్లు వస్తున్న వార్తలను శరద్ పవార్ కొట్టిపారేశారు.

కేంద్రం నుంచి నిధులు తెస్తా

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలపై కొట్లాడతా: ఈటల



సాక్షి, మేడ్చల్ జిల్లా: కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి, ముఖ్యంగా దేశంలోనే అతిపెద్ద పార్లమెంట్ నియోజకవర్గమైన మల్కాజ్‌గిరి సమగ్రాభివృద్ధికి నిధులు తెస్తానని ఎంపీ ఈటల రాజేందర్ హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు కొట్లాడుతానని చెప్పారు. సోమవారం భోగారం హోలి మేరి కాలేజీ వద్ద ఏర్పాటు చేసిన మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. ప్రజల ఆశీర్వాదంతో గెలుపొందానని, బీజేపీకి ఓటు వేసిన ప్రతిఒక్కరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. ప్రజల విశ్వాసానికి తగ్గట్టుగా తన పనివిధానం ఉంటుందన్నారు. తాను మల్కాజ్‌గిరి స్థానికుడనేనని, కంటోన్మెంట్‌లో రోడ్లు, చెరువుల పునరుద్ధరణ, యువతకు ఉపాధి, పేదలకు ఇళ్ల కోసం పోరాడుతానని చెప్పారు. నగర శివారులో ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని, తన గెలుపునకు సహకరించిన అన్ని సంఘాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రకృతిని పరిరక్షిస్తేనే మానవాళికి మనుగడ

- అటవీశాఖ మంత్రికొండా సురేఖ

సాక్షి, హైదరాబాద్: ప్రకృతిని ప్రేమిస్తూ, ప్రకృతిని పరిరక్షిస్తూ కలిసి జీవనం సాగిస్తేనే మానవాళికి మనుగడ ఉంటుందని అటవీ, దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం జూన్ 5 సందర్భంగా మంత్రి సురేఖ పర్యావరణ ప్రేమికులు, ప్రజలకు సందేశమిచ్చారు. ఈ విశ్వంలో ప్రత్యేకమైన శీతోష్ణస్థితి పరిస్థితులు కలిగి జీవించడానికి అనువైన ఒకే ఒక గ్రహమైన భూమిని జాగ్రత్తగా కాపాడుకోవడం మన విధి అని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న ప్రకృతి వైపరీత్యాల దృష్ట్యా ప్రతి ఒక్కరూ పర్యావరణ కాలుష్యం, వాతావరణ మార్పులు, కాలుష్య నివారణ చర్యలపై అవగాహన కలిగి ఉండాలని సురేఖ సూచించారు. విచక్షణ మరిచి మనిషి తన అవసరాలు తీర్చుకోవడమే లక్ష్యంగా సాగిస్తున్న కార్యకలా పాలు ప్రకృతి వైపరీత్యాలకు దారితీస్తున్నా యని ఆందోళన వ్యక్తంచేశారు.

‘ఫోన్ ట్యాపింగ్’పై మీ వివరణేంటి?

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు
- ఇది సాధారణ సమస్య కాదు..
- వ్యక్తుల గోప్యతలోకి చొరబడిన అంశమని వ్యాఖ్య
- మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం



సుమోటోగా విచారణ చేపట్టిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసుపై మీ వివరణేంటో చెప్పాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హైకోర్టు ఆదేశించింది. ఫోన్ ట్యాపింగ్ అనేది తీవ్ర ఆందోళన కలిగించే విషయమని.. ఇది టెలిఫోన్ ట్యాపింగ్ లాంటి సాధారణ సమస్య కాదని, వ్యక్తుల గోప్యతలోకి చొరబడిన అంశమని వ్యాఖ్యానించింది. మూడు వారాల్లో దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేసింది. కేంద్ర హోం శాఖ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, హోంశాఖ ముఖ్య కార్యదర్శి, ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీపీ, హైదరాబాద్ సీపీలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జూలై 3కు వాయిదా వేసింది. గత ప్రభుత్వ హయాంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కాజా శరత్ ఫోన్ కూడా ట్యాపింగ్ చేశారంటూ ఓ పత్రికలో వచ్చిన వార్తను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం సుమోటోగా విచారణ చేపట్టాలని నిర్ణయించింది.

‘ఫోన్ ట్యాపింగ్, జీపీఎస్ లొకేషన్ నుంచి వివరాలు తెలుసుకుని రేవంత్‌రెడ్డి స్నేహితుడు గాలి అనిల్‌కుమార్ నుంచి రూ.90 లక్షలు, కె.వినయ్‌రెడ్డి నుంచి రూ.1.95 కోట్లు, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్నేహితుడు వేణు నుంచి రూ.3 కోట్లు, జి.వినోద్ నుంచి రూ.50 లక్షలు, ఉత్తమ్ మిత్రుల నుంచి రూ.50 లక్షలు.. ఇలా పలువురి నుంచి ఎన్నికల సమయంలో నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ తిరుపతన్న తన వాంగ్మూలంలో చెప్పారు. హైకోర్టు న్యాయమూర్తుల ఫోన్లను కూడా ట్యాప్ చేసినట్లు ఇంటెలిజెన్స్ అదనపు ఎస్పీ నాయిని భుజంగరావు తన నేరాన్ని అంగీకరిస్తూ ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నారు’ అంటూ వచ్చిన కథనాన్ని హైకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ టి.వినోద్‌కుమార్ ధర్మాసనం మంగళవారం మధ్యాహ్న విరామం తరువాత విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ, విచారణ వాయిదా వేసింది.

గ్రూప్–1 ప్రిలిమ్స్ వాయిదాకు హైకోర్టు నిరాకరణ

చట్టప్రకారం నిర్ణయం తీసుకోవాలని టీజీపీఎస్సీకి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 9న ఇంటెలిజెన్స్ బ్యూరో డిపార్ట్‌మెంట్ పరీక్ష ఉన్నందున గ్రూప్–1 ప్రిలిమ్స్ వాయిదా వేయాలన్న పిటిషనర్ల అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. అయితే పిటిషనర్లు ఈ నెల 1న ఇచ్చిన వినతిపత్రాన్ని పరిశీలించి చట్ట ప్రకారం నిర్ణయం తెలియజేయాలని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ)కు స్పష్టం చేసింది. పిటిషన్‌లో విచారణను ముగించింది. ఇంటెలిజెన్స్ బ్యూరో డిపార్ట్‌మెంట్ పరిధిలోని అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ గ్రేడ్- ఐఐ/ఎగ్జిక్యూటివ్ పోస్టుకు 2వ స్క్రీనింగ్ టెస్ట్ ఈ నెల 9న ఉందని, అదేరోజు నిర్వహిస్తున్న గ్రూప్–1 ప్రిలిమ్స్‌ను వాయిదా వేయాలని కోరుతూ ఎం.గణేశ్, భూక్యా భరత్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ పుల్ల కార్తీక్ మంగళవారం విచారణ చేపట్టారు. టీజీపీఎస్సీ తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ..‘గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షకు సంబంధించి షెడ్యూల్ ముందుగానే ప్రకటించాం. 9న పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లన్నీ పూర్తి చేశాం. 4,03,645 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారందరూ పరీక్షకు సిద్ధమయ్యారు. కొందరి కోసం లక్షల మందిని ఇబ్బంది పెట్టడం...పరీక్ష వాయిదా వేయడం సాధ్యం కాదు. అయినా పిటిషనర్ల వినతిపత్రంపై అధికారులు చట్టప్రకారం నిర్ణయం తీసుకుంటారు’ అని వెల్లడించారు. వాదనలు విన్న న్యాయమూర్తి...ఈ పిటిషన్‌లో మెరిట్స్‌లోకి వెళ్లడంలేదని, చట్టప్రకారం టీజీపీఎస్సీ నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు.

నిమిషం ఆలస్యమైతే నో ఎంట్రీ

- నేటి నుంచి టీఎస్ ఐసెట్
- 86,156 మంది అభ్యర్థులు.. హైదరాబాద్‌లోనే అత్యధికం
- 116 పరీక్ష కేంద్రాల ఏర్పాటు

కేయూ క్యాంపస్: రాష్ట్రంలో ఈ విద్యా సంవత్సరం 2024–2025లో ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలకు గానూ నిర్వహించే టీఎస్ ఐసెట్.. బుధ, గురువారాల్లో మూడు సెషన్‌లలో ఆన్‌లైన్‌లో జరగనుంది. పరీక్ష కేంద్రాలకు గంట ముందుగా చేరుకోవాలని టీఎస్ ఐసెట్ కన్వీనర్, కాకతీయ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంటు విభాగం ఆచార్యులు ఎస్.నర్సింహాచారి తెలిపారు. నిర్దేశించిన సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రాల్లోని అనుమతించబోరని స్పష్టం చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి మొత్తంగా 86,156మంది అభ్యర్థులు ఈ ప్రవేశ పరీక్ష రాయనున్నారు. ఇందులో హైదరాబాద్‌లోనే నాలుగు టెస్టు జోన్‌లలో అత్యధికంగా 60,064 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. తెలంగాణలో 111, ఏపీలో 5 మొత్తంగా 116 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 133 మంది అబ్జర్వర్లను నియమించారు. బుధవారం ఉదయం మొదటి సెషన్‌ను 10 నుంచి 12–30 గంటల వరకు, అదే రోజు మధ్యాహ్నం 2–30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెషన్‌ను, గురువారం ఒక్క సెషన్ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12–30 గంటల వరకు నిర్వహిస్తారు. ఈ ప్రవేశ పరీక్ష ఇంగ్లిష్ ప్లస్ తెలుగు, ఇంగ్లిష్ ప్లస్ ఉర్దూ మీడియంలో ఉంటుంది.

సెట్‌ను ఎంపిక చేయనున్న ఉన్నత విద్యామండలి చైర్మన్

రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య ఆర్.లింబాద్రి బుధవారం ఉదయం 8 కాకతీయ యూనివర్సిటీ ఐసెట్ కార్యాలయానికి రానున్నారు. ప్రశ్నపత్రం సెట్‌ను డ్రా పద్ధతిలో ఎంపిక చేస్తారు. ప్రశ్నపత్రం సెట్ ఏ, బీలుగా ఉంటుంది. సెట్ ఎంపిక తరువాత పరీక్ష కేంద్రాలకు ఆన్‌లైన్‌లో పంపనున్నారు. అలా ప్రతి సెషన్‌కు ప్రశ్నపత్రం సెట్‌ను ఎంపిక చేస్తామని ఐసెట్ కన్వీనర్ నర్సింహాచారి తెలిపారు.

దేశభద్రతలో అగ్నివీర్‌లది కీలకపాత్ర

- అగ్నివీర్‌ల పాసింగ్ అవుట్ పరేడ్‌లో లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ ఆర్ సింగ్
- విధుల్లో చేరిన 2,517 మంది అగ్నివీరులు

సాక్షి, హైదరాబాద్: మాతృభూమి సేవలో, దేశ భద్రతలో అగ్నివీర్‌లు ప్రధాన భూమిక పోషిస్తున్నారని లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ ఆర్ సింగ్ పేర్కొన్నారు. ఆర్టిలరీ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన అగ్నివీర్‌ల పాసింగ్ ఔట్ పరేడ్ కార్యక్రమానికి రెజిమెంట్ ఆఫ్ ఆర్టిలరీ కార్ప్స్ కల్నల్ కమాండెంట్, లెఫ్టినెంట్ మేజర్ రాహుల్ ఆర్ సింగ్ పాల్గొన్నారు. మొత్తం 2,517 మంది అగ్నివీర్‌లను గన్నర్‌లుగా ఆర్టిలరీ రెజిమెంట్‌లో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రాహుల్ ఆర్ సింగ్ మాట్లాడుతూ...ఇంత పెద్ద సంఖ్యలో గన్నర్‌లను ఆర్టిలరీ రెజిమెంట్‌లో చేర్చుకోవడం సంతోషంగా ఉందన్నారు. మాతృభూమి సేవ కోసం తమ పిల్లలను అందించిన తల్లిదండ్రుల పట్ల గర్వంగా ఉందని కొనియాడారు. భారత సైన్యం, దేశం మొత్తంగా అగ్నివీర్‌ల చరిత్రలో ఒక కొత్త అధ్యాయం ప్రారంభమైందని తెలిపారు. ఈ సందర్భంగా మఖన్ సింగ్ స్టేడియంలో అగ్నివీర్‌లు తమ పోరాట సామర్థ్యాలను మల్కాంబ్, మార్షల్ ఆర్ట్స్, టార్చ్ డిస్‌ప్లే వంటి వాటిని ప్రదర్శించారు.

నీట్ ‘ఎస్టీ’ టాపర్ మనవాడే

▶ మొదటి పేజీ తరువాయి

ప్రతిభ చాటాడు. అతను జాతీయస్థాయిలో జనరల్ కేటగిరీలో 77వ ర్యాంకు సాధించాడు. ఆలిండియా టాప్ ర్యాంకర్‌గా నిలిచిన మహారాష్ట్రకు చెందిన వేద్ సునీల్ కుమార్ షిండే సహా 67 మందికి ఫస్ట్ ర్యాంకులు ప్రకటించారు. ఫస్ట్ ర్యాంకర్‌కు 99.997129 పర్సంటైల్ రాగా, తెలంగాణ ఫస్ట్ ర్యాంకర్, జాతీయస్థాయి 77వ ర్యాంకర్ అనురాన్ ఘోష్‌కు 99.996614 పర్సంటైల్ వచ్చింది. ఎస్టీ టాపర్ నృపేష్‌కు 99.987314, అదే కేటగిరీలోని రెండో ర్యాంకర్ లావుడ్య శ్రీరామ్ నాయక్‌కు 99.969357 పర్సంటైల్‌లు వచ్చాయి. గతంలో తెలంగాణ నుంచి టాప్ ర్యాంకర్లు ఎక్కువగా ఉండేవారనీ, ఇప్పుడు మాత్రం ఆ స్థాయిలో ర్యాంకర్లు లేరని ఒక విద్యా నిపుణుడు వ్యాఖ్యానించారు.

రాష్ట్రం నుంచి 47,371 మందికి అర్హత

ఎంబీబీఎస్, బీడీఎస్, బీఏఎంఎస్, బీయూఎంఎస్ తదితర మెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం గత నెల 5న నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. గతేడాది దేశవ్యాప్తంగా ఈ పరీక్షకు 20.38 లక్షల మంది హాజరు కాగా, ఈసారి 23.33 లక్షల మంది హాజరయ్యారు. గతేడాది 11.45 లక్షల మంది అర్హత సాధించగా, ఈసారి 13.16 లక్షల మంది అర్హత సాధించడం విశేషం. రాసిన వారూ అర్హత సాధించివారూ పెరిగారు. తెలంగాణ నుంచి గతేడాది 72,842 మంది హాజరుకాగా, 42,654 మంది అర్హత సాధించారు. ఈసారి 77,849 మంది హాజరు కాగా, 47,371 మంది అర్హత సాధించారు.

అర్హత మార్కు జనరల్ 164 : ఈసారి అర్హత మార్కు పెరిగింది. నీట్ పరీక్ష సులువుగా ఉండటం వల్లే ఈసారి అర్హత మార్కు పెరిగిందని నిపుణులు అంటున్నారు. గతేడాది జనరల్ కేటగిరీ/ ఈడబ్ల్యూఎస్‌లో అర్హత మార్కు 137 ఉండగా, ఈసారి అది 164 ఉండటం గమనార్హం. ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అండ్ పీహెచ్, ఎస్సీ అండ్ పీహెచ్‌ల అర్హత మార్కు గతేడాది 107గా ఉండగా, ఈసా రి 129గా ఉంది. అన్ రిజర్వుడు/ఈడబ్ల్యూఎస్ అండ్ పీహెచ్‌ల అర్హత మార్కు గతేడాది 121 ఉండగా, ఈసారి 140గా ఉంది. ఎస్టీ అండ్ పీహెచ్‌లో గతేడా ది అర్హత మార్కు 108 ఉండగా, ఈసారి 129 గా ఉంది. గతేడాది 450 మార్కులు వచ్చిన వారికి జనరల్ కేటగిరీలో కన్వీనర్ కోటాలో సీటు రాగా, ఈసారి 500 మార్కులు దాటిన వారికి కూడా కన్వీనర్ కోటాలో సీటు రావొచ్చని శ్రీచైతన్య సంస్థల డీన్ శంకర్‌రావు విశ్లేషించారు. గతేడాది 600 మార్కులు వచ్చిన వారికి ఆలిండియా ర్యాంకు 30 వేలు ఉండగా, ఈసారి అదే మార్కు వచ్చినవారికి 82 వేల ర్యాంకు రావడం గమనార్హం. అంతేకాదు గతేడాది 720కి 720 మార్కులు వచ్చినవారు దేశవ్యాప్తంగా ఇద్దరు మాత్రమే ఉండగా, ఈసారి 67 మంది ఉన్నారు.

త్వరలో రాష్ట్రస్థాయి ర్యాంకులు

ఆలిండియా ర్యాంకులు ప్రకటించిన జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)... తదుపరి రాష్ట్రాల వారీగా అభ్యర్థుల జాబితాను తయారు చేస్తుంది. అనంతరం ఆ డేటాను రాష్ట్రాలకు పంపిస్తుంది. ముందుగా ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల కోసం ఆలిండియా ర్యాంక్ ఆధారంగా మెరిట్ జాబితా రూపొందిస్తారు. అభ్యర్థులు తమ రాష్ట్రానికి దరఖాస్తు చేసినప్పుడు, వారు రాష్ట్ర కేటగిరీ జాబితా ప్రకారం విభజిస్తారు. రాష్ట్ర కౌన్సెలింగ్ అధికారులు తదనుగుణంగా వారి మెరిట్ జాబితాను తయారు చేస్తారు. 15 శాతం ఆలిండియా కోటా సీట్లను డీమ్డ్ వర్సిటీలు, సెంట్రల్ యూనివర్సిటీలు, ఈఎస్ఐసీ, ఏఎఫ్ఎంసీ, బీహెచ్‌యూ, ఏఎంయూలోని ప్రవేశాలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. అభ్యర్థులు మరింత సమాచారం కోసం www.mcc.nic.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు. అభ్యర్థులు 15 శాతం ఆలిండియా కోటా సీట్లకు దరఖాస్తు చేస్తారు. సీట్లు అయిపోయిన తర్వాత కౌన్సెలింగ్ నిలిపివేస్తారు. కౌన్సెలింగ్ వివరాలు, షెడ్యూల్‌ను ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సహా రాష్ట్రాల వైద్య విద్యా డైరెక్టరేట్ల వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంటాయి. రాష్ట్ర కోటా, రాష్ట్రాల పరిధిలోకి వచ్చే ఇతర సీట్ల కోసం అభ్యర్థులు తమ సొంత రాష్ట్రాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆలిండియా ర్యాంక్ ఆధారంగా సంబంధిత కౌన్సెలింగ్ అధికారులతో మెరిట్ జాబితా తయారు చేస్తారు. ప్రైవేట్ మెడికల్ కాలేజీలకు సంబంధించిన కౌన్సెలింగ్ కూడా సంబంధిత స్టేట్ కౌన్సెలింగ్ అథారిటీనే నిర్వహిస్తుంది. నీట్ ఫలితాల డేటాను బీఎస్సీ నర్సింగ్ ప్రవేశాలకు కూడా వినియోగించుకోవచ్చు. గుర్తింపు పొందిన వెటర్నరీ కళాశాలల్లో 15 శాతం కోటా కింద బీవీఎస్సీ అండ్ ఏహెచ్ కోర్సుల అడ్మిషన్లకూ ఈ ఫలితాల డేటాను ఉపయోగించుకోవచ్చు.

మంచి డాక్టరుగా పేరు తెచ్చుకోవాలని ..

నిపుణుడైన డాక్టరుగా ప్రజలకు సేవ చేయాలనేదే లక్ష్యం. మంచి డాక్టరుగా పేరు తెచ్చుకోవాలని కోరిక. ఇంటర్మీడియెట్‌లో క్లాసులు ముగిశాక సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి ఒంటిగంట వరకు చదివేవాడిని. అమ్మానాన్నల ప్రోత్సాహం ఎంతో ఉంది. నాన్న డాక్టర్ హరిచరణ్ గ్లోబల్ హాస్పిటల్‌లో సీనియర్ జనరల్ ఫిజీషియన్. అమ్మ విజయా చరణ్ ఓయూలో కెమిస్ట్రీ లెక్చరర్. ఏ విభాగంలో స్పెషలైజేషన్ అనేదానిపై ఇప్పుడే ఎలాంటి ఆలోచన లేదు. గ్రాడ్యుయేషన్ అనంతరం ఆలోచిస్తాను. స్వగ్రామం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని హుజూర్‌నగర్. నీట్‌లో వచ్చిన మార్కులు 715. మొదటి ప్రయత్నంలోనే ఈ ర్యాంక్ వచ్చింది. ఎన్సీఈఆర్టీ బుక్స్ బాగా చదివేవాడిని.

–జి.వెంకట నృపేష్, (ఆలిండియా 167 ర్యాంక్. ఎస్టీ విభాగంలో ఫస్ట్ ర్యాంక్)

ఏపీలో 43,858 మంది అర్హత

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ నుంచి ఈసారి నీట్ పరీక్ష 64,931 మంది రాయగా 43,858 మంది అర్హులుగా నిలిచారు. ఆంధ్రప్రదేశ్ నుంచి కె. సందీప్ చౌదరి (21వ స్థానం), జి. భానుతేజ సాయి (29వ స్థానం), పోరెడ్డి ప్రవీణ్‌కుమార్ రెడ్డి(56వ స్థానం), వి. ముకేష్ చౌదరి(60వ స్థానం)లో నిలిచి ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకర్‌లుగా ఉన్నారు. అదే విధంగా ఏపీనూ వీరే టాప్ ర్యాంకర్‌లుగా ఉన్నారు.

జాతీయ స్థాయిలో విభాగాల వారీగా అర్హత సాధించిన విద్యార్థులు ఇలా..

విభాగం	కటాఫ్ మార్కులు	అర్హత సాధించిన విద్యార్థులు
యూఆర్/ ఈడబ్ల్యూఎస్	720–164	11,65,904
ఓబీసీ	163–129	1,00,769
ఎస్సీ	163–129	34,326
ఎస్టీ	163–129	14,478
పీహెచ్ యూఆర్/ ఈడబ్ల్యూఎస్	163–146	455
పీహెచ్ ఓబీసీ	145–129	270
పీహెచ్ ఎస్సీ	145–129	55
పీహెచ్ ఎస్టీ	145–129	11

ఆదిలాబాద్
గోడం నగేశ్
మెజారిటీ 90,652
రెండో స్థానం
ఆత్రం సుగుణ (కాంగ్రెస్)
ఓట్లు 4,77,516
మూడో స్థానం
ఆత్రం సక్కు (బీఆర్ఎస్)
ఓట్లు 1,37,300


వచ్చిన ఓట్లు 5,68,168

కరీంనగర్
బండి సంజయ్
మెజారిటీ 2,25,209
రెండో స్థానం
వెలిచాల రాజేందర్‌రావు (కాంగ్రెస్)
ఓట్లు 3,59,907
మూడో స్థానం
బోయినపల్లి వినోద్‌కుమార్ (బీఆర్ఎస్)
ఓట్లు 2,82,163


వచ్చిన ఓట్లు 5,85,116

పెద్దపల్లి
గడ్డం వంశీకృష్ణ
మెజారిటీ 1,31,364
రెండో స్థానం
గోమాస శ్రీనివాస్ (బీజేపీ)
ఓట్లు 3,44,223
మూడో స్థానం
కొప్పుల ఈశ్వర్ (బీఆర్ఎస్)
ఓట్లు 1,93,356


వచ్చిన ఓట్లు 4,75,587

వరంగల్
కడియం కావ్య
మెజారిటీ 2,20,339
రెండో స్థానం
అరూరి రమేష్ (బీజేపీ)
ఓట్లు 3,60,955
మూడో స్థానం
మారెపల్లి సుధీర్ (బీఆర్ఎస్)
ఓట్లు 2,32,033


వచ్చిన ఓట్లు 5,81,294

మహబూబాబాద్
పోరిక బలరాంనాయక్
మెజారిటీ 3,49,165
రెండో స్థానం
మాలోతు కవిత (బీఆర్ఎస్)
ఓట్లు 2,63,609
మూడో స్థానం
అజ్మీరా సీతారాంనాయక్ (బీజేపీ)
ఓట్లు 1,10,444



వచ్చిన ఓట్లు 6,12,774

నిజామాబాద్
ధర్మపురి అర్వింద్
మెజారిటీ 1,09,241
రెండో స్థానం
తాటిపర్తి జీవన్‌రెడ్డి (కాంగ్రెస్)
ఓట్లు 4,83,077
మూడో స్థానం
బాజిరెడ్డి గోవర్ధన్ (బీఆర్ఎస్)
ఓట్లు 1,02,406


వచ్చిన ఓట్లు 5,92,318

జహీరాబాద్
సురేశ్‌కుమార్ షెట్కార్
మెజారిటీ 46,188
రెండో స్థానం
బీబీ పాటిల్ (బీజేపీ)
ఓట్లు 4,82,230
మూడో స్థానం
గాలి అనిల్‌కుమార్ (బీఆర్ఎస్)
ఓట్లు 1,72,078


వచ్చిన ఓట్లు 5,28,418



ఖమ్మం
ఆర్.రఘురామిరెడ్డి
మెజారిటీ 4,67,847
రెండో స్థానం
నామా నాగేశ్వరరావు (బీఆర్ఎస్)
ఓట్లు 2,99,082
మూడో స్థానం
తాండ్ర వినోద్‌రావు (బీజేపీ)
ఓట్లు 1,18,636


వచ్చిన ఓట్లు 7,66,929

మెదక్
ఎం.రఘునందన్‌రావు
మెజారిటీ 39,139
రెండో స్థానం
నీలం మధు (కాంగ్రెస్)
ఓట్లు 4,32,078
మూడో స్థానం
పి.వెంకట్రామ్‌రెడ్డి (బీఆర్ఎస్)
ఓట్లు 3,96,790


వచ్చిన ఓట్లు 4,71,217

మల్కాజిగిరి
ఈటల రాజేందర్
మెజారిటీ 3,91,475
రెండో స్థానం
పట్నం సునీత (కాంగ్రెస్)
ఓట్లు 5,99,567
మూడో స్థానం
రాగిడి లక్ష్మారెడ్డి (బీఆర్ఎస్)
ఓట్లు 3,00,486


వచ్చిన ఓట్లు 9,91,042

హైదరాబాద్
అసదుద్దీన్ ఒవైసీ
మెజారిటీ 3,38,087
రెండో స్థానం
కొంపెల్లి మాధవీలత (బీజేపీ)
ఓట్లు 3,23,894
మూడో స్థానం
వలీఉల్లా సమీర్ (కాంగ్రెస్)
ఓట్లు 62,962


వచ్చిన ఓట్లు 6,61,981

చేవెళ్ల
కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
మెజారిటీ 1,72,897
రెండో స్థానం
గడ్డం రంజిత్‌రెడ్డి (కాంగ్రెస్)
ఓట్లు 6,36,985
మూడో స్థానం
కాసాని జ్ఞానేశ్వర్ (బీఆర్ఎస్)
ఓట్లు 1,78,968


వచ్చిన ఓట్లు 8,09,882

భువనగిరి
చామల కిరణ్‌కుమార్‌రెడ్డి
మెజారిటీ 2,22,170
రెండో స్థానం
బూర నర్సయ్యగౌడ్ (బీజేపీ)
ఓట్లు 4,06,973
మూడో స్థానం
క్యామ మల్లేశ్ (బీఆర్ఎస్)
ఓట్లు 2,56,187


వచ్చిన ఓట్లు 6,29,143

నాగర్‌కర్నూల్
మల్లు రవి
మెజారిటీ 94,414
రెండో స్థానం
పోతుగంటి భరత్ (బీజేపీ)
ఓట్లు 3,70,658
మూడో స్థానం
ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ (బీఆర్ఎస్)
ఓట్లు 3,21,343


వచ్చిన ఓట్లు 4,65,072

మహబూబ్‌నగర్
డీకే.అరుణ
మెజారిటీ 4,500
రెండో స్థానం
వంశీచంద్‌రెడ్డి (కాంగ్రెస్)
ఓట్లు 5,06,247
మూడో స్థానం
శ్రీనివాస్‌రెడ్డి (బీఆర్ఎస్)
ఓట్లు 1,54,792


వచ్చిన ఓట్లు 5,10,747

సికింద్రాబాద్
జి.కిషన్‌రెడ్డి
మెజారిటీ 49,944
రెండో స్థానం
దానం నాగేందర్ (కాంగ్రెస్)
ఓట్లు 4,23,068
మూడో స్థానం
టి.పద్మారావు (బీఆర్ఎస్)
ఓట్లు 1,29,586


వచ్చిన ఓట్లు 4,73,012

నల్లగొండ
కుందూరు రఘువీర్‌రెడ్డి
మెజారిటీ 5,59,905
రెండో స్థానం
శానంపూడి సైదిరెడ్డి (బీజేపీ)
ఓట్లు 2,24,432
మూడో స్థానం
కంచర్ల కృష్ణారెడ్డి (బీఆర్ఎస్)
ఓట్లు 2,18,417


వచ్చిన ఓట్లు 7,84,337


మంచిర్యాలలోని నివాసంలో తండ్రి వివేక్, తనయుడు వంశీకృష్ణ ఆలింగనం

మూడు తరాలు... ముగ్గురూ ఎంపీలు

- గడ్డం కుటుంబానికి కలిసొచ్చిన పెద్దపల్లి
- ఇక్కడినుంచే వెంకటస్వామి, వివేక్, వంశీకృష్ణ విజయం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పెద్దపల్లి లోక్‌సభ స్థానం నుంచి ఎంపీలుగా గెలవడం ద్వారా గడ్డం కుటుంబ సభ్యులు రికార్డు సృష్టించారు. 1989, 1991, 1996, 2004లో నాలుగుసార్లు ఎంపీగా గడ్డం వెంకటస్వామి గెలుపొందగా, 2009లో ఆయన తనయుడు వివేక్ ఒకసారి గెలిచి, 2014లో ఓడిపోయారు. మళ్లీ పదేళ్లకు తాజాగా వివేక్ తనయుడు వంశీకృష్ణ గెలిచి రికార్డు సృష్టించారు. మరోవైపు ఇదే సమయంలో తండ్రి వివేక్ చెన్నూరు ఎమ్మెల్యేగా ఉండగా, పెద్దనాన్న వినోద్ బెల్లంపల్లి ఎమ్మెల్యేగా ఉన్నారు. ఒకే లోక్‌సభ పరిధిలో ముగ్గురు ప్రజాప్రతినిధులుగా గెలవడం గమనార్హం. నల్లనేలగా ఉన్న సింగరేణి ప్రాంతం నుంచి పారిశ్రామికవేత్తగా ఉన్న వంశీని నిలబెట్టి కాంగ్రెస్ పార్టీ సక్సెస్ అయింది. తన సమీప ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌పై 1.31 లక్షల ఓట్ల మెజార్టీతో వంశీ విజయం సాధించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో లోక్‌సభ స్థానం పరిధిలో ఉన్న ఏడు స్థానాల్లోనూ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. అదే ఊపుతో తాజాగా ఎంపీ స్థానాన్ని గెలిచారు. సింగరేణి, కార్మిక కుటుంబాలు, శ్రామిక వర్గం అధికంగా ఉన్న ఈ సెగ్మెంట్ పరిధిలో ఏకపక్షంగా తీర్పునిచ్చారు. బీఆర్ఎస్ తమ సిట్టింగ్ సీటును కోల్పోయి మూడో స్థానానికి పరిమితమైంది. ఆ పార్టీ అభ్యర్థిగా బరిలో దిగిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయారు.

సీపీఎంకు డిపాజిట్ గల్లంతు

భువనగిరిలో ఆ పార్టీ సాధించిన ఓట్లు 30 వేలే



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఒక స్థానంలో పోటీ చేసిన సీపీఎం డిపాజిట్ కోల్పోయింది. కాంగ్రెస్ పార్టీతో 16 స్థానాల్లో పొత్తు పెట్టుకున్న ఆ పార్టీ, భువనగిరి లోక్‌సభ స్థానంలో మాత్రం బరిలో నిలిచింది. ఆ పార్టీ తరపున పోటీచేసిన జహంగీర్ ఓడిపోయారు. ఈ నెల 13న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి స్థానంలో 13.88 లక్షల ఓట్లు పడగా, మంగళవారం జరిగిన కౌంటింగ్‌లో 30 వేల లోపు ఓట్లు మాత్రమే సీపీఎంకు పడినట్లు ఎన్నికల కమిషన్ వెల్లడించింది. దీంతో డిపాజిట్ కోల్పోయినట్లు అధికారులు చెబుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ ఆ పార్టీ కాంగ్రెస్‌తో పొత్తు కుదరక 19 స్థానాల్లో పోటీ చేసి అన్నిచోట్లా డిపాజిట్లు కోల్పోయింది. భువనగిరి స్థానంలో పోటీ చేయవద్దని కాంగ్రెస్ కోరినా అధిష్టానం నిర్ణయం మేరకు బరిలో నిలిచింది. చివరకు కనీసం డిపాజిట్ కూడా దక్కించుకోలేకపోయింది. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఒక్కచోట కూడా డిపాజిట్లు రాకపోవడంతో ఆ పార్టీ కార్యకర్తలు నిరాశకు గురవుతున్నారు.

చట్టసభల్లో 'బంధుగణం'

తెలంగాణలో 15 మందికి పైగా నేతలు బంధువులే

కొందరు ఎంపీలుగా, మరికొందరు ఎమ్మెల్యేలుగా..



సాక్షి, హైదరాబాద్: రాజకీయ బంధుగణానికి తెలంగాణ చిరునామా అయింది. ఈ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన పలువురు కుటుంబ సభ్యులు విజయతీరాలకు చేరడంతో ఇటు అసెంబ్లీ, అటు పార్లమెంటుకు కుటుంబ సభ్యులు, బంధువులు ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కింది. ఈ బంధుగణం జాబితా కాంగ్రెస్ పార్టీలో ఎక్కువగా కనిపిస్తోంది. మాజీ మంత్రి జానారెడ్డి కుమారుడు జైవీర్‌రెడ్డి ఇప్పటికే నాగార్జునసాగర్ ఎమ్మెల్యేగా ఉండగా, ఆయన మరో కుమారుడు రఘువీర్‌రెడ్డి ఇప్పుడు నల్లగొండ ఎంపీగా గెలుపొందారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా మధిర అసెంబ్లీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తోన్న మల్లు భట్టివిక్రమార్క సోదరుడు డాక్టర్ మల్లురవి నాగర్‌కర్నూల్ ఎంపీగా విజయం సాధించారు. ఇక, పెద్దపల్లి నుంచి గెలిచిన వంశీకృష్ణ తండ్రి వివేక్ వెంకటస్వామి చెన్నూరు ఎమ్మెల్యేగా, పెదనాన్న వినోద్ వెంకటస్వామి బెల్లంపల్లి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ఖమ్మం లోక్‌సభ నుంచి భారీ మెజార్టీతో గెలుపొందిన రామసహాయం రఘురామిరెడ్డి (ఆర్ఆర్ఆర్), రాష్ట్ర మంత్రి, పాలేరు ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వియ్యంకుడు. వరంగల్ జిల్లాలోని స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి మాజీ మంత్రి కడియం శ్రీహరి ఇప్పటికే ఎమ్మెల్యేగా ఉండగా, ఆయన కుమార్తె కడియం కావ్య ఇప్పుడు వరంగల్ ఎంపీగా గెలిచారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీలో కోమటిరెడ్డి బ్రదర్స్‌గా గుర్తింపు పొందిన వెంకట్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డిలు తెలంగాణ అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇక, బీజేపీ నుంచి మహబూబ్‌నగర్ ఎంపీగా గెలిచిన డీకే అరుణ మేనల్లుడు కృష్ణమోహన్‌రెడ్డి గద్వాల ఎమ్మెల్యేగా ఉండగా, మేనకోడలు పర్ణికారెడ్డి నారాయణపేట నుంచి శాసనసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఎంఐఎంలోనూ చాలా కాలం నుంచి సోదరులు అసదుద్దీన్ ఒవైసీ (లోక్‌సభ), అక్బరుద్దీన్ ఒవైసీ (అసెంబ్లీ)కి చట్టసభలకు ప్రాతినిధ్యం వహిస్తుండడం గమనార్హం.

సీనియర్లతో కలిసి 'యువతరం'

- పాత.. కొత్తల కలయికగా కాంగ్రెస్ అభ్యర్థుల విజయం
- ఈసారి కాంగ్రెస్ పార్టీ నుంచి లోక్‌సభకు నలుగురు యువ నేతలు
- చామల, కావ్య, రఘువీర్, వంశీకృష్ణలు తొలిసారి పార్లమెంటుకు

సాక్షి, హైదరాబాద్: చాలాకాలం తరువాత కాంగ్రెస్‌లో కొత్తతరం ఎంపీలు తెరపైకి వచ్చారు. తాజాగా వెలువడ్డ పార్లమెంటు ఎన్నికల ఫలితాల్లో రాష్ట్రంలోని 17 స్థానాలకు గాను 8 చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. 2004, 2009 లోక్‌సభ ఎన్నికల తరువాత కాంగ్రెస్ నుంచి తెలంగాణలో ఎక్కువ సంఖ్యలో ఎంపీలు గెలిచింది ఇప్పుడే. అలాగే యువ, సీనియర్ నాయకుల గెలుపు పాత కొత్తల కలయికగా చాలా కాలం తరువాత తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల్లో కనిపిస్తోంది. గెలిచిన 8 మంది కాంగ్రెస్ ఎంపీల్లో ముగ్గురు నేతలు.. సురేశ్ షెట్కార్ (జహీరాబాద్), మల్లు రవి (నాగర్‌కర్నూల్), బలరాం నాయక్ (మహబూబాబాద్) రాష్ట్ర రాజకీయాల్లో సీనియర్లే కాక, మాజీ ఎంపీలు కూడా. ఖమ్మం నుంచి తొలిసారి ఎంపీగా గెలిచిన రామసహాయం రఘురామిరెడ్డి సీనియర్ నేత, మాజీ ఎంపీ, రామసహాయం సురేందర్ రెడ్డి తనయుడు. రఘురామిరెడ్డి రాజకీయాలకు కొత్త అయినప్పటికీ, ఆయన కుటుంబం ఎప్పటి నుంచో రాజకీయాల్లో ఉంది. ఆయన ప్రస్తుత మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వియ్యంకుడు కూడా. ఆయనతో పాటు మరో నలుగురు యువ నేతలు తొలిసారి ఎంపీలుగా ఎన్నికయ్యారు. భువనగిరి నుంచి గెలిచిన చామల కిరణ్‌కుమార్ రెడ్డి, వరంగల్ ఎంపీ కడియం కావ్య, నల్లగొండ నుంచి గెలిచిన కుందూరు రఘువీర్‌రెడ్డి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ యువతరం ప్రతినిధులుగా తొలిసారి గెలిచారు. వీరు చిన్న వయసులోనే ఎంపీలుగా పార్లమెంటులో అడుగుపెట్టబోతున్నారు.

బీజేపీకి బీఆర్ఎస్ ఓట్లు బదిలీ!

- కాషాయ పార్టీ ఓటింగ్ శాతం 35.08కు పెరుగుదల..
- అసెంబ్లీ ఎన్నికల కంటే 21.08 శాతం వృద్ధి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ఓటింగ్ శాతాన్ని బీజేపీ గణనీయంగా 35.08 శాతానికి పెంచుకుంది. 2023 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 14 శాతం ఓటింగ్‌తో 8 ఎమ్మెల్యే సీట్లలో గెలిచిన విషయం తెలిసిందే. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల్లో ఏకంగా 21.08 ఓటింగ్ శాతం పెంచుకొని మొత్తంగా 35.08 శాతాన్ని సాధించడం గమనార్హం. గత అసెంబ్లీ ఎన్నికలు అప్పటి అధికారపార్టీ బీఆర్ఎస్- ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీల మధ్య సాగడంతో బీజేపీ మూడోస్థానానికి పరిమితం కావాల్సి వచ్చింది. ప్రస్తుతం దేశంలో జాతీయ రాజకీయాలకు ఏర్పడిన ప్రాధాన్యత, మోదీ వరుసగా మూడోసారి ప్రధాని అవుతారనే అంచనాల మధ్య లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి, రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలోని ఇండియా కూటమి పక్షాల మధ్య జరిగిన పార్లమెంట్ ఎన్నికలు అందరి దృష్టిని ఆకర్షించాయి. ఈ నేపథ్యంలో... తెలంగాణలో ప్రధానంగా జాతీయపార్టీలైన బీజేపీ-కాంగ్రెస్‌ల మధ్య హోరాహోరీ పోటీ ఏర్పడడంతో భారత రాష్ట్రీయ సమితి (బీఆర్ఎస్) మూడో స్థానానికి పరిమితం కావాల్సి వచ్చిందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. జాతీయ రాజకీయాలకు ఏర్పడిన ప్రాధాన్యం దృష్ట్యా పలు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఓటింగ్ బీజేపీకి బదిలీ అయ్యిందనే అంచనా వేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికలు కావడంతో స్వతాహాగా బీజేపీ ఓటింగ్ శాతం పెరగడంతో పాటు, బీఆర్ఎస్ ఓట్లు కొంత మేర బీజేపీకి పడడంతో ఒక్కసారిగా ఓటింగ్ శాతం 35.08 శాతానికి చేరుకుందని లెక్కలు కడుతున్నారు.

2.02 % ఓట్ల తేడాతో బీఆర్ఎస్ ఓటమి

రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 39.4 శాతం ఓట్లను సాధించి అగ్రస్థానంలో నిలవగా, బీఆర్ఎస్ పార్టీ 37.35శాతం ఓట్లను సాధించింది. బీఆర్ఎస్‌తో పోల్చితే కేవలం 2.05 శాతం ఓట్ల ఆధిక్యతతో కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని చేజిక్కించుకోవడం గమనార్హం. బీజేపీ 13.9శాతం, ఎంఐఎం 2.22 శాతం, బీఎస్పీ 1.37శాతం ఓట్లను దక్కించుకున్నాయి. ఎన్నికల్లో పోలైన మొత్తం 2,32,59,256 ఓట్లలో కాంగ్రెస్ 92,35,792, బీఆర్ఎస్ 87,53,924, బీజేపీ 32,57,511, ఎంఐఎం 5,19,379 ఓట్లను సాధించాయి.

అసెంబ్లీకి భిన్నంగా లోక్‌సభ తీర్పు

భారీగా పెరిగిన బీజేపీ ఓటు బ్యాంక్

- అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 14%.. ఇప్పుడు 35%
- ఆరు నెలల్లోనే 37.35% నుంచి 16.68 శాతానికి తగ్గిన బీఆర్ఎస్ షేర్
- కాంగ్రెస్‌కు అత్యధిక ఓట్లు వచ్చినా స్వల్ప ఆధిక్యతే
- అప్పుడు 39.40% ఓట్లు.. ఇప్పుడు 40.10%

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర, జాతీయ రాజకీయ మార్పులకు అనుగుణంగా తెలంగాణ ఓటరు నాడి కనిపిస్తోంది. ఆరు నెలల క్రితం జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఇచ్చిన తీర్పుకు భిన్నంగా తాజాగా జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పార్టీలను గెలిపించి రాష్ట్ర ఓటర్లు తమ విలక్షణమైన తీరును మరోసారి చాటుకున్నారు. 2023 నవంబర్‌లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో మొత్తం పోలయిన ఓట్లలో కాంగ్రెస్‌కు 39.40 శాతం వాటా ఇచ్చి 64 సీట్లు కట్టబెట్టి అధికారాన్ని అప్పగించిన ఓటర్లు..ఈసారి దానికి అదనంగా స్వల్ప ఆధిక్యతను కట్టబెట్టారు. మొత్తం పోలయిన ఓట్లలో అత్యధికంగా 87,41,263 ఓట్లను సాధించిన కాంగ్రెస్ పార్టీ.. 40.10 శాతం ఓట్లతో రాష్ట్రంలోని 17 లోక్‌సభ సీట్లకు గాను 8 చోట్ల విజయం సాధించింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో 18 శాతం ఓట్లు మాత్రమే దక్కించుకొని మూడు సీట్లకు పరిమితమైన కాంగ్రెస్.. గత అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం అనూహ్యంగా దాదాపు 40 శాతం ఓట్లు సాధించింది.

గణనీయంగా పెరిగిన బీజేపీ ఓటు షేర్

కాంగ్రెస్‌తో సమానంగా రాష్ట్రంలో 8 లోక్‌సభ సీట్లు గెలుచుకున్నప్పటికీ బీజేపీకి కాంగ్రెస్ కన్నా సుమారు 11 లక్షల ఓట్లు తక్కువ పోలయ్యాయి. అయితే కాంగ్రెస్ తర్వాత మొత్తం 76,47,424 ఓట్లను పొందడం ద్వారా 35.08 శాతం వాటాను కైవసం చేసుకుంది. బీజేపీకి గత నవంబర్‌లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కేవలం 14 శాతం ఓట్లు మాత్రమే రాగా, ఆరు నెలల్లో అది 35 శాతానికి పెరగడం గమనార్హం. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 22 శాతం ఓట్లు సాధించింది.

ఆరునెలల్లో అనూహ్యంగా..

ఈ పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలో బాగా దెబ్బతిన్న పార్టీగా బీఆర్ఎస్ నిలిచింది. ఆరునెలల క్రితం జరిగిన ఎన్నికల్లో 37.35 శాతం ఓట్లతో 39 సీట్లు సాధించి కాంగ్రెస్ తరువాత రెండో స్థానంలో నిలిచిన బీఆర్ఎస్.. ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో బాగా వెనుకబడిపోయింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఏకంగా 52 శాతం ఓట్లు సాధించి 9 సీట్లను గెలుచుకున్న ఈ పార్టీ ఈసారి ఒక్క సీటును కూడా సాధించలేదు. 16.68 శాతం ఓట్లతో (36,37,086) బీఆర్ఎస్ మూడో స్థానంలో నిలిచింది. అయితే గత లోక్‌సభ ఎన్నికలతో పోల్చుకుంటే ఏకంగా 36 శాతం ఓట్లు ఆ పార్టీ కోల్పోయింది. జాతీయ స్థాయిలో ప్రధానిని నిర్ణయించే లోక్‌సభ ఎన్నికల్లో ఈసారి జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌ల వైపు తెలంగాణ ఓటర్లు మొగ్గు చూపినట్లు అర్థమవుతోంది. ఇక హైదరాబాద్‌లో గెలిచిన ఎంఐఎం ఎప్పటిలాగే 3 శాతం ఓట్లను సాధించింది. నోటాకు గణనీయంగా 8,50,177 (3.9 శాతం) ఓట్లు పోలయ్యాయి.

లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని వివిధ పార్టీలు సాధించిన ఓట్ల వివరాలు

పార్టీ	సాధించిన ఓట్లు	ఓట్ల శాతం
కాంగ్రెస్	87,41,263	40.10
బీజేపీ	76,47,424	35.08
బీఆర్ఎస్	36,37,086	16.68
ఎంఐఎం	6,59,278	3.02
ఇతరులు	8,50,177	3.9
బీఎస్పీ	89,091	0.41
సీపీఎం	28,412	0.13
ఏఐఎఫ్‌బీ	43,748	0.2
నోటా	8,50,177	3.9

(నోట్: ఎంఐఎం, సీపీఎం పార్టీలు ఒకే స్థానంలో పోటీ చేశాయి)

ఆ రెండింటా ఓటమి

- పాలమూరులో గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డిన సీఎం రేవంత్
- గెలుపు అంచుల వరకు వచ్చి బోల్తా... మల్కాజ్‌గిరిలో మూడోస్థానానికే పరిమితం
- నల్లగొండ, భువనగిరి సిట్టింగ్ స్థానాల్లో మళ్లీ కాంగ్రెస్‌దే గెలుపు



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి మిశ్రమ ఫలితాలనిచ్చినా, వ్యక్తిగతంగా సీఎం రేవంత్‌రెడ్డికి మాత్రం నిరాశను మిగిల్చాయి. సీఎం హోదాలో ఉన్న రేవంత్ సొంత లోక్‌సభ నియోజకవర్గమైన మహబూబ్‌నగర్‌లోనూ, సిట్టింగ్ స్థానమైన మల్కాజ్‌గిరిలోనూ కాంగ్రెస్ పార్టీ ఓటమి పాలైంది. పాలమూరులో గెలుపు కోసం ఆయన సర్వశక్తులు ఒడ్డినా స్వల్ప తేడాతో పార్టీ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డి ఓడిపోవడం, సిట్టింగ్ స్థానం మల్కాజ్‌గిరిలో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఏకంగా దాదాపు 4లక్షల ఓట్ల మెజారిటీతో గెలుపొందడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా చాలాసార్లు మహబూబ్‌నగర్‌కు వెళ్లిన రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ సొంత స్థానంలో తనను ఓడించి రాజకీయంగా బలహీనపర్చేందుకు కుట్రలు పన్నుతున్నారని వ్యాఖ్యానించారు. వంశీని గెలిపించేందుకు పలు హామీలనిస్తూ కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల లాంటి పథకాలను ప్రకటించారు. అయినా ఫలితం లేకపోవడంతో రేవంత్ శిబిరం ఒకింత నైరాశ్యంలో మునిగిపోయింది. అయితే, ఈ స్థానం నుంచి గెలుపు కాంగ్రెస్, బీజేపీల మధ్య దోబూచులాడడం, బీజేపీ అభ్యర్థి డీకే.అరుణకు గట్టిపోటీ ఇస్తూ చాలా తక్కువ తేడాతో ఓడిపోవడం మాత్రం కొంత ఊరట కలిగించింది. ఇక, మల్కాజ్‌గిరిలో భారీ ఓటమి కూడా రేవంత్ శిబిరానికి మింగుడుపడని విషయమేనని రాజకీయ నిపుణులు చెబుతున్నారు. తాను ప్రాతినిధ్యం వహించిన స్థానంలో, తాను కోరి తెచ్చిన అభ్యర్థి దాదాపు 4లక్షల ఓట్ల తేడాతో ఓడిపోవడం కాంగ్రెస్ అధిష్టానం వద్ద రేవంత్ వ్యక్తిగత ఇమేజ్‌ను ఎంతోకొంత నష్టపరుస్తుందని భావిస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ సిట్టింగ్ స్థానాలైన నల్లగొండ, భువనగిరిల్లో మళ్లీ ఆ పార్టీ అభ్యర్థులు గెలుపొందారు. నల్లగొండలో 5.5లక్షలు, భువనగిరిలో 2.1లక్షల ఓట్ల మెజారిటీతో ప్రత్యర్థులను చిత్తు చేసిన కాంగ్రెస్ ఆ రెండు సిట్టింగ్ స్థానాలనూ నిలబెట్టుకోవడం గమనార్హం.


నాగర్ కర్నూల్ ఎంపీగా గెలిచిన మల్లు రవిని అభినందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. చిత్రంలో మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు

హస్తం... పదిలం

సాక్షి, హైదరాబాద్: ఈ ఎన్నికలు మా పాలనకు రెఫరెండం.. లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్య ఇది. దీనిని సమర్థించుకునేందుకు వీలుగా మిగిలిన అన్ని పార్టీల కంటే ఎక్కువ ఓట్లే కాంగ్రెస్ సాధించగలిగింది. అయితే రేవంత్ విశ్వాసానికి తగిన స్థాయిలో గెలుపు సాధ్యం కాకపోయినా కాంగ్రెస్ పార్టీ ఓట్లు మాత్రం పదిలంగానే ఉన్నాయని లోక్‌సభ ఫలితాల సరళి స్పష్టం చేస్తోంది. కాంగ్రెస్ గెలిచిన చోట్ల భారీ మెజార్టీలనే సాధించగలిగింది. నల్లగొండ, ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్, భువనగిరి, పెద్దపల్లిల్లో లక్ష నుంచి ఐదున్నర లక్షల మెజార్టీ సాధించగా, నాగర్‌కర్నూల్‌లో లక్షకు దగ్గరగా, జహీరాబాద్‌లో మాత్రం అత్యల్పంగా 50 వేల లోపు తేడాతో గెలిచింది. ఇక మహబూబ్‌నగర్, మెదక్‌లలో స్వల్ప తేడాతోనే ఓడిపోయింది. మరోవైపు దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ గెలిచిన స్థానాల్లో అతిపెద్ద మూడో మెజార్టీని నల్లగొండ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి సాధించగా, ఆ స్థానం పరిధిలోనికి వచ్చే హుజూర్‌నగర్‌లో రాష్ట్రంలోనే అత్యధికంగా ఏకంగా 1.05 లక్షల పైచిలుకు మెజార్టీ రావడం గమనార్హం. అక్కడ ఇన్‌చార్జిగా మంత్రి, సిట్టింగ్ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యవహరించడం తెలిసిందే.

అసెంబ్లీ స్థాయిలోనే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓట్లు

కంచుకోట జిల్లాల్లో అవే ఫలితాలు.. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్‌లలో భారీ మెజార్టీలు

దేశంలో ధుబ్రీ, తిరువల్లూర్ తర్వాత కాంగ్రెస్‌కు అత్యధిక మెజార్టీ నల్లగొండలోనే


గాంధీభవన్ వద్ద డోలు వాయిస్తున్న వీహెచ్ తదితరులు

కోటలు బీటలు వారకుండా..

అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన విజయానికి ఎక్కడా తీసిపోకుండా లోక్‌సభ ఎన్నికల్లోనూ విజయతీరాలను చేరడంతో కాంగ్రెస్ పార్టీ కేడర్ ఊపిరి పీల్చుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు దోహదపడిన కంచు కోటలకు ఎక్కడా బీటలు వారకుండా లోక్‌సభ ఎన్నికల్లోనూ ఓట్లను రాబట్టుకోగలిగింది. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో 36 అసెంబ్లీ స్థానాలుండగా, అందులో 34 చోట్ల ఎమ్మెల్యేలుగా కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు. ఇప్పుడు ఆ మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలోనికి వచ్చే నల్లగొండ, భువనగిరి, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్ లోక్‌సభ స్థానాల్లోనూ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. దాదాపు అసెంబ్లీలో సాధించిన స్థాయిలోనే ఆయా నియోజకవర్గాల్లో ఓట్లను రాబట్టుకోగలిగింది. పెద్దపల్లి పార్లమెంటు పరిధిలోని పెద్దపల్లి, రామగుండం, ధర్మపురి, చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల, మంథని స్థానాల్లో గత అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందగా, ఇప్పుడు కూడా ఆ పార్లమెంటులో మంచి మెజార్టీతో కాంగ్రెస్ విజయం సాధించింది. ఇక మహబూబ్‌నగర్, కరీంనగర్ జిల్లాల్లో బీజేపీతో హోరాహోరీ తలపడిన కాంగ్రెస్ అక్కడ కూడా మంచి విజయాలనే సాధించగలిగింది. నాగర్‌కర్నూల్‌లో 94 వేల ఓట్లు, పెద్దపల్లిలో 1.3 లక్షల ఓట్లతో గెలిచిన కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానాన్ని కేవలం ఐదువేల లోపు ఓట్ల తేడాతో కోల్పోయింది.

కరీంనగర్‌లో భారీ తేడాతో ఓటమి

కరీంనగర్ లోక్‌సభ స్థానాన్ని మాత్రం భారీ తేడాతో పోగొట్టుకున్న కాంగ్రెస్ పార్టీ, అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభావం చూపలేకపోయిన మెదక్ పార్లమెంటు స్థానంలో మాత్రం రెండో స్థానానికి చేరుకోగలిగింది. ఇక్కడ కేవలం 40 వేల ఓట్ల తేడాతో మాత్రమే కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ పరాజయం పాలయ్యారు. మొత్తం మీద మహబూబ్‌నగర్, మెదక్ స్థానాల్లో గెలుపు అంచుల వద్ద బోల్తా పడ్డామని, లేదంటే తాము ఆశించిన డబుల్ డిజిట్ స్థానాలు వచ్చేవనే అభిప్రాయం కాంగ్రెస్ నేతల్లో వ్యక్తమవుతోంది.

గాంధీభవన్‌లో సంబురాలు

రాష్ట్రంలో, దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఆశించిన సీట్లు గెలవడంతో బాణాసంచా మోత

సాక్షి, హైదరాబాద్: ఇటు తెలంగాణలో, అటు దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆశించిన స్థాయిలో విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణులు గాంధీభవన్‌లో సంబురాలు చేసుకున్నాయి. తెలంగాణలో 8 ఎంపీ స్థానాల్లో గెలవడం, కంటోన్మెంట్ అసెంబ్లీకి జరిగిన ఉప ఎన్నికల్లో గెలుపొందడంతో డప్పులు మోగిస్తూ, బాణాసంచా కాల్చుకుంటూ, స్వీట్లు పంపిణీ చేసి తమ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సంబురాల్లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, పార్టీ నేతలు హర్కర వేణుగోపాల్, ఫహీం ఖురేషీ, రోహిణ్‌రెడ్డి, మెట్టుసాయికుమార్, సంగిశెట్టి జగదీశ్వరరావు పాల్గొన్నారు.

తప్పిదాలు సరిదిద్దుకుంటాం: మహేశ్‌కుమార్

గాంధీభవన్‌లో మహేశ్‌కుమార్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ ఇటు తెలంగాణలో, అటు దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి ఓటేసిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు రేవంత్ పాలనపై ప్రజలకున్న నమ్మకానికి అద్దం పడుతుందన్నారు. తాము చెప్పినట్టుగా లోక్‌సభ ఎన్నికలను రెఫరెండంగానే భావిస్తున్నామని, గత అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల కంటే ఈ లోక్‌సభ ఎన్నికల్లో తమకు ఎక్కువ ఓట్లు వచ్చాయని, అంటే ప్రజల్లో తమపై విశ్వాసం పెరిగినట్టేనని చెప్పారు. తన కంటిని తన వేలుతో పొడుచుకున్నట్టు స్వయంకృతాపరాధంతో బీజేపీని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గెలిపించారని, ఆ రెండు పార్టీల మధ్య కుదిరిన లోపాయికారీ ఒప్పందంతోనే బీజేపీ 8 స్థానాల్లో గెలవగలిగిందని చెప్పారు.

మోదీని ప్రజలు తిరస్కరించారు: వీహెచ్

మాజీ ఎంపీ వి.హనుమంతరావు మాట్లాడుతూ నరేంద్ర మోదీ పదేళ్లలో ఏమీ చేయలేదని, ప్రజలకిచ్చిన హామీలు నిలబెట్టుకోలేదన్నారు. ఇస్‌బార్ చార్‌సౌ పార్ అన్న మోదీని ప్రజలు తిరస్కరించారన్నారు. తుది విడత పోలింగ్ పూర్తయిన తర్వాత వచ్చిన ఎగ్జిట్‌పోల్స్ చూస్తే రాత్రి తనకు నిద్ర పట్టలేదని, గోడీ మీడియా ఎంత ఊదరగొట్టినా ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించారని చెప్పారు. ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ మోదీ గ్యారంటీ ఎక్స్‌పైరీ అయిందని, మోదీ ప్రధాని పదవికి నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

వికసించిన కమలం

ఈసారి అత్యధికంగా 8 ఎంపీ సీట్లలో గెలిచి సొంత రికార్డు

ఉమ్మడి ఏపీలో 1999 లోక్‌సభ ఎన్నికల్లో టీడీపీతో పొత్తులో ఏడు ఎంపీ స్థానాల్లో గెలుపే ఇప్పటిదాకా ఆ పార్టీ అధిక స్థానాలు

సాక్షి, హైదరాబాద్: ఎనిమిది ఎంపీ స్థానాల్లో గెలిచి బీజేపీ సత్తా చాటింది. ఉమ్మడి ఏపీలో చూసినా, తెలంగాణలో చూసినా ఇవే మెజారిటీ స్థానాలు. ఈ ఎన్నికల్లో కచ్చితంగా డబుల్ డిజిట్ సీట్లు సాధిస్తామని అటు అగ్రనేతలు మోదీ, అమిత్‌షా మొదలు రాష్ట్రనేతలు కిషన్ రెడ్డి, కె.లక్ష్మణ్ పేర్కొన్నా, రెండెంకెల సీట్లను మాత్రం సాధించలేకపోయింది. అయితే అధికార కాంగ్రెస్‌కు బీజేపీ గట్టి పోటీ ఇచ్చింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకల్లా కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు బలమైన ప్రత్యామ్నాయంగా బీజేపీనే ఎదుగుతుందనే ధీమాను ఆ పార్టీనేతలు వ్యక్తం చేస్తున్నారు. కాగా, లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ మంచి ఫలితాలు సాధించడంతో నాంపల్లిలోని పార్టీ కార్యాలయం వద్ద బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంబురాలు చేసుకున్నారు. మరోవైపు మంగళవారం ఉదయం చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఎంపీగా గెలిచినట్టుగా రిటర్నింగ్ ఆఫీసర్ నుంచి ధృవీకరణ పత్రాన్ని అందుకున్నారు.


నాంపల్లిలోని బీజేపీ కార్యాలయం వద్ద జోరువానలో కార్యకర్తల సంబురాలు

రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ప్రదర్శన ఇలా ఉంది

2014 అసెంబ్లీ/లోక్‌సభ	2018 అసెంబ్లీ	2019 లోక్‌సభ
05 - 01	01	04

2023 అసెంబ్లీ - 08 | 2024 లోక్‌సభ - 08

- 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సొంతంగా పోటీచేయగా, జి.కిషన్‌రెడ్డి (సికింద్రాబాద్), బండి సంజయ్ (కరీంనగర్), అర్వింద్ ధర్మపురి (నిజామాబాద్), సోయం బాపూరావు (ఆదిలాబాద్)గెలిచారు.
- 2024 పార్లమెంట్ ఎన్నికల్లో 4 సిట్టింగ్ స్థానాలకు తోడు (ఆదిలాబాద్‌లో సోయం బాపూరావు స్థానంలో గోడెం నగేష్), అదనంగా 4 చోట్ల ఈటల రాజేందర్(మల్కాజిగిరి), డీకే అరుణ (మహబూబ్‌నగర్), కొండా విశ్వేశ్వర్‌రెడ్డి (చేవెళ్ల), ఎం.రఘునందన్‌రావు (మెదక్) గెలిచారు.
- 1980లో బీజేపీ ఏర్పడ్డాక...ఉమ్మడి ఏపీలో జరిగిన 1999 అసెంబ్లీ/లోక్‌సభ ఎన్నికల్లో టీడీపీతో పొత్తులో అత్యధికంగా 12 ఎమ్మెల్యే, 7 ఎంపీ సీట్లు (అందులో నాలుగు తెలంగాణ నుంచి) గెలుపొందారు. బీజేపీ గెలిచిన అత్యధిక సీట్లు అవే.
- 2023 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 8 అసెంబ్లీ స్థానాల్లో గెలుపొందినా...ఇప్పుడు జరిగిన ఎంపీ ఎన్నికల్లో...ఒక్క తెలంగాణ నుంచే అత్యధికంగా 8 ఎంపీ సీట్లలో గెలిచి గత రికార్డులను బ్రేక్ చేసింది.
- 1984లో ప్రధాని ఇందిరాగాంధీ హత్యకు గురైన తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా బీజేపీ రెండే రెండు సీట్లలో గెలుపొందింది. అందులో ఒకటి ఉమ్మడి ఏపీ హనుమకొండ స్థానం. ఇక్కడి నుంచి మాజీ కేంద్రమంత్రి పీవీ నరసింహారావును చందుపట్ల జంగారెడ్డి ఓడించారు. మరో స్థానంలో గుజరాత్‌లోని మెహసినా నుంచి ఏకే పాటిల్ గెలిచారు.
- ఉమ్మడి ఏపీలో జరిగిన 1998 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగా పోటీచేసి సికింద్రాబాద్ నుంచి బండారు దత్తాత్రేయ, కరీంనగర్ నుంచి సీహెచ్ విద్యాసాగరరావు, కాకినాడ నుంచి సినీనటుడు కృష్ణంరాజు, రాజమండ్రి నుంచి గిరిజాల వెంకటస్వామి నాయుడు గెలిచారు.
- 1999 ఎన్నికల నాటికి టీడీపీ కలిసి బీజేపీ పోటీ చేయగా, సికింద్రాబాద్ నుంచి బండారు దత్తాత్రేయ, కరీంనగర్ నుంచి సీహెచ్ విద్యాసాగరరావు, మెదక్ నుంచి ఆలె నరేంద్ర, మహబూబ్‌నగర్ నుంచి ఏపీ జితేందర్‌రెడ్డి, రాజమండ్రి నుంచి ఎస్‌బీపీబీకే సత్యనారాయణ, నరసాపురం నుంచి ఉప్పలపాటి కృష్ణంరాజు, తిరుపతి నుంచి వెంకటస్వామి గెలుపొందారు.

తెలంగాణ వచ్చాక...

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత జరిగిన అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఎన్నో ఎగుడు దిగుళ్లను చవిచూసింది.

- 2014 అసెంబ్లీ/లోక్‌సభ ఎన్నికల్లో టీడీపీతో కలిసి పోటీ చేసింది. 7% ఓట్లతో 5 ఎమ్మెల్యే, ఒక ఎంపీ సీట్లో బీజేపీ గెలుపొందింది.
- 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం ఒకసీటు గెలిచి 105 స్థానాల్లో డిపాజిట్లు గల్లంతయ్యింది. ఆ ఎన్నికల్లో కేవలం ఏడుశాతం ఓటింగ్ సాధించింది.
- 2019 లోక్‌సభ ఎన్నికల్లో సొంతంగా 4 ఎంపీ సీట్లు గెలుపొంది గణనీయంగా 19 శాతం ఓటింగ్‌ను సాధించి బీజేపీ సత్తా చాటింది. వరుసగా బీజేపీ బలం పుంజుకోవడంతోపాటు అధికార బీఆర్ఎస్‌తో నువ్వా నేనా అన్నట్టుగా దుబ్బాక, హుజురాబాద్ ఉప ఎన్నికల్లో తలపడి బీజేపీ అభ్యర్థులు ఎం.రఘునందన్‌రావు, ఈటల రాజేందర్ గెలుపొందారు. మునుగోడు ఉప ఎన్నికల్లో విజయం దగ్గర దాకా చేరుకొని 12 వేల ఓట్ల తేడాతో బీజేపీ అభ్యర్థి కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి ఓటమి పాలయ్యారు.
- 2020 డిసెంబర్‌లో జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికల్లో 48 మంది కార్పొరేటర్లు గెలుపొందడం ద్వారా బీజేపీ సంచలనం సృష్టించింది. అంతకు ముందు ఆ పార్టీకి నలుగురు మాత్రమే కార్పొరేటర్లు ఉండగా ఏకంగా వారి సంఖ్య 48కు చేరుకుంది.
- ఆ తర్వాత మొదటిసారిగా పార్టీ బీ ఫామ్‌పై టీచర్ ఎమ్మెల్సీ స్థానం (గతేడాది మార్చిలో జరిగిన ఎన్నికల్లో) నుంచి ఏవీఎన్‌రెడ్డి సంచలన విజయం సాధించారు.
- 2023 నవంబర్ అసెంబ్లీ ఎన్నికల్లో.14 శాతం ఓటింగ్‌తో 8 ఎమ్మెల్యే సీట్లలో విజయం సాధించింది.
- 2024 మేలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 35.08 శాతం ఓటింగ్‌తో 8 ఎంపీ సీట్లలో గెలుపొంది కాషాయ పార్టీ ఆధిక్యతను చాటింది.

ఎమ్మెల్యేగా ఓడి ఎంపీగా గెలిచి..

సత్తా చాటిన ఈటల రాజేందర్, బండి సంజయ్, రఘునందన్‌రావు, అర్వింద్

2018లో ఎమ్మెల్యేగా ఓడి 2019లో ఎంపీగా గెలిచిన కిషన్‌రెడ్డి

అదే కోవలో ఎమ్మెల్యేగా ఓడి ఎంపీగా గెలిచిన రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: శాసనసభ్యుడిగా పోటీచేసి ఓటమి చవిచూశాక, మళ్లీ పార్లమెంట్ అభ్యర్థిగా బరిలో దిగి ఎంపీలుగా గెలిచి సంచలనం సృష్టించిన వారి సంఖ్య ఈ సారి పెరిగింది. తాజాగా ప్రకటించిన లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో.. బీజేపీ నుంచి ఏకంగా నలుగురు ఎంపీలుగా గెలుపొందారు. 2023 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్, గజ్వేల్‌ల నుంచి పోటీ చేసి ఓడి, పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి నుంచి ఎంపీగా ఈటల రాజేందర్, అప్పటికే ఎమ్మెల్యేగా ఉన్న రఘునందన్‌రావు శాసనసభ ఎన్నికల్లో ఓడి మళ్లీ జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మెదక్ నుంచి విజయం సాధించారు. అదేవిధంగా అప్పటికే సిట్టింగ్ ఎంపీలుగా ఉంటూ అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ నుంచి బండి సంజయ్, కోరుట్ల నుంచి ధర్మపురి అర్వింద్ ఓటమి చెందాక పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ నుంచి సంజయ్, నిజామాబాద్ నుంచి అర్వింద్ ఎంపీలుగా గెలుపొంది సత్తా చాటారు. అలాగే 2018 అసెంబ్లీ ఎన్నికల్లో అంబర్‌పేట నుంచి ఓడిన బీజేపీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి, 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీగా గెలిచి మొదట కేంద్రహోంశాఖ సహాయ మంత్రి, ఆ తర్వాత కేంద్రమంత్రిగా ఆయన ప్రమోషన్ పొందారు. తాజాగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మళ్లీ సికింద్రాబాద్ నుంచి కిషన్‌రెడ్డి విజయం సాధించారు. ఇదే ఒరవడిలో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నుంచి ఓడిన కాంగ్రెస్‌నేత, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి, ఆ వెంటనే జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజిగిరి నుంచి ఎంపీగా గెలిచారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నుంచి రేవంత్‌రెడ్డి గెలిచి ముఖ్యమంత్రి అయిన విషయం తెలిసిందే. అదేవిధంగా 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఓడి ఆ తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎంపీగా విజయం సాధించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో నల్లగొండ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి ప్రస్తుతం రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో ఆయన మంత్రిగా కొనసాగుతున్న సంగతి విదితమే.

బీజేపీకి ఎనిమిది సీట్లు ఎలా?

సాక్షి, న్యూఢిల్లీ:

తెలంగాణ ఫలితాలపై కాంగ్రెస్ అధిష్టానం విస్మయం

- కాంగ్రెస్‌తో సమానంగా బీజేపీకి మెజార్టీ స్థానాలు దక్కడంపై కలవరం

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అనుకున్న లక్ష్యాలకు పూర్తి భిన్నంగా ఫలితాలు రావడంపై ఆ పార్టీ హైకమాండ్ విస్మయం వ్యక్తం చేసింది. ఆరు నెలల కిందటే అధికారంలోకి వచ్చిన రాష్ట్రంలో ఆశించిన స్థాయిలో సీట్లు రాకపోవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేసింది. మొత్తం 17 సీట్లకు గానూ 14 సీట్లు వస్తాయని భావించినా, కేవలం 8 సీట్లు రావడం, అంతగా క్షేత్రస్థాయి బలం లేని బీజేపీ ఏకంగా 8 స్థానాలను గెలవడం పార్టీ పెద్దలను కలవరానికి గురి చేసింది. రాష్ట్ర ప్రభుత్వంపై ఈ ఫలితాల ప్రభావం పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు రాష్ట్ర నేతలతో పూర్తి స్థాయి సమీక్ష నిర్వహించే అవకాశాలున్నాయని ఏఐసీసీ వర్గాల ద్వారా తెలుస్తోంది.

సీఎం సొంత జిల్లాలోనూ ఓటమా?

తెలంగాణలో ప్రస్తుత ఎన్నికల్లో కనీసంగా 14 సీట్లు గెలవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా ముఖ్య నేతలను కాంగ్రెస్ హైకమాండ్ ఆదేశించింది. దీనికి అనుగుణంగా ప్రణాళికలు ఉండాలని సూచించింది. హైకమాండ్ సూచనల మేరకు కాంగ్రెస్ పార్టీ తన కార్యాచరణను రూపొందించుకొని అభ్యర్థుల ఎంపిక మొదలు ప్రచారం, బూత్, పోల్ మేనేజ్‌మెంట్ బాధ్యతలకు మంత్రులకు కట్టబెట్టింది. ఇందులో భాగంగా సీఎం స్వయంగా తన సొంత జిల్లా మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఇంచార్జిగా వ్యవహరించారు. ఆ జిల్లాలోనే పకడ్బందీగా వ్యవహరించినప్పటికీ ఏఐసీసీ కార్యదర్శి, అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి ఓటమి పాలవ్వడంపై హైకమాండ్ నేతలు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. లోక్‌సభ పరిధిలో ఏడుకు ఏడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలే ఉన్నప్పటికీ అభ్యర్థి ఓడటంపై వారు స్వయంగా ముఖ్యమంత్రినే ఆరా తీసినట్లు తెలిసింది.


మల్కాజిగిరిలో బీజేపీకి 3లక్షలు మెజారిటీనా?

ఇక గతంలో సీఎం రేవంత్ స్వయంగా గెలిచిన మల్కాజ్‌గిరి నియోజకవర్గంలోనూ కాంగ్రెస్ ఓడటం,, బీజేపీ అభ్యర్థికి ఏకంగా 3 లక్షల పైచిలుకు మెజార్టీ రావడంపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ రాష్ట్ర ముఖ్య నేతలను ప్రశ్నించినట్లు సమాచారం. కేవలం ఆరు నెలల వ్యవధిలో ఇంతమార్పు ఎందుకు జరిగింది?, పార్టీ నేతల మధ్య సమన్వయం లేదా?,మరే ఇతర కారాణాలున్నాయా? అని ఆయన ఆరా తీసినట్లు తెలిసింది. చాలామంది రాష్ట్ర నేతలు బీజేపీ గాలి వీచిందని చెప్పగా, అభ్యర్థుల ఎంపికలో తొందరపాటు నిర్ణయాలు ఉన్నాయని మరికొందమంది చెప్పినట్లుగా చెబుతున్నారు. ముఖ్యంగా చేవెళ్ల, మల్కాజ్‌గిరి, కరీంనగర్, సికింద్రాబాద్ నియోజకవర్గాల పరిధిలో అభ్యర్థుల ఎంపిక పూర్తి ఏకపక్షంగా జరిగిందనే వాదనను కొందరు తెరపైకి తెచ్చినట్లు తెలిసింది.

ఫలితాలపై మూడ్రోజుల్లో పూర్తి స్థాయి సమీక్ష

రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై పార్టీ హైకమాండ్ మూడు, నాలుగు రోజుల్లో పూర్తి స్థాయి సమీక్ష నిర్వహించే అవకాశం ఉందని సమాచారం. లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ల శాతం, సీట్ల సంఖ్యను బీజేపీ పెంచుకున్న నేపథ్యంలో ఈ ప్రభావం రాష్ట్ర ప్రభుత్వంపై పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర ముఖ్య నేతలతో ఏఐసీసీ పెద్దలు సమావేశం నిర్వహించే అవకాశం ఉందని తెలిసింది.

అద్భుత విజయాన్ని అందించిన ఓటర్లకు ధన్యవాదాలు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



సాక్షి, హైదరాబాద్: దేశం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించి అద్భుతమైన విజయాన్ని అందించిన ఓటర్లకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ధన్యవాదాలు తెలిపారు. రికార్డు స్థాయి మెజారిటీ సాధించేందుకు కృషి చేసిన కాంగ్రెస్ శ్రేణులకు ఆయన మంగళవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఈ దేశంలో స్వతంత్రాన్ని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే కాంగ్రెస్ పార్టీకి, ఇండియా కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ, రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఇచ్చిన పిలుపునకు స్పందించినందుకు భట్టి ధన్యవాదాలు తెలిపారు.

20 ఏళ్ల తర్వాత తొలిసారి

లోక్‌సభలో బీఆర్ఎస్‌కు దక్కని ప్రాతినిధ్యం

ఎన్నికల్లో ఒక్క సీటూ గెలవని గులాబీ పార్టీ

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో భారత్ రాష్ట్ర సమితి పార్టీ ఆవిర్భావం తర్వాత ఎన్నడూ లేని రీతిలో పరాజయాన్ని చవిచూసింది. రాష్ట్రంలోని మొత్తం 17 స్థానాల్లోనూ ఓటమి పాలయ్యింది. 2004 లోక్‌సభ ఎన్నికల్లో తొలిసారిగా బరిలోకి దిగిన బీఆర్ఎస్ సరిగ్గా 20 ఏళ్ల తర్వాత లోక్‌సభలో ప్రాతినిధ్యాన్ని కోల్పోయింది. 2004 ఎన్నికల్లో (14వ లోక్‌సభ) ఐదు, 2009లో 2, 2014లో 11, 2019లో 9 స్థానాలు సాధించింది. గత ఏడాది జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్.. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో రెండంకెల స్థానాలు సాధించడం లక్ష్యంగా సర్వశక్తులూ ఒడ్డింది. కానీ ఒక్క స్థానంలో కూడా విజయం సాధించలేక పోయింది. చివరకు పార్టీకి పట్టు ఉన్న మెదక్ సెగ్మెంటు సహా గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆధిక్యాన్ని సాధించిన మరో ఏడు లోక్‌సభ నియోజకవర్గాల్లో సైతం పార్టీ అభ్యర్థులు ప్రభావం చూపలేకపోయారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు బస్సుయాత్రతో 13 లోక్‌సభ సెగ్మెంట్లను చుట్టి వచ్చినా ఫలితం లేకుండా పోయింది. స్టార్ క్యాంపెయినర్లుగా ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మాజీ మంత్రి హరీశ్‌రావు సుడిగాలి ప్రచారం చేసినా ఎన్నికల ఫలితాలు పూర్తిగా నిరాశకే గురి చేశాయి. మరోవైపు గత అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో కూడా పార్టీ పరాజయం పాలైంది.

అసెంబ్లీ ఫలితాలతో అప్రమత్తమైనా..

గత ఏడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి దృష్టిలో పెట్టుకుని జనవరి మొదటి వారం నుంచే ఓటమిపై సమీక్ష పేరిట లోక్‌సభ ఎన్నికలకు బీఆర్ఎస్ సన్నద్ధతను ప్రారంభించింది. కేటీఆర్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశాల్లో కేడర్‌కు దిశానిర్దేశం చేశారు. మరోవైపు కేఆర్ఎంబీకి కృష్ణా జలాల అప్పగింతను నిరసిస్తూ నల్లగొండలో నిర్వహించిన భారీ బహిరంగ సభకు.. కేసీఆర్ ఊతకర్ర సాయంతో (కేసీఆర్ ఇంట్లో ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే) హాజరయ్యారు. ఎండిన పంట పొలాల పరిశీలనకు పొలం బాట పేరిట ఉమ్మడి నల్లగొండ, వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో బస్సుయాత్ర చేశారు. మరోవైపు 'చలో మేడిగడ్డ' పేరిట కేటీఆర్, హరీశ్‌ల నేతృత్వంలో బీఆర్ఎస్ కీలకనేతలందరూ ప్రాజెక్టును సందర్శించారు. పార్టీ కేడర్‌లో స్థైర్యం నింపే ప్రయత్నం చేశారు. మార్చి మొదటి వారం నుంచే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై కేసీఆర్ దృష్టి పెట్టారు. అదే సమయంలో ఎన్నికల సన్నద్ధతను వేగవంతం చేసేందుకు మార్చి 12న 'కరీంనగర్ కదనభేరి' సభను నిర్వహించారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసే సమయంలో చేవెళ్లలో భారీ బహిరంగ సభ నిర్వహించి ప్రచారానికి శ్రీకారం చుట్టారు.

సిట్టింగ్ ఎంపీలు పార్టీకి దూరం

లోక్‌సభ ఎన్నికల సన్నద్ధత, అభ్యర్థుల ఎంపికపై కేసీఆర్, కేటీఆర్ సెగ్మెంట్ల వారీగా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్న సమయంలోనే పలువురు బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీలు పార్టీని వీడి కాంగ్రెస్ లేదా బీజేపీలో చేరారు. 9 మంది సిట్టింగ్ ఎంపీలకు గాను కేవలం ముగ్గురు మాత్రమే తిరిగి లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీ చేశారు. కొత్త ప్రభాకర్‌రెడ్డి దుబ్బాక ఎమ్మెల్యేగా ఎన్నిక కాగా, మన్నె శ్రీనివాస్ రెడ్డి (మహబూబ్‌నగర్), మాలోత్ కవిత (మహబూబాబాద్), నామా నాగేశ్వర్‌రావు (ఖమ్మం) మాత్రమే తిరిగి పోటీ చేశారు. వెంకటేశ్ నేత (పెద్దపల్లి), పి.రాములు (నాగర్‌కర్నూలు), బీబీ పాటిల్ (జహీరాబాద్), రంజిత్‌రెడ్డి (చేవెళ్ల), పసునూరు దయాకర్ (వరంగల్) బీఆర్ఎస్‌కు దూరమయ్యారు. పార్టీ టికెట్ ఖరారు చేసినా రంజిత్‌రెడ్డి, పి.రాములు, బీబీ పాటిల్ పార్టీకి దూరమవడం పార్టీ కేడర్ నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసింది. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావుతో పాటు రాజ్యసభ ఎంపీ కె.కేశవరావు, మాజీ ఎమ్మెల్యేలు ఇంద్రకరణ్‌రెడ్డి, కోనప్ప, పట్నం మహేందర్‌రెడ్డి, సైదిరెడ్డి తదితరులు కాంగ్రెస్ లేదా బీజేపీలోకి వలస వెళ్లడం కూడా బీఆర్ఎస్‌పై ప్రభావం చూపింది. ఇలా బీఆర్ఎస్ నుంచి బయటకు వెళ్లిన 9 మందికి బీజేపీ, కాంగ్రెస్‌లు ఎంపీ టికెట్లు ఇచ్చాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా పోటీ చేశారు.


బోసిపోయిన తెలంగాణ భవన్

కవిత అరెస్టుతో విమర్శలు

బీఆర్ఎస్ లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతపై దృష్టి కేంద్రీకరించిన సమయంలోనే ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఢిల్లీ మద్యం కుంభకోణంలో అరెస్టు అయ్యారు. దీంతో బీఆర్ఎస్ తీవ్ర విమర్శలను ఎదుర్కోవాల్సి వచ్చింది. కాంగ్రెస్, బీజేపీ ఈ అంశాన్ని ఎన్నికల ప్రచారంలో ప్రస్తావించాయి. ఇక బస్సు యాత్ర కొనసాగుతున్న సమయంలోనే కేసీఆర్ ప్రచారంపై ఎన్నికల సంఘం 48 గంటల నిషేధాన్ని విధించింది. సిరిసిల్లలో కాంగ్రెస్ నేతలపై చేసిన వ్యాఖ్యలపై ఆ పార్టీ ఫిర్యాదు చేసిన నేపథ్యంలో కేసీఆర్ ప్రచారానికి దూరంగా ఉండాల్సి వచ్చింది. బస్సు యాత్రకు జనం స్పందన భారీగా రావడంతో లోక్‌సభ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధిస్తామనే ధీమా బీఆర్ఎస్ శిబిరంలో కనిపించినా చివరకు పూర్తిస్థాయిలో పరాజయాన్ని మూటగట్టుకుంది. వాస్తవానికి ఎన్నికల ఫలితాలు ఆశించిన రీతిలో రావడం లేదని రాష్ట్ర అవతరణ వేడుకల సందర్భంగా కేసీఆర్ సంకేతాలు ఇచ్చారు.

మూడో స్థానంతో నిరాశ

కానీ బీఆర్ఎస్‌కు మాత్రం లోక్‌సభ ఫలితాలు తీవ్ర నిరాశను మిగిల్చాయి. సికింద్రాబాద్ నుంచి బరిలో నిలిచిన పద్మారావు గౌడ్, బాజిరెడ్డి గోవర్దన్ (నిజామాబాద్), ఆర్ఎస్. ప్రవీణ్‌కుమార్ (నాగర్ కర్నూల్), పి.వెంకట్రామిరెడ్డి (మెదక్). ఆత్రం సక్కు (ఆదిలాబాద్) లాంటి నేతలు కూడా మూడో స్థానానికి పడిపోయారు. మహబూబాబాద్, ఖమ్మం మినహా అన్ని చోట్లా మూడో స్థానానికి పడిపోయిన బీఆర్ఎస్, హైదరాబాద్‌లో 4వ స్థానంలో నిలిచింది. సిట్టింగ్ ఎంపీలుగా ఉన్న మాలోతు కవిత (మహబూబాబాద్), నామా నాగేశ్వరరావు (ఖమ్మం)లు మాత్రమే రెండో స్థానంలో ఉండి కొంత పోటీ ఇవ్వగలిగారు. గత ఫలితాలతో పోలిస్తే 3 స్థానాలున్న కాంగ్రెస్ బలం 8 స్థానాలకు పెరగ్గా, గతంలో 4 సీట్లు గెలిచిన బీజేపీ ఇప్పుడు రెట్టింపు స్థానాల్లో విజయం సాధించింది. ఇక, పోటీ చేసిన 17 స్థానాల్లో 8 చోట్ల గెలుపొందిన కాంగ్రెస్ పార్టీ, 8 చోట్ల రెండో స్థానంలో, ఒక్కచోట మాత్రం మూడోస్థానంలో నిలిచింది.

పేదల గొంతుకై నిలుస్తాం

ఫలితాలు ఆశ్చర్యం కలిగించాయి.. ప్రతిపక్షం.. పోరాటం.. కొత్తేమీ కాదు: వైఎస్ జగన్

ఎవరో మోసం చేశారు, ఎవరో అన్యాయం చేశారు.. అని అనొచ్చు. కానీ ఆధారాలు లేవు. ఏం జరిగిందో దేవుడికి తెలుసు. నేనైతే చేయగలిగిందేమీ లేదు. ప్రజల తీర్పు తీసుకుంటాను. మంచి చేయడానికి మాత్రం కచ్చితంగా ప్రజలకు తోడుగా ఉంటాం. వాయిస్ ఆఫ్ ది వాయిస్ లెస్ కింద ఈ పార్టీ తాను చేయాల్సిన పని తప్పకుండా చేస్తుంది. పేదవాడికి అండగా ఉండే కార్యక్రమంలో ఎప్పుడూ పేదవాడికి తోడుగా ఉంటూ గళం విప్పుతుంది. పెద్దపెద్ద వాళ్ల కూటమి ఇది. ఢిల్లీలో సైతం శాసించే పరిస్థితులు ఉన్న కూటమి ఇది. ఈ కూటమిలో ఉన్న బీజేపీ, చంద్రబాబుకు, పవన్ కల్యాణ్‌కు, అందరికీ కూడా వాళ్ల గొప్ప విజయానికి అభినందనలు. ఓడిపోయినా, నా ప్రతి కష్టంలో తోడుగా, అండగా నిలబడిన ప్రతి నాయకుడికీ, ప్రతి కార్యకర్తకూ, ప్రతి వలంటీర్‌కు, ప్రతి ఇంట్లో నుంచి వచ్చి స్టార్ క్యాంపెయినర్‌గా నాకు తోడుగా నిలబడిన నా అక్కచెల్లెమ్మలకు, అన్నదమ్ములకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నా.

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: దేశంలో ఏ రాష్ట్రంలో జరగనన్ని సంక్షేమ పథకాలు, ఎక్కడా ఏ పేదవాడికీ దక్కని ప్రయోజనాలు.. అవి నీతికి తావు లేకుండా, నేరుగా వారి గుమ్మం వద్దకే తీసుకువెళ్లే వ్యవస్థను ఏర్పాటు చేసినప్పటికీ ఎందుకిలా జరిగిందో తెలియడం లేదని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఫలితాలన్నీ దాదాపుగా కొలిక్కి వస్తున్నాయి. జరిగిన పరిస్థితులు చూస్తే నిజంగా ఆశ్చర్యంగా ఉంది. ఇలా జరుగుతుందని, ఫలితాలు ఇలా వస్తాయని ఊహించలేదు. పిల్లలు బాగుండాలని, వాళ్ల చదువులు బాగుండాలని తాపత్రయపడుతూ.. అమ్మ ఒడి అందుకున్న 53 లక్షల మంది తల్లులకు మంచి చేశాం. వారికి మంచి చేయాలనే తపనతో అడుగులు వేశాం. మరి ఆ అక్కచెల్లెమ్మల ఓట్లు ఏమయ్యాయో తెలియదు' అన్నారు. '66 లక్షల మంది అవ్వాతాతలకు, వితంతువులకు, వికలాంగులకు గతంలో ఎన్నడూ జరగని విధంగా మంచి చేశాం. వారి కష్టాల్లో తోడుగా ఉంటూ, వారి కష్టాన్ని అర్థం చేసుకుంటూ, వారి ఇంటికే సంక్షేమాన్ని పంపించే వ్యవస్థను సైతం తీసుకువచ్చాం. గతంలో మన ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇస్తున్న చాలీచాలని పెన్షన్ నుంచి.. ఎంతో మంచి చేస్తూ అడుగులు వేసినా కూడా ఆ అవ్వాతాతలు చూపిన ఆప్యాయత ఏమైందో కూడా తెలియడం లేదు' అని ఆవేదన వ్యక్తం చేశారు. 'దాదాపు కోటీ 5 లక్షల మంది పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలకు మంచి చేస్తూ, వారి కష్టాలనే మా కష్టాలుగా భావిస్తూ, ఇచ్చిన ఏ మాటా తప్పకుండా అన్ని రకాలుగా వాళ్లకు అండగా ఉంటూ.. ఆసరా, చేయూతతో తోడున్నాం. సున్నా వడ్డీతో సైతం అండగా నిలిచాం. మరి ఆ కోటీ ఐదు లక్షల అక్కచెల్లెమ్మల ప్రేమాభిమానాలు ఏమయ్యాయో తెలియదు. 26 లక్షల మంది చేయూతను అందుకుంటున్న అక్కచెల్లెమ్మల ఆప్యాయత ఏమైందో తెలియదు' అని అన్నారు. సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

పిల్లల చదువుల కోసం పరితపించాం

'పిల్లల చదువుల కోసం ఏ తల్లీ, తండ్రీ ఇబ్బంది పడకూడదని మొట్టమొదటి సారిగా పూర్తి ఫీజు ఇస్తూ అండగా నిలవడం ద్వారా చదువుల్లో ఎప్పుడూ చూడని మార్పులు తీసుకొచ్చాం. ఏటా దాదాపు 12 లక్షల మందికి మంచి చేశాం. ఆ పిల్లలు, తల్లుల అభిమానం ఏమయ్యిందో తెలియదు. 54 లక్షల మంది రైతన్నలకు గతంలో ఎప్పుడూ చూడని విధంగా, జరగని విధంగా పెట్టుబడికి సహాయం అందించే కార్యక్రమం మన ప్రభుత్వం వచ్చిన తర్వాతే జరిగింది. అంతగా రైతన్నకు తోడుగా ఉంటూ, రైతన్నలకు రైతు భరోసా ఇవ్వడం గానీ, సీజన్ ముగిసేలోగా ఇన్‌పుట్ సబ్సిడీ, ఉచిత ఇన్సూరెన్స్, పగటిపూటే 9 గంటల ఉచిత విద్యుత్ ఇచ్చే కార్యక్రమం చేశాం. మరి ఆ అరకోటి మంది రైతుల ప్రేమ ఏమైందో తెలియదు. ఆటోలు, టాక్సీలు నడుపుకుంటున్న వాళ్లు ఇబ్బంది పడకూడదని వారికి అండగా నిలుస్తూ వాహనమిత్ర, నేతన్నలకు అండగా ఉంటూ నేతన్న నేస్తం, మత్స్యకారులకు తోడుగా ఉంటూ మత్స్యకార భరోసా ఇచ్చాం. పుట్‌పాత్‌ల మీద చిన్న చిన్న ఇడ్లీ దుకాణాలు, వ్యాపారాలు చేసుకుంటున్న నా అక్కచెల్లెమ్మలకు, నా అన్నదమ్ములకు మంచి జరగాలని ఆరాటపడుతూ వాళ్లకు తోడుగా నిలిచాం. నా రజకులకు, నాయీ బ్రాహ్మణులకు, టైలర్లకు అండగా ఉంటూ చేదోడు ఇచ్చాం. ఇన్ని కోట్ల మందికి మంచి చేసి, ఎప్పుడూ జరగని విధంగా మేనిఫెస్టో అంటే చెత్త బుట్టలో పడేసే డాక్యుమెంట్ కాదు.. మేనిఫెస్టో అంటే ఒక బైబిల్, ఖురాన్, భగవద్గీత అని మొట్టమొదటి రోజు నుంచీ భావిస్తూ 99 శాతం వాగ్దానాలు అమలు చేశాం. చిత్తశుద్ధితో మేనిఫెస్టోను అక్కచెల్లెమ్మల ఇళ్లకు తీసుకెళ్లి చూపించి మీరే టిక్ పెట్టండి అనే నిబద్ధత గల ప్రభుత్వంగా పని చేశాం.

ఇంటి వద్దకే సేవలు

ఎప్పుడూ జరగని విధంగా, పేదరికం పోవాలంటే.. పిల్లలకు క్వాలిటీ ఎడ్యుకేషన్ అవసరం అని ఇంగ్లిష్ మీడియంను వ్యతిరేకిస్తున్న పెత్తందార్లతో సైతం యుద్ధం చేసి పిల్లలకు ఇంగ్లిష్ మీడియం తీసుకురావడమే కాకుండా, ఆ పేద పిల్లలకు అండగా నిలబడాలని, తోడుగా ఉండాలని, వారి చరిత్రను కూడా మార్చాలని టోఫెల్, ఐబీ లాంటి కలలు కన్నాం. ఎప్పుడూ చూడని విధంగా గ్రామ స్థాయిలోనే సచివాలయం, వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి.. వివక్ష, కరప్షన్ లేకుండా ప్రతి ఇంటికీ సేవలందించాం. దాదాపు రూ.2.70 లక్షల కోట్లు ఇంటి వద్దకే అందించగలిగాం. ఎప్పుడూ చూడని మార్పులను తీసుకు రావడమే కాకుండా విద్య, వ్యవసాయం, వైద్య రంగంలో ఏ పేదవాడు ఎప్పుడూ ఇబ్బంది పడకూడదని, ఊహించని మార్పులు తీసుకొస్తూ పేదవాడికి అండగా నిలబడగలిగాం. మహిళా సాధికారత అంటే ఇదీ అని, సామాజిక న్యాయం అంటే ఇదీ అని ప్రపంచానికి చూపించగలిగాం. ఇన్ని గొప్ప మార్పులు చేసిన తర్వాత, ఇన్ని కోట్ల మందికి మంచి చేసిన తర్వాత ఆ అభిమానం ఏమయ్యిందో, ఆ ఆప్యాయత ఏమైందో తెలియదు' అంటూ ఎన్నికల ఫలితాలపై సీఎం జగన్ తన స్పందనను ముగించారు. అనంతరం సీఎం పదవికి రాజీనామా చేయగా గవర్నర్ ఆమోదించారు.

ప్రజలిచ్చిన తీర్పును గౌరవిస్తున్నాం : వైఎస్ జగన్

రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వానికి అభినందనలు

సాక్షి, అమరావతి : ప్రజలిచ్చిన తీర్పును గౌరవిస్తున్నాం అని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. 'రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వానికి అభినందనలు. ప్రజల తరఫున పోరాడతాం. కచ్చితంగా మళ్లీ తిరిగి లేస్తాం. ప్రజల తీర్పు తీసుకుంటాం. ప్రజలకు మంచి చేయడానికి ఎల్లవేళల తోడుగా కచ్చితంగా ఉంటాం. ప్రభుత్వంలోకి వచ్చిన వాళ్లకు ఆల్ ది వెరీ బెస్ట్. థాంక్యూ' అంటూ మంగళవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఆయన పోస్టు చేశారు.

వైఎస్ జగన్ ఘన విజయం
61,687 ఓట్ల మెజార్టీ..

కడప సెవెన్‌రోడ్స్: పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గంలో తమకు ఎదురే లేదని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోమారు రుజువు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోలైన మొత్తం ఓట్లలో 1,77,580 ఓట్లు చెల్లుబాటు అయ్యాయి. ఇందులో జగన్‌కు 1,16,315 (65.50 శాతం) ఓట్లు వచ్చాయి. ఆయన తన సమీప ప్రత్యర్థి, టీడీపీ అభ్యర్థి బీటెక్ రవిపై 61,687 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. టీడీపీ అభ్యర్థికి 54,628 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి ధృవ కుమార్‌రెడ్డికి 10,083 ఓట్లు వచ్చాయి. ఈ నియోజకవర్గంలో 23 రౌండ్ల ఓట్ల లెక్కింపు జరిగింది. ప్రతి రౌండులోనూ వైఎస్ జగన్ ఆధిక్యతను చాటుకోవడం విశేషం. పులివెందుల నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దడంలో వైఎస్సార్ కుటుంబం ఎంతో కృషి చేసింది. అందుకే పులివెందులలో వైఎస్ కుటుంబానికి ప్రజలు 1978 నుంచి పట్టం కడుతూనే ఉన్నారు.

'ప్రజలకు ధన్యవాదాలు'



సాక్షి, అమరావతి: టీడీపీ, జేఎస్పీ, బీజేపీ కూటమిని అఖండ విజయంతో ఆశీర్వదించినందుకు చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు ఎక్స్‌లో ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రాన్ని పునర్నిర్మించేందుకు చేసిన పోరులో తాము గెలిచామన్నారు. ఏపీ భవిష్యత్తుకు కట్టుబడిన ప్రధాని మోదీ, అమిత్‌షా, జేపీ నడ్డాకు ధన్యవాదాలు తెలిపారు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి అభినందనలు తెలిపారు. ఈ విజయం పార్టీ నాయకులు, కార్యకర్తల కృషి, అంకితభావాల ఫలితమని తెలిపారు. చివరి ఓటు వేసే వరకు ధైర్యంగా పోరాడారని, వారి నిబద్ధతకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. 9న అమరావతిలోని ఉద్దండరాయుని పాలెంలో చంద్రబాబు సీఎంగా ప్రమాణస్వీకారం చేస్తారని టీడీపీ వర్గాలు తెలిపాయి.

అంతుచిక్కని ఫలితం!

వైఎస్ జగన్ విప్లవాత్మక సంస్కరణలు, డీబీటీ ద్వారా రూ.2.70 లక్షల కోట్ల లబ్ధి, సుపరిపాలన

అయినా ఇంతలా 'కూటమి' విజయానికి కారణాలు అంతుచిక్కడం లేదంటోన్న రాజకీయ పండితులు



సాక్షి, అమరావతి: గత ఎన్నికల్లో మేనిఫెస్టోలో వైఎస్సార్‌సీపీ ఇచ్చిన హామీల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 99 శాతం అమలు చేశారు. ఐదేళ్లుగా విద్య, వైద్య, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నిలిపారు. అర్హతే ప్రమాణికంగా.. వివక్ష చూపకుండా.. పారదర్శకంగా అర్హులందరికీ నవరత్నాలు సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ రూపంలో రూ.2.70 లక్షల కోట్లు జమ చేశారు. కేబినెట్ నుంచి నామినేటెడ్ వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పదవుల్లో పెద్దపీట వేసి సామాజిక న్యాయమంటే ఇదీ అని దేశానికి చాటిచెప్పారు. జిల్లాలను పునర్ వ్యవస్థీకరించి.. గ్రామ, వార్డు సచివాలయాలు-వలంటీర్ల వ్యవస్థ ద్వారా పరిపాలనను వికేంద్రీకరించి ఇంటి గుమ్మం వద్దకే ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించారు. ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తూ.. పరిశ్రమల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తూ యువతకు దన్నుగా నిలిచారు. సంక్షేమాభివృద్ధి పథకాలు.. సుపరిపాలన అందించిన సీఎం జగన్‌కు జనం నీరాజనాలు పలికారు. సార్వత్రిక ఎన్నికలకు శ్రేణులను సన్నద్ధం చేయడం కోసం భీమిలి, దెందులూరు, రాప్తాడు, మేదరమెట్లలలో నిర్వహించిన సిద్ధం సభలకు లక్షల సంఖ్యలో జనం పోటెత్తారు. ఉమ్మడి, తెలుగు రాష్ట్రాల చరిత్రలో రాప్తాడు, మేదరమెట్ల సిద్ధం సభలు అతి పెద్ద ప్రజాసభలుగా నిలిచాయి. ఎన్నికల తొలి విడత ప్రచారంలో భాగంగా వైఎస్ జగన్ చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్రకు జనం బ్రహ్మరథం పట్టారు. బహిరంగ సభలకు జనం కదలివచ్చి సంఘీభావం తెలిపారు.

ప్రజల నుంచి అపూర్వ స్పందన వచ్చినా..

సిద్ధం సభలు.. మేమంతా సిద్ధం బస్సు యాత్ర.. ఎన్నికల ప్రచార సభల్లో.. 'మీ బిడ్డ ప్రభుత్వం వల్ల మీ కుటుంబానికి మంచి జరిగి ఉంటే.. ఫ్యాన్ గుర్తుపై రెండు బటన్లు నొక్కి ఓటు వేసి ఆశీర్వదించేందుకు మీరంతా సిద్ధమా' అని జగన్ పిలుపునిస్తే.. మేమంతా సిద్ధం సిద్ధం అంటూ లక్షలాది మంది ప్రజలు పిడికిళ్లు బిగించి నినదించారు. కానీ.. వైఎస్సార్‌సీపీకి దక్కాల్సిన ఎన్నికల ఫలితం టీడీపీ కూటమికి దక్కడంపై రాజకీయ విశ్లేషకులు నివ్వెరపోతున్నారు. ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ సంబంధిత వ్యాధుల సమస్య దశాబ్దాలుగా పట్టి పీడిస్తోంది. ఆ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తూ రూ.800 కోట్లతో తాగునీటి పథకం, కిడ్నీ వ్యాధుల పరిశోధన కేంద్రం, కిడ్నీ వ్యాధుల చికిత్సకు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మించినా.. పలాస నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఓడిపోవడంపై రాజకీయ పరిశీలకులు నివ్వెరపోతున్నారు. ఎన్నడూ లేని రీతిలో రూ.8 వేల కోట్ల వ్యయంతో 17 మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని చేపట్టారు. నంద్యాల, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, విజయనగరంలలో పూర్తి చేశారు. గతేడాది నుంచే ఆ ఐదు మెడికల్ కాలేజీలు ప్రారంభమయ్యాయి. కానీ.. ఆ ఐదు నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ ఓడిపోవడంపై రాజకీయ పరిశీలకులు ఆశ్చర్యపోతున్నారు.

కంచుకోటల్లోనూ కూటమి పాగా

రాయలసీమ జిల్లాలు, నెల్లూరు, ప్రకాశం, విజయనగరం జిల్లాలు వైఎస్సార్‌సీపీకి కంచుకోటలుగా నిలుస్తూ వస్తున్నాయి. కానీ.. ఈ ఎన్నికల్లో ఆ కంచుకోటల్లోనూ గతంలో ఎన్నడూ లేని రీతిలో టీడీపీ గెలుపొందడటంపై రాజకీయ పరిశీలకులు నివ్వెరపోతున్నారు. ఎన్నికల్లో ఫలితాల్లో వైఎస్సార్‌సీపీ నిలవాల్సిన చోట్ల టీడీపీ కూటమి నిలవడంపై ఆశ్చర్యపోతున్నారు. వైఎస్సార్‌సీపీకి దక్కాల్సిన ఫలితం టీడీపీకి దక్కడానికి కారణాలు అంతుచిక్కడం లేదని రాజకీయ పండితులు వాపోతున్నారు. ఇటీవల యాక్సెస్ మై ఇండియా చర్చలో ఇండియా టుడే కన్సల్టింగ్ ఎడిటర్ రాజ్‌దీప్ సర్దేశాయ్ మాట్లాడుతూ మహిళలు, గ్రామీణులు భారీ ఎత్తున వైఎస్ జగన్‌కు మద్దతుగా నిలిచారని చెప్పడం.. ఎన్‌డీటీవీ ప్రణయ్ రాయ్ కూడా పలు సందర్భాల్లో గ్రామీణులు, మహిళలు, మైనార్టీలు జగన్‌కు అండగా ఉన్నారని స్పష్టం చేసిన నేపథ్యంలో ఫలితాలు ఇలా వెలువడటం సర్వత్రా ఆశ్చర్యపరుస్తోంది.

పోటీ చేసిన అన్ని స్థానాల్లో జనసేన విజయం

- 21 అసెంబ్లీ, 2 ఎంపీ సీట్లలో గెలుపు.. పవన్ సహా మిగతా అభ్యర్థులకూ భారీ మెజార్టీలు
- పిఠాపురంలో 70,279 ఓట్ల ఆధిక్యంతో పవన్ విజయం
- 28,76,208 ఓట్లు సాధించి మొత్తం ఓట్లలో 8.53 శాతం సొంతం
- గుర్తింపు కలిగిన రాజకీయ పార్టీగా గుర్తింపు పొందే అవకాశం

సాక్షి, అమరావతి/పిఠాపురం: జనసేన పార్టీకి ఈ ఎన్నికల్లో పెద్ద విజయమే దక్కింది. పోటీ చేసిన 21 అసెంబ్లీ, రెండు లోకసభ స్థానాల్లోనూ విజయం సాధించడంతో పాటు మెజార్టీలు కూడా భారీగానే దక్కాయి. జనసేన అత్యధికంగా పెందుర్తిలో 81,870 ఓట్ల మెజార్టీ పొందగా, కాకినాడ రూరల్‌లో 72,040 ఓట్ల అధిక్యం లభించింది. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కూడా కాకినాడ జిల్లా పిఠాపురం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వంగా గీతపై 70,279 ఓట్ల భారీ ఆధిక్యంతో గెలుపొందారు. నియోజకవర్గ చరిత్రలో ఇదే అత్యధిక మెజారిటీ. రాష్ట్రంలో మొత్తం 4.31 కోట్ల మంది ఓటర్లు ఉండగా, ఈ ఎన్నికల్లో 3.38 కోట్లు మంది ఓట్లు వేశారు. కాగా, జనసేన పోటీ చేసిన 21 అసెంబ్లీ స్థానాల్లో సుమారు 28,76,208 ఓట్లు సాధించి రాష్ట్రం మొత్తం మీద 8.53 శాతం ఓట్లను దక్కించుకుంది. గత ఎన్నికలోకల ఈ పార్టీ ఉభయ కమ్యూనిస్టు పార్టీలు, బీఎస్పీతో పొత్తు పెట్టుకొని, 137 స్థానాల్లో పోటీ చేసింది. అయినప్పటికీ, ఆ ఎన్నికల్లో 17,36,811 ఓట్లు మాత్రమే జనసేనకు వచ్చాయి. ఒక్క నియోజకవర్గంలోనే గెలిచింది. గత ఎన్నికల్లో పోలిస్తే ఈసారి 15 శాతం స్థానాల్లో మాత్రమే జనసేన పోటీ చేసినప్పటికీ, దాదాపు 3 శాతం ఓట్లు అదనంగా దక్కించుకోవడం గమనార్హం. కాగా, ఇప్పటివరకు రిజిస్టర్డ్ రాజకీయ పార్టీగానే ఉన్న జనసేన పార్టీకి ఈ ఎన్నికల్లో దక్కిన విజయంతో గుర్తింపు కలిగిన పార్టీగా కేంద్ర ఎన్నికల సంఘం గుర్తింపు లభించనుంది.

పిఠాపురంలో పవన్‌కు 1,32,725 ఓట్లు

పిఠాపురంలో పవన్‌కు 1,32,725 ఓట్లు పోలవగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వంగా గీతకు 63,556 ఓట్లు వచ్చాయి. మొత్తం 18 రౌండ్లలోనూ పవన్ ఆధిక్యత కనబరిచారు. గొల్లప్రోలు, పిఠాపురం మండలాలు, పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీల్లో పవన్ అత్యధిక మెజారిటీ సాధించారు. పవన్ నియోజకవర్గంలో లేకపోవడంతో ఆయన విజయాన్ని ధ్రువీకరిస్తూ ఎన్నికల అధికారులు ఇచ్చే డిక్లరేషన్‌ను ఇంకా స్వీకరించలేదు.

ప్రజల ఆకాంక్షల మేరకు మా ప్రభుత్వం పనిచేస్తుంది

- ప్రజలు ఆకాశమంత విజయాన్ని ఇచ్చారు.. పెద్ద బాధ్యతగా భావిస్తా
- వైఎస్సార్‌సీపీపై కక్ష సాధింపు చర్యలుండవు: పవన్ కల్యాణ్



సాక్షి, అమరావతి : ప్రజలు జనసేన పార్టీకి ఆకాశమంత విజయాన్ని ఇచ్చారని, ఇది చాలా బాధ్యతతో కూడకున్నదని ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. ఐదు కోట్ల మంది రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తామని చెప్పారు. ఎన్నికల్లో కూటమి విజయం అనంతరం పవన్ కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ నుంచి మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయానికి వచ్చారు. అక్కడ పార్టీ శ్రేణులనుద్దేశించి మాట్లాడారు. ఇది ఐదు కోట్ల మంది ప్రజలు చరిత్రాత్మకమైన తీర్పు ఇచ్చిన రోజని అన్నారు. ప్రజలకు మాట ఇచ్చిన ప్రకారం జవాబుదారీతనంతో ఉన్న ప్రభుత్వాన్ని స్థాపిస్తామన్నారు. ప్రభుత్వం, అధికార యంత్రాంగం ఎలా ఉండాలన్నది అందరికీ చూపిస్తామని చెప్పారు. పోటీ చేసిన అన్ని స్థానాల్లో గెలిపించి ప్రజలు తనపై పెద్ద బాధ్యత ఉంచారన్నారు. అంత బాధ్యతతో పని చేస్తామని అన్నారు. ఇది కక్షసాధింపుల సమయం కాదన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు బలమైన పునాది వేసే సమయమని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నేత వైఎస్ జగన్‌పై తనకు ఎప్పటికీ వ్యక్తిగత ద్వేషం ఉండదని, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలను హింసించడానికి కూటమి ప్రభుత్వం పని చేయదని చెప్పారు. వైఎస్సార్‌సీపీని ఇబ్బంది పెట్టడానికి ప్రజలు విజయాన్ని అందించలేదన్న విషయాన్ని జన సైనికులు, నాయకులు, వీర మహిళలు గుర్తుంచుకోవాలని చెప్పారు. ఐదు కోట్ల మంది ప్రజల కోసం పనిచేయాలన్నారు.

జనసేన ఆఫీసులో బాబు – పవన్ భేటీ

పవన్ పార్టీ శ్రేణులతో సమావేశమైన సమయంలోనే టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయానికి వచ్చారు. పవన్ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం అనా కొణిదెల, అకిరా నందన్‌తో కలసి చంద్రబాబును సత్కరించారు. ఆ తర్వాత చంద్రబాబు, పవన్ కొద్దిసేపే భేటీ అయ్యారు.

వైఎస్సార్ సీపీకి 1.32 కోట్ల ఓట్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో టీడీపీ కూటమి గెలుపొందినా 1.32 కోట్ల మంది ఓటర్లు వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలిచినట్లు ఎన్నికల సంఘం తాజా గణాంకాలను బట్టి తెలుస్తోంది. రాష్ట్రంలో మొత్తం 4.13 కోట్ల మంది ఓటర్లు ఉండగా మే 13న జరిగిన పోలింగ్‌లో పోస్టల్ బ్యాలెట్‌తో కలిపి 3.38 కోట్ల మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో టీడీపీకి 45.63 శాతం ఓట్లతో 1,53,56,470 మంది ఓటర్లు మద్దతు తెలుపగా, 39.37 శాతం ఓట్లతో 1,32,57,919 మంది మేం జగన్ వెంటే ఉన్నామంటూ వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచారు. జనసేనకు సుమారు 8.3 శాతం ఓట్లతో 20 లక్షల మంది మద్దతు తెలుపగా బీజేపీకి 9.53 లక్షల మంది (2.80 శాతం) ఓట్లు వేశారు. 1.72 శాతంతో కాంగ్రెస్ పార్టీకి 5.80 లక్షల ఓట్లు పోలవ్వగా నోటాకు 1.09 శాతంతో 3.68 లక్షల మంది ఓటు వేశారు. ఎన్నికల సంఘం ఇంకా తుది ఫలితాలను ప్రకటించకపోవడంతో ఈ గణాంకాల్లో స్వల్ప మార్పులు ఉండే అవకాశం ఉంది.

గాజువాకలో రికార్డు మెజార్టీ

రాష్ట్ర అసెంబ్లీ చరిత్రలో తొలిసారిగా రికార్డు మెజార్టీలు నమోదయ్యాయి. గాజువాక నుంచి టీడీపీ తరఫున పోటీ చేసిన పల్లా శ్రీనివాసరావు సమీప వైఎస్సార్ సీపీ అభ్యర్థి గుడివాడ అమర్నాథ్‌పై 95,235 మెజార్టీతో గెలుపొందారు. మంగళగిరి నుంచి నారా లోకేష్ 91,413, భీమిలి నుంచి గంటా శ్రీనివాసరావు 92,401 ఓట్ల మెజార్టీతో గెలిచారు. పెందుర్తి, నెల్లూరు సిటీ, తణుకు, కాకినాడ గ్రామీణ, రాజమహేంద్రవరం సిటీ, విశాఖ తూర్పు, పిఠాపురం నియోజకవర్గాల్లో 70 వేలకు పైగా మెజార్టీలు నమోదయ్యాయి. మడకశిర నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఉపాధి హామీ కూలీ ఈర లక్కప్ప కేవలం 25 ఓట్ల తేడాతో టీడీపీ అభ్యర్థి ఎంఎస్ రాజు చేతిలో ఓడినట్లు తొలుత ప్రకటించగా దీనిపై రీ కౌంటింగ్ కోరడంతో 351 ఓట్లతో వెనుకబడినట్లు ప్రకటించారు. దీనిపై వైఎస్సార్ సీపీ అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఫలితం ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. గిద్దలూరులో రౌండు రౌండ్‌కు ఫలితం దోబూచులాడగా చివరకు వైఎస్సార్ సీపీ అభ్యర్థి కుందూరు నాగార్జునరెడ్డి 392 ఓట్లతో గెలిపొందారు. ఫలితాన్ని అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

కూటమి భారీ విజయం

164 సీట్లలో టీడీపీ, బీజేపీ, జనసేన అభ్యర్థుల విజయం



సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి భారీ విజయాన్ని సాధించింది. పొత్తు పెట్టుకోవడం బీజేపీకి బాగా కలిసి వచ్చింది. కూటమిలోని మూడు పార్టీలు కలసి 175 శాసనసభా స్థానాల్లో పోటీ చేయగా 164 చోట్ల గెలుపొందాయి. 144 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసిన టీడీపీ 135 చోట్ల స్థానాల్లో విజయఢంకా మోగించింది. పోటీ చేసిన 21 స్థానాల్లోనూ జనసేన గెలుపొందింది. బీజేపీ పోటీ చేసిన పది స్థానాలకుగానూ 8 చోట్ల విజయ బావుటా ఎగురవేసింది. అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేవలం 11 స్థానాలకే పరిమితమైంది.

ఎంపీ స్థానాల్లోనూ కూటమి విజయ కేతనం

రాష్ట్రంలో 25 ఎంపీ స్థానాలకుగానూ కూటమి 21 సీట్లలో గెలిచింది. 17 స్థానాల్లో పోటీ చేసిన టీడీపీ 16 చోట్ల విజయం సాధించగా పోటీ చేసిన రెండు సీట్లలోనూ జనసేన గెలుపొందింది. ఆరు ఎంపీ స్థానాల్లో పోటీకి దిగిన బీజేపీ మూడు చోట్ల విజయ దుందుభి మోగించింది. వైఎస్సార్‌సీపీకి నాలుగు ఎంపీ స్థానాలు మాత్రమే దక్కాయి. అరకు (తనూజా రాణి), రాజంపేట(మిథున్‌రెడ్డి), తిరుపతి(గురుమూర్తి), కడప(వైఎస్ అవినాశ్ రెడ్డి) ఎంపీ స్థానాలను వైఎస్సార్ సీపీ సాధించింది. పోటీ చేసిన మచిలీపట్నం, కాకినాడ ఎంపీ స్థానాల్లో జనసేన నెగ్గింది. రాజమహేంద్రవరం, అనకాపల్లి, నరసాపురం ఎంపీ స్థానాల్లో బీజేపీ గెలుపొందింది. మిగిలిన 16 స్థానాలను టీడీపీ తన ఖాతాలో వేసుకుంది.

గెలుపొందిన ప్రముఖులు

టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గంలో 47 వేలకుపైగా ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పిఠాపురంలో 70,279 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల నుంచి 61,687 ఓట్ల తేడాతో టీడీపీ అభ్యర్థిపై విజయం సాధించారు. చంద్రబాబు తనయుడు నారా లోకేశ్ మంగళగిరి నుంచి 91,413 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. హిందూపురం నుంచి నందమూరి బాలకృష్ణ మూడోసారి గెలిచి హ్యాట్రిక్ సాధించారు. బాలకృష్ణ రెండో అల్లుడు భరత్ భారీ మెజారిటీతో విశాఖ ఎంపీగా గెలిచారు. దీంతో బాలకృష్ణ ఇద్దరు అల్లుళ్లు లోకేష్, భరత్ తొలిసారి ఎన్నికల్లో గెలిచినట్లయింది. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు 34,435 ఓట్ల మెజారిటీతో గెలిచారు. బాలకృష్ణ, అచ్చెన్నాయుడు, బెందాళం అశోక్ (ఇచ్ఛాపురం) వరుసగా మూడుసార్లు గెలుపొంది హ్యాట్రిక్ కొట్టారు. టీడీపీ తరఫున పోటీ చేసి ఐదు సార్లు ఓడిపోయిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఈసారి సర్వేపల్లి నుంచి ఎట్టకేలకు గెలుపొందారు.

- బీజేపీ తరఫున పోటీ చేసిన పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి (రాజమండ్రి ఎంపీ), సీఎం రమేష్ (అనకాపల్లి ఎంపీ), సుజనా చౌదరి (విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే) గెలుపొందారు. అదే పార్టీ నుంచి పోటీ చేసిన మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి రాజంపేట ఎంపీ స్థానంలో పరాజయం పాలయ్యారు.
- సీఎం వైఎస్ జగన్ మంత్రివర్గంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాత్రమే గెలుపొంది అసెంబ్లీలో అడుగుపెట్టబోతున్నారు. మంత్రులు కొడాలి నాని, బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, గుడివాడ అమర్నాథ్, జోగి రమేష్, విడదల రజని, ఆర్‌కే రోజా, బుగ్గన రాజేంద్రనాథ్, అంబటి రాంబాబు, కాకాని గోవర్ధన్‌రెడ్డి, స్పీకర్ తమ్మినేని సీతారాం లాంటి హేమాహేమీలు ఓటమి పాలయ్యారు. ఎంపీలుగా పోటీ చేసిన వి.విజయసాయిరెడ్డి, బూడి ముత్యాలనాయుడు, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, కేశినేని నాని ఓడిపోయారు.
- 8 ఉమ్మడి జిల్లాల్లో కూటమి క్లీన్ స్వీప్ చేసింది. కోస్తాలో విశాఖ మినహా మిగిలిన అన్ని జిల్లాల్లో సీట్లను కూటమి గెలుచుకుంది. శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో వైఎస్సార్‌సీపీ ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయింది. గ్రేటర్ రాయలసీమలో చిత్తూరు, కడప, కర్నూలు, ప్రకాశం జిల్లాల్లో మాత్రమే వైఎస్సార్‌సీపీకి ఎమ్మెల్యే సీట్లు దక్కాయి. నెల్లూరు, అనంతపురం జిల్లాల్లోనూ కూటమి క్లీన్‌స్వీప్ చేసింది.

పార్టీలవారీగా ఎమ్మెల్యే సీట్లు

టీడీపీ	135
జనసేన	21
బీజేపీ	8
వైఎస్సార్‌సీపీ	11

ఎంపీ సీట్లు ఎవరికెన్ని?

టీడీపీ	16
బీజేపీ	3
జనసేన	2
వైఎస్సార్‌సీపీ	4

ఏ జిల్లాలో ఎవరికి ఎన్ని సీట్లు?

జిల్లాలో సీట్లు	కూటమి	వైఎస్సార్‌సీపీ
శ్రీకాకుళం (10)	10	-
విజయనగరం (9)	9	-
విశాఖ (15)	13	2
తూ.గోదావరి (19)	19	-
ప. గోదావరి (15)	15	-
కృష్ణా (16)	16	-
గుంటూరు (17)	17	-
ప్రకాశం (12)	10	2
నెల్లూరు (10)	10	-
కర్నూలు (14)	12	2
అనంతపురం (14)	14	-
కడప (10)	7	3
చిత్తూరు (14)	12	2
మొత్తం	164	11



మంగళవారం ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయం వద్ద ప్రధాని మోదీ, జేపీ నడ్డాకు ఘనస్వాగతం

రాజ్యాంగమే దారిదీపం

- వికసిత్ భారత్ కోసం అన్ని రాష్ట్రాలతో కలిసి పని చేస్తాం
- అవినీతిపై ఇక ఉక్కుపాదం మోపడం ఖాయం
- ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి

న్యూఢిల్లీ: భారత రాజ్యాంగం తమకు మార్గం చూపే దారిదీపం అని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. 'అభివృద్ధి చెందిన భారత్' తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. లక్ష్య సాధన కోసం పార్టీలకు అతీతంగా అన్ని రాష్ట్రాలతో కలిసి పని చేస్తామని చెప్పారు. మంగళవారం ఎన్నికల ఫలితాలు వెల్లడైన అనంతరం ఆయన బీజేపీ ప్రధాన కార్యాలయంలో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. జై జగన్నాథ్ అంటూ ప్రసంగం ప్రారంభించారు. ప్రధానమంత్రిగా మూడో పర్యాయంలో అవినీతిపై ఉక్కుపాదం మోపుతానని చెప్పారు. అవినీతిని నిర్మూలించడానికి కఠిన నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. ఈ ఎన్నికల్లో విపక్ష కూటమి సాధించిన మొత్తం సీట్ల కంటే బీజేపీకే ఎక్కువ సీట్లు వచ్చాయని అన్నారు. కేంద్రంలో బీజేపీ వరుసగా మూడోసారి అధికారంలోకి వస్తుండడం ఆరు దశాబ్దాల తర్వాత ఇదే మొదటిసారి అని గుర్తుచేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి స్పష్టమైన మెజార్టీ ఒడిశా ప్రజలకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్డీయే పక్షాలకు సైతం కృతజ్ఞతలు తెలియజేశారు. 'దేశమే ప్రథమం' స్ఫూర్తితో ఆత్మనిర్భర్ భారత్ దిశగా అసాధారణ నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మహిళలే కేంద్రంగా అభివృద్ధి నమూనా

తన తల్లి మృతి చెందిన తర్వాత తనకు ఇది మొదటి ఎన్నిక అంటూ ప్రధాని మోదీ భావోద్వేగానికి గురయ్యారు. దేశంలోని కోట్లాది మంది మహిళలు తనపట్ల ఆప్యాయత ఆదరణ చూపించారని, ఆశీస్సులు అందించారని, తనకు తల్లి లేని లోటు కన్పించకుండా చేశారని వెల్లడించారు. మహిళలే కేంద్రంగా అభివృద్ధి నమూనాను కొనసాగిస్తామని ప్రకటించారు. యువత సాధికారత కోసం కృషి చేస్తామన్నారు. భవిష్యత్తు మొత్తం ఇకపై హరిత శకానిదేనని, గ్రీన్ ఎకానమీలో పెట్టుబడులు పెంచుతామని హామీ ఇచ్చారు. వాతావరణ మార్పుల నుంచి ఆహార భద్రత దాకా భిన్న రంగాల్లో ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలకు భారత్ పరిష్కారం చూపుతుందన్నారు. బలమైన భారత్ బలమైన ప్రపంచానికి బలమైన మూలస్తంభంగా నిలుస్తుందని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ప్రజలు 10 గంటలు పని చేస్తే తాను 18 గంటలు పని చేస్తానన్నారు. వారు రెండు అడుగులు వేస్తే తాను నాలుగు అడుగులు వేస్తానన్నారు. మనమంతా కలిసికట్టుగా పనిచేస్తే కీలక నిర్ణయాలు తీసుకోవడంలో భారత్ కొత్త అధ్యాయం లిఖిస్తుందని, ఇది మోదీ గ్యారంటీ అని వివరించారు. దేశంలో అన్ని వర్గాలు, అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ఎన్డీయే పని చేస్తుందన్నారు.

'అబ్ కీ బార్...' పాచిక పారలేదు

లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా రెండుసార్లు తిరుగులేని విజయాలు. ఈసారి 370 సీట్ల లక్ష్యం. 300 నుంచి 350 స్థానాల దాకా ఖాయమంటూ ఎగ్జిట్ పోల్స్ జోస్యం. కానీ ఎగ్జాక్ట్ ఫలితాలు బీజేపీకి తేరుకోలేని షాకిచ్చాయి. ఎవరూ ఊహించని విధంగా కనీసం మెజారిటీ మార్కును కూడా అందుకోలేకపోయింది. కేవలం 240 స్థానాలకు పరిమితమై చతికిలపడింది. తరచి చూస్తే ఇందుకు పలు కారణాలు కన్పిస్తున్నాయి...

- అత్యంత కీలకమైన ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ పేలవ ప్రదర్శన ఎవరూ ఊహించనిది. అక్కడ బీజేపీ బలం 62 నుంచి ఏకంగా 33 స్థానాలకు పడిపోయింది. రాష్ట్రంలో ఓబీసీలతో పాటు ప్రధానంగా దళిత, ముస్లిం ఓట్లను ఎస్పీ–కాంగ్రెస్ కూటమి పూర్తిస్థాయిలో ఒడిసిపట్టడమే ఇందుకు కారణం. దాంతో వాటి భాగస్వామ్యం యూపీలో సూపర్‌హిట్టయింది. బీజేపీకి దేశవ్యాప్తంగా తగ్గిన 63 సీట్లలో సగానికి సగం యూపీలోనే కావడం విశేషం.
- యూపీ తర్వాత కీలకమైన మహారాష్ట్రలో శివసేన, ఎన్సీపీలను బీజేపీ చీల్చిన తీరును జనం వ్యతిరేకించారు. తాజా ఫలితాల్లో చీలిక వర్గాలకే ఆదరణ లభించింది. ఆ మేరకు రాష్ట్రంలో ఎన్డీఏ స్థానాలకు భారీగా గండి పడింది.

బీజేపీని దెబ్బ తీసిన నిరుద్యోగం, ద్రవ్యోల్బణం

అగ్నివీర్ పథకంపై యువత ఆగ్రహం	చేటు చేసిన మోదీ వ్యాఖ్యలు, విమర్శలు	విపక్షాల 'రిజర్వేషన్ల' ప్రచారంతో తీవ్ర నష్టం	ఓటర్లను ఆకట్టుకోని 'అబ్ కీ బార్...' నినాదం

- ప్రచారం పొడవునా మోదీతో పాటు బీజేపీ నేతలు ప్రదర్శించిన మితిమీరిన దూకుడు కూడా బెడిసికొట్టింది.
- నానాటికీ పెరిగిన ద్రవ్యోల్బణం, నిరుద్యోగం మధ్య తరగతి, యువతలో ఆగ్రహానికి కారణమయ్యాయి.
- సైన్యంలో చేరేందుకు మోదీ సర్కారు తెచ్చిన అగ్నివీర్ పథకాన్ని యువత దేశవ్యాప్తంగా తీవ్రంగా వ్యతిరేకించడం తెలిసిందే. ఆ పథకాన్ని రద్దు చేస్తామన్న కాంగ్రెస్ హామీ యువకులను బాగా ఆకట్టుకున్నాయి.
- సైనిక దళాల్లో యువత ఎక్కువగా చేరే రాజస్తాన్, హరియాణాల్లో బీజేపీకి సీట్లు తగ్గడం అగ్నివీర్ పథకంపై ఆగ్రహ ప్రతిఫలమే.
- ఓవైపు ఇన్ని సమస్యలు కన్పిస్తుంటే పట్టించుకోకుండా బీజేపీ ఇచ్చిన 'అబ్ కీ బార్, 400 పార్ (ఈసారి 400 సీట్లకు మించి)' నినాదాన్ని ప్రజలు హర్షించలేదు. 2004 నాటి 'ఇండియా షైనింగ్' నినాదం అంతగా కాకున్నా 'అబ్ కీ బార్...' బీజేపీకి కాస్త చేటే చేసిందంటున్నారు. నిజంగానే అన్ని సీట్లు వస్తే నిరంకుశత్వానికి బాటలు పడతాయన్న భావన ప్రబలింది. అంతే గాక బీజేపీ నేతల్లో అలసత్వానికి కూడా ఈ నినాదం కారణమైంది.

మోదీ మాటతీరు...

- పార్టీని పూర్తిగా తోసిరాజని ఈసారి ప్రచారంలో సర్వం మోదీమయంగా మారింది. ప్రతిదానికీ 'మోదీ హామీ' అంటూ ప్రధాని పదేపదే చెబుతూ వచ్చారు. ఏకంగా బీజేపీ మేనిఫెస్టో పేరునే 'మోదీ కీ గ్యారెంటీ'గా మార్చేశారు! సర్వం తననే కేంద్రం చేసుకుని నడిపించారు.
- దీనికి తోడు మోదీ మాటతీరును, విపక్షాలపై చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలు, విమర్శలను ప్రజలు ఆమోదించలేదు. విపక్షాలపై ఆయన చేసిన ముజ్రా తదితర విమర్శలు బీజేపీకి మేలు కంటే కీడే ఎక్కువ చేశాయి.
- మంగళసూత్రాలు మొదలుకుని మాంసాహారం, ముస్లిం రిజర్వేషన్ల దాకా మోదీ చేసిన వ్యాఖ్యలను జనం జీర్ణించుకోలేదని ఫలితాలు చెబుతున్నాయి.
- వీటికి తోడు ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామన్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటన దేశవ్యాప్తంగా ఆ వర్గం ఓట్లు పూర్తిగా బీజేపీకి వ్యతిరేకంగా సంఘటితమయ్యేందుకు కారణమైంది.
- షా ప్రకటనను కాంగ్రెస్, విపక్షాలు అందిపుచ్చుని బీజేపీ మళ్లీ వస్తే మొత్తం రిజర్వేషన్లనే ఎత్తేస్తుందంటూ చేసిన ప్రచారం ప్రజల్లోకి బాగా వెళ్లింది. ఇది బీజేపీకి చెప్పలేనంత చేటు చేసింది.
- విపక్షాలపైకి మోదీ సర్కారు దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతోందన్న ప్రచారం కూడా బీజేపీకి ప్రతికూలంగా మారింది. ఎన్నికల వేళ ఆప్ అధినేత కేజ్రీవాల్ అరెస్టు కూడా చేటే చేసింది.
- ఇక కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన నిరుద్యోగ భృతి, మహిళలకు ఏటా రూ.లక్ష సాయం వంటి హామీలు ఓటర్లను ఆకట్టుకోవడంలో సఫలమయ్యాయి.
- మోదీ పాలనలో అంబానీ, అదానీ వంటి కొద్ది మంది కుబేరులకే భారీ లబ్ధి చేకూరుతోందంటూ కాంగ్రెస్, విపక్షాలు పదేపదే చేసిన ప్రభావం కూడా ప్రజల్లోకి వెళ్లింది.
- అభ్యర్థుల ఎంపికలోనూ బీజేపీ పలు తప్పిదాలు చేయడం పలు చోట్ల ఓటమికి కారణాలుగా మారింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

యూపీలో కమల విలాపం!

అఖిలేశ్ మ్యాజిక్... ఎస్పీ హవా
- 5 సీట్ల నుంచి 37 సీట్లకు జంప్
- ఇండియా కూటమి సూపర్ హిట్
- బీజేపీకి కోలుకోలేని దెబ్బ...

దేశంలోనే అత్యధికంగా 80 సీట్లతో హస్తినకు రాచమార్గంగా పరిగణించే ఉత్తర ప్రదేశ్‌లో కమలానికి ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. 'అబ్ కీ బార్ 400 పార్' అంటూ ఊదరగొట్టిన కాషాయదళాన్ని ఇండియా కూటమి కకావికలం చేసింది. ఈసారి కూడా యూపీ కుంభస్థలాన్ని కొట్టి, ఢిల్లీ కోటపై తిరుగులేని పట్టు సాధించాలన్న వారి కలలకు గండి కొట్టింది. సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) సారథి అఖిలేశ్ యాదవ్ బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కారు ఆశలపై నీళ్లుజల్లారు. అంతేకాదు, అట్టడుగుకు పడిపోయిన పార్టీకి మళ్లీ జవసత్వాలు అందించి, రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు తిరుగులేని బాట వేసుకున్నారు. అయోధ్య రామమందిరం కల సాకారం చేసిన కాషాయ పార్టీకి... హిందుత్వ నినాదం ఏమంత కలిసిరాలేదని ఈ ఎన్నికలు తేల్చేశాయి. మరోపక్క, ముస్లిం, దళిత, ఓబీసీ ఓటర్లు కమలానికి ముఖం చాటేయడంతో దాదాపు సగం సీట్లను చేజార్చుకుంది.ఒకప్పుడు కాంగ్రెస్, ఎస్పీ, బీఎస్పీ వంటి పార్టీల కంచుకోటగా ఉన్న యూపీలో 2014లో బీజేపీ ఏకంగా 71 సీట్లను కొల్లగొట్టి పూర్తిగా పాగా వేసింది. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికల్లో సైతం ప్రత్యర్థులను మట్టి కరిపించింది. అయితే, 2019లో బీజేపీ బలం 62 సీట్లకు తగ్గినప్పటికీ, అత్యధిక స్థానాలను గెల్చుకుని రెండోసారి హస్తిన పీఠాన్ని చేజిక్కించుకోగలిగింది. గత ఎన్నికల్లో మాయావతి నేతృత్వంలోని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ), అఖిలేశ్‌యాదవ్ సారథ్యంలోని ఎస్పీ కలిసి పోటీ చేయడం బీజేపీ బలాన్ని కాస్త తగ్గించగలిగినప్పటికీ... పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. మరోపక్క, కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేసి చేతులు కాల్చుకుంది. కేవలం ఒక్క సీటుకే పరిమితం కావాల్సి వచ్చింది. ఈ ఓట్ల చీలిక కాషాయ పార్టీకి వరంగా మారడంతో పెద్ద సమస్య కాలేదు. కానీ ఈసారి ఇండియా కూటమి కింద పోటీ చేసిన ఎస్పీ–కాంగ్రెస్ సత్తా చాటాయి. వీటికి టీఎంసీ, ఆప్ దన్నుగా నిలిచాయి. ఎన్డీయే కూటమిలో ఉన్న ఆర్ఎల్డీకి రెండు సీట్లిచ్చి మిగతా 78 స్థానాల్లో పోటీ చేసిన బీజేపీ... ఈసారి కనీసం 65–70 స్థానాలను కొల్లగొట్టి, మోదీ 3.0 సర్కారులో తిరుగులేని మెజారిటీ అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. చాలావరకు ఒపీనియన్ పోల్స్, ఎగ్జిట్ పోల్స్ ఇదే అంచనా వేశాయి. అయితే, ఇవన్నీ పటాపంచలైపోయాయి. ఊహించని విధంగా కాషాయ పార్టీ ఖాతా నుంచి 29 సీట్లు ఎగిరిపోయాయి. కేవలం 33 సీట్లకు పడిపోవడంతో బీజేపీ సొంతంగా మెజారిటీ (272 సీట్లు) మార్కుకు ఆమడదూరంలో నిలిచిపోవాల్సి వచ్చింది. మరోపక్క, గత ఎన్నికల్లో కేవలం 5 సీట్లకు పరిమితమైన ఎస్పీ ఏకంగా 37 స్థానాలను కొల్లగొట్టి దేశంలో బీజేపీ, కాంగ్రెస్ తర్వాత మూడో అతిపెద్ద పార్టీగా, రాష్ట్రంలో నంబర్ వన్‌గా నిలిచింది. సీట్ల సర్దుబాటులో భాగంగా ఎస్పీ 62 సీట్లలో, కాంగ్రెస్ 17 చోట్ల, టీఎంసీ 1 చోట పోటీ చేశాయి. కాంగ్రెస్ కూడా బలం పుంజుకుని 6 చోట్ల గెల్చింది.

కలిసొచ్చిన 'పీడీఏ' నినాదం...

ఎన్నికలకు ముందు అఖిలేశ్ యాదవ్ పిచ్డే, దళిత్, అల్పసంఖ్యాక్ – పీడీఏ (వెనుకబడిన, దళిత, మైనారిటీ) నినాదంతో చేపట్టిన యాత్ర ఈ ఎన్నికల్లో కూటమి హవాకు దన్నుగా నిలిచిందని చెప్పొచ్చు. ఈ యాత్ర ప్రధానంగా యూపీలోని ముస్లిం కేంద్రిక జిల్లాల్లోనే సాగింది. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రతో పాటు ఎస్పీ–కాంగ్రెస్ జట్టుకట్టడం కూడా కలిసొచ్చింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఫలించని అయోధ్య బ్రహ్మాస్త్రం...

ఎన్నికలకు ముందు హడావుడిగా అయోధ్య రామ మందిరాన్ని ప్రజలకు అంకితం చేసిన బీజేపీ, దీన్ని ఈసారి బ్రహ్మాస్త్రంగా ప్రయోగించింది. హిందూ ఓట్లను గంపగుత్తగా కొల్లగొట్టాలన్న కాషాయ పాచిక పారలేదు. అయోధ్య కొలువుదీరిన యూపీలో పార్టీ రెండో స్థానానికి పడిపోవడం దీనికి నిదర్శనం. అంతేకాదు, అయోధ్య అసెంబ్లీ స్థానం ఉన్న ఫైజాబాద్ లోక్‌సభ నియోజకవర్గాన్ని సైతం కమలనాథులు కోల్పోయారు. ఇక్కడ ఎస్పీ అభ్యర్థి అవధేశ్ ప్రసాద్, బీజేపీ నేత లల్లూ సింగ్‌పై దాదాపు 65,000 ఓట్ల మెజారిటీతో విజయం సాధించడం విశేషం. ఇక్కడ గత ఎన్నికల్లో లల్లూ సింగ్ లక్ష ఓట్లకు పైగా తేడాతో గెలుపొందారు. అంతేకాదు, మరోసారి వారణాసి నుంచి పోటీకి దిగిన మోదీ... కనీవినీ ఎరుగని మెజారిటీతో గెలుపొందడం ద్వారా యూపీ గెలుపును చాటిచెప్పాలనుకున్నారు. ఇది కూడా నెరవేరకపోవడం గమనార్హం. గత ఎన్నికల్లో 4,79,505 ఓట్ల మెజారిటీ సాధించిన మోదీకి ఈసారి గట్టి షాకే తగిలింది. మెజారిటీ 1,52,513కు పడిపోయింది.

ఢిల్లీలో బీజేపీ తీన్‌మార్..!

- వరుసగా మూడోసారి బీజేపీ క్లీన్‌స్వీప్
- ఫలించని ఇండియా కూటమి ప్రయత్నాలు
- జైలు పాలైనా కేజ్రీవాల్‌కు రాని సానుభూతి

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో మరోమారు భారతీయ జనతా పార్టీ సత్తా చాటింది. వరుసగా మూడోసారి విజయం సాధించి హ్యాట్రిక్‌ను సాధించింది. ఢిల్లీలోని ఏడు లోక్‌సభ స్థానాలకు ఏడింటినీ గెలుచుకుంది. జైలు నుంచి వచ్చి ప్రచారం చేసిన ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ సానుభూతితో ఓట్లు తెచ్చుకునేందుకు చేసిన ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టారు. 2009లో ఢిల్లీలో ద్వితీయ స్థానంలో నిలిచిన బీజేపీ 2014, 2019తోపాటు ప్రస్తుత ఎన్నికల్లో ఏడు స్థానాల్లోనూ గెలిచి సత్తా చాటింది.

ఓట్లు రాబట్టని ప్రసంగం

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో తీహార్ జైలులో ఉన్న కేజ్రీవాల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు సుప్రీంకోర్టు బెయిలిచ్చింది. తనను అక్రమంగా అరెస్టు చేశారని, ఇండియా కూటమిని గెలిపిస్తే కేజ్రీవాల్ జైలుకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండదంటూ ప్రజల్లో సానుభూతి కోసం ప్రయత్నించారు. ప్రతిచోటా ఇదే ప్రసంగంతో ఓట్లు రాబట్టుకునేందుకు ప్రయత్నాలు చేశారు. కానీ, అవి ఫలించలేదు.

వివిధ ఎన్నికల్లో గెలిచిన స్థానాలు ఇలా

పార్టీ	2009	2014	2019	2024
కాంగ్రెస్	07	0	0	0
బీజేపీ	0	07	07	07
ఆప్	పోటీలేదు	0	0	0

వివిధ ఎన్నికల్లో ఓట్ల శాతం ఇలా(శాతాల్లో)

పార్టీ	2009	2014	2019	2024
కాంగ్రెస్	57.11	15.10	22.62	19.07
బీజేపీ	35.23	46.40	56.85	54.32
ఆప్	పోటీలేదు	32.90	18.02	24.04

తగ్గిన బీజేపీ ఓటింగ్ శాతం

వరుసగా మూడు పర్యాయాలు ఢిల్లీలో బీజేపీ తన ఆధిపత్యాన్ని కనబరిచింది. 2009 ఎన్నికల్లో ఢిల్లీలో బీజేపీ 35.23% ఓట్లు తెచ్చుకుంది. 2014లో 46.40శాతం, 2019లో 56.85 శాతం ఓట్లతో వరుసగా విజయం సాధించింది. తాజా ఎన్నికల్లో మాత్రం బీజేపీ 54.30 శాతం ఓట్లను మాత్రమే తన ఖాతాలో వేసుకుంది. అంటే గత ఎన్నికలతో పోల్చితే ఈ ఎన్నికల్లో బీజేపీ 2.55శాతం ఓట్లను కోల్పోయింది.

డీలా పడ్డ కాంగ్రెస్ గ్రాఫ్

2009 ఎన్నికల్లో 57.11 శాతం ఓట్లతో కాంగ్రెస్ ఏడు స్థానాలను కైవసం చేసుకుని అగ్రస్థానంలో నిలిచిన కాంగ్రెస్, 2014కు వచ్చేసరికి ఓటమిని చవి చూసింది. కేవలం 15.10% ఓట్లతో ద్వితీయస్థానంలో నిలిచిన కాంగ్రెస్ 2019 ఎన్నికల్లో 22.63% ఓట్లతో పుంజుకుంది. తాజా ఎన్నికల్లో 19.11% ఓట్లతో తృతీయ స్థానానికి చేరింది. ఇక 24.02% ఓట్లతో ఆప్ ద్వితీయ స్థానంలో నిలిచాయి. ఈ రెండు పార్టీలు ఓట్ల శాతాన్ని పెంచుకున్నా సీట్ల సాధనలో విఫలమయ్యాయి.

అమేథీలో కిశోరీ లాల్ సంచలనం

రాహుల్‌ను ఓడించిన స్మృతి ఇరానీని మట్టికరిపించిన శర్మ

అమేథీ: అమేథీ నియోజకవర్గంలో 2019లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీనే ఓడించిన బీజేపీ నాయకురాలు స్మృతి ఇరానీని ఈయన ఢీకొట్టగలరా? అన్న విశ్లేషకుల అనుమానాలను పటాపంచలు చేస్తూ కిశోరీ లాల్ శర్మ జయకేతనం ఎగరేశారు. మంగళవారం అమేథీ నియోజవర్గంలో స్మృతి ఇరానీపై 1,67,196 ఓట్ల మెజారిటీతో కిశోరీ లాల్ శర్మ ఘన విజయం సాధించారు. తొలి ప్రయత్నంలోనే లక్షకుపైగా మెజారిటీ సాధించి అమేథీ కాంగ్రెస్‌కు కంచుకోట అని కిశోరీలాల్ మరోసారి నిరూపించారు. రాహుల్‌ను ఇరానీ గతంలో 55వేల ఓట్ల తేడాతో ఓడిస్తే ఈసారి ఆమెను శర్మ అంతకు మూడురెట్లకు మించి మెజారిటీతో ఓడించడం విశేషం. '' ఈ విజయం నా ఒక్కరిది కాదు. మొత్తం నియోజకవర్గ కుటుంబాలది. ఇంతటి విజయం అందించిన అమేథీ ప్రజలకు నా కృతజ్ఞతలు. ఈ విజయం అమేథీ ప్రజలు, గాంధీల కుటుంబానికే చెందుతుంది. మనది బలీయ, ప్రజాస్వామ్య భారతం అని అమేథీ చాటింది' అని ఫలితం వెలువడ్డాక కిశోరీలాల్ వ్యాఖ్యానించారు.



విజయం సాధించిన విధేయత: గాంధీల కుటుంబానికి అత్యంత విధేయుడిగా కిశోరీ లాల్ శర్మకు మంచి పేరుంది. నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్‌లో క్రియాశీలంగా పనిచేస్తున్నారు. శర్మ సొంత రాష్ట్రం పంజాబ్. లూథియానాకు చెందిన శర్మ మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీకి సన్నిహితుడు కూడా. 1983లో రాజీవ్‌తోపాటు యూపీ రాజకీయాల్లో అడుగుపెట్టారు. నాటి నుంచి స్థానిక వ్యవహారాల్లో కీలక పాత్ర పోషిస్తూ వస్తున్నారు. 1991లో రాజీవ్ మరణానంతరం గాంధీల కుటుంబంతో సన్నిహిత సంబంధాలు కొనసాగించారు. 1999లో తొలిసారిగా సోనియాగాంధీ అమేథీ నియోజవర్గంలో ఘన విజయం సాధించడంలో శర్మ కృషి దాగిఉందని అమేథీ రాజకీయ వర్గాలు చెబుతాయి. అమేథీ, రాయ్‌బరేలీ నియోజకవర్గాల్లో దశాబ్దాలుగా క్షేత్రస్థాయిలో పార్టీ తరఫున అన్ని పనులు శర్మనే చూసుకునేవారు. అమేథీ, రాయ్‌బరేలీల్లో రాహుల్, సోనియా అందుబాటులో లేనపుడు నియోజకవర్గ సమస్యలపై పార్టీ అగ్రనాయకత్వానికి తెలియ జేయడం వంటి పనులనూ చక్క బెట్టేవారు. రాయ్‌బరేలీ ప్రజలతో ఈయన మంచి పరిచయం ఉంది. గత ఎన్నికల్లో అమేథీలో రాహుల్ ఓడిపోయాక నియోజకవర్గంలో కాంగ్రెస్ వ్యవహారాలను శర్మనే చూసుకున్నారు. కొంతకాలం బిహార్, పంజాబ్ రాష్ట్రాల వ్యవహారాలనూ చూశారు. అమేథీ రాజకీయాల్లో తెరవెనుకే ఉండిపోయిన కిశోరీ లాల్.. రాహుల్ ఓటమితో ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. అయినా తొలి ప్రయత్నంలోనే ఘన విజయం సాధించడం విశేషం. 2019 లోక్‌సభ ఎన్నికల్లో అమేథీలో రాహుల్‌పై స్మృతి ఇరానీ 55,000 ఓట్ల మెజారిటీతో గెలిచారు. అదే ఊపులో బరిలో దిగిన స్మృతి ఇరానీని శర్మ ఈసారి ఇంటిబాట పట్టించారు. నియోజవర్గ సమస్యలపై పోరాటం చేసినందుకు ఫలితంగానే కిశోరీలాల్‌కు విజయకిరీటాన్ని ఓటర్లు కట్టబెట్టారని విశ్లేషకులు చెబుతున్నారు.

కిశోరీ భాయ్.. ముందే చెప్పా: ప్రియాంకా గాంధీ

కిశోరీ లాల్ గెలుపుపై పార్టీ నేత ప్రియాంక గాంధీ స్పందించారు. '' కిశోరీ భాయ్.. మొదట్నుంచీ మీ గెలుపు మీద నాకు ఏమాత్రం సందేహం లేదు. మీరు గెలుస్తారని తొలినుంచీ బలంగా నమ్ముతున్నా. మీకు, నియోజకవర్గ సోదర, సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు' అని 'ఎక్స్'లో హిందీలో ట్వీట్‌చేశారు.

48 ఓట్ల అత్యల్ప మెజారిటీతో గెలుపు!

ముంబై వాయవ్య నియోజకవర్గంలో అనూహ్య ఫలితం

ముంబై: లోక్‌సభ ఎన్నికల్లో రికార్డు స్థాయి మెజారిటీయే కాదు.. అత్యల్ప మెజారిటీ కూడా నమోదైంది. మహారాష్ట్రలోని ముంబై వాయవ్య నియోజకవర్గంలో అనూహ్య ఫలితం వెలువడింది. శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే) వర్సెస్ శివసేన (సీఎం ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని పార్టీ) పోరు హోరాహోరీగా సాగింది. ఈ పోరులో చివరి వరకు విజయం ఇరుపక్షాల మధ్య దోబూచులాడింది. చివరకు కేవలం 48 ఓట్ల అతితక్కువ మెజారిటీతో శివసేన అభ్యర్థి రవీంద్ర దత్తారాం వాయ్‌కర్ తన సమీప ప్రత్యర్థి అమోల్ కీర్తికర్‌పై గెలుపొందారు. వాయ్‌కర్‌కు 4,52,644 ఓట్లు లభించగా అమోల్‌కు 4,52,596 ఓట్లు లభించాయి. రౌండ్ రౌండ్‌కు ఆధిక్యం ఇరు పార్టీల అభ్యర్థుల మధ్య మారుతూ వచ్చింది. ఒక రౌండ్‌లో అయితే అమోల్ కేవలం ఒక ఓటుతో ఆధిక్యంలో కాసేపు కొనసాగారు. ఈ ఎన్నికల్లో కేరళలోని అత్తింగల్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి అదూర్ ప్రకాశ్ కేవలం 684 ఓట్ల తేడాతో తన సమీప ప్రత్యర్థిపై విజయం సాధించారు. రాజస్తాన్‌లోని జైపూర్ రూరల్ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి రావు రాజేంద్ర సింగ్ 1,615 ఓట్ల తేడాతో గెలిచారు. ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ నుంచి బీజేపీ అభ్యర్థి భోజ్‌రాజ్ నాగ్ 1,884 ఓట్ల తేడాతో విజయం కైవసం చేసుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ఫరూఖాబాద్ నుంచి బీజేపీ అభ్యర్థి ముకేశ్ రాజ్‌పుత్ 2,678 ఓట్ల తేడాతో నెగ్గారు.

బెంగాల్‌లో దీదీ మేజిక్

రాష్ట్రంలోని 42 స్థానాలకు 29 చోట్ల టీఎంసీ ఘన విజయం

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతా బెనర్జీ మేజిక్ మరోసారి పనిచేసింది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ రాష్ట్రంలో 42 స్థానాలకుగాను 29 చోట్ల టీఎంసీ అభ్యర్థులు విజయం సాధించారు. పార్టీ నేతలపై అవినీతి ఆరోపణలు, సందేశ్‌ఖాలీసహా రాష్ట్రంలో పలు చోట్ల అంతర్గత సమస్యలు తలెత్తినా అవేమీ దీదీ నేతృత్వంలో టీఎంసీ విజయయాత్రను ఆపలేకపోయాయి. పశ్చిమబెంగాల్‌లో ఎలాగైనా మెజారిటీ స్థానాలు ఒడిసిపట్టాలని బీజేపీ అగ్రనేతలు మోదీ, అమిత్ షా కాళ్లకు బలపం కట్టుకుని మరీ తెగ ప్రచారంచేశారు. ఎగ్జిట్ పోల్స్ సైతం ఈసారి బెంగాల్‌లో కమలవికాసం ఖాయమని అంచనాలు వెలువరిచాయి. ఈసారి మోదీ మేనియా ఉండొచ్చన్న రాజకీయ పండితుల లెక్కలూ తప్పు అని మమత మరోసారి నిరూపించారు. విపక్షాల 'ఇండియా' కూటమిలో కొనసాగబోనంటూ వేరుబడి కూడా సార్వత్రిక ఎన్నికల్లో మమత జయకేతనం ఎగరేయడం విశేషం. ' బెంగాల్‌లో బీజేపీ అంతర్గత కలహాలు, వ్యవస్థాగతంగా బలహీనంగా ఉండటం, బలమైన లెఫ్ట్–కాంగ్రెస్ కూటమి నేపథ్యంలో తృణమూల్ వ్యతిరేక ఓటును బీజేపీ తనవైపునకు తిప్పుకోలేకపోయింది' అని రాజకీయ విశ్లేషకుడు మైదుల్ ఇస్లామ్ చెప్పారు. అందుకే 2019తో పోలిస్తే తృణమూల్ ఓటు షేరు నాలుగు శాతం పెరిగి 47 శాతానికి చేరుకుంది. బీజేపీ 12 చోట్ల విజయం సాధించింది. 2019 ఎన్నికల్లాగే సీపీఐ(ఎం) పార్టీ ఈసారి కూడా బోణీ కొట్టలేక చతికిలపడింది. కాంగ్రెస్ కేవలం ఒక్క స్థానంలో గెలిచింది.

జట్టు కట్టకపోవడంతో పుంజుకుంది

కాంగ్రెస్‌తో సీట్ల సర్దుబాటు ఒప్పందం నుంచి మమత జనవరిలోనే వైదొలగడం టీఎంసీకి బాగా కలిసి వచ్చింది. దీంతో త్రిముఖపోరులో మైనారిటీలు, బీజేపీ వ్యతిరేకులు మరోమార్గంలేక టీఎంసీకే ఓటేశారు. గతంలో బీజేపీ సైతం ఇలాగే టీఎంసీ వ్యతిరేక ఓట్లను ఒడిసిపట్టి 2014లో 17 శాతంగా ఉన్న ఓటు షేరును 2019లో 40 శాతానికి పెంచుకుంది. స్థానిక సమస్యలు, ఎస్ఎస్‌సీ ఉద్యోగాల రద్దు, సీఏఏ అమలు అంశాలు ఈసారి ఎన్నికల్లో నిర్ణయాత్మకంగా మారాయి.

మైనారిటీ ఓటుతో పైపైకి

మైనారిటీల బలం దీదీ పార్టీకి ఎంతో దోహపడింది. సీఏఏ అమలు, రామకృష్ణమిషన్, భారత్ సేవాశ్రమం సంఘలను వ్యతిరేకిస్తూ మమత వ్యాఖ్యలు, 77 ముస్లిం ఉపకులాలకు ఓబీసీ హోదా రద్దుచేస్తూ కలకత్తా హైకోర్టు సంచలన తీర్పుతో మమత మాత్రమే తమను పట్టించుకుంటారని భావించి మైనారిటీలు టీఎంసీ వెంట నడిచి పార్టీ విజయాన్ని సులభం చేశారు. లక్ష్మీర్ భండార్, కన్యశ్రీ పథకాల లబ్ధిపొందిన మహిళలూ మమతకు మద్దతు పలికారు.



మోదీ తక్షణమే రాజీనామా చేయాలి: మమత

లోక్‌సభ ఎన్నికల్లో నైతిక ఓటమిని అంగీకరిస్తూ ప్రధాని మోదీ వెంటనే పదవి నుంచి వైదొలగాలని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ డిమాండ్ చేశారు. ఎన్నికల్లో బీజేపీ 400కుపైగా సీట్లు సాధిస్తుందంటూ ప్రచారం చేసుకున్న మోదీ వాస్తవానికి సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునేందుకు అవసరమైన మెజారిటీని సైతం సాధించుకోవడంలో విఫలమయ్యారని విమర్శించారు. మోదీ విశ్వసనీయత కోల్పోయారు. ఇండియా గెలిచింది. మోదీ ఓడిపోయారు. ఎన్నో రాజకీయ పార్టీలను ఆయన ముక్కలుచెక్కలుగా చేశారు. ప్రజలే ఆయన్ను నైతికంగా దెబ్బకొట్టారు. ప్రభుత్వం ఏర్పాటు చేసుకునేందుకు మోదీ టీడీపీ, నితీశ్ కుమార్‌ల వద్ద కాళ్లబేరానికి వచ్చారు'అని మండిపడ్డారు.

నవీన్ చరిష్మాకు తెర!

- ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం
- 147 స్థానాలకుగాను 78 స్థానాల్లో గెలుపు



ఒడిశా అసెంబ్లీలో పార్టీల బలాబలాలు

బీజేపీ	78
బీజేడీ	51
కాంగ్రెస్	14
సీపీఐ(ఎం)	1
స్వతంత్రులు	3
మొత్తం	147

సాక్షి, న్యూఢిల్లీ: ఒడిశా ముఖ్యమంత్రిగా నవీన్ పట్నాయక్ 24 ఏళ్ల పాలనకు తెర పడింది. ఆయన సారథ్యంలోని బిజూ జనతా దళ్(బీజేడీ) పార్టీ అధికారం కోల్పోయింది. మొత్తం 147 అసెంబ్లీ స్థానాలకుగాను 78 స్థానాల్లో బీజేపీ విజయం సాధించింది. ఒడిశా అస్మిత (ఆత్మగౌరవం) నినాదానికి తోడు బీజేపీ అగ్రనేతలు మోదీ, అమిత్ షాల ప్రచారం బీజేపీని విజయతీరాలకు చేర్చింది. గత ఎన్నికల్లో బీజేపీ కేవలం 23 చోట్ల గెలిచింది. సీఎం అభ్యర్థిని ప్రకటించకుండానే ఎన్నికల బరిలోకి దిగిన కమలం పార్టీ తొలిసారి అధికారపీఠాన్ని కైవసం చేసుకుంది. 2019 ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో 113 చోట్ల గెలిచిన బీజేడీ ఈసారి 51 చోట్ల, కాంగ్రెస్ 14 చోట్ల, సీపీఐఎం ఒకచోట గెలిచాయి.

సుదీర్ఘ సీఎం రికార్డ్ మిస్

2000 సంవత్సరం నుంచి నవీన్ పట్నాయక్ ఒడిశా ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. ఈ ఎన్నికల్లో కూడా పట్నాయక్ పార్టీ గెలిచి సీఎం పదవి చేపడితే దేశంలో అత్యధిక కాలం సీఎంగా ఉన్న వ్యక్తిగా రికార్డు సొంతం చేసుకునేవారు. అయితే బీజేడీ విజయయాత్రకు బీజేపీ బ్రేకులు వేసింది. హింజిలి నియోజకవర్గంలో కేవలం 4,636 ఓట్ల తేడాతో నవీన్ ఎలాగోలా గెలిచారు.

పనిచేసిన ఒడిశా అస్మిత నినాదం

ఈ ఎన్నికల్లో సమస్యల కంటే బీజేపీ 'ఒడిశా అస్మిత' ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లింది. నవీన్ పట్నాయక్ అనారోగ్య కారణాలను ఆసరాగా చేసుకుని తమిళనాడుకు చెందిన మాజీ ఐఏఎస్ అధికారి కార్తికేయ పాండియన్ బీజేడీ పార్టీపై ఆధిపత్యాన్ని చలాయించారు. ఈ అంశాన్ని బీజేపీ విజయవంతంగా ప్రచార అస్త్రంగా మలిచింది. ఒడిశా భవిష్యత్తును స్థానికేతరుల చేతిలో పెట్టి ప్రజల ఆత్మగౌరవాన్ని బీజేడీ తాకట్టు పెట్టిందని పాండ్యన్ లక్ష్యంగా అస్మిత నినాదాన్ని బీజేపీ బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లింది. వ్యక్తిగతంగా పట్నాయక్ అవినీతి మరకలు లేని నేత. కానీ బీజేడీ సర్కార్‌లో మంత్రులఅవినీతినే ప్రధాన ప్రచారాస్త్రాలుగా మలచి బీజేపీ విజయబావుటా ఎగరేసింది.

మోదీ మెజార్టీకి కోత

లక్నో: ప్రధాని నరేంద్ర మోదీ ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి నుంచి వరుసగా మూడోసారి గెలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి అజయ్ రాయ్‌పై విజయం సాధించారు. కానీ, ఈసారి మోదీ మెజార్టీ భారీగా తగ్గిపోవడం గమనార్హం. 2014లో ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌పై మోదీ 3,71,784 ఓట్ల మెజార్టీతో నెగ్గారు. 2019లో సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి శాలినీ యాదవ్‌పై ఏకంగా 4,79,505 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ ఎన్నికల్లో మోదీ మెజార్టీ 1,52,513కి పడిపోయింది.

బోల్తా కొట్టిన 'ఆమ్ ఆద్మీ'

కేవలం 3 స్థానాల్లో విజయం

న్యూఢిల్లీ: అధినేత అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుతో ఇప్పటికే కష్టాల్లో కూరుకుపోయిన ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)కి లోక్‌సభ ఎన్నికల్లో నిరాశా నిస్పృహలే మిగిలాయి. మొత్తం 22 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేసిన ఆ పార్టీ కేవలం 3 స్థానాల్లో నెగ్గింది. పంజాబ్‌లో 13, ఢిల్లీలో 4, గుజరాత్‌లో 2, అస్సాంలో 2, హరియాణాలో ఒక స్థానంలో ఆప్ పోటీకి దిగింది. కేవలం పంజాబ్‌లో మాత్రమే 3 సీట్లు దక్కించుకుంది. మిగతా చోట్ల పరాజయం పాలైంది. అధికారంలో ఉన్న ఢిల్లీపై పెట్టుకున్న ఆశలు నెరవేరలేదు. పోటీ చేసిన నాలుగు సీట్లలోనూ చేదు అనుభవమే ఎదురయ్యింది. ఢిల్లీ, గుజరాత్, హరియాణాలో కాంగ్రెస్‌తో పెట్టుకున్న పొత్తు సత్ఫలితం ఇవ్వలేదు.

'మాయ'మేనా?

ఉత్తరప్రదేశ్‌లో బీఎస్పీ గుండుసున్నా

లక్నో: కుమారి మాయావతి.. జాతీయ పార్టీ అయిన బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) అధినేత. దేశ రాజకీయాల్లో సీనియర్ నాయకురాలు. ఒక దశలో ప్రధానమంత్రి పదవికి సైతం పోటీ పడిన నేత. పెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌కు పలుమార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన మాయావతికి తాజా ఎన్నికల్లో చేదు అనుభవమే మిగిలింది. యూపీలో 80 సీట్లలో ఒంటరిగా పోటీకి దిగిన మాయావతి పార్టీ ఒక్కటంటే ఒక్క సీటు కూడా దక్కించుకోలేకపోయింది. గత ఎన్నికల్లో 10 స్థానాలు గెలిచి పరువు కాపాడుకున్న బీఎస్పీకి ఈ ఎన్నికల్లో గుండుసున్నా మిగిలింది. దేశంలో దళితులు, నిమ్నవర్గాల సాధికారతకు ప్రతినిధిగా భావించే మాయావతి ఇక రాజకీయ రంగం నుంచి కనుమరుగయ్యే అవకాశం లేకపోలేదని రాజకీయ పరిశీలకులు అంచనా.

25 ఏళ్లకే ఎంపీలుగా

రికార్డుకెక్కిన పుష్పేంద్ర, ప్రియా

న్యూఢిల్లీ: ఈ సార్వత్రిక ఎన్నికల్లో నెగ్గిన అత్యంత పిన్నవయస్కులు, అత్యంత వృద్ధుడు ఎవరో తెలుసా? ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థులుగా కౌశంబీ లోక్‌సభ స్థానం నుంచి బరిలోకి దిగిన పుష్పేంద్ర సరోజ్, మఛిలీషహర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీచేసిన ప్రియా సరోజ్ విజయం సాధించారు. వారిద్దరి వయసు 25 ఏళ్లే కావడం విశేషం. వీరిద్దరే ఈసారి అత్యంత పిన్నవయస్కులైన ఎంపీలుగా రికార్డు సృష్టించారు. తమిళనాడులోని శ్రీపెరుంబుదూర్ స్థానం నుంచి డీఎంకే అభ్యర్థిగా పోటీ చేసిన సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి టి.ఆర్.బాలు సులువుగా నెగ్గారు. 82 ఏళ్ల టి.ఆర్.బాలు ఈ ఎన్నికల్లో అత్యంత వృద్ధుడైన ఎంపీగా రికార్డుకెక్కారు.

11.75 లక్షల ఓట్ల తేడాతో నెగ్గిన శంకర్ లాల్వానీ

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ లోక్‌సభ సీటును బీజేపీకి చెందిన సిట్టింగ్ ఎంపీ శంకర్ లాల్వానీ 11,75,092 ఓట్ల భారీ తేడాతో గెలుచుకున్నారు. దేశ ఎన్నికల చరిత్రలోనే ఇంతటి భారీ విజయం ఇక్కడ తొలిసారిగా నమోదైందని లాల్వానీ చెప్పుకున్నారు. అదే విధంగా, నోటాకు సైతం రికార్డు స్థాయిలో 2.18 లక్షల ఓట్లు పడ్డాయి. మొత్తం ఓట్లలో ఇవి 14.01శాతంగా ఉన్నాయి. ఇండోర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తమ నేత అక్షయ్ కాంతి బామ్‌కు టికెట్టిచ్చింది. అయితే, ఆయన నామినేషన్ల ఉపసంహరణకు చివరి రోజున పోటీ నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించి పార్టీకి షాకిచ్చారు. అనంతరం అక్షయ్ కాంతి బామ్ బీజేపీ కండువా కప్పుకున్నారు. దీంతో, కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థుల్లేకుండా పోయారు. తమ అభ్యర్థికి బదులుగా నోటాకు ఓటేయాల్సిందిగా కాంగ్రెస్ ప్రచారం చేసుకుంది. దీంతో రికార్డు స్థాయిలో నోటాకు రూ.2.18 లక్షల ఓట్లు పోలయ్యాయి.

వీరేంద్ర కుమార్ 8.. పంకజ్ చౌదరి 7..!

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్‌కు చెందిన దళిత నేత, కేంద్ర మంత్రి వీరేంద్ర కుమార్ టికంగఢ్ నియోజకవర్గం నుంచి మరోసారి గెలుపొందారు. లోక్‌సభ ఎన్నికల్లో ఇది ఆయనకు ఎనిమిదో విజయం. అలాగే, యూపీలోని మహారాజ్‌గంజ్ నుంచి ఓబీసీ నేత, కేంద్ర సహాయ మంత్రి పంకజ్ చౌదరి ఏడోసారి గెలుపొందారు. వీరిద్దరితోపాటు పలువురు నేతలు దశాబ్దాలుగా రాజకీయాల్లో కొనసాగుతూ లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటుతున్నారు. బీజేపీ నేతలు ఇందర్‌జిత్ సింగ్, శివరాజ్ చౌహాన్, టీఎంసీ నేత సుదీప్ బంధోపాధ్యాయ్ తాజా విజయంతో కలుపుకుంటే లోక్‌సభ ఎన్నికల్లో ఆరోసారి విజయ ఢంకా మోగించినట్లయింది.



రాయ్‌బరేలీ, వయనాడ్‌లలో రాహుల్ గాంధీ గెలుపు అనంతరం విజయ సంకేతం చూపుతున్న సోనియా గాంధీ, పార్టీ చీఫ్ ఖర్గే, ప్రియాంక, రాహుల్

పాత మిత్రులపై కూటమిలో చర్చ

బుధవారం ఈ విషయం తేలుస్తాం | రాహుల్ గాంధీ స్పష్టీకరణ

సాక్షి, న్యూఢిల్లీ: పాత మిత్రపక్షాలతో జట్టుకట్టే అంశంపై విపక్షాల 'ఇండియా' కూటమి నేతలతో చర్చించాకే నిర్ణయం తీసుకుంటామని కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది. మిత్రపక్షాలతో చర్చించకుండా జేడీ(యూ), తెలుగుదేశం పార్టీ వంటి పాత మిత్రులను చేర్చుకునే అంశంపై సొంత నిర్ణయం తీసుకోబోమని తేల్చిచెప్పింది. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, సోనియా గాంధీలు మంగళవారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. సాయంత్ర ఆరు గంటలకు ఢిల్లీలోని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే నివాసంలో 'ఇండియా' కూటమి భేటీకానుందని విశ్వసనీయ వర్గాల సమాచారం. సోనియా, రాహుల్, శరద్ పవార్, మమతా బెనర్జీ, ఎంకే స్టాలిన్, చంపయి సోరెన్, ఉద్ధవ్ ఠాక్రే, అఖిలేశ్ యాదవ్, సీతారాం ఏచూరి, డి.రాజా ఈ భేటీలో పాల్గొననున్నారు.

నేడు ఇండియా కూటమి సమావేశం: రాహుల్

'' విపక్షాల 'ఇండియా' కూటమి సమావేశం బుధవారం నిర్వహిస్తాం. మా కూటమి నేతల అభిప్రాయం అడగకుండా మేం ఎలాంటి నిర్ణయాలు ప్రకటించలేం. కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటే లక్ష్యంగా వ్యూహరచన, తీసుకోవాల్సిన నిర్ణయాలపై బుధవారం మా కూటమి పక్షాలు ప్రధానంగా చర్చిస్తాయి. దేశ రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు ప్రజలంతా కలిసి నడుస్తారని ముందే అనుకున్నా. రాజ్యాంగాన్ని కాపాడేందుకు పడిన తొలి అడుగు ఇది. ఈసారి ఎన్నికల్లో పేదలతోపాటు అణగారిన వర్గాలు మాకు అండగా నిలబడ్డాయి. పేదల అభ్యున్నతికి పాటుపడే కొత్త మార్గదర్శకత్వాన్ని కాంగ్రెస్, 'ఇండియా' కూటమి అందించనున్నాయి. ఈ ఎన్నికలు, దేశం ఒక్కటే విషయాన్ని చెప్పదల్చుకున్నాయి. మోదీ, అమిత్‌షా పాలనలో దేశం మగ్గిపోవాల్సిన పనిలేదని చాటాయి. కూటమి పార్టీలన్నీ ఐక్యమత్యంతో పోరాడాయి. కాంగ్రెస్‌కు మద్దతు పలికిన ఉత్తరప్రదేశ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు. నేను వయనాడ్, రాయ్‌బరేలీ రెండు స్థానాల్లో గెలిచినా ఏ స్థానాన్ని వదులుకోవాలో ప్రజలతో మాట్లాడి నిర్ణయిస్తా. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తాం' అని రాహుల్ అన్నారు.

మోదీ వ్యతిరేక ప్రజాతీర్పు ఇది: ఖర్గే

ప్రధాని మోదీకి వ్యతిరేకంగా ప్రజాతీర్పు ఇది అని ఫలితాలపై కాంగ్రెస్ చీఫ్ ఖర్గే వ్యాఖ్యానించారు. '' ఒకే వ్యక్తి పేరుతో బీజేపీ ఓట్లు అడిగింది. ఇది మోదీ రాజకీయ, నైతిక పరాజయం. కాంగ్రెస్ మేనిఫెస్టోపై మోదీ అసత్య ప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలకు ప్రజల మద్దతు లభించింది. మోదీకి మరో అవకాశం ఇస్తే ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతుందని ప్రజలు గ్రహించారు. పార్టీని గెలిపించిన కార్యకర్తలకు ధన్యవాదాలు. విజయం కోసం ఐక్యంగా పనిచేసిన ఇండియా కూటమి నేతలకు ధన్యవాదాలు'' అని ఖర్గే అన్నారు.

పడిలేచిన కాంగ్రెస్!

బీజేపీ దూకుడుకు అడ్డుకట్ట | 53 నుంచి ఏకంగా 99కి పెరిగిన సీట్లు

కేంద్రంలో ముచ్చటగా మూడోసారి సొంతంగానే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్న బీజేపీ కలలను కాంగ్రెస్ చిత్తు చేసింది. 'అబ్ కీ బార్ చార్ సౌ పార్' నినాదంతో బరిలో దిగిన బీజేపీని అటు సొంత బలంతో, ఇటు కూటమి పక్షాల సహకారంతో తుత్తునియలు చేసింది. అధికారం చేపట్టేందుకు కాంగ్రెస్ ఆమడదూరంలో ఆగినా పడిలేచిన కెరటంలా సత్తా చాటింది. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందంటూ చేసిన ప్రచారం ఓ వైపు.. ప్రాంతీయ పార్టీల ఓట్లు చీలకుండా తీసుకున్న జాగ్రత్తలు ఇంకోవైపు.. పార్టీ గుప్పించిన హామీలు మరోవైపు... కలిపి బీజేపీని కలవరపాటుకు గురిచేయడంలో విజయవంతమయ్యాయి...

- లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా 328 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్ 99 సీట్లు సాధించింది. 2019 నాటి కంటే 47 సీట్లు అధికంగా గెలుచుకుంది.
- కూటమి పక్షాల భాగస్వామ్యంతో ఈసారి అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ గట్టిగా కృషి చేసింది. విపక్షాల మధ్య ఓట్ల చీలికను నివారించేందుకు తాను పోటీ చేసే స్థానాల సంఖ్యను తగ్గించుకుంది.
- రాజస్తాన్, కర్ణాటక, హరియాణా, పంజాబ్‌ల్లో కాంగ్రెస్ మెరుగైన ఫలితాలు సాధించింది.
- రాజస్తాన్‌లో బీజేపీపై రైతుల్లో ఆగ్రహాన్ని, రాజ్‌పుత్‌ల్లో ఉన్న వ్యతిరేకతను కాంగ్రెస్ సొమ్ము చేసుకుంది. 2019లో 25 స్థానాలనూ బీజేపీ క్లీన్‌స్వీప్ చేయగా ఈసారి కాంగ్రెస్ 8 గెలిచింది. హరియాణాలోనూ గత ఎన్నికల్లో బీజేపీ 10కి 10 గెలవగా ఈసారి కాంగ్రెస్ 5 గెలిచింది.
- 80 స్థానాలున్న కీలకమైన యూపీలో ఓట్ల చీలికకు ఆస్కారమివ్వకుండా సమాజ్‌వాదీ పార్టీకి 63 సీట్లిచ్చింది. ఇది ముస్లిం ఓట్లను ఏకీకృతం చేయడంతోపాటు ఓట్ల చీలికను నివారించింది. ఫలితంగా ఎస్పీ ఏకంగా 37 సీట్లు సాధించి బీజేపీని తేరుకోలేని దెబ్బ కొట్టింది.
- తమిళనాడులో డీఎంకే, మహారాష్ట్రలో శివసేన(ఉద్ధవ్), ఎన్సీపీ (శరద్‌పవార్), కేరళ, బిహార్, యూపీ, జార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో సీపీఐ(ఎం), ఐయూఎంఎల్, సమాజ్‌వాదీ, ఆర్జేడీ, జేఎంఎం, కేరళ కాంగ్రెస్, ఆర్‌సీపీలతో ముందస్తు పొత్తులు కూడా కాంగ్రెస్‌కు లాభించాయి.
- బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దవుతాయంటూ కాంగ్రెస్ సహా విపక్షాలన్నీ ప్రచారం చేసిన ప్రచారం బాగానే ఫలించింది. ఆ ఉద్దేశమే లేదని మోదీ, బీజేపీ ఎంత చెప్పినా దేశంలో 80 శాతానికి పైగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల్లో అనుమానాలు తొలగలేదు.
- ఎన్డీఏకు 400 కన్నా ఎక్కువ సీట్లొస్తే రాజ్యాంగాన్ని, పలు చట్టాలను మార్చేస్తారన్న కాంగ్రెస్ ప్రచారమూ ఓటర్లను ప్రభావితం చేసింది.
- ఎన్నికల ముంగిట జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్టు కక్ష సాధింపేనంటూ ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కాంగ్రెస్ విపక్షాలు సఫలీకృతమయ్యాయి.
- బీజేపీ ఓటమే లక్ష్యంగా సీట్ల పంపకంలో పట్టువిడుపులతో వ్యవహరించిన కాంగ్రెస్, ప్రచారం, సమన్వయం, వ్యూహ రచనలో మాత్రం ఎక్కడా తగ్గలేదు.
- రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. నేతల మధ్య విభేదాలను పక్కన పెట్టేలా చేసింది. మిత్రులెవరో, శత్రువులెవరో తేలిపోయింది.
- రైతులు, మహిళలు, యువత, బలహీన వర్గాలే లక్ష్యంగా కాంగ్రెస్ విడుదల చేసిన మేనిఫెస్టో ఆకట్టుకుంది. పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడమే తమ తొలి ప్రాధాన్యమని ప్రకటించింది. రైతులకు వడ్డీలేని రుణాలు, ప్రస్తుతం కేంద్రం అందిస్తున్న సాయం పెంపు వంటి అంశాలను మేనిఫెస్టోలో చేర్చింది.
- యువత కోసం 30 లక్షల ఉద్యోగాల భర్తీ, 25 ఏళ్ల కంటే తక్కువ వయసున్న ప్రతి డిప్లొమా లేక డిగ్రీ హోల్డర్‌కు అప్రెంటీస్‌షిప్ శిక్షణ కోసం రూ.లక్ష సాయం, 30 ఏళ్లలోపు యువకుల స్టార్టప్‌లకు నిధులు సమకూర్చడానికి రూ.5,000 కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటు, పేపర్ లీకేజీల నివారణకు ప్రత్యేక చట్టం వంటి హామీలు ఇచ్చింది.
- నిరుపేద కుటుంబంలోని ఒక మహిళకు ఏటా రూ.లక్ష సాయం, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ వంటి అంశాలు కాంగ్రెస్‌కు సీట్ల సంఖ్యను పెంచుకొనేందుకు దోహదం చేశాయి.
- కాంగ్రెస్ అగ్ర నేత సోనియాగాంధీ అనారోగ్యంతో ఇంటికే పరిమితమైనా విపక్షాలను ఒక్కతాటిపైకి తేవడంలో, ఇండియా కూటమి ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు.

– సాక్షి, న్యూఢిల్లీ

నేటి భేటీలో ప్రధాని అభ్యర్థి ఖరారు: ఉద్ధవ్ ఠాక్రే

ముంబై: ప్రతిపక్ష ఇండియా కూటమి కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తుందని శివసేన (యూబీటీ)చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే చెప్పారు. బుధవారం ఢిల్లీలో సమావేశమై, ప్రధానమంత్రి అభ్యర్థి ఎవరనేది నిర్ణయిస్తామని ఠాక్రే అన్నారు. ప్రస్తుత ఎన్ని కల ఫలితాల సరళిని బట్టి చూస్తే ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన సాధారణ మెజారిటీ 272 మార్కును బీజేపీ పొందే అవకాశాలు కనిపించడం లేదన్నారు. బిహార్ సీఎం నితీశ్ కుమార్, టీడీపీ చీఫ్ చంద్రబాబుతో కూటమిలోని కాంగ్రెస్, ఇతర పక్షాలు టచ్‌లో ఉన్నాయని వివరించారు. వీరిని కూటమిలో చేర్చుకునేందుకు గల అవకాశాలను చర్చిస్తున్నామని చెప్పారు. గతంలో, బీజేపీ కారణంగా ఇబ్బందులు పడిన వీరిద్దరే ఇప్పుడు కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటులో కీలకంగా మారారని ఠాక్రే వివరించారు.

గెలిచిన, ఓడిన ప్రముఖులు

పేరు	నియోజకవర్గం	రాష్ట్రం	పార్టీ	ఫలితం
నరేంద్ర మోదీ	వారణాసి	ఉత్తర్‌ప్రదేశ్	బీజేపీ	విజయం
అమిత్ షా	గాంధీనగర్	గుజరాత్	బీజేపీ	విజయం
రాహుల్‌గాంధీ	రాయ్‌బరేలీ	ఉత్తర్‌ప్రదేశ్	కాంగ్రెస్	విజయం
రాహుల్‌గాంధీ	వయనాడ్	కేరళ	కాంగ్రెస్	విజయం
ఓంబిర్లా	కోటా	రాజస్తాన్	బీజేపీ	విజయం
అఖిలేశ్ యాదవ్	కన్నౌజ్	ఉత్తర్‌ప్రదేశ్	ఎస్పీ	విజయం
డింపుల్ యాదవ్	మొయిన్‌పురీ	ఉత్తర్‌ప్రదేశ్	ఎస్పీ	విజయం
కిరెణ్ రిజిజు	అరుణాచల్ పశ్చిమ	అరుణాచల్ ప్రదేశ్	బీజేపీ	విజయం
హెచ్‌డీ కుమారస్వామి	మాండ్యా	కర్ణాటక	జేడీఎస్	విజయం
కేసీ వేణుగోపాల్	అలప్పుజ	కేరళ	కాంగ్రెస్	విజయం
మనీశ్ తివారీ	చండీగఢ్	చండీగఢ్	కాంగ్రెస్	విజయం
పీయూష్ గోయల్	ముంబై ఉత్తర	మహారాష్ట్ర	బీజేపీ	విజయం
శివరాజ్‌సింగ్ చౌహాన్	విదిశ	మధ్యప్రదేశ్	బీజేపీ	విజయం
నితిన్ గడ్కరీ	నాగ్‌పూర్	మహారాష్ట్ర	బీజేపీ	విజయం
చిరాగ్ పాశ్వాన్	హాజీపూర్	బిహార్	ఎల్జేపీ	విజయం
జ్యోతిరాదిత్య సింధియా	గుణ	మధ్యప్రదేశ్	బీజేపీ	విజయం
గజేంద్ర సింగ్ షెకావత్	జోధ్‌పూర్	రాజస్థాన్	బీజేపీ	విజయం
కళ్యాణ్ బెనర్జీ	శ్రీరాంపూర్	పశ్చిమబెంగాల్	టీఎంసీ	విజయం
మీసా భారతి	పాటలీపుత్ర	బిహార్	ఆర్జేడీ	విజయం
జితిన్ ప్రసాద	ఫిలిబిత్	ఉత్తర్‌ప్రదేశ్	బీజేపీ	విజయం
శశిథరూర్	తిరువనంతపురం	కేరళ	కాంగ్రెస్	విజయం
సుప్రియా సూలే	బారామతి	మహారాష్ట్ర	ఎన్సీపీ(ఎస్పీ)	విజయం
కంగనా రనౌత్	మండి	హిమాచల్	బీజేపీ	విజయం
చరణ్‌జీత్ సింగ్ ఛన్నీ	జలంధర్	పంజాబ్	కాంగ్రెస్	విజయం
శత్రుఘ్నసిన్హా	అసన్‌సోల్	పశ్చిమ బెంగాల్	టీఎంసీ	విజయం
కనిమొళి	తూత్తుకుడి	తమిళనాడు	డీఎంకే	విజయం
మాణిక్కం ఠాగూర్	విరుదునగర్	తమిళనాడు	కాంగ్రెస్	విజయం
కార్తీ చిదంబరం	శివగంగ	తమిళనాడు	కాంగ్రెస్	విజయం
మహువా మొయిత్రా	కృష్ణానగర్	పశ్చిమబెంగాల్	టీఎంసీ	విజయం
రాజీవ్ ప్రతాప్ రూఢీ	సరన్	బిహార్	బీజేపీ	విజయం
మనోహర్‌లాల్ ఖట్టర్	కర్నాల్	హరియాణా	బీజేపీ	విజయం
హర్‌సిమ్రత్ కౌర్ బాదల్	భటిండా	పంజాబ్	శిరోమణి అకాలీదళ్	విజయం
అభిషేక్ బెనర్జీ	డైమండ్ హార్బర్	పశ్చిమ బెంగాల్	టీఎంసీ	విజయం
భూపేంద్ర యాదవ్	అల్వార్	రాజస్థాన్	బీజేపీ	విజయం
హేమమాలిని	మథుర	ఉత్తర్‌ప్రదేశ్	బీజేపీ	విజయం
ధర్మేంద్ర ప్రధాన్	సంభల్‌పూర్	ఒడిశా	బీజేపీ	విజయం
ఎ.రాజా	నీలగిరి	తమిళనాడు	డీఎంకే	విజయం
అరుణ్ గోవిల్	మీరట్	ఉత్తర్‌ప్రదేశ్	బీజేపీ	విజయం
బస్వరాజ్ బొమ్మై	హావేరి	కర్ణాటక	బీజేపీ	విజయం
తేజస్వీ సూర్య	బెంగళూరు సౌత్	కర్ణాటక	బీజేపీ	విజయం
నవీన్ జిందాల్	కురుక్షేత్ర	హరియాణా	బీజేపీ	విజయం
అనురాగ్‌ఠాకూర్	హమీర్‌పూర్	హిమాచల్ ప్రదేశ్	బీజేపీ	విజయం
ప్రహ్లాద్ జోషి	ధార్వాడ్	కర్ణాటక	బీజేపీ	విజయం
అనుప్రియా పటేల్	మీర్జాపూర్	ఉత్తర్‌ప్రదేశ్	అప్నాదళ్(ఎస్)	విజయం
యూసఫ్ పఠాన్	బహరంపూర్	పశ్చిమ బెంగాల్	టీఎంసీ	విజయం
కీర్తి ఆజాద్	బుర్ద్వాన్‌దుర్గాపూర్	పశ్చిమ బెంగాల్	టీఎంసీ	విజయం
రచనా బెనర్జీ	హుగ్లీ	పశ్చిమబెంగాల్	టీఎంసీ	విజయం
సురేష్ గోపి	త్రిసూర్	కేరళ	బీజేపీ	విజయం
అమృత్‌పాల్ సింగ్	ఖదూర్ సాహిబ్	పంజాబ్	ఇండిపెండెంట్	విజయం
శ్రీకాంత్ షిండే	కళ్యాణ్	మహారాష్ట్ర	శివసేన	విజయం
మేనకాగాంధీ	సుల్తాన్‌పూర్	ఉత్తర్‌ప్రదేశ్	బీజేపీ	ఓటమి
నవనీత్ రాణా	అమరావతి	మహారాష్ట్ర	బీజేపీ	ఓటమి
కె.అన్నామలై	కోయంబత్తూర్	తమిళనాడు	బీజేపీ	ఓటమి
దిగ్విజయ్ సింగ్	రాజ్‌గఢ్	మధ్యప్రదేశ్	కాంగ్రెస్	ఓటమి
తమిళిసై సౌందర్‌రాజన్	చెన్నై సౌత్	తమిళనాడు	బీజేపీ	ఓటమి
రోహిణి ఆచార్య	సరన్	బిహార్	ఆర్జేడీ	ఓటమి
స్మృతి ఇరానీ	అమేథీ	ఉత్తర్‌ప్రదేశ్	బీజేపీ	ఓటమి
రాధిక శరత్‌కుమార్	విరుదునగర్	తమిళనాడు	బీజేపీ	ఓటమి
హన్స్‌రాజ్ హన్స్	ఫరీద్‌కోట్	పంజాబ్	బీజేపీ	ఓటమి
ఒమర్ అబ్దుల్లా	బారాముల్లా	జమ్మూకశ్మీర్	ఎన్సీ	ఓటమి
వి.మురళీధరన్	అత్తింగల్	కేరళ	బీజేపీ	ఓటమి
మెహబూబా ముఫ్తీ	అనంత్‌నాగ్	జమ్మూకశ్మీర్	పీడీపీ	ఓటమి
వైభవ్ గెహ్లోట్	జాలోర్	రాజస్థాన్	కాంగ్రెస్	ఓటమి
భూపేశ్ బఘేల్	రాజ్‌నంద్‌గావ్	ఛత్తీస్‌గఢ్	కాంగ్రెస్	ఓటమి

రెండు చోట్లా రాహుల్ గెలుపు

రాయ్‌బరేలీ/తిరువనంతపురం: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ట్విన్ విన్స్ సాధించారు. తాను పోటీ చేసిన యూపీలోని రాయ్‌బరేలీ స్థానంతోపాటు కేరళలోని వయనాడ్ నియోజకవర్గం నుంచి భారీ మెజారిటీలతో గెలుపొందారు. ఇప్పటివరకు తన తల్లి, కాంగ్రెస్ మాజీ చీఫ్ సోనియా గాంధీ ప్రాతినిధ్యం వహించిన రాయ్‌బరేలీ నుంచి తొలిసారి బరిలో దిగిన రాహుల్ ఏకంగా 3,90,030 ఓట్ల మెజారిటీతో విజయదుందుభి మోగించారు. తద్వారా తన తల్లి 2019లో సాధించిన మెజారిటీని అధిగమించారు. రాహుల్‌కు మొత్తం 6,87,649 ఓట్లు లభించగా ఆయనపై పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి దినేశ్ ప్రతాప్‌సింగ్ 2,97,619 ఓట్లు మాత్రమే వచ్చాయి. 2019 ఎన్నికల్లో ఇదే అభ్యర్థిపై సోనియా 1,67,178 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. 2004 నుంచి రాయ్‌బరేలీ స్థానం నుంచి పోటీ చేస్తూ వచ్చిన సోనియా ఇటీవల రాజ్యసభకు ఎన్నిక కావడంతో ఈ స్థానాన్ని వదులుకున్నారు.

వయనాడ్‌లో తగ్గిన మెజారిటీ..

మరోవైపు వయనాడ్ స్థానం నుంచి సిట్టింగ్ ఎంపీగా కూడా బరిలోకి దిగిన రాహుల్ గాంధీ 3,64,422 ఓట్ల తేడాతో తన సమీప ప్రత్యర్థి, సీపీఐ అభ్యర్థి ఆన్నీ రాజాపై గెలుపొందారు. ఇక్కడ రాహుల్ 6,47,445 ఓట్లు సాధించగా సీపీఐ అభ్యర్థి 2,83,023 ఓట్లకే పరిమితం అయ్యారు. అయితే 2019 లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే వయనాడ్‌లో ఈసారి రాహుల్ మెజారిటీ తగ్గడం గమనార్హం. 2019లో 7,06,367 ఓట్లు పొందిన రాహుల్ తన ప్రత్యర్థి అయిన సీపీఐ అభ్యర్థి పీపీ సునీర్‌పై 4,31,770 ఓట్ల తేడాతో గెలిచారు.

ఏ స్థానం వదులుకోవాలో నిర్ణయించుకోలేదు: రాహుల్

లోక్‌సభ ఎన్నికల్లో రెండు చోట్లా విజయం సాధించిన నేపథ్యంలో రాహుల్ గాంధీ స్పందించారు. మంగళవారం రాత్రి ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ తనను గెలిపించినందుకు రాయ్‌బరేలీ, వయనాడ్ నియోజకవర్గాల ప్రజలకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. అయితే ఏ స్థానాన్ని అట్టిపెట్టుకోవాలో.. ఏ స్థానానికి రాజీనామా చేయాలో ఇంకా నిర్ణయించుకోలేదన్నారు.

చీలిక రాజకీయాలకు చుక్కెదురు

మహారాష్ట్రలో దెబ్బతిన్న ఎన్సీపీ

- అజిత్ పవార్ పార్టీ గెలిచింది ఒక్కటే
- శరద్‌పవార్‌దే పైచేయి
- ఉద్ధవ్ సేనకే ఎక్కువ సీట్లు
- ఉనికిని కాపాడుకున్న షిండే సేన
- సగం స్థానాల్లోనూ గెలవలేకపోయిన బీజేపీ

ముంబై: మహారాష్ట్రలో చీలిక రాజకీయాలపై ప్రజలు భిన్నమైన తీర్పు ఇచ్చారు. బీజేపీ అనుసరించిన 'విభజించు పాలించు' ప్రయోగం వికటించింది. పార్టీ జెండా, గుర్తులను కొల్లగొట్టొచ్చేమో కానీ, ప్రజల హృదయాలను గెలవడం అంత సులువు కాదని తేలిపోయింది. 2019 ఎన్నికల్లో సొంతంగా 23 చోట్ల గెలిచిన బీజేపీ ఈ విడత అందులో సగం స్థానాలను కూడా కాపాడుకోలేకపోయింది. రాష్ట్రంలోని మొత్తం 48 స్థానాలుంటే, నాడు శివసేన (విభజించక ముందు)తో కూడిన ఎన్డీఏ 41 చోట్ల విజయదుందుభి మోగించింది. 23 స్థానాల్లో బీజేపీ, 18 చోట్ల శివసేన గెలిచాయి. అనంతర పరిణామాల్లో.. శివసేన పార్టీ రెండుగా చీలడం తెలిసిందే. అసలైన శివసేనగా గుర్తింపు పొందిన ఏక్‌నాథ్ షిండే ఆధ్వర్యంలోని పార్టీ 15 చోట్ల పోటీ చేయగా, దక్కింది ఏడు స్థానాలు. అదే సమయంలో ఉద్ధవ్ ఠాకరే ఆధ్వర్యంలోని శివసేన (యూబీటీ) ఇంతకంటే మెరుగ్గా 9 స్థానాలను (21చోట్ల పోటీ చేసి) సొంతం చేసుకుంది. అంటే రెండు శివసేనలు కలసి గత ఎన్నికల కంటే మొత్తం మీద రెండు స్థానాలను నష్టపోయినట్టయింది. మరోవైపు శరద్‌పవార్ ఆధ్వర్యంలోని ఎన్సీపీ కూడా రెండుగా చీలిపోయింది. శరద్ పవార్ అన్న కుమారుడు అజిత్ పవార్ అసలైన ఎన్సీపీనే సొంతం చేసుకోవడం విదితమే. కానీ, తొలి ఎన్నికల్లోనే పూర్తిగా చతికిలపడ్డారు. తన భార్య సునేత్ర పవార్‌ను కూడా గెలిపించుకోలేకపోయారు. బారామతి స్థానంలో శరద్ పవార్ కుమార్తె సుప్రియాసూలేపై సునేత్రను నిలబెట్టి సవాల్ విసిరినప్పటికీ.. బాబాయి శరద్ పవార్ రాజకీయ వ్యూహాల ముందు తేలిపోయారు. నాలుగు చోట్ల పోటీ చేసి ఒక్క విజయంతోనే సరిపెట్టుకున్నారు. 10 చోట్ల పోటీ చేసి, 8 స్థానాల్లో ఎన్సీపీ (శరద్‌చంద్ర పవార్)ని గెలిపించుకుని శరద్ పవార్ తన సత్తా చాటుకున్నారు. వెరసి నమ్మకస్తులైన సొంత పార్టీ నేతల వెన్ను పోట్లను తట్టుకుని శరద్‌పవార్, ఉద్ధవ్ థాకరే ఎన్నికల క్షేత్రంలో తమను తాము నిరూపించుకున్నారు. కొత్త పార్టీ, కొత్త గుర్తులతో పరీక్షలో నెగ్గుకొచ్చారు.

బీజేపీకి శరాఘాతం

మరోవైపు ఈ చీలిక రాజకీయాలకు తెరవెనుక సహకారం అందించిన బీజేపీకి ఈ ఫలితాలు చేదు ఫలితాన్నిచ్చాయి. గత ఎన్నికల్లో శివసేన మద్దతుతో 25 స్థానాల్లో పోటీ చేసిన కమలం 23 చోట్ల విజయకేతనం ఎగురవేయగా, ఈ విడత 28 నియోజకవర్గాల్లో బరిలోకి దిగి, కేవలం 9 స్థానాలతోనే సరిపెట్టుకుంది. కాంగ్రెస్‌పై అలిగి సంగ్లీలో స్వతంత్రుడిగా పోటీ చేసిన విశాల్ పాటిల్ విజయం సాధించగా, తాను తిరిగి కాంగ్రెస్‌లోకి వెళ్లడం ఆ పార్టీ నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుందని ప్రకటించారు.

బలాబలాలు

పార్టీ గెలిచిన స్థానాలు	2019 ఎన్నికలు	2024 ఎన్నికలు
బీజేపీ	23	9
కాంగ్రెస్	1	13
శివసేన	18	7 (షిండే)
శివసేన (యూబీటీ)	-	9 (ఉద్ధవ్)
ఎన్సీపీ	4	1 (అజిత్)
ఎన్సీపీ(ఎస్పీ)	-	8 (పవార్)
ఎంఐఎం	1	-
స్వతంత్రులు	1	1

ఉప పోరులో కాంగ్రెస్‌కు 4 సీట్లు

సుఖూ సర్కారుకు తొలగిన ముప్పు

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాలుగింటిని కైవసం చేసుకోగా బీజేపీ రెండు చోట్ల గెలిచింది. తాజా గెలుపుతో, అసెంబ్లీలోని 65 సీట్లకు గాను అధికార కాంగ్రెస్ బలం 38కి పెరిగింది. దీంతో, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి తక్షణ ముప్పు తొలగినట్లయింది. ఫిబ్రవరిలో రాజ్యసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌కు చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడి, బీజేపీ అభ్యర్థి విజయానికి దోహదం చేశారు. దీంతో, పార్టీ విప్‌ను ధిక్కరించినట్లుగా పరిగణిస్తూ స్పీకర్ వీరిపై అనర్హత వేటు వేశారు. దీంతో..రాష్ట్రంలోని నాలుగు లోక్‌సభ స్థానాలతోపాటు ఆరు శాసనసభా స్థానాలకు కలిపి జూన్ ఒకటిన ఉప ఎన్నికలు జరిపారు.

కేరళలో బీజేపీ బోణీ


త్రిసూర్: కేరళలో దాదాపు ఏడు దశాబ్దాల తర్వాత బీజేపీ ఎట్టకేలకు ఖాతా తెరిచింది. త్రిసూర్ లోక్‌సభ స్థానంలో బీజేపీ అభ్యర్థి, నటుడు సురేష్ గోపీ చారిత్రక విజయం నమోదు చేసుకున్నారు. ఆయన 74,686 ఓట్ల మెజారిటీతో గెలిచారు. సురేష్ గోపీకి 4,12,338 ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి, ఎల్డీఎఫ్ అభ్యర్థికి 3,37,652 ఓట్లు పడ్డాయి. కాగా, తమిళనాడులో మాత్రం బోణీ కొట్టలేకపోయింది.

ఎగ్జిట్ పోల్స్ లెక్కతప్పింది

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో ఎగ్జిట్ పోల్స్ లెక్క తప్పింది. ఈసారి 400కుపైగా స్థానాలు సాధిస్తామన్న బీజేపీ ధీమాకు వత్తాసు పలుకుతూ పలు సర్వే సంస్థలు ఎన్డీయే కూటమికి 350కి పైగా సీట్లు వస్తాయని చెప్పిన అంచనా తప్పినట్లు తేలింది. ఆయా సర్వే సంస్థలు వెల్లడించిన అంచనాల్లో.. ఎన్డీయేకి నాయకత్వం వహించిన బీజేపీ సొంతంగా మ్యాజిక్ ఫిగర్ అయిన 272 సీట్లను కూడా దాటలేదు. ఏ సర్వే కూడా ఇండియా కూటమికి 180కి మించి ఇవ్వలేదు. కానీ ఇండియా కూటమి మాత్రం అనూహ్యంగా 230 మార్కును దాటడం విశేషం. ఇక ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ ఏకపక్ష విజయాన్ని ఆయా సర్వే సంస్థలు అంచనా వేసినప్పటికీ రెండో స్థానంతో సరిపెట్టుకుంది.

సార్వత్రిక ఎన్నికల సమరంలో అనూహ్య ఫలితాలు వెలువడ్డాయి. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి భారీగా పుంజుకుంది. మరోపక్క, ఎన్డీయే 400 సీట్లు, బీజేపీ సొంతంగా 370 సీట్ల లక్ష్యాలు తునాతుకలయ్యాయి. గత రెండు ఎన్నికల్లోనూ సొంతంగా మెజారిటీ మార్కు (272)ను అధిగమించిన కమలనాథులకు ఓటర్లు షాకిచ్చారు. దీంతో బీజేపీ బలం 303 నుంచి 240కి పడిపోయింది. కాషాయ పార్టీకి కంచుకోటల్లాంటి ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ వంటి హిందీ రాష్ట్రాల్లో కమలానికి ఘోర పరాభవం ఎదురైంది. అయితే ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో మెరుగైన ప్రదర్శనతో ఆ నష్టం కొంతమేర పూడ్చుకుంది. కాంగ్రెస్ సొంతంగా సెంచరీ కొట్టగా, ఎస్పీ 37 సీట్లతో మూడో అతిపెద్ద పార్టీగా అవతరించింది.

భారత యుద్ధంలో బలాబలాలు



ఢిల్లీ 7

	2014	2019	2024
కాంగ్రెస్	00	00	00
బీజేపీ	07	07	07
ఆప్	00	00	00

బీజేపీ హ్యాట్రిక్ క్లీన్ స్వీప్

- దేశ రాజధానిలో కమలం మరోసారి సత్తా చాటింది. వరుసగా మూడో సారి ఏడు సీట్లనూ కొల్లగొట్టి ట్రిపుల్ హ్యాట్రిక్ కొట్టింది.
- నార్త్–ఈస్ట్ ఢిల్లీలో బీజేపీ నేత మనోజ్ తివారీ చేతిలో కాంగ్రెస్ అభ్యర్థి కన్హయ్య కుమార్ ఓటమి పాలయ్యారు.

జమ్మూకశ్మీర్-లద్దాక్ 6

	2014	2019	2024
కాంగ్రెస్	00	00	00
బీజేపీ	03	03	02
పీడీపీ	03	00	00
నేషనల్ కాన్ఫరెన్స్	00	03	02
ఇండిపెండెంట్లు	00	00	02

పంజాబ్ 13

	2014	2019	2024
కాంగ్రెస్	03	08	07
బీజేపీ	02	04	00
అకాలీదళ్	04	00	01
ఆప్	04	01	03
ఇండిపెండెంట్లు	00	00	02

బీజేపీ క్లీన్ స్వీప్...

- ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం జోరుతో పార్లమెంట్‌లోనూ కమలనాథులు సత్తా చాటారు. ఒక సీటును అద నంగా గెలుచుకుని బలాన్ని 10కి పెంచుకున్నారు.
- కాంగ్రెస్ బలం రెండు నుంచి ఒకటికి తగ్గింది.

మళ్లీ కషాయ జెండా...

- అరుణాచల్‌లో బీజేపీ జైత్ర యాత్ర కొనసాగుతోంది. వరుసగా రెండోసారి కూడా రెండు సీట్లనూ చేజిక్కించుకుంది.
- కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు అరుణాచల్ వెస్ట్ సీట్లో లక్ష ఓట్లకు పైగా మెజారిటీతో గెలిచారు.
- అరుణాచల్ ఈస్ట్ సీటును తాపిర్ గావో మరోసారి నిలబెట్టుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో సైతం బీజేపీ 46 సీట్లతో మళ్లీ అధికారాన్ని దక్కించుకున్న సంగతి తెలిసిందే.

బిహార్ 40

	2014	2019	2024
కాంగ్రెస్	02	01	03
బీజేపీ	22	17	12
లోక్‌జన్‌శక్తి	06	06	05
ఆర్జేడీ	04	00	04
జేడీయూ	02	16	12
ఎన్సీపీ	01	00	00
ఇతరులు	03	00	04

అరుణాచల్ ప్రదేశ్ 2

	2014	2019	2024
కాంగ్రెస్	01	00	00
బీజేపీ	01	02	02

పశ్చిమ బెంగాల్ 42

	2014	2019	2024
కాంగ్రెస్	04	02	01
బీజేపీ	02	18	12
టీఎంసీ	34	22	29
సీపీఎం	02	00	00

దుమ్మురేపిన దీదీ...

- గత ఎన్నికల్లో తృణమూల్‌తో పోటాపోటీగా ఎంపీ సీట్లను కొల్లగొట్టిన బీజేపీకి ఈసారి దీదీ షాకిచ్చారు. 7 స్థానాలను అదనంగా దక్కించుకున్నారు.
- పార్లమెంట్ నుంచి బహిష్కరణకు గురైన టీఎంసీ నేత మహువా మొయిత్రా, శతృఘ్న సిన్హా అసన్‌సోల్, కీర్తి ఆజాద్ తదితరులు టీఎంసీ నుంచి విజయం సాధించారు.

అస్సాం 14

	2014	2019	2024
కాంగ్రెస్	03	03	03
బీజేపీ+	07	09	11
ఏఐయూడీఎఫ్	03	00	00
ఇతరులు	01	02	00

ఒడిశా 21

	2014	2019	2024
కాంగ్రెస్	0	00	01
బీజేపీ	1	08	20
బీజేడీ	20	13	00

మహారాష్ట్ర 48

	2014	2019	2024
కాంగ్రెస్	02	01	13
బీజేపీ	23	23	09
శివసేన	18	18	07
శివసేన(యూబీటీ)	00	00	09
ఎన్సీపీ	04	04	01
ఎన్సీపీ(ఎస్పీ)	00	00	08
ఇతరులు	01	02	01

మణిపూర్ 2

	2014	2019	2024
ఎన్పీఎఫ్	00	01	00
బీజేపీ	00	01	00
కాంగ్రెస్	02	00	02

ఛత్తీస్‌గఢ్ 11

	2014	2019	2024
కాంగ్రెస్	01	02	01
బీజేపీ	10	09	10

గుజరాత్ 26

	2014	2019	2024
కాంగ్రెస్	0	00	01
బీజేపీ	26	26	25

హిమాచల్ ప్రదేశ్ 4

	2014	2019	2024
కాంగ్రెస్	00	00	00
బీజేపీ	04	04	04

కేంద్రపాలిత ప్రాంతాలు

	2014	2019	2024
అండమాన్ నికోబార్ దీవులు			
కాంగ్రెస్	00	01	00
బీజేపీ	01	00	01
చండీగఢ్			
కాంగ్రెస్	00	00	01
బీజేపీ	01	01	00
డామన్ డయ్యు			
కాంగ్రెస్	00	00	00
బీజేపీ	01	01	00
ఇండిపెండెంట్	00	00	01
లక్షదీవులు			
కాంగ్రెస్	00	01	01
ఎన్సీపీ	01	00	00
పుదుచ్చేరి			
కాంగ్రెస్	00	01	01
ఏఐఎన్ఆర్ కాంగ్రెస్	01	00	00
దాద్రానగర్ హవేలీ			
కాంగ్రెస్	00	00	00
బీజేపీ	01	00	01
ఇండిపెండెంట్	00	01	00

తగ్గిన బీజేపీ బలం...

- అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నుంచి తేరుకోక ముందే బీజేపీకి ఎంపీ ఎన్నికల్లోనూ షాక్ తగిలింది. గత ఎన్నికల్లో 26 సీట్లతో క్లీన్ స్వీప్ చేసిన కమలనాథులను కాంగ్రెస్ దెబ్బతీసింది. దాదాపు 9 సీట్లను కొల్లగొట్టింది.
- సెక్స్ స్కాండల్‌లో చిక్కుకుని జైలు పాలైన దేవెగౌడ మనుమడు ప్రజ్వల్ రేవణ్ణ కాంగ్రెస్ నేత శ్రేయస్ పటేల్ చేతిలో 42,549 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. జేడీఎస్ రెండు చోట్ల గెలిచింది.
- మైసూరు రాజు యదువీర్ కృష్ణ దత్త ఛామరాజ వడియార్ బీజేపీ తరఫున విజయం సాధించారు.

కర్ణాటక 28

	2014	2019	2024
కాంగ్రెస్	09	01	09
బీజేపీ	17	26	17
జేడీఎస్	02	01	02

ఇండియా కూటమి హవా...

- తమిళనాట పాగా వేయాలన్న కాషాయ పార్టీ కోరిక ఈసారీ నెరవేరలేదు. డీఎంకే సారథ్యంలోని ఇండియా కూటమి బంపర్ విక్టరీ కొట్టింది. పోటీ చేసిన 39 సీట్లనూ కైవసం చేసుకుంది.
- 2004లో డీఎంకే అధ్యక్షుడు కరుణానిధి సారథ్యంలోని ప్రతిపక్ష కూటమి మొత్తం 39 స్థానాలను చేజిక్కించుకున్న తర్వాత, మళ్లీ ఆయన తనయుడు స్టాలిన్ నేతృత్వంలో దాన్ని రిపీట్ చేయడం విశేషం.
- ఒంటరిగా పోటీ చేసిన అన్నాడీఎంకే పూర్తిగా చతికిలపడింది. గతంలో గెలిచిన ఒక్కసీటునూ కోల్పోయింది.
- బీజేపీ ఫైర్‌బ్రాండ్, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు అన్నామలై సైతం లక్ష ఓట్లకు పైగా తేడాతో ఘోర ఓటమి చూశారు.

మధ్యప్రదేశ్ 29

	2014	2019	2024
కాంగ్రెస్	02	02	00
బీజేపీ	27	27	29

ఆంధ్రప్రదేశ్ 25

	2014	2019	2024
కాంగ్రెస్	00	00	00
బీజేపీ	2	00	03
టీడీపీ	15	03	16
వైఎస్సార్‌సీపీ	08	22	04
జనసేన	00	00	02

ఉత్తరాఖండ్ 5

	2014	2019	2024
కాంగ్రెస్	00	00	00
బీజేపీ	05	05	05

తమిళనాడు 39

	2014	2019	2024
ఏఐడీఎంకే	37	01	00
బీజేపీ	01	00	00
డీఎంకే+	00	38	39
పీఎంకే	01	00	00

కేరళ 20

	2014	2019	2024
కాంగ్రెస్+	08	19	14
సీపీఎం	05	01	01
కేరళ కాంగ్రెస్(ఎం)	01	00	01
బీజేపీ	02	00	01
ముస్లింలీగ్	02	00	02
ఇతరులు	00	00	01

తెలంగాణ 17

	2014	2019	2024
బీఆర్ఎస్	11	09	00
కాంగ్రెస్	02	03	08
బీజేపీ	01	04	08
ఎంఐఎం	01	01	01

కమలం, హస్తం పోటీపోటీ...

- అసెంబ్లీ ఎన్నికల్లో సత్తాచాటిన కాంగ్రెస్, లోక్‌సభ పోరులోనూ జోరు కొనసాగించింది. అయితే, బీజేపీ కూడా రేసులో భారీగా పుంజుకుంది. కమలం, హస్తం పార్టీలు చెరో 8 సీట్లను కొల్లగొట్టాయి.

ఉత్తరప్రదేశ్ 80

	2014	2019	2024
కాంగ్రెస్	02	01	06
బీజేపీ	71	62	33
అప్నాదళ్	02	02	01
బీఎస్పీ	00	10	00
సమాజ్‌వాదీ పార్టీ	05	05	37
ఇతరులు	00	00	03

జార్ఖండ్ 14

	2014	2019	2024
కాంగ్రెస్	00	00	02
బీజేపీ+	12	12	09
జేఎంఎం	02	02	03

రాజస్తాన్ 26

	2014	2019	2024
కాంగ్రెస్	0	00	08
బీజేపీ	25	25	14
ఇతరులు	00	00	03

హర్యానా 10

	2014	2019	2024
కాంగ్రెస్	01	00	05
బీజేపీ	07	10	05
ఐఎన్ఎల్డీ	02	00	00

మేఘాలయ 2

	2014	2019	2024
కాంగ్రెస్	01	01	01
ఎన్పీపీ	01	01	00
ఇతరులు	00	00	01

గోవా 2

	2014	2019	2024
కాంగ్రెస్	00	01	01
బీజేపీ	02	01	01

త్రిపుర 2

	2014	2019	2024
కాంగ్రెస్	00	00	00
బీజేపీ	00	02	02
సీపీఎం	02	00	00

మిజోరం 1

	2014	2019	2024
ఇతరులు	01	01	01


నాగాలాండ్ 1

	2014	2019	2024
ఎన్డీపీపీ	01	01	00
కాంగ్రెస్	00	00	01

సిక్కిం 1

	2014	2019	2024
ఇతరులు	01	01	01

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.



SR SHINES BRIGHT IN NEET 2024

MARKS	Name	App No
662	KEERTHI	App No: 240411019693
652	P.HARSHITHA	App No: 240411189150
630	K.RAMESH	App No: 240410623483
626	M.KEERTHI	App No: 240411145924
621	T.SHALINI	App No: 240410344939
621	V.SAI PRASAD	App No: 240410826037
618	P.VARSHITHA	App No: 240411157333
618	M.GANESH	App No: 240411198374
618	S.RAHUL	App No: 240410766259
613	D.VISHAL	App No: 240410756301
612	M.MEGHANA	App No: 240410870505
607	K.HARIKA	App No: 240410610750
600	SRI CHARAN	App No: 240410439908

596 595 595 594 593 592 592 589 589 588 587 586 586 584 581 580 578 578

577 576 576 575 575 574 573 572 572 571 571 569 567 567 567 566 566 564

559 557 557 556 553 552 551 549 549 544 544 542 542 541 540 532 526 526

526 526 525 525 524 524 523 523 522 522 521 521 520 519 519 516 515 513

513 513 512 511 510 510 510 509 509 508 508 508 507 507 505 504 503 503

502 502 500

Proud Achievement - 106 students scored 500 + marks

తెలుగు రాష్ట్రాల్లో పెరుగుతున్న మెడికల్ సీట్స్ ను దృష్టిలో ఉంచుకొని డాక్టర్ కావాలనే ప్రతి విద్యార్థి కల ను నెరవేర్చుటకై IPE/NEET 2024 మార్కుల ఆధారంగా NEET లాంగ్ టర్మ్ అడ్మిషన్లో Concessions పై ' ' సంచలనాత్మక నిర్ణయం.

IPE 2024 MARKS BASED CONCESSIONS

IPE-2024 MARKS	% OF CONCESSION	TOTAL FEE FOR RESIDENTIAL	CONCESSION	TOTAL FEE FOR RESIDENTIAL
980 and above	80%	1,50,000/-.	1,20,000/-.	30,000/-.
965 to 979	70%	1,50,000/-.	1,05,000/-.	45,000/-.
950 to 964	60%	1,50,000/-.	90,000/-.	60,000/-.
900 to 949	50%	1,50,000/-.	75,000/-.	75,000/-.

NEET 2024 MARKS BASED CONCESSIONS

NEET-2024 MARKS	% OF CONCESSION	TOTAL FEE FOR RESIDENTIAL	CONCESSION	NET FEE
450 and above	90%	1,50,000/-.	1,35,000/-.	15,000/-.
425 to 449	80%	1,50,000/-.	1,20,000/-.	30,000/-.
400 to 424	70%	1,50,000/-.	1,05,000/-.	45,000/-.
375 to 399	60%	1,50,000/-.	90,000/-.	60,000/-.
350 to 374	50%	1,50,000/-.	75,000/-.	75,000/-.

NOTE: * DAY SCHOLAR FEE IS 50% OF RESIDENTIAL FEE * the ABOVE CONCESSIONS APPLICABLE FOR LIMITED PERIOD AND LIMITED ADMISSION ONLY..

LONG TERM 'NEET' COACHING CLASSES STARTS FROM 17th JUNE 2024

HYDERABAD: 8886322296, 9121307474, 9290684090, 8712612424, 8712612422, 8712604778, 8712612435, 8712612425, 8712612433 | **WARANGAL:** 9642117378 | **VIJAYAWADA:** 8142111302 | **VIZAG:** 9052222274, 9154854707 | **GUNTUR:** 9154854694 | **TIRUPATI:** 9154854699 | **NELLORE:** 9154854696 | **ANANTHAPURM:** 9154854691 | **KURNOOL:** 9154854695 | **NIZAMABAD:** 9642117110, 096421 15777 | **SRIKAKULAM:** 9154854697 | **BHIMAVARAM:** 9642223762, 7331122579 | **RAJAHMUNDRY:** 9154854693 | **KARIMNAGAR:** 9642117335 | **NALGONDA:** 9573927070 | **ONGOLE:** 8712609156 | **KHAMMAM:** 9121155002 | **ADILABAD:** 9154854690 | **KOTHAGUDEM:** 9154854692 | **NIRMAL:** 9642117835 | **HOSAPETE:** 9154854713.

SR Educational Academy

TELANGANA • ANDHRA PRADESH • KARNATAKA

సాక్షి I
హైదరాబాద్
బుధవారం । 5 । జూన్ । 2024



రిటర్నింగ్ ఆఫీసర్ల నుంచి ఎంపీలుగా గెలుపొందిన ధ్రువ పత్రాలను అందుకుంటున్న ఈటల రాజేందర్, కిషన్‌రెడ్డి, అసదుద్దీన్ ఒవైసీ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా ధ్రువీకరణ పత్రంతో శ్రీగణేశ్



నాంపల్లి బీజేపీ కార్యాలయం వద్ద కమలం శ్రేణుల కోలాహలం

పుష్ప.. ఫ్లవర్ కాదు పవర్

బీజేపీ తీన్మార్.. హుషార్

మల్కాజిగిరి, సికింద్రాబాద్, చేవెళ్లలో బీజేపీ హవా

గ్రేటర్ పరిధిలోని లోక్‌సభ ఎన్నికల్లో అనూహ్య ఫలితాలు వెలువడ్డాయి. అధికార, ప్రతిపక్ష పార్టీలను మట్టికరిపిస్తూ బీజేపీ విజయదుందుభి మోగించింది. హైదరాబాద్ మినహా మిగిలిన మూడు స్థానాల్లోనూ కమలం వికసించింది. గ్రేటర్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఓటు బ్యాంక్‌ను బీజేపీ ఆక్రమించేసింది. దీంతో చేవెళ్ల, మల్కాజిగిరి, సికింద్రాబాద్ నియోజకవరాల్లో ఆ పార్టీ పాగా వేసింది. హైదరాబాద్‌లో బీజేపీ ఓటింగ్ శాతం పెరిగినా.. పతంగి జైత్రయాత్ర కొనసాగింది.

– సాక్షి, సిటీబ్యూరో



- లష్కర్‌లో వరుస విజయాల బీజేపీ
- పాతబస్తీలో మళ్లీ ఎగిరిన పతంగి
- ఖాతా తెరవని కాంగ్రెస్.. సిట్టింగ్ సీటు గాయబ్
- గ్రేటర్‌లో చతికిలపడిన బీఆర్ఎస్
- అసెంబ్లీ ఎన్నికల్లో 16 సీట్లు గెలిచినా దక్కని లోక్‌సభ ఫలితం
- కంటోన్మెంట్ అసెంబ్లీ సీటును దక్కించుకున్న హస్తం పార్టీ

గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రమంతా కాంగ్రెస్ గాలి వీచినా గ్రేటర్ పరిధిలోని 16 అసెంబ్లీ సెగ్మెంట్లలో బీఆర్ఎస్ తన సత్తా చాటింది. గ్రేటర్ పరిధిలోని 24 అసెంబ్లీ సెగ్మెంట్లలో ఒక్క చోట కూడా కాంగ్రెస్ గెలవలేదు. పాతబస్తీ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఎంఐఎం, గోషామహల్ సెగ్మెంట్‌లో బీజేపీ గెలవగా.. మిగతా 16 అసెంబ్లీ సెగ్మెంట్లలోనూ బీఆర్ఎస్సే గెలిచింది. వారిలో దానం నాగేందర్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరగా, 15 మంది

ఖాతా తెరవని కారు

ఎమ్మెల్యేలు, వారి పరిధిలోని పలువురు కార్పొరేటర్ల బలం బీఆర్ఎస్‌కు ఉన్నా.. ప్రస్తుత ఎంపీ ఎన్నికల్లో ఎందుకూ పనికిరాకుండా పోయింది. గ్రేటర్ పరిధిలోని నాలుగు పార్లమెంట్ స్థానాల్లో చార్మినార్‌పై ఎలాగూ ఆశలు పెట్టుకోలేదు. మిగతా మూడు నియోజకవర్గాలు సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్లలో గెలుపు ద్వారా సత్తా చాటాలని కేసీఆర్, కేటీఆర్‌లు భావించారు. తమ బలం ఏమాత్రం తగ్గలేదని, ప్రజలు తమ వెంటే ఉన్నారని చాటుకోవాలనుకున్నారు. కేటీఆర్ తన ప్రచారంలోనూ ఆ అంశాన్నే ప్రస్తావించారు. అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీలు నమోదవడాన్ని చెబుతూ ఎంపీ ఎన్నికల్లో తామే గెలుస్తామన్నారు. ఎంపీలుగా గెలిస్తే కేంద్రంలోనూ సత్తా చూపుతామన్నారు. ఎంతగా ప్రచారం చేసినా ప్రజలు బీఆర్ఎస్‌కు మద్దతివ్వలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో కంటే బీఆర్ఎస్ బలం ఈ ఎన్నికల్లో తగ్గిపోయింది. గ్రేటర్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లోనూ గెలుపు కాదు కదా కనీసం రెండో స్థానంలో కూడా నిలవలేకపోయింది.

నోటాకు 27,861 ఓట్లు

శాసనసభ ఎన్నికలతో పోలిస్తే లోక్‌సభలో నన్ ఆఫ్ ది ఎబౌ (నోటా) ఓట్లు పెద్దగా ప్రభావం చూపించలేదు. గ్రేటర్ పరిధిలోని నాలుగు లోక్‌సభ స్థానాల్లో కలిపి నోటాకు 27,861 ఓట్లు పోలయ్యాయి. గత లోక్‌సభతో పోలిస్తే ఈసారి నోటా ఓట్లు బాగా తగ్గాయి. 2019లో నోటాకు 41,840 ఓట్లు పోలయ్యాయి. ఓటర్లు నోటాకు బదులు నచ్చిన అభ్యర్థికే ఓటు వేయడమే ఈ తగ్గుదలకు కారణం. గ్రేటర్ పరిధిలో తాజా ఎన్నికల్లో అత్యధికంగా మల్కాజిగిరి లోక్‌సభ సెగ్మెంట్‌లో 13,366 నోటా ఓట్లు పడగా.. అత్యల్పంగా హైదరాబాద్‌లో కేవలం 2,906 ఓట్లు పోలయ్యాయి. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి నోటాకు 17,979 ఓట్ల తేడా వచ్చింది.

చేవెళ్లలో..

2019 లోక్‌సభ ఎన్నికల్లో, గత అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్ల సెగ్మెంట్లను గెలుచుకున్న బీఆర్ఎస్.. తాజా లోక్‌సభ ఎన్నికల్లో ఏమాత్రం ప్రభావం చూపించలేకపోయింది. గతంలో ఇక్కడి నుంచి బీఆర్ఎస్ తరఫున రంజిత్ రెడ్డి గెలుపొందారు. ఆ పార్టీకి 40.62 శాతం ఓట్లు రాగా.. ఈసారి కేవలం 10.68 శాతానికి పడిపోయింది. గత ఎన్నికల్లో మూడో స్థానానికి పరిమితమైన బీజేపీ ఈసారి అనూహ్యంగా పుంజుకుంది. అప్పుడు బీజేపీకి 15.53 శాతం ఓట్లు పోలవగా.. ఈసారి ఏకంగా 48.34 శాతం ఓట్లను దక్కించుకుంది. కాంగ్రెస్ ఓట్లు స్వల్పంగా తగ్గాయి. అధికార కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్ ఓట్లన్నీ కమలం వైపు మొగ్గు చూపించాయి. గత లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడి బీఆర్ఎస్, కాంగ్రెస్ ఓటు బ్యాంక్ అంతా బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వైపు మళ్లింది.

మల్కాజిగిరిలో..

గత లోక్‌సభలో కాంగ్రెస్ గెలిచిన ఈ నియోజకవర్గంలో.. తాజా ఎన్నికల్లో కమలం వికసించింది. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన రేవంత్.. ఆ తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజిగిరి నుంచి పోటీ చేసి గెలిచారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన ఈటల రాజేందర్.. తాజాగా జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజిగిరి నుంచి బరిలోకి దిగి గెలుపొందారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి బీజేపీ ఓటు బ్యాంక్ అనూహ్యంగా పెరిగింది. కేంద్రంలో మోదీ హవా, అధికార కాంగ్రెస్ సర్కారు ఆరు గ్యారంటీల అమలులో వైఫల్యంపై ప్రజల్లో వ్యతిరేకత, ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై విముఖత.. ఇవన్నీ ఈటలకు బాగా కలిసొచ్చాయి. దీంతో గత కాంగ్రెస్ కంచుకోటను బద్దలు కొట్టి విజయ దుందుభి మోగించారు. 2019లో కేవలం 19.47 శాతంగా ఉన్న బీజేపీ ఓటింగ్ శాతం.. ఈసారి ఏకంగా 51.25 శాతానికి పెరిగింది. బీఆర్ఎస్ పూర్తిగా చతికిలపడిపోయింది. గతంలో ఈ సెగ్మెంట్‌లో 37.93 శాతం ఓట్లను మూటగట్టుకున్న గులాబీ కేసీఆర్.. తాజా ఎన్నికల్లో 15.47 శాతానికి పడిపోయింది.

సికింద్రాబాద్..

సికింద్రాబాద్‌లో వరుసగా రెండోసారి కిషన్ రెడ్డి గెలుపొందారు. అయితే గతంతో పోలిస్తే ఈసారి ఈ నియోజకవర్గంలో బీజేపీకి ఓటింగ్ శాతం పెరిగింది. 2019లో బీజేపీకి 42.05 శాతం ఓట్లు రాగా.. ఈసారి దాదాపు 3 శాతం మేర పెరిగి 45.15 శాతం ఓట్లొచ్చాయి. బీఆర్ఎస్ ఓట్లలో సింహభాగం కాంగ్రెస్‌కు మళ్లాయి. గత ఎన్నికల్లో 35.26 శాతం ఓట్లతో రెండో స్థానంలో నిలిచి బీఆర్ఎస్.. ఈసారికి కేవలం 12.37 శాతం ఓట్లు మాత్రమే సాధించి. మూడో స్థానానికి పడిపోయింది. సికింద్రాబాద్ లోక్‌సభ సెగ్మెంట్‌లో 2004, 2009 ఎన్నికల్లో వరుసగా రెండుసార్లు కాంగ్రెస్ పార్టీ తరఫున అంజన్‌కుమార్ యాదవ్ గెలిచారు. తాజాగా ఈ రికార్డును కిషన్ రెడ్డి సమం చేశారు.

సిట్టింగ్‌కే పట్టం

సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి ఈసారి ఇద్దరు సిట్టింగ్ ఎమ్మెల్యేలు, సిట్టింగ్ ఎంపీ పోటీపడ్డా ప్రజలు సిట్టింగ్ ఎంపీకే తిరిగి పట్టం కట్టబెట్టారు. ఎమ్మెల్యేలుగానే మీ నియోజకవర్గ ప్రజలకు సేవలందించండి అంటూ సిట్టింగ్ ఎమ్మెల్యేలకు తీర్పు చెప్పారు. తిరిగి ఒక ఎమ్మెల్యే స్థానానికి ఉప ఎన్నిక జరిగే పరిస్థితి రాకుండా నివారించారు. సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన సిట్టింగ్ ఎంపీ జి.కిషన్‌రెడ్డినే తిరిగి గెలిపించారు. ఇక్కడి నుంచి ఎంపీ అయ్యేందుకు కాంగ్రెస్ నుంచి పోటీచేసిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు, బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన టి. పద్మారావుగౌడ్‌కు ఎంపీగా అవకాశం కల్పించలేదు. దానం నాగేందర్ ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ నుంచి గెలిచాక, కాంగ్రెస్‌లో చేరి ఎంపీగా పోటీ చేశారు.

గ్రేటర్‌లో పార్టీల వారీగా ఓట్ల శాతం..

నియోజకవర్గం	పార్టీ	2019	2024
సికింద్రాబాద్	బీజేపీ	42.05	45.15
	బీఆర్ఎస్	35.26	12.37
	కాంగ్రెస్	18.93	40.38
మల్కాజిగిరి	బీజేపీ	19.47	51.25
	కాంగ్రెస్	38.63	31
	బీఆర్ఎస్	37.93	15.47
చేవెళ్ల	బీజేపీ	15.53	48.34
	కాంగ్రెస్	39.5	38.02
	బీఆర్ఎస్	40.62	10.68
హైదరాబాద్	ఎంఐఎం	58.9	61.28
	బీజేపీ	26.8	29.98
	బీఆర్ఎస్	7.20	1.73
	కాంగ్రెస్	5.69	5.83

ఆ రెండింటికి పెరిగిన ఓటింగ్ శాతం..

హైదరాబాద్‌లో ఎంఐఎం పార్టీ జైత్రయాత్ర కొనసాగించింది. ఆ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ వరుసగా ఐదోసారి గెలిచి రికార్డు సృష్టించారు. ఈసారి అసద్‌కు విజయం నల్లేరు మీద నడకేం కాలేదు. గతంలో కంటే ఈసారి ప్రత్యర్థి నుంచి ఎంఐఎంకు గట్టి పోటీ ఎదురైంది. బీజేపీ అభ్యర్థి మాధవీలత గట్టి పోటీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో జోరు, సామాజిక మాధ్యమాల్లో ఓటర్ల ఆకర్షణ, కేంద్రంలో బీజేపీ హవా వంటి కారణాలతో హైదరాబాద్‌లో బీజేపీ ఓటు బ్యాంక్ పెరిగింది. ఇదే సమయంలో 2019 లోక్‌సభతో పోలిస్తే ఎంఐఎంకు ఓటింగ్ శాతం పెరిగింది. గతంలో 26.8 శాతం ఓట్లు పోలవగా.. ఈసారి 29.98 శాతానికి పెరిగాయి. అలాగే పతంగి కూడా గత ఎన్నికల్లో 58.9 శాతం ఓట్లు రాగా.. ఈసారి 61.28 శాతానికి పెరిగాయి. ఇక్కడ కాంగ్రెస్, బీఆర్ఎస్ ఓటు బ్యాంకు పూర్తిగా ఎంఐఎం ఆక్రమించేసింది. బీఆర్ఎస్ పార్టీ ఘోరంగా 7.20 శాతం ఓట్ల నుంచి 1.73 శాతానికి పడిపోయాయి.



ఎంఐఎం కార్యాలయం ఎదుట కార్యకర్తలకు అభివాదం చేస్తున్న అసదుద్దీన్ ఒవైసీ



చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న కిషన్‌రెడ్డి దంపతులు

సత్తా చాటాలనుకున్నా..


రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎంపీ ఎన్నికల్లో సత్తా చాటాలనుకుంది. అందులో భాగంగా సికింద్రాబాద్‌లో గెలవాలనే తలంపుతో బీఆర్ఎస్ నుంచి తమ పార్టీలో చేరిన దానం నాగేందర్‌కు టికెటిచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా నాగేందర్ గెలుపు కోసం పార్టీ నేతలు రోడ్‌షోలు నిర్వహించారు. ప్రచారం చేశారు. అయినా ప్రజలు ఆదరించలేదు. అలాగే బీఆర్ఎస్ నుంచి సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే పద్మారావుకు ఎంపీ టికెటిచ్చారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, కాలేరు వెంకటేశ్, మాగంటి గోపీనాథ్ ప్రచారం చేశారు. నియోజకవర్గం పరిధిలో పార్టీకి ఐదుగురు ఎమ్మెల్యేలు, పలువురు కార్పొరేటర్లున్నప్పటికీ పద్మారావు ఎంపీగా గెలవలేకపోయారు. కనీసం రెండో స్థానంలో కూడా నిలవలేకపోయారు.

కంటోన్మెంట్‌లో క్రాస్ ఓటింగ్

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికలు సంబంధించి భారీ స్థాయిలో క్రాస్ ఓటింగ్ జరిగింది. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి 53,651 ఓట్లు సాధించగా, ఆ పార్టీ మల్కాజిగిరి లోక్‌సభ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డికి మాత్రం 45,661 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. అంటే కంటోన్మెంట్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థికి సంబంధించి పోలైన 7,990 ఓట్లు ఎంపీ అభ్యర్థికి పడలేదు. అలాగే బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు కంటోన్మెంట్‌లో 64,133 ఓట్లు రాగా, ఆ పార్టీ కంటోన్మెంట్ అసెంబ్లీ అభ్యర్థి వంశ తిలక్‌కు కేవలం 40,445 ఓట్లు మాత్రమే వచ్చాయి. అంటే బీజేపీకి సంబంధించిన 23,688 ఓట్లు క్రాస్ అయ్యాయి. బీఆర్ఎస్ పరిస్థితి మరోలా ఉంది. కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదితకు 34,462 ఓట్లు రాగా, ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి కేవలం 17,339 ఓట్లు మాత్రమే వచ్చాయి. బీఆర్ఎస్‌కు సంబంధించి 17,123 ఓట్లు క్రాస్ అయినట్లు తెలుస్తోంది. మొత్తంగా బీజేపీ ఎంపీ అభ్యర్థికి పడిన ఓట్లలో దాదాపు సగం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదితకు పడి ఉండొచ్చని ఆ పార్టీ శ్రేణులు అంచనా వేస్తున్నాయి. కంటోన్మెంట్‌లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థితో పోలిస్తే, ఎమ్మెల్యే అభ్యర్థికి దాదాపు 8 వేలు అధికంగా ఓట్లు పోలయ్యాయి.

లోక్‌సభ స్థానాల్లో గెలుపొందిన అభ్యర్థులు.. ప్రొఫైల్

చేవెళ్ల



అభ్యర్థిపేరు: కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
తల్లిదండ్రులు: జయలతా రెడ్డి, జస్టిస్ కొండా మాధవరెడ్డి
స్వస్థలం: బంజారాహిల్స్
విద్యార్హత: కంప్యూటర్ సైన్స్
సాధించిన ఓట్లు: 8,09,882
మెజారిటీ: 1,72,897

2013లో బీఆర్ఎస్‌లో చేరారు. 2014లో చేవెళ్ల లోక్‌సభా స్థానంలో గెలుపొందారు. 2018 నవంబర్‌లో బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి, ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత 2021 మార్చిలో ఆ పార్టీకి రాజీనామా చేసి, బీజేపీలో చేరారు. అప్పటి ఆ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం బీజేపీ ఎంపీగా గెలిచారు.

సికింద్రాబాద్



అభ్యర్థిపేరు: జి.కిషన్‌రెడ్డి
తల్లిదండ్రులు: స్వామిరెడ్డి, ఆండాళమ్మ
స్వస్థలం: తిమ్మాపూర్
విద్యార్హత: ఇంజనీరింగ్
సాధించిన ఓట్లు : 4,73,012
మెజారిటీ : 49,944

1964 మే 15న జన్మించారు. సాధారణ కార్యకర్తగా నుంచి మార్చి 6, 2010న బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. 2004 శాసనసభ ఎన్నికల్లో తొలిసారిగా హిమాయత్ నగర్ నుంచి, 2009లో అంబర్‌పేట్ శాసనసభ నుంచి ఎన్నికయ్యారు. 2012 జనవరి 19న మహబూబ్‌నగర్ జిల్లా కృష్ణా గ్రామం నుంచి 22 రోజులపాటు బీజేపీ పోరుయాత్ర ప్రారంభించారు. 2019 భారత సార్వత్రిక ఎన్నికల్లో సికింద్రాబాదు లోక్‌సభ నుంచి ఎన్నికై కేంద్ర సాంస్కృతిక, పర్యాటక, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2023 జులై 4న తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా నియమితులయ్యారు

మల్కాజిగిరి



అభ్యర్థిపేరు: ఈటల రాజేందర్
తల్లిదండ్రులు: మల్లయ్య, వెంకటమ్మ
స్వస్థలం: కమలాపూర్, కరీంనగర్‌జిల్లా
విద్యార్హత: డిగ్రీ
సాధించిన ఓట్లు: 9,91,042
మెజారిటీ: 3,91,475

1964 మార్చి 20న జన్మించారు. 2003లో టీఆర్ఎస్ పార్టీలో చేరి, 2004 ఎన్నికల్లో కమలాపూర్ నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా అయ్యారు. 2008 ఉపఎన్నికల్లో రెండోసారి గెలిచారు. వైఎస్ హయాంలో టీఆర్ఎస్ ఎల్పీ నేతగా తన వాగ్ధాటితో ఆకట్టుకున్నారు. 2009 నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా కమలాపూర్, హుజూరాబాద్‌గా మారింది. 2009లో కాంగ్రెస్ అభ్యర్థి వకుళాభరణం కృష్ణమోహన్‌రావుపై, 2010 ఉప ఎన్నికల్లో ముద్దసాని దామోదరరెడ్డిపై నాల్గోసారి గెలిచారు. 2014లో కాంగ్రెస్ అభ్యర్థి కేతిరి సుదర్శన్‌రెడ్డిపై గెలిచి కేసీఆర్ తొలి మంత్రివర్గంలో చోటుదక్కించుకున్నారు. 2019లో వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా కొనసాగారు. టీఆర్ఎస్ సభ్యత్వానికి, ఎమ్మెల్యే పదవికి 2021 జూన్ 12న రాజీనామా చేసి, బీజేపీలో చేరాడు. 2021 హుజూరాబాద్ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థిగా 23,855 ఓట్ల మెజారిటీతో గెలిచారు. 2023లో హుజురాబాద్‌తో పాటు కామారెడ్డిలోనూ పోటీ చేసి, రెండు చోట్ల ఓటమి పాలయ్యారు. ప్రస్తుతం మల్కాజ్ గిరి లోక్‌సభ స్థానం నుంచి భారీ మెజారిటీతో గెలుపొందారు.

హైదరాబాద్



అభ్యర్థిపేరు: అసదుద్దీన్ ఒవైసీ
తల్లిదండ్రులు: సలావుద్దీన్ ఒవైసీ, నజమున్నీసా
స్వస్థలం: హైదరాబాద్
నివాసం: శాస్త్రిపురం
విద్యార్హత: బీఏ,ఎల్ఎల్‌బీ (లండన్)
సాధించిన ఓట్లు: 6,61,981
మెజారిటీ: 3,38,087

ఏఐఎంఐఎం అధినేతగా తిరుగలేని రాజకీయ నాయకుడిగా విజయపరంపర కొనసాగిస్తున్నారు. ప్రధానంగా 1994–2004 వరకూ చార్మినార్ ఎమ్మెల్యేగా చేశారు. 2004 నుంచి వరుసగా హైదరాబాద్ ఎంపీగా ఎన్నికై చరిత్ర సృష్టించారు. ప్రస్తుతం అనూహ్యంగా విస్తృత ప్రచారం పొందిన బీజేపీ అభ్యర్థి మాధవీలతపై 3,38,087 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

కంటోన్మెంట్ (అసెంబ్లీ)



అభ్యర్థి పేరు : నారాయణన్ శ్రీగణేశ్
తల్లిదండ్రులు : సుగుణమ్మాళ్, నారాయణన్
స్వస్థలం : అడ్డగుట్ట, సికింద్రాబాద్
విద్యార్హత : ఇంటర్మీడియెట్
సాధించిన ఓట్లు : 53,651
మెజారిటీ : 13,206

2009 నుంచి కాంగ్రెస్ యువనేతగా రాజకీయాల్లోకి వచ్చి, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పనిచేశారు. 2014, 2018 ఎన్నికల్లో కంటోన్మెంట్ నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడ్డారు. 2018లో బీజేపీ టికెట్ దక్కడంతో తొలిసారిగా పోటీ చేశారు. అనంతరం బీఆర్ఎస్‌లో చేరారు. 2023లో మరోసారి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. తాజాగా కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు.

పతంగిదే పాతబస్తీ



మజ్లిస్ కార్యాలయం ఎదుట అభిమానుల ఆనందోత్సాహాలు

వరుసగా ఐదోసారి ఎంపీగా అసదుద్దీన్ ఒవైసీ

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ లోక్‌సభ స్థానంలో పతంగి ఎగిరింది. మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ విజయం సాధించారు. ప్రత్యర్థి గట్టి పోటీ ఇచ్చినా ఆయన భారీ మెజార్టీతో గెలుపొందారు. సమీప బీజేపీ అభ్యర్థి మాధవీలతపై 3,38,087 ఓట్ల తేడాతో విజయ బావుటా ఎగురవేశారు. ప్రస్తుతం గెలుపుతో ఇక్కడి నుంచి వరుసగా ఐదోసారి అసదుద్దీన్ ఘన విజయం సాధించినట్లైంది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో అసదుద్దీన్ కంటే మాధవీలతకు 710 ఓట్లు అధికంగా రావడం గమనార్హం.

తగ్గిన ఓటింగ్ శాతం

ఎన్నడూ లేని విధంగా బీజేపీ గట్టి పోటీ ఇచ్చినట్లు ప్రచారం జరిగినా.. మెజార్టీ పెరిగిందే తప్ప ఓట్ల శాతం మాత్రం తగ్గింది. బీజేపీకి ఓట్ల శాతం పెరిగింది. మజ్లిస్ పార్టీకి గత ఎన్నికలతో పోల్చితే 2.67 శాతం ఓట్లు తగ్గాయి. బీజేపీకి మాత్రం 3.18 శాతం పెరిగింది. ఈసారి మజ్లిస్‌కు 61.28, బీజేపీకి 29.98, కాంగ్రెస్‌కు 5.98, బీఆర్ఎస్‌కు 1.73 శాతం ఓట్లు లభించాయి. 2019లో మజ్లిస్‌కు 63.95, బీజేపీకి 28.8, కాంగ్రెస్‌కు 5.69, టీఆర్ఎస్‌కు 7.2 శాతం ఓట్లు లభించాయి.

హైదరాబాద్ లోక్‌సభ స్థానంలో ప్రధాన పక్షాల అభ్యర్థులకు లభించిన ఓట్లు ఇలా

అభ్యర్థి పేరు	పార్టీ	ఈవీఎం ఓట్లు	పోస్టల్ ఓట్లు	మొత్తం ఓట్లు
అసదుద్దీన్ ఒవైసీ	ఏఐఎంఐఎం	6,59,278	2,703	6,61981
కొంపల్లి మాధవీలత	బీజేపీ	3,20,481	3,413	3,23,894
వలీవుల్లా సమీర్	కాంగ్రెస్	62,497	465	62,962
గడ్డం శ్రీనివాస్ యాదవ్	బీఆర్ఎస్	18,498	143	18,641

హైదరాబాద్ లోక్‌సభలో మజ్లిస్‌కు మెజార్టీ ఇలా

2024 3,38,087
2019 2,81,815
2014 2,02,454
2009 1,13,865
2004 1,00,145

విషాదం మిగిల్చిన విహారయాత్ర

రోడ్డు ప్రమాదంలో బాలుడి దుర్మరణం, ఇద్దరికి గాయాలు


శబరీశ్‌ (ఫైల్‌)

ఇబ్రహీంపట్నం రూరల్‌: కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపడానికి యాత్రకు వెళ్లారు. అనంతరం దైవ దర్శనానికి బయలుదేరారు. అంతలోనే అనుకోని ఉపద్రవం ఎదురైంది. ఆదిబట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్‌కు చెందిన ఓ కుటుంబం చేపట్టిన విహారయాత్ర విషాదాన్ని నింపింది. రోడ్డు ప్రమాదం రూపంలో బాలుడిని బలిగొన్న ఘటన స్థానికంగా కలచి వేస్తోంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తాళ్ల దర్శన్‌ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం మూడు కార్లల్లో విహారయాత్రకు వెళ్లారు. యాత్రలో భాగంగా భద్రాచలం నుంచి ములుగు జిల్లా మీదుగా తాడ్వాయి గుండా సమ్మక్క సారక్క వైపు వెళ్తుండగా మంగళవారం తెల్లవారుజామున కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ప్రమాదంలో తాళ్ల అరుణ్‌ కుమారుడు శబరీశ్‌(9) అక్కడికక్కడే మృతి చెందాడు. కారు నడుపుతున్న అరుణ్‌, అతడి తండ్రి దర్శన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికంగా ప్రథమ చికిత్స అనంతరం ఇద్దరినీ నగరంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. దర్శన్‌(60) పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. తండ్రీతాతలు ఆస్పత్రిలో ఉండగా పిల్లాడి అంత్యక్రియలకు కుటుంబ సభ్యులు సిద్ధం చేశారు. దీంతో కొంగరకలాన్‌ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

సిటీలో వర్షం

నగరంలో మంగళవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం వేళ వర్షం పడడంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగింది. కొన్నిచోట్ల రోడ్లు జలమయం అయ్యాయి.
– సాక్షి, సిటీబ్యూరో


గాంధీభవన్‌ రోడ్డు..




నాంపల్లిలో..

నేనున్నానని..

- ఎమ్మెల్యేగా ఓడిన వారిని ఎంపీలు చేసిన మల్కాజిగిరి
- 2019లో రేవంత్‌రెడ్డికి, నేడు ఈటలకు అండగా

సాక్షి, సిటీబ్యూరో: జీవితంలోనైనా, రాజకీయాల్లోనైనా! రాజు కింకరుడగు.. కింకరుడు రాజగు అన్నట్లు ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేరు. కార్పొరేటర్లుగా ఓడిన వారు ఎమ్మెల్యేలు, మంత్రులైన దాఖలాలూ ఉన్నాయి. అలాగే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఓడిన వారిని ఎంపీగా గెలిపించింది మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం. ఆర్నెల్ల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్‌, గజ్వేల్‌ నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఒక్కచోట కూడా గెలవలేకపోయిన ఈటల రాజేందర్‌ను ప్రస్తుతం ఎంపీగా గెలిపించింది. అంతకుముందు రేవంత్‌రెడ్డిని సైతం అలాగే గెలిపించింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్‌ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఓడిపోయిన రేవంత్‌రెడ్డిని 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీని చేసింది.ఎంపీగా గెలిచాకే రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్‌ అధిష్టానం పీసీసీ అధ్యక్షునిగా చేసింది. ఆ పదవితో కాంగ్రెస్‌కు నేతృత్వం వహిస్తూ ఆర్నెల్ల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలవడంతో ఏకంగా ముఖ్యమంత్రి అయ్యారు. ప్రస్తుతం ఈ నియోజకవర్గం నుంచి గెలిచిన ఈటల రాజేందర్‌కూ మంచి రాజకీయ భవిష్యత్‌ ఉంటుందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.

సికింద్రాబాద్‌ నుంచి కిషన్‌రెడ్డి

ఎంపీ కావడంతో పాటు కేంద్రమంత్రి పదవి కూడా పొందిన కిషన్‌రెడ్డిదీ ఇలాంటి అనుభవమే. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో అంబర్‌పేట నుంచి పోటీచేసి ఓటమి పాలైన కిషన్‌రెడ్డి, 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్‌ నుంచి గెలుపొందారు. పార్టీ అధిష్టానం ఆయనకు మంత్రి పదవి ఇవ్వడమూ తెలిసిందే.

పార్టీ మారినా జాతకం మారలే..

మరోవైపు, పార్టీ మారి గొప్ప రాజకీయ భవిష్యత్‌ పొందొచ్చని ఆశించిన వారి ఆశలు తల్లకిందులయ్యాయి. గ్రేటర్‌ పరిధిలో పార్టీ మారి గెలవని వారూ ఉన్నారు. బీఆర్‌ఎస్‌ నుంచి ఖైరతాబాద్‌ ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్‌ కాంగ్రెస్‌లో చేరి సికింద్రాబాద్‌ ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. అలాగే మూడు పర్యాయాలు జడ్పీ చైర్మన్‌గా ఎన్నికైన పట్నం సునీత సైతం బీఆర్‌ఎస్‌ నుంచి కాంగ్రెస్‌లో చేరి మల్కాజిగిరి నుంచి ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. గత ఎన్నికల్లో చేవెళ్ల నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్‌ అభ్యర్థిగా పోటీ చేసి ఎంపీగా ఎన్నికైన గడ్డం రంజిత్‌రెడ్డి ఈసారి కాంగ్రెస్‌లో చేరి పోటీచేసి ఓడిపోయారు. అలాగే ఉప్పల్‌ టిక్కెట్‌ రాకపోవడంతో కాంగ్రెస్‌ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరి మల్కాజిగిరి ఎంపీగా పోటీ చేసిన రాగిడి లక్ష్మారెడ్డి కూడా ఓడిపోయారు.

ఇది ప్రజా విజయం

కృతజ్ఞతలు తెలిపిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌ రెడ్డి



కాచిగూడ: సికింద్రాబాద్‌ పార్లమెంట్‌ సభ్యుడిగా తనను గెలిపించడంలో కీలక పాత్ర పోషించిన బీజేపీ కార్యకర్తలకు, ప్రజలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఇది విజయం ప్రజా విజయమని పేర్కొన్నారు. బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయం వద్ద జరిగిన బీజేపీ విజయోత్సవంలో కిషన్‌ రెడ్డి బాణాసంచా కాల్చి కార్యకర్తలతో సంబరాలు జరుపుకున్నారు. అనంతరం స్వీట్స్‌ పంపిణీ చేసి శ్రేణులకు, అభిమానులకు అభినందనలు తెలియజేశారు. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించేలా 8 స్థానాల్లో బీజేపీ విజయం సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌, మజ్లిస్‌ పార్టీలను ప్రజలు తిప్పికొట్టి బీజేపీని బలపరిచారని తెలిపారు. బుధవారం ఉదయం ఢిల్లీలో జరిగే పార్టీ సమావేశానికి హాజరయ్యేందుకు ఢిల్లీ వెళుతున్నానని, తిరిగొచ్చాక ప్రతి ఒక్కరినీ కలుస్తానని కిషన్‌రెడ్డి తెలిపారు. జూన్‌ రెండో వారంలో నరేంద్రమోదీ హ్యాట్రిక్‌ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు డాక్టర్‌ ఎస్‌.గౌతంరావు, ఎ.సూర్యప్రకాష్‌ సింగ్‌, కన్నె రమేష్‌ యాదవ్‌, ఎక్కాల కన్నా, వనం రమేష్‌, ఎడెల్లి అజయ్‌కుమార్‌, సి.నందకిషోర్‌ యాదవ్‌ పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో మారిన తీర్పు

కాంగ్రెస్‌ పార్టీపై ఈటల భారీ మెజారిటీ

- బీజేపీ శ్రేణుల సంబరాలు
- ఏడు సెగ్మెంట్లలోనూ అదే తీరు

సాక్షి, మేడ్చల్‌ జిల్లా: మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి, మాజీ మంత్రి ఈటెల రాజేందర్‌ విజయం సాధించారు. సమీప కాంగ్రెస్‌ అభ్యర్థి పట్నం సునితా మహేందర్‌రెడ్డి పై దాదాపు 3,91,475 ఓట్ల మెజారిటీతో ఈటల గెలుపొందారు. దేశంలో అతిపెద్ద పార్లమెంట్‌ నియోజకవర్గమైన మల్కాజిగిరి స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లల్లో మొత్తం ఓట్లు 37,79,596 కాగా, ఇందులో 19,34,065 (బ్యాలెట్‌ ఓట్లు కలుపుకొని) ఓట్లు పోలయ్యాయి. ఇందులో ఈటెలకు 9,91,042 ఓట్లు, సునితకు 5,99,567 ఓట్లు, టీఆర్‌ఎస్‌ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి 3,00486 ఓట్లు పోలయ్యాయి. మల్కాజిగిరి ఓటర్లు ప్రతి ఎన్నికల్లో విలక్షణమైన తీర్పునిస్తారు. ఓ సారి గెలిచిన పార్టీకి మరోసారి అవకాశమివ్వరు. 2009లో తొలిసారి కాంగ్రెస్‌కు పట్టం గట్టగా, 2014లో బీజేపీ మద్దతుతో టీడీపీ విజయం సాధించింది. ప్రస్తుత ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్‌ స్థానంలో మొదటి సారి బీజేపీ అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలుపొందటంతో కార్యకర్తలు, కేడర్‌ పెద్దత్తున సంబరాలు జరుపుకుంటున్నారు. కాగా నోటాకు 13,366 ఓట్లు పోలయ్యాయి. 222 చెల్లని ఓట్లు పోలయ్యాయి. మిగిలిన ఓట్లు 19 స్వతంత్ర అభ్యర్థులు దక్కించుకున్నారు.

- ఏడు సెగ్మెంట్లలోనూ బీజేపీ మెజారిటీ మల్కాజిగిరి పార్లమెంట్‌ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొదటి రౌండు నుంచి చివరి వర కూ ఈటల అధిక్యతను చాటుకున్నారు.
- పార్లమెంట్‌ పరిధిలోని అన్నీ అసెంబ్లీ స్థానాల్లో ఇటీవల శాసనసభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ విజయ సాధించినప్పటికీ, ఈ ఎన్నికల్లో మాత్రం పూర్తిగా చతికిల పడింది.
- కాంగ్రెస్‌ పార్టీ మల్కాజిగిరి సిట్టింగ్‌ స్థానంలో ఓడిపోవటంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సిట్టింగ్‌ సీటు పాయే..

గ్రేటర్‌లో కాంగ్రెస్‌ గోల్‌మాల్‌

- సిట్టింగ్‌ స్థానాన్ని నిలుపుకోలేని సీఎం
- ఇన్‌ఛార్జి మంత్రులున్నా గెలవలేని చేవెళ్ల, సికింద్రాబాద్‌
- సికింద్రాబాద్‌కు కోమటిరెడ్డి, మల్కాజిగిరికి తుమ్మల..



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌ ఓటరు మరోసారి కాంగ్రెస్‌ను బురిడీ కొట్టించాడు. మొన్నటి శాసనసభ ఎన్నికల ఫలితాలనే లోక్‌సభ పోరులోనూ తిరగరాశాడు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఆఖండ విజయం సాధించిన హస్తం పార్టీ...రాష్ట్ర రాజధానిలో మాత్రం చతికిలపడింది. కనీసం ఖాతా తెరవకుండానే బోల్తా పడింది. ఈ పరాభవానికి ప్రతీకారం తీర్చుకోవాలని భావించిన ఆ పార్టీ.. లోక్‌సభ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అభ్యర్థుల ఖరారు మొదలు ప్రచారశైలి వరకూ వినూత్నంగా ముందుకు సాగింది. అయినా, ఆ పార్టీకి చుక్కెదురైంది. ఖాతా తెరవడం దేవుడెరుగు.. ఉన్న సిట్టింగ్‌ స్థానాన్నీ చేజార్చుకుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిథ్యం వహించిన మల్కాజ్‌గిరి ఎంపీ స్థానంలో ఘోర పరాభవాన్ని చవిచూసింది. ఇక చేవెళ్ల, సికింద్రాబాద్‌ స్థానాల్లోనూ ఆ పార్టీకి ఓటమే ఎదురైనా రెండో స్థానంలో నిలిచి కాస్తా పరువు కాపాడుకుంది. ఇక భావోద్వేగాల మధ్య ఎన్నికలు జరిగే హైదరాబాద్‌లో సహజంగానే డిపాజిట్‌ కోల్పోయి మూడో స్థానంతో సరిపెట్టుకుంది.

సీఎంకు గట్టి షాక్‌!

2018 అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్‌లో ఓటమితో మల్కాజ్‌గిరి లోక్‌సభ బరిలో నిలిచిన రేవంత్‌ను ఇక్కడి ఓటర్లు ఆదరించారు. ఈ పదవితో ఏకంగా పీసీసీ చీఫ్‌ పోస్టుకు ఎదిగిన రేవంత్‌కు ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికలు కలిసొచ్చాయి. ఏకంగా ముఖ్యమంత్రి పదవిని కట్టబెట్టాయి. అయితే, తాజా లోక్‌సభ ఎన్నికల్లో ఆయనకు గట్టి షాక్‌ ఎదురైంది. సిట్టింగ్‌ స్థానాన్ని నిలబెట్టుకోకపోవడం ఇబ్బందిగా మారింది. మరోవైపు చేవెళ్ల సెగ్మెంట్‌కు ఆయన ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించారు. ప్రభుత్వ ప్రధానసలహాదారు వేం నరేందర్‌రెడ్డిని ముందుంచి ప్రచారశైలిని పర్యవేక్షించిన సీఎంకు ఇక్కడి ఫలితాలు నిరాశనే మిగిల్చాయి. బీఆర్‌ఎస్‌ తరుపున సీటు ఖరారైన తర్వాత పార్టీ మారేలా చేయడమేగాకుండా.. చేవెళ్ల నుంచి బరిలో దించిన రంజిత్‌రెడ్డి ఘోర ఓటమిని చవిచూశారు. అలాగే, ఈ స్థానానికి తొలుత అభ్యర్థిగా ప్రకటించి రంజిత్‌రెడ్డి రాకతో మల్కాజ్‌గిరి స్థానానికి మారిన వికారాబాద్‌ జడ్పీ చైర్‌పర్సన్‌ సునీతా మహేందర్‌రెడ్డి దారుణంగా ఓడిపోయారు. ఈ స్థానంలో పార్టీ తరుపున ఇన్‌ఛార్జ్‌ బాధ్యతలు నిర్వర్తించిన తుమ్మల నాగేశ్వరరావు అభ్యర్థిని గెలుపు తీరాలకు చేర్చలేకపోయారు.

కోమటిరెడ్డిదీ అదే పరిస్థితి

బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యేగా ఖైరతాబాద్‌ నుంచి గెలిచిన దానం నాగేందర్‌ కాంగ్రెస్‌లో చేరి ప్రజా వ్యతిరేకతను చవిచూడాల్సి వచ్చింది. ఎమ్మెల్యే ఎన్నికల్లో గెలిపించిన ఓటర్లే సికింద్రాబాద్‌ లోక్‌సభ అభ్యర్థిగా ఆయనను తిరస్కరించారు. శాసనసభ మిగిల్చిన చేదు ఫలితాలతో గ్రేటర్‌లో ఉనికిని చాటుకోవాలనే లక్ష్యంతో సీనియర్‌ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని రంగంలోకి దించినా ఫలితం లేకుండా పోయింది.

జాతీయ రహదారిపై కూలిన భారీ వృక్షం

- తప్పిన పెను ప్రమాదం
- కిలోమీటర్ల మేర నిలిచిపోయిన ట్రాఫిక్‌

చేవెళ్ల/మొయినాబాద్‌: ఈదురుగాలులతో కూడిన వర్షానికి హైదరాబాద్‌–బీజాపూర్‌ జాతీయ రహదారిపై భారీ మర్రి వృక్షం కూలింది. చేవెళ్ల మండల పరిధిలోని మిర్జాగూడ గేటు సమీపంలో రోడ్డుకు అడ్డంగా మర్రి వృక్షం పడడంతో రహదారిపై ట్రాఫిక్‌ నిలిచిపోయింది. మంగళవారం చేవెళ్ల మండలంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. బలమైన ఈదురుగాలులు వీయడంతో మర్రివృక్షం రోడ్డుపై కూలింది. రోడ్డుకు అడ్డంగా పడటంతో మన్నెగూడ–చేవెళ్ల మధ్యలో ట్రాఫిక్‌ పూర్తిగా నిలిచిపోయింది. రెండు వైపుల సుమారు మూడు కిలోమీటర్ల దూరం ట్రాఫిక్‌ జాం అయ్యింది. చెట్టు కూలిన సమయంలో రోడ్డుపై వాహనాలేమీ వెళ్లకపోవడంతో ప్రమాదం తప్పింది. చేవెళ్ల ట్రాఫిక్‌ పోలీసులు అక్కడికి చేరుకుని జేసీబీల సాయంతో చెట్టును తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్‌ చేశారు.


చేవెళ్ల మండలం మిర్జాగూడ గేటు సమీపంలో హైదరాబాద్‌–బీజాపూర్‌ జాతీయ రహదారిపై కూలిన మర్రి వృక్షం

హెచ్‌ఎండీఏ పనుల్లో పురోగతి ఏది?

పలుచోట్ల అభివృద్ధి పనులకు బ్రేక్‌

- నిలిచిపోయిన బిల్లుల చెల్లింపులు
- బాచుపల్లి ఫ్లైఓవర్‌, మెహిదీపట్నం స్కైవాక్‌ పనులు పూర్తికాక ప్రజల అవస్థలు

సాక్షి, సిటీబ్యూరో: జనసామర్థ్యం, వాహనాల రాకపోకలు అత్యధికంగా ఉన్న బాచుపల్లి కూడలిలో హెచ్‌ఎండీఏ ఫ్లైఓవర్‌ నిర్మాణం చేపట్టింది. మొదట్లో రోడ్ల విస్తరణకే పరిమితం కావాలని భావించినా వాహనాల రాకపోకలు, రద్దీని దృష్టిలో ఉంచుకొని అప్పటి ప్రభుత్వం ఫ్లైఓవర్‌ నిర్మాణానికే మొగ్గుచూపింది. సుమారు రూ.75 కోట్ల అంచనాలతో చేపట్టిన ఫ్లైఓవర్‌ పనులు శ్లాబ్‌ వరకూ వచ్చాయి. ఇప్పటి వరకూ చేపట్టిన పనులకు పూర్తి స్థాయిలో బిల్లులు రాకపోవడంతో నిర్మాణ సంస్థ పనులను నిలిపివేసింది. ఒక్క బాచుపల్లి ఫ్లై ఓవర్‌ మాత్రమే కాదు. హెచ్‌ఎండీఏ చేపట్టిన అనేక అభివృద్ధి పనులు ఆగిపోయాయి. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు, నిర్మాణ సంస్థలు చేతులెత్తేశాయి. వివిధ ప్రాంతాల్లో రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల విస్తరణ కోసం గత ప్రభుత్వ హయాంలోనే ప్రతిపాదనలు రూపొందించారు. అప్పట్లోనే ప్రణాళికలను సిద్ధం చేశారు. కొన్ని ప్రాజెక్టుల కోసం టెండర్లను సైతం ఆహ్వానించారు. ఈ క్రమంలోనే ఎన్నికలు రావడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చి ఐదు నెలలైనా పనుల్లో మాత్రం ఎలాంటి పురోగతీ లేదని అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో ప్రధాన రహదారులను లింక్‌రోడ్లలతో అనుసంధానం చేసేందుకు కార్యాచరణ చేపట్టారు. వీటిలో పలు చోట్ల పనులు పూర్తి కాగా, మరికొన్ని చోట్ల ప్రతిపాదనల దశలోనే ఉన్నాయి. చిన్నవి, పెద్దవి సుమారు 30 పనులు వివిధ స్థాయిల్లో నిలిచిపోయినట్లు అంచనా.

రూ.30 కోట్లు చెల్లిస్తే...

కేవలం రూ.30 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉండడం వల్ల బాచుపల్లి కూడలిలో చేపట్టిన ఫ్లై ఓవర్‌ పనులు ఆగిపోయినట్లు సమాచారం. 1.3 కిలోమీటర్ల మార్గంలో చేపట్టిన ఈ ప్రాజెక్టు కోసం గతేడాది వరకూ అయిన పనుల్లో కొన్నింటికి మాత్రమే బిల్లులు చెల్లించారు. కానీ ఆ తర్వాత పెండింగ్‌ బిల్లుల కారణంగా పనులు ముందుకు సాగలేదు. బాచుపల్లి చుట్టుపక్కల ప్రాంతాలు అనూహ్యంగా అభివృద్ధి చెందాయి. వాహనాల రద్దీ భారీగా పెరిగింది. శరవేగంగా విస్తరిస్తున్న కాలనీలు, గేటెడ్‌ కమ్యూనిటీలు, విల్లాలు, బహుళ అంతస్తులతో జనజీవనం విస్తరించింది. ఈ క్రమంలో రోడ్డు విస్తరణ, ఫ్లై ఓవర్‌ నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా మారాయి. మరోవైపు బాచుపల్లికి చేరువలోనే బౌరంపేట్‌ ఎడ్యుకేషనల్‌ హబ్‌గా మారింది. పదుల సంఖ్యలో విద్యాసంస్థలు ఏర్పాటయ్యాయి. దీంతో నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు వందల సంఖ్యలో ఇక్కడికి విద్యకోసం వస్తుంటారు. ప్రతిరోజు కూకట్‌పల్లి, ప్రగతినగర జేఎన్‌టీయూ, నిజాంపేట్‌, గండిమైసమ్మ తదితర ప్రాంతాల నుంచి బౌరంపేట్‌కు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ కారణంగా తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది.

మెహదీపట్నం స్కైవాక్‌..

అత్యధి వాహనాల రాకపోకలు, పాదచారుల రద్దీ ఉండే మెహిదీపట్నం కూడలిలో స్కైవాక్‌ నిర్మాణానికి అప్పట్లోనే హెచ్‌ఎండీఏ ప్రణాళికలను సిద్ధం చేసింది. పనులు కూడా ప్రారంభించింది. కానీ రక్షణశాఖకు చెందిన భూమి సేకరణ కోసం తలెత్తిన ఆటంకం కారణంగా పనులు ఆగిపోయాయి. కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చిన తరువాత క్లియరెన్స్‌ లభించింది. స్కైవాక్‌ కోసం స్థలం ఇచ్చేందుకు రక్షణశాఖ అంగీకరించింది. కానీ అందుకోసం ప్రభుత్వం పరిహారంగా రూ.15 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. ఈ డబ్బులు ఇప్పటి వరకూ చెల్లించకపోవడం వల్ల స్కైవాక్‌ ఆగింది. సుమారు రూ.35 కోట్ల అంచనాలతో, 600 మీటర్ల పరిధిలో ఈ స్కైవాక్‌ నిర్మాణం చేపట్టారు. ఉప్పల్‌ తరహాలో పాదచారులు నలువైపులా రాకపోకలు సాగించేందుకు ఎంతో అనుకూలంగా ఉంటుంది. కానీ నిధుల కొరత ఈ ప్రాజెక్టును వెంటాడుతోంది.

లే అవుట్‌ల అభివృద్ధికి పైసల్లేవు...

వివిధ ప్రాంతాల్లో హెచ్‌ఎండీఏ విక్రయించిన లే అవుట్‌లలో ఇప్పటి వరకూ కొన్ని చోట్ల మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయలేదు. రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్‌, మంచినీటిపైపు లైన్‌లు వంటి పనులు చేపట్టి పూర్తి చేయాల్సి ఉండగా, ఏళ్లు గడిచినా కనీస సదుపాయాలు కూడా లేవని హెచ్‌ఎండీఏ స్థలాలను కొనుగోలు చేసిన వారు ఆందోళన వ్యక్తం చేశారు. రూ.లక్షలు చెల్లించి ప్లాట్‌ కొనుగోలు చేసినప్పటికీ ఇల్లు కట్టుకోలేకపోతున్నట్లు పలువురు విస్మయం వ్యక్తం చేశారు. అలాగే బహుళ అంతస్తుల నిర్మాణం కోసం స్థలాలు కొనుగోలు చేసిన నిర్మాణ సంస్థలు, బిల్డర్‌లు, రియల్టర్‌లు కూడా ఆందోళనకు గురవుతున్నారు. కొన్ని చోట్ల బీటీ రోడ్ల వరకూ పూర్తి కాగా, మరి కొన్ని చోట్ల విద్యుత్‌ సదుపాయం లేదు. పార్కులు లేవు. కొన్ని లే అవుట్‌లలో ఎలాంటి పనులను ప్రారంభించలేదు.

ప్రతిపాదనలకే పరిమితం...

నార్సింగి నుంచి ఔటర్‌ రింగ్‌రోడ్డు వరకూ కొత్తగా రోడ్డును అభివృద్ధి చేశారు. అలాగే ఔటర్‌ చుట్టుపక్కల ఉన్న కాలనీలకు సైతం లింకు రోడ్లతో అనుసంధానం చేసేందుకు సన్నాహాలు చేశారు. ఇప్పటి వరకూ ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులూ లభించకపోవడంతో పనులను పెండింగ్‌లో పెట్టినట్లు సమాచారం. ఇదొక్కటే కాదు... చాలా చోట్ల ఇదే పరిస్థితి. లింకు రోడ్ల కోసం కొన్నిచోట్ల ఇప్పటికే టెండర్‌లను ఆహ్వానించగా, మరికొన్ని చోట్ల టెండర్‌లకు నోటిఫికేషన్‌ దశలో ఉన్నాయి. ‘ఈ పెండింగ్‌ పనుల పైన ఎలా ముందుకెళ్లాలనే అంశంపైన సందిగ్ధం నెలకొంది. గతంలో ఆహ్వానించిన టెండర్‌లను రద్దు చేసి కొత్తగా మరోసారి టెండర్లు వేయవలసి ఉంటుందా, లేక ఆ ప్రాజెక్టులనే రద్దు చేయవలసి వస్తుందా అనేది తెలియడం లేదు’ అని హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారి ఒకరు చెబుతున్నారు.

మల్కాజిగిరి ఓట్ల లెక్కింపు ప్రశాంతం

● కౌంటింగ్‌ను పర్యవేక్షించిన కలెక్టర్, పోలీసు అధికారులు ● ప్రతీ రౌండ్‌లోనూ బీజేపీదే ఆధిక్యం

సాక్షి,మేడ్చల్ జిల్లా: కీసర మండలం భోగారం హోలీమేరీ ఇంజినీరింగ్ కళాశాలలో మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు, సరూర్‌నగర్ ఇండోర్‌స్టేడియంలో ఎల్బీనగర్, బేగంపేట వెస్లీ కాలేజీలో కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు సోమవారం ప్రశాంతంగా జరిగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మూడంచెల భద్రతతో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. హోలీమేరీ కాలేజీలో మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలకు వేర్వేరుగా కేంద్రాలను ఏర్పాటు చేసి ఓట్ల లెక్కింపు నిర్వహించారు. ఇందులో 575 మంది సిబ్బంది విధులు నిర్వహించారు. కౌంటింగ్ కేంద్రంలో బరిలో ఉన్న పార్టీల అభ్యర్థుల తరఫున ఏజెంట్లు హాజరుకాగా, ఒక టేబుల్ వద్ద కౌంటింగ్ సూపర్‌వైజర్, అసిస్టెంట్ కౌంటింగ్ సూపర్‌వైజర్, మైక్రోఅబ్జర్వర్ విధులు నిర్వహించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద మీడియా సెంటర్‌తో పాటు ఎప్పటికప్పుడు ఎన్నికల ఫలితాల సమాచారం కోసం ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. లెక్కింపు కేంద్రాలను తరచుగా జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్, పోలీసు అధికారులు పర్యవేక్షించగా, పలువురు డీసీపీలు, ఏసీపీలు, పదుల సంఖ్యలో సీఐ, ఎస్ఐలు, వందలాది పోలీసులు బందోబస్తు చేపట్టారు.

ఉత్కంఠ భరితంగా..

మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల ఓట్ల లెక్కింపు ఆద్యాంతం ఉత్కంఠరితంగా సాగింది. మేడ్చల్,కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్, మల్కాజిగిరి, ఎల్బీనగర్, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గాల్లోని లెక్కింపులో ప్రతీ రౌండ్‌లో మొదటి నుంచి బీజేపీ అధిక్యతను చాటింది. ఫలితం బీజేపీకి అనుకూలంగా ఉండడంతో ఆ పార్టీ అభ్యర్థులు, వారి ఏజెంట్లు గెలుపు ధీమాతో ఆనందాన్ని వ్యక్తం చేయగా, మిగితా పార్టీల ఏజెంట్లు మాత్రం కౌంటింగ్ కేంద్రం నుంచి వెళ్లిపోవడం కనిపించింది. ఓట్ల లెక్కింపు కొనసాగుతుండగానే.. బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి కౌంటింగ్ కేంద్రం నుంచి వెళ్లిపోగా, బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ మాత్రం చివరి వరకు కౌంటింగ్ కేంద్రంలోనే ఓట్ల లెక్కింపును పర్యవేక్షించారు. కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి కూడా కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు సరళిని పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రాన్ని ఎన్నికల నోడల్ అధికారులు పర్యవేక్షించారు. కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు, అగ్నిమాపక వాహనంతో పాటు హాలులో టవరింగ్ ఏసీలు, భోజన వసతి, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించారు.

69,376 ఓట్ల ఆధిక్యత సాధించిన ఈటల

మేడ్చల్/పోచారం: కీసర మండలం భోగారంలోని హోలీమేరీ ఇంజినీరింగ్ కళాశాలలో మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని మేడ్చల్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపును మంగళవారం చేపట్టారు. అధికారులు టేబుళ్లు ఏర్పాటు చేసి 21 రౌండ్ల పాటు కౌంటింగ్ నిర్వహించారు. నియోజకవర్గంలో 6,65,979 మంది ఓటర్లుండగా 3,85,129 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ మేడ్చల్‌లో 1,86,819 ఓట్లతో మొదటి స్థానం సాధించారు. 1,17,443 ఓట్లతో కాంగ్రెస్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి రెండో స్థానం, 66,485 ఓట్లతో బీఆర్ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి మూడో స్థానంలో నిలిచారు. మొత్తంగా ఈటల 69,376 ఓట్ల ఆధిక్యతను సాధించారు.

ఈటల మెజార్టీ కంటే బీఆర్ఎస్ అభ్యర్థికి తక్కువ ఓట్లు..

ఈటల రాజేందర్‌కు 1,86219 ఓట్లు రాగా ఆయనకు 69,376 ఓట్ల మెజార్టీ లభించింది. అయితే బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి 66485 ఓట్లు మాత్రమే లభించగా ఈటల మెజార్టీ కంటే 2891 ఓట్లు తక్కువగా వచ్చాయి.

రౌండ్ల వారీగా ఎవరికెన్ని ఓట్లు..

రౌండ్	బీజేపీ	కాంగ్రెస్	బీఆర్ఎస్	లీడ్
1	7790	7590	3747	200(బీజేపీ)
2	9577	5134	2715	4443 '
3	8841	5167	2428	3674 '
4	6873	5833	4225	1040 '
5	8980	6731	3305	2249
6	8357	5476	3279	2881
7	7561	6855	2641	706
8	10458	5817	2770	4641
9	10495	5101	2867	5394
10	8643	5514	3101	3129
11	7986	6396	3381	1590
12	7770	5252	2405	2518
13	8426	5829	3434	2597
14	10569	6770	3255	3799
15	12379	4318	3561	8061
16	11063	4942	3475	6121
17	11155	4331	2737	6824
18	9236	4632	2644	4694
19	9453	5584	3489	3869
20	6627	5309	3642	1318
21	4580	4862	3384	282(కాంగ్రెస్)
మొత్తం.	1,86,519	117443	66485	69376

నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు బలం పెరిగింది

కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఓటింగ్ శాతాన్ని గణనీయంగా మెరుగుపరుచుకుందని కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 67వేల ఓట్లు వస్తే లోక్‌సభ ఎన్నికల్లో 86 వేల ఓట్లు వచ్చాయన్నారు. గత 15 ఏళ్లుగా కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీకి నాయకుడే లేడు అనే స్థితి నుంచి రెండో స్థానంలో నిలబడే స్థాయికి వచ్చామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కంటే లోక్‌సభ ఎన్నికల్లో 35శాతం ఓట్లు అధికంగా పార్టీకి వచ్చేలా కృషి చేసిన కార్యకర్తలకు అభినందనలు తెలిపారు.

డ్రైనేజీ నిర్మాణ వ్యర్థాలను తరలించండి



మోతీనగర్ శంకరమఠం సమీపంలో డ్రైనేజీ వ్యర్థాలు

మోతీనగర్: మ్యాన్‌హోల్‌కు మరమ్మతు చేసిన తర్వాత వ్యర్థాలను రోడ్డు మధ్యలోనే వదిలి వేయటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మూసాపేట డివిజన్ అవంతి నగర్, మోతీనగర్ శంకర మఠం సమీపంలో కొన్ని రోజుల క్రితం మ్యాన్‌హోల్‌పై మూతలు ఏర్పాటు చేయటం తర్వాత వాటి వ్యర్థాలను రోడ్ల మధ్యనే వదిలివేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు డ్రైనేజీ నుంచి తీసిన వ్యర్థాలను తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

కాంగ్రెస్‌తోనే బీసీల అభ్యున్నతి

లిబర్టీ: లోక్‌సభ ఎన్నికల్లో బీసీలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్రు కుమారస్వామి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌ను అడ్డుకునేందుకు బీజేపీ, బీఆర్ఎస్ ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థుల వైపే మొగ్గు చూపారన్నారు. బీసీ సామాజిక వర్గాలు ఎప్పుడు కాంగ్రెస్‌కు అండగా ఉంటారని ఆ పార్టీ కూడా బీసీల ఆర్థిక అభివృద్ధి కోసం సామాజిక ప్రగతి కోసం జీవన ప్రమాణాల మార్పు కోసం మెరుగైన చర్యలు చేపట్టారని కుమారస్వామి సూచించారు. ఏ రాజకీయ పార్టీ అయినా ప్రజల తీర్పును గౌరవించాలని ఆ తీర్పుకు కట్టుబడి ఉండాలన్నారు. తెలంగాణలో అధికారంలో ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ బీసీల కోసం వారి ప్రగతి కోసం నిరంతరంగా పని చేస్తుందన్నారు.

బీజేపీతోనే ప్రజా సమస్యల పరిష్కారం

లిబర్టీ: బీజేపీ సారథ్యంలో ఎన్‌డీఏ ప్రభుత్వానికి ప్రజలు మరోమారు పట్టం కట్టారని లోక్‌దల్ పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు జాతీయ కార్యదర్శి పుల్లూరు వెంకటరాజేశ్వరరావు అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పదేళ్లుగా దేశ భద్రత రక్షణ తదితర అంశాలపై ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు చేసిందన్నారు. మూడోసారి ప్రజలు ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని ఆదరించారన్నారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్, సంకీర్త పాల్గొన్నారు.

సమాజ సేవకులకు ఎల్లప్పుడూ గుర్తింపు

లిబర్టీ: సమాజ హితమే జన హితంగా భావించి పని చేస్తే ప్రతి వ్యక్తికి గుర్తింపు ఉంటుందని ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు, ఎన్విరాల్‌మెంట్ మాజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఆదినారాయణ అన్నారు. కృషి పట్టుదల ఉంటే అన్ని రంగాల్లో రాణించగలమన్నారు. మంగళవారం ఆదిలీలా ఫౌండేషన్ కార్యాలయంలో జరిగిన సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ సామాజిక సేవ, పేదల అభ్యున్నతి కోసం పని చేసిన వారు నిజమైన వ్యక్తులన్నారు. చరిత్రలో నిలవాలంటే గొప్ప కార్యం సాధించాలన్నారు.

అధిక ఫీజులపై పోరాడతాం

ఉస్మానియా యూనివర్సిటీ: అధిక ఫీజులు, విద్యార్థి సంక్షేమం, విద్యారంగ సమస్యలపై పోరాడనున్నట్లు తెలంగాణ విద్యార్థి ఫోరం (టీవీఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు ఆషాడపు మధు పేర్కొన్నారు. మంగళవారం ఓయూలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశం అనంతరం టీవీఎఫ్ నూతన అధ్యక్షుడిగా మధును రాష్ట్ర కార్యవర్గం ఎన్నుకుంది. ఉమ్మడి వరంగల్ జిల్లా (ప్రస్తుతం భూపాలపల్లి) గణపురం మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన మధు తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. విద్యారంగాన్ని పట్టిపీడిస్తున్న అధిక ఫీజులపై పోరాడనున్నట్లు ఈ సందర్భంగా మధు పేర్కొన్నారు.

కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయం వద్ద సంబరాల్లో వడ్డేపల్లి రాజేశ్వరరావు, కార్యకర్తలు



విజయోత్సాహం

కూకట్‌పల్లి నియోజకవర్గ వ్యాప్తంగా బీజేపీ సంబురాలు



మూసాపేట డివిజన్‌లో జరిగిన వేడుకల్లో కార్పొరేటర్ మహేందర్





ఈటల రాజేందర్‌తో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్‌పల్లి: మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ ఎంపీగా ఈటల రాజేందర్ భారీ మెజార్టీతో గెలవడంతో కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీజేపీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. కూకట్‌పల్లి నియోజకర్గ కార్యాలయం ఆవరణలో బాణసంచా కాల్చి మిఠాయిలు పంచుకుని వేడుకలు చేసుకున్నారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ.. ఈటల రాజేందర్ భారీ మెజార్టీతో గెలవటం చాలా ఆనందంగా ఉందన్నారు. దేశంలో మరోమారు ప్రజలు మోదీ ప్రభుత్వానికే పట్టం కట్టారన్నారు. మల్కాజిగిరి లోక్‌సభను దేశంలో ఆదర్శనీయంగా తీర్చిదిద్దుతారనే నమ్మకం ఉందని జిల్లా కార్యదర్శి పులిగొళ్ల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాయినేని సూర్యప్రకాష్‌రావు, అర్సనపల్లి సూర్యారావు, మూసాపేట కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్, సీనియర్ నాయకులు మల్లేష్ గౌడ్, దాకయ్య, తూము శైలేష్, ఐలయ్య, పోలాకి కిషోర్, ప్రశాంత్‌రెడ్డి, భాస్కర్, విజయభవాని, సాయి, శోభరాజన్, స్వామి, నవీన్, వెంకటేష్ యాదవ్, శ్రీకాంత్, రాజేశ్వరి, జానకి, శ్రీకాంత్ పాల్గొన్నారు.



గాయత్రినగర్ చౌరస్తాలో సంబురాల్లో పులిగొళ్ల శ్రీనివాస్‌యాదవ్, నాయకులు

ఉచితంగా ఫిజియోథెరపీ చికిత్సలు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి, వివేకానందనగర్ కాలనీలోని రిక్రియేషన్ క్లబ్‌లో ఫిజియోథెరపీ చికిత్స ఉచితంగా చేయనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఫ్యాప్సికో, జీహెచ్ఎంసీ, హెల్పేజ్ ఇండియా, రిక్రియేషన్ క్లబ్, ఎంపీసీఆర్, లయన్స్‌క్లబ్‌ల సంయుక్త సహకారంతో నిర్వహించే ఈ ఫిజియోథెరపీ సెంటర్‌లో ప్రతిరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు చికిత్స అందజేయనున్నట్లు తెలిపారు. మెడ, మోకాళు, ఒళ్లు, కాళ్లు, కీళ్ల నొప్పులు వంటి తదితర నొప్పులకు చికిత్స చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంతవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: భారతదేశంలో ఫ్యాషన్ పరిశ్రమ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని 'మనూ' డిజైనింగ్ కోర్సుల ఇన్‌చార్జి సమనా మూస్వి మంగళవారం తెలిపారు. ఈ నేపథ్యంలో మనూలో ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులను ప్రారంభించడం జరిగిందన్నారు. 'మనూ', సమనా కాలేజ్ ఆఫ్ డిజైన్ సహకారంతో నాలుగేళ్ళ (యూజీ కోర్సు) బీఎస్సీ, రెండు ఏళ్ళ డిప్లొమో కోర్సు, ఫ్యాషన్ డిజైనింగ్, ఇంటీరియర్ డిజైనింగ్‌లో ఒక ఏడాది కాలపరిమితితో కూడిన సర్టిఫికెట్ కోర్సును నిర్వహించడం జరుగుతోందన్నారు. 10ప్లస్ 2 లేదా తత్సమాన కోర్సులో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ కోర్సులో ప్రవేశానికి అర్హులన్నారు. ఇది కాకుండా ఉర్దూ యూనివర్శిటీ మోడల్ స్కూల్, పాలిటెక్నిక్, గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు ప్రత్యేక మినహాయింపు ఉంటుందన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు ఫారమ్‌తో పాటు ప్రాస్పెక్టస్ యూనివర్శిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. దరఖాస్తు సమర్పించడానికి చివరితేదీగా జూన్30గా నిర్ణయించామన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 81065 28786లో సంప్రదించాలన్నారు.

శిథిలావస్థకు చేరిన ఇళ్ల కూల్చివేత

అత్తాపూర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాలలో శిథిలావస్థకు చేరిన ఇళ్లను కూల్చివేసినట్లు రాజేంద్రనగర్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ కె. రవికుమార్ తెలిపారు. ఇటీవల బాబుల్‌రెడ్డి నగర్‌లో గోడ కూలిన ఘటనలో చిన్నారులు మృతి చెందిన విషయం విషాదకరమన్నారు. శిథిలావస్థకు చేరిన ప్రహరీలను, ఇళ్లను స్వచ్ఛందంగా తొలగించుకుంటే ఎలాంటి ప్రమాదాలు జరగవన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

నీటి వృథా

జీడిమెట్ల: మంచినీటి పైపులైన్ పగిలిపోవడంతో నీరు రోడ్డుపై వృథాగా పోతుంది. జీడిమెట్ల ఫేజ్–5లోని రాంరెడ్డినగర్ రోడ్డులో మంచినీటి పైప్‌లైన్ పగిలిపోయింది. దీంతో వేలాది లీటర్ల మంచినీరు వృథాగా పోయింది. అధికారులు స్పందించి మంచినీటి పైపులైన్‌కు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

8న చేప ప్రసాదం పంపిణీ

నారాయణఖేడ్: మృగశిర కార్తె సందర్భంగా నిజాంపేట్ మండల కేంద్రంలో ఈ నెల 8న ఉదయం 7.30 గంటల నుంచి చేప ప్రసాదాన్ని పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తడకంటి పర్వాగౌడ్, లక్ష్మీనారాయణగౌడ్, శంకర్‌గౌడ్, లింగాగౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ పూర్వీకుల నుంచి ఆనవాయితీగా ప్రసాదం పంపిణీ చేస్తున్నామన్నారు. దగ్గు ఉబ్బసం వ్యాధి ఉన్న బాధితులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సీజనల్ వ్యాధులు.. జాగ్రత్తలు తప్పనిసరి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డా.శ్రీకాంత్



హఫీజ్‌పేట్: వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజలు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, ఇంట్లోకి వెలుతురు వచ్చే విధంగా చూడాలని హఫీజ్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డా.శ్రీకాంత్ సూచించారు. వర్షాకాలంలో ఎక్కువగా జలుబు, దగ్గు, జ్వరాలు వస్తాయని గోరు వెచ్చని నీటిని తాగాలని , తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమల ద్వారా డెంగ్యూ, మలేరియా వ్యాధులు వస్తాయి కనుక నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని చెప్పారు.హఫీజ్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోజు సుమారు 100 మందికి వైద్య పరీక్షలు చేస్తున్నారన్నారు. ఆరోగ్య కేంద్రంలో ఒక మెడికల్ ఆఫీసర్, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఇద్దరు ఏఎన్ఎంలు, ఇద్దరు సూపర్‌వైజర్లు, ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్స్, ఒక డీఈఓ, అకౌంటెంట్ ఉన్నారు.

పీహెచ్‌సీలో చేసే రక్త పరీక్షలు..

డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్యా, పూర్తి రక్తం చిత్రం, షుగర్, కాలేయం, ఊపిరితిత్తులు, కిడ్నీ, సీఆర్‌పి, హెచ్ఐవీ వంటి రక్త పరీక్షలు చేయడం జరుగుతుంది.

◆ రోజుకు పది మందికి పైగా రక్త పరీక్షలు చేస్తున్నారు.

'ఎస్కీ'లో జీఐఎస్‌పై స్వల్పకాలిక సర్టిఫికేషన్ కోర్సులు

● ఎస్కీ డైరెక్టర్ డా.రామేశ్వరరావు

రాయదుర్గం: ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఎస్కీ)లో జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(జీఐఎస్)లో స్వల్పకాలిక కోర్సులను అందుబాటులోకి తేవాలని నిర్ణయించినట్లు ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు మంగళవారం వివరించారు. జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌లో 6వారాల, 4 వారాల వ్యవధితో ఉండే రెండు ప్రత్యేక సర్టిఫికేషన్ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కోర్సులను జూన్10వ తేదీ నుంచి నిర్వహించాలని తలపెట్టినట్లు పేర్కొన్నారు.అన్ని రకాల డేటాను మ్యాప్ చేసే ఏకైక వ్యవస్థ జీఐఎస్ కాబట్టి మెరుగైన కమ్యూనికేషన్ విధానంతో కూడిన సిలబస్ రూపొందించడం జరిగిందన్నారు.ఈ కోర్సులో చేరాలనుకునేవారు ఎల్‌సీఈ/ఎల్ఎంఈతో పాటుగా బీఈ, బీటెక్/ప్లానింగ్ లేదా ఆర్కిటెక్చర్‌లో డిగ్రీ అర్హత, ఎంటెక్ టౌన్‌ప్లానింగ్, రిమోట్ సెన్సింగ్ జియోమ్యాటిక్స్, ఎన్విరాన్‌మెంట్ కలిగిన అభ్యర్థులు బీఎస్సీ కంప్యూటర్‌సైన్స్, కంప్యూటర్స్, ఎంఎస్సీ జీఓఇన్ఫర్‌మ్యాటిక్స్ కలిగిన అభ్యర్థులకు జీఐఎస్ సర్టిఫికేషన్ కోర్సు చేయడానికి అర్హతగా నిర్ణయించినట్లు ఆయన వివరించారు.

కుమారుడి చికిత్సకు వచ్చిన వ్యక్తి అదృశ్యం

రాంగోపాల్‌పేట్: కుమారుడి చికిత్స కోసం నగరానికి వచ్చిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా వీరాపూర్‌కు చెందిన ఆటో డ్రైవర్ సాంబయ్య (32) తన కుమారుడికి ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఈ నెల 1న నాంపల్లిలోని నీలోఫర్ ఆస్పత్రికి తీసుకొచ్చాడు. ఆయనతో పాటు చిన్నాన్న పవార్ సాంబయ్య తోడుగా వచ్చారు. ఈ నెల 2న సాంబయ్య తల్లి హైదరాబాద్‌కు వచ్చినట్లు ఫోన్ చేసింది. రెతిఫైల్ బస్టాండ్ వద్ద ఉన్న ఆమెను తీసుకుని వచ్చేందుకు రాపిడోపై సాంబయ్య సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. కొద్ది గంటల తర్వాత పవార్ సాంబయ్య ఆయనకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. పవార్ సాంబయ్య ఆయన తల్లికి ఫోన్ చేయగా తీసుకుని వెళ్లేందుకు రాలేదని చెప్పింది. రాపిడో డ్రైవర్‌ను వాకబు చేస్తే రెతిఫైల్ ఎదురుగానే దించినట్లు చెప్పాడు. తెలిసిన వాళ్లు, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కూకట్‌పల్లిలో కమల వికాసం

● బీజేపీ, కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోటీ ● పోటీలో కానరాని బీఆర్ఎస్

కూకట్‌పల్లి: మారుతున్న కాలానికి అనుగుణంగా రాజకీయ పరిస్థితులు కూడా ఎప్పటికప్పుడు మారతాయనడంలో సందేహం లేదు. ఆరు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అనూహ్య విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల్లో 70వేల మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం సాధించారు. కానీ లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ మూడో స్థానంలో నిలిచింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కూటమి 37వేల ఓట్లు కూడా సాధించలేదు. అలాంటి బీజేపీ అత్యధిక ఓట్ల మెజార్టీతో విజయం సాధించటం కూకట్‌పల్లి చరిత్రలో ఇదే ప్రథమం.

మూడో స్థానానికే బీఆర్ఎస్ పరిమితం...

కాంగ్రెస్ పార్టీ మాత్రం అసెంబ్లీ ఎన్నికల్లో 65వేల ఓట్లు సాధించింది. లోక్‌సభ ఎన్నికల్లో 86వేల ఓట్లు సాధించి సుమారు 20వేల ఓట్లను పెంచుకుంది. బీఆర్ఎస్ మాత్రం గత ఎన్నికల్లో 1,35,000 ఓట్లు సాధించి ఈసారి మూడోస్థానానికి పడిపోవటం గమనార్హం. బీజేపీ 1,09,820 ఓట్లు సాధించగా, కాంగ్రెస్ 84,700 ఓట్లు, బీఆర్ఎస్ 32,788 ఓట్లు సాధించాయి. కూకట్‌పల్లి నియోజకవర్గంలో దాదాపు 25 వేల పై చిలుకు మెజార్టీ సాధించింది.

కేవలం 3 రౌండ్లలోనే కాంగ్రెస్ ఆధిక్యం..

6వ రౌండ్‌లో కాంగ్రెస్‌కు 2800 మెజార్టీ, 13వ రౌండ్‌లో ఏకంగా 6 వేలు, 15వ రౌండ్‌లో కూడా 3వేల ఆధిక్యంలో కాంగ్రెస్ ఉంది. ఈ మూడు రౌండ్‌లు మినహాయిస్తే మిగిలిన అన్ని రౌండ్‌లలో బీజేపీ తన ఆధిక్యాన్ని ప్రదర్శించింది. కేవలం మైనార్టీ ప్రాంతాల వారు నివాసముండే కాలనీల్లో మాత్రమే కాంగ్రెస్‌కు అత్యధికంగా ఓట్లు పోలయ్యాయని తెలుస్తోంది. బీఆర్ఎస్ మాత్రం అన్ని రౌండ్లలో మూడో స్థానంతోనే సరిపుచ్చుకుంది.

బీజేపీ కార్యకర్తల్లో జోష్..

గతంలో బీజేపీ కూటమిలో ఉన్న జనసేనకు 39వేల ఓట్లు రాగా ఈసారి బీఆర్ఎస్‌కు 32,788 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. ఏది ఏమైనప్పటికీ గత అసెంబ్లీ ఎన్నికల్లో మొదటి స్థానం నుంచి పార్లమెంట్ ఎన్నికల్లో మూడో స్థానానికి బీఆర్ఎస్ చేరడం అందరినీ ఆశ్చర్య పరుస్తోంది. బీజేపీ మాత్రం అనూహ్యంగా మొదటి స్థానంలోకి చేరడంతో స్థానిక నేతలు, కార్యకర్తల్లో జోష్ పెరిగింది.

- ఇక్కడ అసెంబ్లీలో గెలిచినా లోక్‌సభలో బోల్తాపడిన బీఆర్ఎస్
- కూకట్‌పల్లి నియోజకవర్గంలోనే 1,09,820 ఓట్లు సాధించిన ఈటల
- బీజేపీకి దాదాపు 25వేల పై చిలుకు మెజార్టీ
- ఆ తర్వాతి స్థానాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు
- దేశంలో అతిపెద్ద లోక్‌సభ నియోజకవర్గమైన మల్కాజ్‌గిరిలో ఈటలదే విజయం

రౌండ్	ఈటల రాజేందర్	పట్నం సునీతారెడ్డి	రాగిడి లక్ష్మారెడ్డి
సంఖ్య	బీజేపీ	కాంగ్రెస్	బీఆర్ఎస్
01.	6542	3053	2168
02.	4216	3940	2035
03.	4786	3370	2038
04.	5728	4617	1737
05.	6632	3936	1727
06.	4138	6907	1546
07.	5144	4231	1582
08.	4889	4566	1842
09.	5048	2938	1648
10.	6264	4474	1618
11.	6574	3530	2023
12.	6571	2966	1392
13.	3418	9046	1645
14.	2407	4554	1420
15.	3337	6497	1213
16.	5356	2519	1085
17.	6031	2937	1306
18.	5248	2459	1272
19.	6369	2934	1104
20.	5137	2766	859
21.	5987	2493	1537

ప్రపంచ స్థాయి ర్యాంకింగ్స్‌లో 'హెచ్‌సీయూ'

రాయదుర్గం: ప్రపంచ స్థాయి ర్యాంకింగ్స్‌లో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ 801–850 ర్యాంక్‌లో స్థానం పొందింది. కాగా 'సిటేషన్స్ ఫర్ ఫ్యాకల్టీ' సూచికలో హెచ్‌సీయూకు ప్రపంచంలో 335వ స్థానం లభించడం విశేషం. ప్రపంచంలోని అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా పేరుపొందింది. ఉన్నత విద్యా సంస్థలలో ర్యాంకింగ్స్‌ను క్వాక్వారెల్లి సైమండ్స్(క్యూఎస్) యూనివర్శిటీ ర్యాంకింగ్స్‌ను ప్రతియేటా ప్రకటిస్తుంటారు. అందులో భాగంగా 2025 ర్యాంకింగ్స్‌ను ప్రకటించారు.

గత ఏడాది కంటే మెరుగైంది

హెచ్‌సీయూ వీసీ ప్రొఫెసర్ బీజేరావు

క్యూఎస్ వరల్డ్ యూనివర్శిటీ ర్యాంకింగ్స్‌లో గత ఏడాది కంటే మెరుగైన స్థానం రావడం సంతోషించదగ్గవిషయని హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు పేర్కొన్నారు. 2025 ఎడిషన్‌లో సిటేషన్స్ ఫర్ ఫ్యాకల్టీ సూచికలో 335 ర్యాంక్‌ను పొందిందని, 2024లో 372వ ర్యాంక్ సాధించిందని ఆయన గుర్తు చేశారు. ఇది పురోగతికి నిదర్శనమన్నారు.

ప్రైవేట్ ఫీజుల దోపిడీని అరికట్టాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేష్

పటాన్‌చెరు టౌన్: అనుమతులు లేకుండా అడ్మిషన్లు ఇస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు. మంగళవారం పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి మాట్లాడారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న వేళ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాల, కళాశాలలో ఫీజుల దోపిడీని అరికట్టాలని అదేవిధంగా ఫీజులో నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. జిల్లాలో అనుమతులు లేకుండా కొన్ని బడా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ముందస్తు అడ్మిషన్లు చేస్తూ రిజిస్ట్రేషన్ ఫీజులు సైతం భారీగా వసూలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల విద్యార్థులకు 25% ఉచితంగా విద్యను అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు , విజయ్ ,అనూష, మౌనిక, హారిక తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవాల్లో టీడీపీ శ్రేణుల దాడులు

'ప్రకాశం'లో జెడ్పీ పాఠశాల ముఖ ద్వారం, గేట్ జేసీబీతో కూల్చివేత

- బీసీ, ఎస్సీల ఇళ్లు కూల్చేందుకు ప్రయత్నం
- విడదల రజిని, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి కార్యాలయాలపై దాడులు
- బొల్లా బ్రహ్మనాయుడు కళ్యాణమండపం ధ్వంసం
- డా.వైఎస్సార్ హెల్త్ వర్సిటీ పేరులో 'వైఎస్' పేరు తొలగింపు
- పలుచోట్ల ప్రభుత్వ కార్యాలయాలపై దాడి.. ఆస్తి నష్టం
- మచిలీపట్నం, కొవ్వూరులో కవ్వింపు చర్యలు.. రాళ్ల దాడి.. కార్లు ధ్వంసం
- ఎక్కడా పోలీసుల నిషేధాజ్ఞలను పట్టించుకోని టీడీపీ–జనసేన శ్రేణులు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

హామీలు ఆశలు రేపాయా?

- మహిళలు, యువత లక్ష్యంగా సూపర్ సిక్స్ హామీలు
- వాటిని నమ్మి ఆశతో చంద్రబాబుకు ప్రజలు పట్టం కట్టారా!



సాక్షి, అమరావతి: ఎన్నికల్లో టీడీపీ కూటమి గట్టెక్కటానికి చంద్రబాబు గుప్పించిన హామీలే ప్రధాన కారణమనే చర్చ జరుగుతోంది. సీఎం జగన్ అమలు చేసిన పథకాల కంటే ఎక్కువగా అందిస్తామని నమ్మబలకడంతో ప్రజలు ఆకర్షితులైనట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. సూపర్ సిక్స్ పేరుతో ఎడాపెడా హామీలను ఇచ్చేసిన చంద్రబాబు స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏటా రూ.15 వేలు చొప్పున కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికి డబ్బులిస్తామని ప్రకటించడంతో ఇప్పటికే అమ్మఒడి ద్వారా లబ్ధి పొందుతున్న కుటుంబాలు ఆకర్షణకు గురైనట్లు చెబుతున్నారు. ఐదేళ్లుగా ప్రతి నెలా ఇంటి వద్దే టంచన్‌గా పింఛన్లను అందిస్తుండగా తాము రూ.4 వేలకు పెంచి ఇస్తామన్న చంద్రబాబు వాగ్దానంపై వృద్ధులు ఆశపడ్డారు. ఏప్రిల్ నుంచే దీన్ని అమలు చేయడంతోపాటు జూలైలో బకాయిలతో కలిపి మొత్తం ఆ నెలలో రూ.7 వేల పింఛను అందిస్తామని చంద్రబాబు చెప్పారు. కొన్ని వర్గాలకు పింఛన్ వయో పరిమితి తగ్గింపుతోపాటు ప్రతి రైతుకు ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తామనడంతో అన్నదాతలు ఆశలు పెంచుకున్నట్లు వెల్లడవుతోంది.

మెగా డీఎస్సీపై తొలి సంతకం..

అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసి తొలి సంతకం ఆ ఫైలు పైనే చేస్తానని చంద్రబాబు ప్రకటించడంతో నిరుద్యోగులు ఆకర్షితులయ్యారు. ఏటా జాబ్ క్యాలెండర్, యువతకు 20 లక్షల ఉద్యోగాలు లేదా నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని బాబు హామీలిచ్చారు. ప్రతి మహిళకు నెలకు రూ.1,500 చొప్పున సాయం, ప్రతి ఇంటికి ఏటా ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం లాంటి వాగ్దానాలతో అక్క చెల్లెమ్మలు టీడీపీ వైపు మొగ్గినట్లు భావిస్తున్నారు. స్వయం సహాయక సంఘాలకు రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు రుణాలు ఇస్తామని చంద్రబాబు హామీలివ్వడం కూడా మరో కారణం. ప్రతి ఇంటికీ మేలు చేస్తూ సీఎం జగన్ ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థను కొనసాగించడంతోపాటు వారికి రూ.10 వేలు చొప్పున గౌరవ వేతనం ఇస్తానని ప్రకటించడం ద్వారా చంద్రబాబు మరో ఎత్తుగడ వేశారు. గ్రామాల్లో పేదలకు 3 సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలిస్తానని, పక్కా ఇళ్లు కట్టిస్తానని ఇచ్చిన హామీలు కూడా ప్రభావితం చేశాయి. పోలవరాన్ని సత్వరం పూర్తి చేస్తానని, నదుల అనుసంధానం, ప్రతి ఎకరానికి నీళ్లు ఇస్తానంటూ చంద్రబాబు హామీలిచ్చారు. ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్య బీమా, జన ఔషధి కేంద్రాలు, బీపీ, షుగర్ వ్యాధులకు ఉచితంగా జనరిక్ మందులను పంపిణీ చేస్తామన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వంద శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తుండగా తాను నేరుగా కాలేజీలకే చెల్లిస్తానంటూ చంద్రబాబు చెప్పారు. గతంలో మాదిరిగా ఉచిత ఇసుక విధానాన్ని మళ్లీ తెస్తానని ప్రకటించారు. మండల, జిల్లా కేంద్రాల్లో వర్క్ ఫ్రం హోం స్టేషన్లు ఏర్పాటు చేస్తానని ఇచ్చిన హామీలు కొంతమేర ప్రభావం చూపడంతో చంద్రబాబు అధికారంలోకి వచ్చినట్లు విశ్లేషకులు చెబుతున్నారు.

ఓడినా.. గెలిచినా మీతోనే జగన్

వైఎస్సార్‌సీపీ అభిమానుల్లో సడలని ఆత్మస్థైర్యం

- ఎన్నికల ఫలితాలతో ప్రమేయం లేకుండా మద్దతు
- సోషల్ మీడియా వేదికగా పోటెత్తిన పోస్టులు
- టీడీపీ కవ్వింపు చర్యలకు చలించని నాయకులు, కార్యకర్తలు

సాక్షి, అమరావతి: ఏం జరిగిందో.. ఎలా జరిగిందో కూటమి గెలిచింది. వైఎస్సార్‌సీపీ అత్యల్ప స్థానాలనే దక్కించుకుంది. అయితేనేం ఆ పార్టీ కేడర్‌లో ఇసుమంత ఆత్మస్థైర్యం కూడా సడలలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అభిమానం కించిత్తయినా తగ్గలేదు. వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, జగన్ మరోసారి ముఖ్యమంత్రి అవుతారని కోటి ఆశలతో రేయింబవళ్లు శ్రమించిన నాయకులు, కార్యకర్తలకు మంగళవారం ఓట్ల లెక్కింపు మొదలైన కొద్దిసేపటికే అర్థమైపోయింది. అయినా ఏ మాత్రం సంయమనం కోల్పోలేదు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం వద్దకు వచ్చి టీడీపీ శ్రేణులు బాణాసంచా కాల్చి సంబరాలతో కవ్వింపు చర్యలకు పాల్పడినా చలించలేదు. ప్రజలిచ్చిన తీర్పును గౌరవించి, అధినేత జగన్ ఆదేశం కోసం సాయంత్రం వరకూ ఎదురు చూశారు. సాయంత్రం మీడియాతో ఆయన మాట్లాడాక వారిలో కొండంత ధైర్యం వచ్చింది. 'ఓడినా.. గెలిచినా ప్రాణం ఉన్నంతవరకూ మా ప్రయాణం నీతోనే జగనన్న'అంటూ ముక్తకంఠంతో వారు చేసిన నినాదం సోషల్ మీడియాలో మిన్నంటింది. వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ గ్రూపుల్లో జగన్‌కు అనుకూలంగా పోస్టులు వెల్లువెత్తాయి. ఎన్నికల ఫలితాలతో ప్రమేయం లేకుండా జగన్, వైఎస్సార్‌సీపీకి అభిమానులు మద్దతు ప్రకటించారు. తమకు పదవులతో పనిలేదని, కడవరకూ మీ వెంటే మేమంతా ఉంటామని కామెంట్లు పెట్టారు. కొందరు ఈవీఎంలపై సందేహాలను వ్యక్తం చేశారు. మరికొందరు పార్టీ సంస్థాగత నిర్మాణంలో లోటుపాట్లపై సూచనలు, సలహాలు ఇచ్చారు. సీఎం జగన్ మీడియాతో మాట్లాడుతున్న సమయంలో ఆయన మాటలకు కన్నీళ్లు ఆగడం లేదంటూ ఇంకొందరు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఓడినా ప్రజల గుండెల్లో జగన్‌కు ప్రత్యేక స్థానం ఉందని ఈ చర్యలతో స్పష్టమైంది. మా నమ్మకం నువ్వే జగన్ అంటూ వారంతా అండగా నిలవడాన్ని బట్టి సీఎం జగన్ జనం మనసులను గెలుచుకున్నారని రుజువైంది.

దెబ్బ తీసిన దుష్ప్రచారం

వైఎస్సార్‌సీపీ ఓటమిపై రాజకీయ వేత్తల విస్మయం

- తప్పుడు ప్రచారాలను క్షేత్రస్థాయిలో సమర్థంగా తిప్పికొట్టి ఖండించడంలో పార్టీ యంత్రాంగం విఫలం
- వేధింపులు లేకపోయినా ఉద్యోగులు దూరమయ్యారు
- మందు బాబులకు ధరలు రుచించలేదు
- ల్యాండ్ టైట్లింగ్‌పై విపక్షాల దుష్ప్రచారం
- నవరత్నాలు గట్టెక్కించలేకపోయాయి
- కోవిడ్‌లోనూ సంక్షేమం అందించినా అండగా నిలవలేదు

సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమి పాలు కావడం అనూహ్యంగా ఉందని తలపండిన రాజకీయ నాయకులు సైతం విస్తుపోతున్నారు. నవరత్నాల హామీలను తు.చ. తప్పకుండా అమలు చేసిన వైఎస్సార్‌సీపీ పట్ల ఓటర్లు మొహం చాటేయడం ఆశ్చర్యకరంగా ఉందని సీనియర్లు విస్మయంవ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అసెంబ్లీ, లోక్‌సభ సీట్లు అత్యల్పంగా రావడం ఊహకు అందనిదని, దుష్ప్రచారాలను క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగం సమర్థంగా తిప్పికొట్టలేకపోయిందని.. గ్రామ, మండల, జిల్లా స్థాయిలోఎక్కడికక్కడ వీటిని ఖండించడంలో విఫలమైందని పేర్కొంటున్నారు. దీంతో దుష్ప్రచారాలదే పైచేయి అయిందని, ప్రజలు దాన్నే విశ్వసించారని విశ్లేషిస్తున్నారు. కోవిడ్ సంక్షోభంలోనూ సీఎం జగన్ ప్రభుత్వం సంక్షేమ యజ్ఞాన్ని నిర్విఘ్నంగా కొనసాగించినా ప్రజలు అండగా నిలవకపోవడం అంతుపట్టకుండా ఉందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తం అవుతోంది. వేధింపులు లేకపోయినా ఉద్యోగులు దూరమయ్యారని, దీంతో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందని పేర్కొంటున్నారు. ఇచ్చిన మాట మేరకు అధికారంలోకి రాగానే ఉద్యోగులకు 27 శాతం మధ్యంతర భృతి ఇచ్చినప్పటికీ ఆ తరువాత ఫిట్‌మెంట్‌ను అంతకన్నా తక్కువగా ఇవ్వడంతో ఉద్యోగులు దూరమయ్యారని ఉద్యోగ సంఘాల నేతలు చెబుతున్నారు. ఉన్నతాధికారులు ఈ విషయంలో ముఖ్యమంత్రి జగన్‌ను తప్పుదోవ పట్టించారే అభిప్రాయాన్ని ఉద్యోగ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. పొదుపు సంఘాల మహిళల రుణాలన్నీ మాఫీ చేస్తామని మాట ఇచ్చిన సీఎం జగన్ మాట మేరకు రూ.25 వేల కోట్లకు పైగా రుణాలను మాఫీ చేశారు. దీంతో మహిళల ఓటింగ్ పెరగడంతో అక్కచెల్లెమ్మలంతా "ఫ్యాన్"కే ఓటు వేశారని పోలింగ్ రోజు సర్వత్రా చర్చ జరిగినా ఫలితాల్లో అది కనిపించలేదు. 45–60 ఏళ్ల వయసున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అక్క చెల్లెమ్మలను వారి కాళ్ల మీద నిలబెట్టాలనే తపనతో సీఎం జగన్ వైఎస్సార్ చేయూత కింద రూ.19,189.59 కోట్లను నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. వారంతా ఆకర్షణకు గురై ఇతర పార్టీల వైపు మొగ్గు చూపారనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. జగనన్న అమ్మ ఒడి ద్వారా రూ.26,067 కోట్ల మేర లబ్ధి పొందిన మహిళల విషయంలోనూ ఇదే జరిగినట్లు విశ్లేషిస్తున్నారు.



దేశమంతా మెచ్చినా..

వీటన్నింటికి తోడు ఎన్నికల్లో సీఎం జగన్‌పై కూటమి నేతలు వ్యక్తిగత దుష్ప్రచారానికి దిగారు. భూములపై యజమానులకు శాశ్వత హక్కులు కల్పించాలనే సదుద్దేశంతో వందేళ్ల అనంతరం సమగ్ర భూ సర్వేలో భాగంగా ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని తీసుకొస్తే భూములు లాక్కుంటున్నారంటూ కూటమి నేతలు పెద్ద ఎత్తున అసత్య ప్రచారానికి పాల్పడ్డారు. అర్హతే ప్రామాణికంగా పేదలకు వివక్ష లేకుండా పథకాలను అందించినా ఆయా వర్గాలు పూర్తి స్థాయిలో అండగా నిలవలేదనేది ఫలితాల సరళిని బట్టి అంచనా వేస్తున్నారు. గ్రామ స్వరాజ్యాన్ని నిజం చేస్తూ సచివాలయాల వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలన్నీ ఇంటి ముంగిటే అందించి దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందినా ప్రజలు ఈ ఎన్నికల్లో పార్టీని ఎందుకు ఆదరించలేదో అర్థం కావడం లేదని ఓ సీనియర్ రాజకీయ వేత్త వ్యాఖ్యానించారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించకపోవడం ఆశ్చర్యంగా ఉందని ఓ ఉన్నతాధికారి పేర్కొన్నారు.

మందు ప్రభావం..

దశల వారీ మద్యం నియంత్రణలో భాగంగా షాక్ కొట్టేలా మద్యం ధరలను పెంచడం మందు బాబులకు రుచించలేదని, ఆ ప్రభావం ఎన్నికల ఫలితాల్లో స్పష్టంగా కనిపిస్తోందని రాజకీయ నేతలు అభిప్రాయపడుతున్నారు. మద్యాన్ని తక్కువ ధరకే అందుబాటులోకి తెస్తామని చంద్రబాబు హామీ ఇవ్వడం కూడా ప్రభావితం చేసిందని చెబుతున్నారు. ఇప్పటి వరకు అమలు చేసిన పథకాలన్నింటినీ కొనసాగిస్తామని, పింఛన్ రూ.3,500కి పెంచుతామని సీఎం జగన్ ఆచరణ సాధ్యమైన హామీలనే ఇచ్చారు. అయితే చంద్రబాబు పెన్షన్‌ను నెలకు రూ.4 వేలకు పెంచడంతోపాటు ఏప్రిల్ నుంచి మూడు నెలల బకాయిలతో కలిపి జూలైలో మొత్తం రూ.7 వేలు అందచేస్తామని వాగ్దానం చేశారు. దీంతో పెన్షనర్లు ఆకర్షితులయ్యారనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

నగర వార్తలు

మ్యూజిక్ కాపీరైట్ తీసుకోని పబ్స్‌పై ఫిర్యాదు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో అనుమతి పొందకుండా కాపీరైట్ సంగీతాన్ని ఉపయోగిస్తున్న వ్యక్తులు, వినోద కేంద్రాలపై ఫోనోగ్రాఫిక్ పెర్ఫార్మెన్స్ ఇండియా లిమిటెడ్ (పిపిఎల్) సంస్థ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయాన్ని పీపీఎల్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఒక ప్రముఖ డీజే సహా పలు పబ్స్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశామని, తమ ఫిర్యాదులపై స్పందించిన పోలీసులు ప్రసిద్ధ డీజేలు పబ్‌లకు సంబంధించిన కాపీరైట్ ఉల్లంఘన ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్నారని వివరించారు. తాము ఫిర్యాదు చేసిన పబ్స్‌లో బాబిలోన్ కిచెన్ – బార్ (డార్క్ హార్స్ హాస్పిటాలిటీ అండ్ ఈవెంట్స్ ఎల్ఎల్‌పి), అమ్నీసియా లాంజ్ ఇన్సోమ్నియా లాంజ్ (ఇండియన్ బూజింగ్ కంపెనీ) తదితర పబ్స్ ఉన్నాయన్నారు.

అనుచిత పోస్ట్ చేసి కటకటాల్లోకి...

- సామాజిక మాధ్యమంలో అనుచిత పోస్ట్ చేసిన ముగ్గురి అరెస్ట్

చిలకలగూడ: సామాజిక మాధ్యమంలో అనుచిత పోస్ట్ చేసిన ముగ్గురు యువకులు కటకటాలపాలైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌ఓ అనుదీప్ తెలిపిన వివరాల ప్రకారం.. సామాజక మాధ్యమమైన ఇన్‌స్టాగామ్‌లో 'హైదరాబాదీ జేమ్స్ బాండ్' పేరిట ఏర్పాటు ఖాతాను తెరిచి మత కలహాలు సృష్టించే విధంగా ఆడియో క్లిప్పింగ్స్‌తో కూడిన ఓ పోస్ట్‌ను అప్‌లోడ్ చేసినట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. అదే సమయంలో మహ్మద్ ఇనయతుల్లాషరీఫ్ సదరు పోస్ట్ విషయంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఐటీ యాక్టు ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు హైదరాబాదీ జేమ్స్‌బాండ్ పేరిట అకౌంట్‌ను ఏర్పాటు చేసిన వెస్ట్‌మారేడుపల్లికి చెందిన నోయల్ శోభిత్‌రాజ్ (19)తో పాటు మరో ఇద్దరిని అరెస్ట్ చేయగా విచారణలో నేరాన్ని అంగీకరించడంతో రిమాండ్‌కు తరలించారు. అదే విధంగా అనుచిత క్లిప్పింగ్‌ను పోస్ట్ చేసిన సెల్‌ఫోన్‌ను కూడా స్వాధీనం చేసుకుని, కేసు విషయంలో చాకచక్యంగా వ్యవహరించి ఛేదించిన చిలకలగూడ ఎస్‌హెచ్‌ఓ అనుదీప్, ఎస్ఐలు బాలరాజు, కిషోర్, క్రైమ్ స్టాఫ్ నవీన్, జగదీశ్, వినయ్‌కుమార్, గణేష్‌లతోపాటు టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్, చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డిలు అభినందించి రివార్డులు అందించారు.

రావి నారాయణ రెడ్డి సేవలు ఎనలేనివి



రావి నారాయణరెడ్డికి నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

బంజారాహిల్స్: భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం ఫాసిస్ట్ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కమ్యూనిస్ట్ పార్టీ జరిపిన ప్రజా ఉద్యమంలో విప్లవాగ్ని రగిలించిన రావి నారాయణరెడ్డి నేటికీ తెలంగాణ ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడని సీపీఐ నేతలు అన్నారు. కమ్యూనిస్ట్ నేత రావి నారాయణరెడ్డి 118వ జయంతి సందర్భంగా బంజారాహిల్స్ తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ భవన్, ఆర్ఎస్ఆర్ ఆడిటోరియంలో మంగళవారం సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ అధ్యక్షులు సురవరం సుధాకర్‌రెడ్డి, సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, ఈటీ నరసింహ, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ కార్యదర్శి కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి, కోశాధికారి ఉజ్జిని రత్నాకర్‌రావు తదితరులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సురవరం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట యోధులు మఖ్దూమ్ మొహినుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి తదితరులతో కలిసి నైజాం పాలకులు, రజాకార్లకు వ్యతిరేకంగా గెరిల్లా యుద్ధాలు ప్రారంభించి, వీరోచితంగా పోరాటాలు నిర్వహించి రావి నారాయణరెడ్డి నిజాం వెన్నులో వణుకుపుట్టించారన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో నాటి తెలంగాణ సాయుధ పోరాట యోధులను స్మరించుకోకపోవడం, రాష్ట్ర గేయంలో తెలంగాణ సాయుధ పోరాటంపై ఒక జ్ఞాపిక లేకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారికంగా ఉన్నా లేకపోయినా తెలంగాణ సాయుధ పోరాటం ప్రజల హృదయాల్లో శాశ్వతంగా ఉంటుందని సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. డాక్టర్ కే నారాయణ మాట్లాడుతూ కేవలం తెలంగాణలోనే కాకుండా రావి నారాయణరెడ్డి పేరు దేశమంతా మార్మోగిందని, 1952 మొదటి పార్లమెంట్ ఎన్నికల్లో రావి నారాయణరెడ్డి కమ్యూనిస్టు పార్టీ తరుపున నల్లగొండ జిల్లా పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ సాధించిన మెజార్టీ కంటే ఎక్కువ మెజార్టీతో గెలుపొందారన్నారు. రాష్ట్రాలు విడిపోయినా తెలుగు ప్రజలు విడిపోలేదని, తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలను తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత గత ప్రభుత్వం అధికారికంగా జరపకపోవడం, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో రావి నారాయణరెడ్డి వంటి వీరుల చరిత్ర ప్రస్తావించకపోవడం బాధాకరమన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలను సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ నారాయణరెడ్డి ఒక వ్యక్తి కాదు, శక్తి అని, స్వాతంత్ర సమరయోధుడు మానవతావాది అని, తెలంగాణ సాయుధ పోరాటానికి చిరునామా అని తెలిపారు. కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ రావి నారాయణరెడ్డి ప్రజాపోరాట నాయకుడిగా ఎదిగి, తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని, కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో కీలకపాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి చాయాదేవి, రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, చెన్నకేశవులు, స్టాలిన్, ట్రస్ట్ సభ్యులు జైన్ రమేష్, వెంకటేశ్వరరెడ్డి, ఆరుట్ల సుశీల, తెలంగాణ ప్రజా నాట్యమండలి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కే శ్రీనివాస్, పల్లె నరసింహ, నేతలు ఉప్పలయ్య, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో రూ. లక్షల్లో వసూళ్లు

నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు

కుత్బుల్లాపూర్: ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురి వద్ద నుంచి లక్షల్లో వసూలు చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన మంగళవారం పేట్‌బషీరాబాద్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొంపల్లికి చెందిన కేతావత్ సంతోష్ (33) ఎయిర్‌ఫోర్స్‌లో జాబ్‌లు ఇప్పిస్తానంటూ 40 మంది నుంచి రూ.6 లక్షలు మొదలుకుని రూ.12 లక్షల వరకు వసూలు చేశాడు. వారికి పరీక్షలు నిర్వహించడంతో పాటు నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్లను సైతం అందజేశారు. అయితే ఎంతకీ ఉద్యోగాలు రాకపోవడంతో బాధితులు అతన్ని సంప్రదించేందుకు యత్నించగా తప్పించుకు తిరుగుతున్నారు. దీంతో తాము మోసపోయామని గ్రహించిన బాధితులు ఈ నెల 1వ తేదీన పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తుగా భాగంగా మంగళవారం కొంపల్లి జయభేరి కాలనీలోని సంతోష్‌ను అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించగా దాదాపు రూ. కోటి వరకు మోసం చేసినట్లు అంగీకరించాడు. దీంతో అతన్ని కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించడంతో జైలుకు తరలించారు.

రెండు కిలోల గంజాయి స్వాధీనం

బాలానగర్: అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిని తనిఖీ చేయగా అతని వద్ద గంజాయి లభించిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బాలానగర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మూసాపేట మెట్రోస్టేషన్ వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో అతడిని తనిఖీ చేయగా అతడి వద్ద 2 కిలోల 100 గ్రాముల గంజాయి లభించడంతో దానిని స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ జీవన్ కుమార్ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి విచారణ నిమిత్తం బాలానగర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ సుభాష్ చంద్ర తెలిపారు. ఈ దాడిలో ఎస్ఐ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.



గంజాయితో ఉన్న వ్యక్తిని అరెస్టు చేసిన పోలీసులు

అత్త ప్రాణం తీసిన 'కోడలి' తగాదా

- కూతురి గొడవలో తలదూర్చి వియ్యంకురాలిపై దాడి





మృతురాలు లలిత (ఫైల్)

మీర్‌పేట: అత్తాకోడళ్ల మధ్య జరిగిన వివాదంలో కూతురుకు వత్తాసుగా నిలిచిన తండ్రి ఆవేశానికిలోనై వియ్యంకురాలిపై దాడి చేయడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మంగళవారం మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం కేసీ తండాకు చెందిన జతావత్ ప్రభు (45) ఆటో డ్రైవర్. రెండేళ్ల క్రితం అల్మాస్‌గూడ వినాయకహిల్స్‌లో నివాసముండే కొర్ర జయరామ్‌కు తన కుమార్తె స్వాతిని ఇచ్చి వివాహం జరిపించాడు. కొంత కాలంగా ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. కుమార్తెను చూసేందుకు ప్రభు అతని భార్య శాంతితో కలిసి మంగళవారం వినాయకహిల్స్‌లోని అల్లుడి ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో కూతురు స్వాతి, అత్త లలిత (50)లు గొడవ పడుతుండగా ప్రభు మధ్యలోకి వెళ్లడంతో ఇరువురి మధ్య మాటామాట పెరిగింది. దీంతో ఆగ్రహానికి లోనైన ప్రభు పక్కనే ఉన్న ఇనుప సుత్తెతో లలితపై దాడి చేయడంతో ఆమెకు తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించి, నిందితుడు ప్రభును అరెస్టు చేసినట్లు ఎస్ఐ గోవిందస్వామి తెలిపారు.

ఓట్ల లెక్కింపు ప్రశాంతం

జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రాస్

సాక్షి, సిటీబ్యూరో : హైదరాబాద్ జిల్లాలో ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ తెలిపారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా మంగళవారం ఆయన కార్వాన్, నాంపల్లి, యాకుత్‌పురా, చార్మినార్, చాంద్రాయణగుట్ట అసెంబ్లీసెగ్మెంట్ల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పరిశీలించారు. ఈ ప్రక్రియకు సహకరించిన అధికారులకు, సిబ్బందికి, పోలీస్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల కమిషన్ నియమించిన కౌంటింగ్ అబ్జర్వర్స్ సహకారం మరువలేనిదని పేర్కొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌లోనూ ఈటల ఆధిక్యం

సాక్షి,మేడ్చల్ జిల్లా: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో మొత్తంగా 18,880 ఉండగా, ఇందులో లక్ష 18,496 బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు 10,330 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునితా మహేందర్‌రెడ్డికి 6,230 బ్యాలెట్ ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి 1,787 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ కంటే బీజేపీకి 4,100 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. నోటాకు 160 ఓట్లు రాగా, చెల్లని బ్యాలెట్ ఓట్లు 222 ఉన్నాయి. మిగతా ఓట్లు ఇతర అభ్యర్థులకు పోలయ్యాయి.

అబ్బురపరిచిన అగ్నివీర్ పరేడ్

గోల్కొండ: అగ్నివీర్ శిక్షణ పూర్తి చేసుకున్న వారు మెరికలలాంటి వారని ఆర్టిలరీ సెంట్రల్ లెఫ్టినెంట్ కర్నల్ విఎస్ఎం రాహుల్ ఆర్ సింగ్ టూ కారఫ్స్ అండ్ కర్నల్ కమాండెంట్ అన్నారు. మంగళవారం గోల్కొండ ఆర్టిలరీ సెంటర్‌లో మూడో బ్యాచ్ అగ్నివీర్‌ల ముగింపు పరేడ్ జరిగింది. ఈ పరేడ్‌ను అధికారులతో కలిసి తిలకించారు. ఈ బ్యాచ్‌లో 2,517 మంది అగ్నివీర్ యోధులు విజయవంతంగా శిక్షణ ముగించుకున్నారని అన్నారు. సుశిక్షితులైన అగ్నివీర్‌లు భారత సైన్యానికి అదనపు బలమన్నారు. వీరికి శిక్షణ ఇచ్చిన ఆర్టిలరీ సెంటర్ అధికారులను అభినందించారు.



గౌరవ వందనాలను స్వీకరిస్తున్న అధికారులు




అస్తిత్వాన్ని వెలికి తీద్దాం

మనం పై పైన చూసే ఎన్నో విషయాలు మూలాల్లో ఉన్న అస్తిత్వానికి గొడ్డలిపెట్టుగా ఉండవచ్చు.
అది మొక్కలకు సంబంధించినవైనా సరే...
ప్రపంచంలో తెల్లజాతీయుల ఆధిపత్య వలసవాదులు పెట్టిన వృక్ష జాతుల శాస్త్రీయనామాల మూలాలను శోధించి తిరిగి వాటికి పూర్వపు పేర్లు ఉండేలా కృషి చేస్తోంది భాను సుబ్రమణ్యం. అమెరికాలోని వెల్లెస్లీ కాలేజీలో ఉమెన్ అండ్ జెండర్ స్టడీస్ ప్రొఫెసర్‌గా ఉన్న భారతీయురాలు.
తెల్లజాతీయుల ఆధిపత్య వలసవాదులు పెట్టిన 126 వృక్ష జాతుల మూలాలను శోధించి, తిరిగి వాటి పూర్వపు పేర్లతోనే పిలిచేలా కృషి చేశారు. దీంతో ఆ వృక్షజాతుల పేర్ల గురించి ఎవరు చర్చించినా భాను సుబ్రమణ్యాన్ని గుర్తుంచుకుంటారు. 'దీనిని అత్యంత క్లిష్టమైన సమస్యగా ఎవరూ గుర్తించరు. అధికారంలో ఉన్నవారు దీనికి అనేక కారణాలు చూపుతారు' అంటారామె.



భాను సుబ్రమణ్యం



మొక్కల పేర్ల నుండి స్థానిక జాతుల వరకు ప్రపంచంలోని అనేక అంశాలు వలస సామ్రాజ్యాల ద్వారా రూపొందించబడ్డాయి. మనం ఈ వలసరాజ్యాల ఆధిపత్యాన్ని తొలగించాలి' అంటారు వృక్షశాస్త్రంలో ఎంపరర్‌గా పేరొందిన భాను సుబ్రమణ్యం. తన కొత్త పుస్తకమైన 'బోటనీ ఆఫ్ ఎంపైర్'లో వలసవాదం సృష్టించే సమస్యలు ఎప్పటికీ అంతం కావని, దాని వెనక తీవ్రమైన ప్రయత్నం ఎలా ఉండాలో తను రాసిన పుస్తకం ద్వారా సమాజం దృష్టికి తీసుకువచ్చింది. జాతుల వర్గీకరణ, మొక్కల పునరుత్పత్తి, దండయాత్రల ద్వారా ప్రవేశపెట్టబడిన జాతుల వ్యాప్తికి సంబంధించిన శాస్త్రంగా ఈ పుస్తకం మనకు వివరిస్తుంది.

•••

'నేను పరిణామాత్మక జీవశాస్త్రవేత్త, మొక్కల శాస్త్రవేత్తగా పేరొందాను. స్త్రీవాద, సాంకేతిక రంగాలలో మానవీయ, సామాజిక శాస్త్రాలను కూడా అధ్యయనం చేశాను. జెండర్, జాతి, కులానికి సంబంధించిన శాస్త్రాలు, వైద్యం, తత్వశాస్త్రం, చరిత్ర, సంస్కృతులను అన్వేషిస్తాను. నా ఇటీవల పరిశోధన వలసవాదం, జీనోఫోబియా చరిత్రలకు సంబంధించిన వృక్షశాస్త్రం వీటన్నింటినీ పునరాలోచింపజేస్తుంది. వలస, ఆక్రమణ జాతులకు సంబంధించి శాస్త్రీయ సిద్ధాంతాలు, ఆలోచనలు, విస్తృత ప్రయాణాలను అన్వేషిస్తుంది. భారతదేశంలో సైన్స్, హిందూ జాతీయవాదం సంబంధంపై కూడా పని చేస్తున్నాను. ఇప్పటివరకు మూడు పుస్తకాలను తీసుకువచ్చాను. వీటిలో ప్లాంట్ వరల్డ్స్ అండ్ ది సైంటిఫిక్ లెగసీస్ ఆఫ్ కలోనియలిజం ఈ యేడాది తీసుకువచ్చాను. ది బయోపాలిటిక్స్ ఆఫ్ హిందూ నేషనలిజం సొసైటీ ఫర్ లిటరేచర్ బుక్ ప్రైజ్‌ను గెలుచుకుంది. ఈ పుస్తకం భారతదేశంలో పుట్టుకువస్తున్న జాతీయవాద రాజకీయాలు, ఆధునికత, సైన్స్, మతం ఒకదానికి ఒకటి ఎలా ముడిపడి ఉన్నాయో తెలియజేస్తుంది' అని వివరిస్తుంది.

•••

భాను సుబ్రమణ్యం స్వాతంత్ర్యానికి ముందు భారతదేశంలో పెరిగారు. దీంతో బ్రిటిషర్లు దేశంలో మూలాంశాలను ఎలా మార్చేశారో తెలుసుకున్నారు. ఫెమినిస్ట్ సైన్స్ అండ్ టెక్నాలజీ అధ్యయనాల కోసం అమెరికాలో పరిణామాత్మక జీవశాస్త్రంలో పీహెచ్‌డి చేశారు. తన రచనల ద్వారా జీవశాస్త్ర పండితురాలిగా పేరొందారు. ఈ ఏడాది జూలైలో జరిగే అంతర్జాతీయ బొటానికల్ కాంగ్రెస్‌లో పాల్గొని, అనేక సవరణలపై చర్చించబోతున్నారు. మొక్కల శాస్త్రీయ నామకరణాన్ని నియంత్రించే అంతర్జాతీయ కోడ్‌కు బాధ్యత వహించే నామకరణ విభాగం, వర్గీకరణ, శాస్త్రవేత్తలు ప్రతిపాదించిన అనేక సవరణలపై చర్చించి నిర్ణయం తీసుకోవడానికి ఈ ప్రొఫెసర్ సమావేశంలో పాల్గొన బోతున్నారు. ఏడేళ్ల క్రితం జరిగిన సమావేశంలో తీసుకున్న కోడ్ మెకానిజంలో అనుచితమైనవిగా పరిగణించబడే మరెన్నో మొక్కల పేర్లను ఈ సమావేశం తిరస్కరించవచ్చు. దీని వెనకాల ఈ సీనియర్ ప్రొఫెసర్ చేస్తున్న కృషి మనల్ని ఆలోచింపజేస్తుంది.

వలసవాదం సుసంపన్నమైన వృక్ష ప్రపంచాలను జీవశాస్త్ర జ్ఞానంగా ఎలా మార్చింది అనే క్లిష్టమైన చరిత్రను అన్వేషించడానికి బాను సుబ్రమణ్యం దేశీయ అధ్యయనాలను శోధించారు. లాటిన్– ఆధారిత నామకరణ వ్యవస్థ, మొక్కల లైంగికతను వివరించడానికి యూరోపియన్ ఉన్నత వర్గాల ఊహాజనిత విధానాలను 'బాటనీ ఆఫ్ ఎంపైర్' పుస్తకం ద్వారా వివరించారు. వలసవాదులు మొక్కల కాలపు లోతైన చరిత్రను ఎలా నిర్మూలించారో మనం ఇందులో చూస్తాం. జాత్యాహంకారం, బానిసత్వం, వలసవాద చరిత్రలలోని దాని మూలల నుండి కేంద్రీకృతమైన వృక్షశాస్త్రానికి సంబంధించిన మరింత సమగ్రమైన, సామర్థ్యం గల రంగాన్ని ఊహించడానికి ఈ పుస్తకం ఉపయోగపడుతుంది.



రోబోటిక్స్ విజేత



ఉషా కుమావత్

''రోబోటిక్స్ రంగంలో బాలురు మాత్రమే రాణిస్తారని ఒకప్పుడు అనుకున్నాను. అది కేవలం అపోహ మాత్రమే. బాలికలు కూడా రాణించగలుగుతారని, బాలురకంటే మెరుగైన ఫలితాలను సాధించగలరని నిరూపించాను'' అన్నది ఉషా కుమావత్. పదిహేనేళ్ల ఉషా కుమావత్.

గోవా, పంజిమ్ పట్టణంలో పదవ తరగతి చదువుతున్న ఉష గత మార్చి నెలలో దుబాయ్‌లో జరిగిన ఇంటర్నేషనల్ కోవెడర్ 5.0 ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ రోబో సిటీ చాలెంజ్‌లో విజేతగా నిలిచింది. యునైటెడ్ నేషన్స్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ కాన్సెప్ట్‌లో భాగంగా నిర్వహించిన పోటీల్లో అరవై దేశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో స్టెల్లార్ కంట్రోల్ స్కిల్స్‌లో ఉష ప్రతిభ కనబరిచింది. తన విజయాన్ని తన టీచర్ మాయా కామత్‌కి అంకితమిచ్చింది ఉషా కుమావత్.

వీడియోగేమ్ కూడా తెలియదు

''మా సొంతూరు రాజస్థాన్‌లోని గుహాలా గ్రామం. నేను పుట్టింది పెరిగింది గోవాలోనే. నాన్న భవన నిర్మాణరంగంలో టైల్స్ అమర్చే పని చేస్తాడు. అమ్మ గృహిణి. కంప్యూటర్‌ను దూరం నుంచి చూడడమే కానీ కనీసం తాకిన సందర్భం కూడా లేదు. అలాంటి నన్ను మా టీచర్ మాయా కామత్ ఒక రోబోటిక్స్ వర్క్ షాప్‌కి తీసుకెళ్లారు. నాకు చాలా ఆసక్తి కలిగింది. ఎన్నో సందేహాలు కలిగాయి. అవన్నీ టీచర్‌ని అడుగుతూ ఉంటే ఆమె కూడా చాలా ఇష్టంగా వివరించేవారు. కోడింగ్ కూడా నేర్పించారు. నాకు వీడియో గేమ్ ఆడిన అనుభవం కూడా లేదు. అలాంటిది రోబోటిక్స్‌లో నైపుణ్యం సాధించగలిగానంటే అంతా మా టీచర్ ప్రోత్సాహమే. దుబాయ్‌లో అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనడానికి ముందు గురుగ్రామ్‌లో జాతీయ స్థాయి పోటీలకు తీసుకెళ్లారు. పోటీల వేదిక మీద రోబోను ఆపరేట్ చేయడం కొంత బెరుగ్గా అనిపించినప్పటికీ నా ప్రతిభను ప్రదర్శించగలిగాను. ఆ పోటీల్లోనే అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాను. ఆ పోటీల్లో రాణించాలంటే ఇంకా చాలా బాగా సాధన చేయాలని నాకే అర్థమైంది. ఎక్కువ రోజుల్లేవు. నా రోబో పేరు క్వార్కీ. దాంతో ఐదు నిమిషాల సమయంలో మ్యాచింగ్ కలర్స్, జడ్జింగ్ డైరెక్షన్స్, నావిగేటింగ్, సెగ్రిగేటింగ్ వంటి పదకొండు పనులు చేయించి నిరూపించాలి నేను. రోజూ టైమ్ పెట్టుకుని సాధన చేస్తూ ఒక రోజుకంటే మరో రోజు ఇంకా తక్కువ సమయంలో పూర్తి చేస్తూ మొత్తానికి లక్ష్యాన్ని సాధించగలిగాను'' అని వివరించింది ఉషా కుమావత్.



ఉషా కుమావత్ తయారుచేసిన రోబో



టీచర్ మాయా కామత్‌తో ఉషా కుమావత్

పేరు మారింది

ఇదిలా ఉండగా... ఉషకు రోబోటిక్స్‌లో శిక్షణ ఇవ్వడం కంటే దుబాయ్ వెళ్లడానికి పాస్‌పోర్టు కోసం పడిన కష్టాలే పెద్దవన్నారు ఉష టీచర్ మాయా కామత్. ''పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేయడానికి అవసరమైన పత్రాలను చూస్తే ఒకదానితో మరొకటి సరిపోలడం లేదు. స్కూల్ రికార్డ్స్‌లో ఉషా కుమావత్ అని ఉంది, బర్త్ సర్టిఫికేట్‌లో ఉషా కుమారి అని ఉంది. బర్త్ సర్టిఫికేట్‌ను సరిచేయమని కోరుతూ ప్రభుత్వానికి దరఖాస్తు చేయాల్సి వచ్చింది. ఉష తల్లిదండ్రుల మ్యారేజ్ సర్టిఫికేట్ లేదు. వారి పెళ్లి రాజస్థాన్‌లోని వాళ్ల సొంతూరులో జరిగింది. ఆ సర్టిఫికేట్ కుదరదని పాన్ కార్డు కోసం అప్లయ్ చేశాం. పాన్ కార్డు రావాలంటే ముందు ఆధార్ కార్డులో పేరు సరి చేసుకోవాల్సి వచ్చింది. ఇన్ని ప్రయాసల తర్వాత పాస్‌పోర్టు జారీ అయింది. కానీ ప్రయాణఖర్చులు ప్రశ్నార్థకమయ్యాయి. గోవాలోని పెద్ద వ్యాపార కంపెనీలను అభ్యర్థించి మొత్తానికి అవసరానికి తగిన డబ్బు సమకూర్చగలిగాను. దుబాయ్ వరకు తీసుకెళ్లిన తర్వాత అక్కడ చక్కటి ప్రతిభ ప్రదర్శించి మనదేశానికి గౌరవం తెచ్చింది. ఉష లాగా నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులు ఉంటే నేర్పించి వారిని విజేతలుగా తీర్చిదిద్దడానికి మాలాంటి టీచర్లు సిద్ధంగా ఉంటారు. మా విజయం మా విద్యార్థులే'' అన్నారు మాయా కామత్.

ఆటతో నిరూపించింది

**ఒకప్పుడు అబ్బాయిలకే గుత్తాధిపత్యంగా ఉన్న ఫుట్‌బాల్‌ను ఆమె తన చేతిలోకి తీసుకుంది.
చదువుతో పాటు క్రీడలనూ సాధన చేయడానికి సిద్ధమైంది.
చుట్టుపక్కల వాళ్లు 'ఆడపిల్లవి, ఇంట్లో గిన్నెలు కడుగుతూ, వంట వండుతూ కూర్చోక మగపిల్లల్లా ఆ ఆటలేంటి?' అనేవారు.
ఎగతాళి మాటలను, వ్యతిరేకతను లెక్కచేయలేదు. ఫుట్‌బాల్‌తో గ్లోబ్‌ను టచ్ చేయడానికి సిద్ధమైంది.
ఫలితంగా కేరళ ఫుట్‌బాల్ జట్టుకు కెప్టెన్‌గా, భారత జట్టుకు వైస్‌కెప్టెన్‌గా ఎదిగింది.
'ఈ ఆటలు నీకెందుకు' అని గేలిచేసినవారే ఇప్పుడు తమ పిల్లలకు కె.సున లాగా ఎదగాలని మరీ మరీ చెబుతున్నారు.
పిల్లల పాఠ్యపుస్తకంలో సునా కథ పాఠమై పిల్లలను ఉత్తేజపరుస్తోంది.**



కె.సున

కేరళలోని ఐదవ తరగతి పాఠ్య పుస్తకంలో..

ప్రతిభను చూపిన స్ఫూర్తిమంతమైన సునా కథ ఇలా మొదలవుతుంది.. 'అంతర్జాతీయఫుట్‌బాల్‌లో పాల్గొనడానికి వెళుతున్న అబ్బాయిలలో టీమ్ కెప్టెన్ ఒకరు ''ఎప్పుడైనా మాలాగా నువ్వు విదేశాలలో ఆడగలవా?'' అని సునాని ఆటపట్టిస్తారు. అతని తల్లి అసాధ్యాన్ని సాధ్యం చేసి చూపిన సున పట్టుదలను చూపి కొడుకు ప్రవర్తనను సరిదిద్దుతుంది. టీచర్ చెబుతుంటే పిల్లలు సున కథను ఆసక్తిగా వింటుంటారు. ఆ కథకు 'గర్ల్ అబౌట్ టు ప్లే బాల్ ఇన్ ది ఫిఫ్త్ క్లైండ్' అనే టైటిల్‌ను పెట్టారు. ఐదవ తరగతి పాఠ్యపుస్తకంలోని ఈ కంటెంట్ కె.సున ది.

•••

కున్నూర్‌లో పుట్టి పెరిగింది సున. పాఠ్యపుస్తకంలోని సున కథా రచయిత కలవూరు రవి కుమార్. సునా, రవి కుమార్ చిన్ననాటి స్నేహితులు కూడా. 'మొదట్లో స్కూల్, కాలేజీ స్థాయిల్లో సునను ఎగతాళి చేసినవారు. ఆ తర్వాత ఫుట్‌బాల్‌పై ఆమెకున్న అభిరుచిని, ప్రతిభను అర్థం చేసుకొని జట్టులోకి తీసుకునేందుకు పోటీ పడ్డార'ని రవికుమార్ చెబుతాడు. ఈ చిన్ననాటి జ్ఞాపకాలు కథగా రావడం, అది అందరినీ ఆకట్టుకోవడంతో రవికుమార్ ఈ రచన కూడా అందుకుంది.

•••

మాజీ ఫుట్‌బాల్ స్టార్ ఎమ్ఆర్‌సి కృష్ణన్ వద్ద శిక్షణ పొందిన సున 2022లో యాక్టివ్ ఫుట్‌బాల్ నుండి రిటైరైంది. తర్వాత, ఆమె ఓ ప్రభుత్వ సంస్థలో అసిస్టెంట్ ఫోర్‌మెన్‌గా వర్క్ చేసి రిటైరైంది. అక్కడా అవార్డులు గెలుచుకుంది. వర్క్ ప్లేస్ నుంచి కూడా జాతీయ స్థాయిలో పాల్గొన్న ఒక టోర్నమెంట్‌లో 21 గోల్స్ చేసింది.

•••

ఐదో తరగతిలో పిల్లలు తమ పాఠ్యపుస్తకంలోని పాఠాన్ని ఇలా చదువుతున్నారు..

'స్కూల్లో అబ్బాయిల మధ్య ఫుట్‌బాల్ మ్యాచ్ జరిగినప్పుడు వాళ్ల మధ్యకు వెళ్లి సున బాల్ కొట్టేది. దీంతో అబ్బాయిలు వెళ్లి ఈ విషయాన్ని టీచర్లకు కంప్లైంట్ చేసేవారు..'

ఎగతాళి రోజులను తట్టుకొని, పట్టుదలతో శ్రమించి, సాధించిన ఘనతను రేపటి తరం పిల్లల్లో స్ఫూర్తిని కలిగిస్తూ తనదైన ముద్ర వేసేంతగా ఎదగడం ఎంతటి గొప్ప మార్పు. 'హ్యాట్సాఫ్ సున' అంటున్నారంతా.

యూత్ పల్స్

నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం



పర్యావరణహితం యువతరం సంతకం



కామిక్ స్ట్రిప్స్, వీడియోలు, ఫొటోగ్రాఫ్‌లు, రీల్స్... ఒక్కటనేమిటి... సమస్త సాధనాలు, వేదికల ద్వారా పర్యావరణహిత ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు యంగ్-ఎకో వారియర్స్. 'కళలో సామాజిక సందేశం కూడా ఇమిడి ఉంది' అనే నిజాన్ని రుజువు చేస్తున్నారు.

వాతావరణానికి హాని కలిగించే ఉత్పత్తులు, వాటికి ప్రత్యామ్నాయాలు, షాపింగ్ మార్గాలు... మొదలైన వాటి గురించి సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేస్తోంది సస్టెయినబుల్ లైఫ్‌స్టైల్ ఎడ్యుకేటర్ అండ్ ఎకో-యూట్యూబర్ నేయన ప్రేమ్‌నాథ్.

సస్టెయినబుల్ లివింగ్‌పై కంటెంట్ రూపొందిస్తోంది. క్లైమెట్-డామేజ్ ప్రొడక్ట్స్‌కు ప్రత్యామ్నాయాలు ఏమిటో చెబుతోంది. ఉదా: సస్టెయినబుల్ షాపింగ్, సస్టెయినబుల్ ఫ్యాషన్... మొదలైనవి.

'పర్యావరణ హిత వీడియోలు చేస్తున్నప్పుడు నాకు ఎంతో సంతోషంగా ఉంటుంది. ఆ సంతోషమే శక్తిగా నన్ను ముందుకు నడిపిస్తోంది' అంటుంది ప్రేమ్‌నాథ్.

ప్రయాణ ప్రేమికుడిగా ఆకాశ్ మన దేశంలోని ఎన్నో ప్రాంతాలకు వెళ్లాడు. తాను వెళ్లిన ప్రాంతాలలో రోడ్డు పక్కన ప్లాస్టిక్ చెత్త కనిపించేది. 'ఏమిటి ఇది' అనుకునేవాడు. అయితే లడఖ్ అందాల మధ్య ప్లాస్టిక్ వ్యర్థాలను చూసి ఆకాష్ షాక్ అయ్యాడు. ఆ షాక్ అతడిని కొత్త దారి వైపు తీసుకువెళ్లింది.

'ఆ రోజు నుంచి పర్యావరణ సంరక్షణ కార్యక్రమాలలో భాగం కావాలనే ఆలోచన అంతకంతకూ పెరుగుతూ వచ్చింది' అంటాడు ఆకాశ్ రాణిసన్.

పర్యావరణానికి సంబంధించిన సంక్లిష్ట విషయాలను సామాన్యులకు అర్థం అయ్యేలా సోషల్ మీడియాలో కంటెంట్ రూపొందించడం ప్రారంభించాడు. 'గ్రీన్ వాషింగ్' అంటే ఏమిటో వివరించడంతో పాటు వాతావరణ మార్పుల గురించి తెలుసుకోవడానికి చూడాల్సిన డాక్యుమెంటరీల గురించి చెప్పడం వరకు ఎన్నో విషయాలను ప్రచారం చేస్తున్నాడు.

మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన ఆకాష్ క్లైమెట్ చేంజ్ ఎక్స్‌ప్లెయిన్‌డ్: ఫర్ వన్ అండ్ ఆల్ అనే పుస్తకం రాశాడు.

అహ్మదాబాద్‌లోని మధ్యతరగతి కుటుంబానికి చెందిన పంక్తీ పాండే లాక్ డౌన్ టైమ్‌లో సస్టెయినబుల్ లివింగ్‌పై కంటెంట్ క్రియేషన్ మొదలు పెట్టింది. జీరో-వేస్ట్ ప్రాక్టీషనర్‌గా పేరు తెచ్చుకుంది పంక్తీ. రోజువారీ జీవితంలో పర్యావరణ స్పృహతో ఎలా వ్యవహరించాలి, ఎలాంటి ఎంపికలు అవసరం... మొదలైన విషయాల గురించి సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తోంది.

'నాలుగు మంచి మాటలు చెప్పినంత మాత్రాన ప్రజల్లో మార్పు వస్తుందా... లాంటి నిరాశపూరిత మాటలు వినడం నాకు కష్టంగా అనిపించేది. నేను మాటలకే పరిమితం కాలేదు. జీరో వేస్ట్‌పై నా ఇల్లే ప్రయోగశాలగా ఎన్నో ప్రయోగాలు చేశాను. నేను సాధన చేస్తున్న విషయాలను ఫేస్‌బుక్‌లో జీరో అడ్డా పేజీ ద్వారా ఇతరులతో పంచుకుంటున్నాను' అంటుంది పంక్తీ పాండే.

ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ రిసెర్చర్ అయిన రస్లీన్ గ్రోవర్ కంటెంట్ క్రియేటర్ కూడా.

సోషల్ మీడియాలో వాతావరణ విధానాలకు సంబంధించిన కంటెంట్‌ను ఇన్‌ఫర్‌మేటివ్ అండ్ ఎంటర్‌టైనింగ్ విధానంలో రూపొందిస్తోంది రస్లీన్.

'నా కంటెంట్ ద్వారా ప్రజల జీవనశైలిలో ఏ కొంచెం మార్పు వచ్చినా సంతోషం అనుకొని ప్రయాణం ప్రారంభించాను. నా ప్రయత్నం వృథా పోలేదు' అంటుంది రస్లీన్.

చెన్నైకి చెందిన కీర్తి, దిల్లీకి చెందిన కృతి, ముంబైకి చెందిన రష్మీ పెయింటింగ్‌లో మంచి పేరు తెచ్చుకోవాలనుకుంటున్నారు. ఈ ముగ్గురికి ఇష్టమైన సబ్జెక్ట్ పర్యావరణం.

వారి చిత్రాలలో పర్యావరణ హిత ఆలోచనల వెలుగు కనిపిస్తుంది.

'వాతావరణ మార్పుల గురించి తెలుసుకుంటున్న యువతరం నిట్టూర్పుకు మాత్రమే పరిమితం కావడం లేదు. పర్యావరణ సంరక్షణకు సంబంధించిన విషయాలను తమకు తోచిన రీతిలో ప్రచారం చేస్తున్నారు' అంటుంది క్లైమెట్ యాక్టివిస్ట్, ఆవాజ్ ఫౌండేషన్ కన్వీనర్ సుమైర.



అనుష్క మాస్కే

పర్యావరణ పాట

'ఆహా' అనుకునే పాటలు కొన్ని. 'ఆహా' అనుకుంటూనే ఆలోచించేలా చేసే పాటలు కొన్ని. అనుష్క మాస్కే పాటలు రెండో కోవకు చెందినవి. సింగర్-సాంగ్ రైటర్ అనుష్క మాస్కే పర్యావరణ సంరక్షణకు సంబంధించిన ప్రచారానికి 'పాట' బలమైన మాధ్యమం. సిక్కింకు చెందిన అనుష్క తొలి ఆల్బమ్ 'థింగ్స్ ఐ సా ఏ డ్రీమ్'లో పర్యావరణ స్పృహ కనిపిస్తుంది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	4,390	72,079
నిఫ్టీ ▽	1,379	21,885

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ		
నాస్‌డాక్	16,800	▽ 29
డోజోన్స్	38,598	△ 27
ఎఫ్‌టీఎస్ఈ 100	8,232	▽ 31
డాక్స్	18,417	▽ 191
షాంఘై	3,091	△ 13
నికాయ్	38,837	▽ 86

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	71,969	△ 193
బంగారం (99.5 స్వచ్ఛత)	71,681	△ 192
వెండి (కిలో)	88,837	▽ 1,380

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.84	83.86
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.50	108.06
€	యూరో	ఎస్‌బీఐ	89.75	92.11
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	52.72	53.89
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.71	56.65
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.67	64.36
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.38	22.94
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.86	23.64
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.42	12.49

మార్కెట్ అల్లకల్లోలం



అమ్మకాల సునామీ

- కుప్పకూలిన మార్కెట్లు
- రూ. 31 లక్షల కోట్లు ఆవిరి
- సెన్సెక్స్ 4,390 పాయింట్ల పతనం
- 1,379 పాయింట్లు పడిన నిఫ్టీ

లోక్‌సభ తాజా ఫలితాలలో ఎన్‌డీఏ 300 సీట్లకంటే తక్కువకు పరిమితం కానున్నట్లు స్పష్టమవడంతో ఇన్వెస్టర్లు ఒక్కసారిగా ఆందోళన చెందారు. మార్కెట్ ఆరంభం నుంచే అమ్మకాలకు దిగారు. దీంతో సెన్సెక్స్ 6,234 పాయింట్లు, నిఫ్టీ 1,982 పాయింట్ల చొప్పున కుప్పకూలాయి. చివరికి కొంత కోలుకుని 4,390 పాయింట్ల నష్టంతో 72,079 వద్ద సెన్సెక్స్ నిలిచింది. 1,379 పాయింట్లకు నిఫ్టీ నీళ్లొదులుకుని 21,885 వద్ద ముగిసింది. ఇది రెండు నెలల కనిష్టం కాగా.. ఇంట్రాడేలో సెన్సెక్స్ 70,234కు పడిపోయింది. వెరసి ఎగ్జిట్ పోల్స్ కారణంగా సోమవారం ఇన్వెస్టర్లకు అందిన 3 శాతం లాభాలు ఒక్క రోజు తిరగకుండానే ఆవిరయ్యాయి. అంతేకాకుండా రికార్డ్ గరిష్టాలు 76,469, 23,264 పాయింట్ల స్థాయిల నుంచి సెన్సెక్స్, నిఫ్టీ గత నాలుగేళ్లలోలేని విధంగా భారీగా పతనమయ్యాయి! ఇంతక్రితం కోవిడ్–19 మహమ్మారి కట్టడికి కేంద్రం లాక్‌డౌన్ ప్రకటించడంతో దేశీ స్టాక్ మార్కెట్లు 2020 మార్చి 23న ఇంత కంటే అధికంగా 13 % కుప్పకూలిన సంగతి తెలిసిందే!!

ఇంట్రాడే
70,234

ముగింపు
72,079

పీఎస్‌యూ షేర్లు ఫట్

మోడీ ప్రభుత్వానికి స్పష్టమైన మెజారిటీ లభించకపోవడంతో ప్రభుత్వ రంగ కౌంటర్లు తీవ్రంగా నష్టపోయాయి. ప్రధానంగా ఆర్ఈసీ 24 శాతం, పీఎఫ్‌సీ 22%, బీఈఎంఎల్, కంకార్, బీఈఎల్, బీహెచ్ఈఎల్ 19%, హెచ్ఏఎల్ 17%, ఓఎన్‌జీసీ, మజ్గావ్ డాక్ 16%, రైల్‌టెల్, ఎన్‌టీపీసీ, కోల్ ఇండియా 14%, ఆర్‌వీఎన్ఎల్ 13%, ఐఆర్‌సీటీసీ, పవర్‌గ్రిడ్, బీపీసీఎల్ 12% చొప్పున దిగజారాయి. ఇక పీఎస్‌యూ బ్యాంక్స్‌లో యూనియన్ బ్యాంక్, బీవోబీ, పీఎన్‌బీ, కెనరా బ్యాంక్, ఎస్‌బీఐ 18–13% మధ్య కుప్పకూలాయి. దీంతో పీఎస్ఈ ఇండెక్స్ 16%పైగా క్షీణించింది. ఎన్ఎస్ఈలో బ్యాంకెక్స్ 2022 ఫిబ్రవరి తదుపరి అత్యధికంగా 8% పతనమైంది.

అదానీ గ్రూప్ బేర్..

అదానీ గ్రూప్ కౌంటర్లు భారీగా పతనమై ముందురోజు ఆర్జించిన లాభాలను పోగొట్టుకోవడంతోపాటు మరింత నష్టపోయాయి. అదానీ పోర్ట్స్ 21 శాతం, ఎనర్జీ సొల్యూషన్స్ 20 శాతం దిగజారగా.. గ్రీన్ ఎనర్జీ, ఎంటర్‌ప్రైజెస్, టోటల్ గ్యాస్, ఎన్‌డీటీవీ 19 శాతం, అదానీ పవర్, అంబుజా సిమెంట్స్ 17 శాతం చొప్పున పతనమయ్యాయి. ఏసీసీ 15 శాతం, అదానీ విల్మర్ 10 శాతం పడ్డాయి. అత్యధిక శాతం షేర్లు కొనేవాళ్లులేక లోయర్ సర్క్యూట్లను తాకాయి. ఫలితంగా గ్రూప్‌లోని 10 లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువకు ఒక్క రోజులో రూ. 3.64 లక్షల కోట్లమేర కోతపడింది. రూ. 15.78 లక్షల కోట్లకు పరిమితమైంది.

మోదీ 1, 2, 3...(సెన్సెక్స్ తీరు)

తేదీ	లాభం/నష్టం	ముగింపు
2014 మే 16*	+261	24,122
2019 మే 23*	-299	38,811
2024 జూన్ 4*	-4,390	72,079

* ఇంట్రాడేలో 25,000కు
* ఇంట్రాడేలో తొలిసారి 40,000కు
* ఇంట్రాడేలో 70,234కు



సంపదకు చిల్లు



స్టాక్ బేర్ దెబ్బకు ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ ఒక్క రోజులోనే ఏకంగా రూ. 31 లక్షల కోట్లకుపైగా ఆవిరైంది. దీంతో బీఎస్ఈ లిస్టెడ్ సంస్థల మార్కెట్ క్యాపిటలైజేషన్ దాదాపు రూ. 395 లక్షల కోట్ల(4.73 ట్రిలియన్ డాలర్ల)కు తగ్గింది. ఎన్‌డీఏకు స్పష్టమైన మెజారిటీ అంచనా వేసిన ఎగ్జిట్ పోల్స్‌తో సోమవారం దాదాపు రూ. 426 లక్షల కోట్లకు చేరిన సంగతి తెలిసిందే. వెరసి తొలిసారి 5.13 ట్రిలియన్ డాలర్లను తాకింది కూడా! 2014 మే 16న ఈ విలువ రూ. 80.63 లక్షల కోట్లుకాగా.. 2019 మే 23కల్లా రూ. 150 లక్షల కోట్లకు ఎగసింది! వెరసి దశాబ్ద కాలంలో రూ. 314 లక్షల కోట్లకుపైగా జమ చేసుకుంది!!

ఎఫ్‌పీఐల భారీ అమ్మకాలు



నగదు విభాగంలో ఎఫ్‌పీఐలు రూ. 12,436 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించగా.. డీఐఐలు రూ. 3,319 కోట్ల పెట్టుబడులు వెనక్కి తీసుకున్నాయి. డాలరుతో మారకంలో రూపాయి 37 పైసలు కోల్పోయి 83.51కు చేరింది. సోమవారం 28 పైసలు పుంజుకుని 83.14 వద్ద ముగిసిన విషయం విదితమే. బీఎస్ఈలో మిడ్, స్మాల్ క్యాప్స్ 8–7 శాతం దెబ్బ తిన్నాయి. ట్రేడైన షేర్లలో 3,349 నష్టపోగా.. కేవలం 488 లాభపడ్డాయి.

ఎదురీదిన ఎఫ్ఎంసీజీ..

బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో అన్ని రంగాలూ దెబ్బతిన్నాయి. ప్రధానంగా బ్యాంకింగ్, మెటల్, చమురు, రియల్టీ, క్యాపిటల్ గూడ్స్, విద్యుత్ 15–6 శాతం మధ్య పతనమయ్యాయి. ఎఫ్ఎంసీజీ మాత్రం 1 శాతం బలపడింది. ప్రభుత్వేతర దిగ్గజాలలో ఎల్అండ్‌టీ, శ్రీరామ్ ఫైనాన్స్, టాటా స్టీల్, ఇండస్‌ఇండ్, హిందాల్కో, ఐసీఐసీఐ, జేఎస్‌డబ్ల్యూ, భారతీ, యాక్సిస్ 16–7 శాతం మధ్య క్షీణించాయి. అయితే హెచ్‌యూఎల్, బ్రిటానియా, నెస్లే, హీరో మోటో, టాటా కన్జూమర్ 6–2 % మధ్య జంప్ చేశాయి.



కెనరా హెచ్ఎస్‌బీసీ లైఫ్‌లో పీఎన్‌బీ వాటాల విక్రయం

న్యూఢిల్లీ: పబ్లిక్ ఇష్యూ కింద కెనరా హెచ్ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో 10 శాతం వాటాలను విక్రయించనున్నట్లు పీఎన్‌బీ వెల్లడించింది. ప్రస్తుతం కంపెనీలో పీఎన్‌బీకి 23 శాతం, హెచ్ఎస్‌బీసీకి 26 శాతం, కెనరా బ్యాంక్‌కు 51 శాతం వాటాలు ఉన్నాయి. ఐపీవో ద్వారా కెనరా హెచ్ఎస్‌బీసీ లైఫ్‌ను లిస్టింగ్ చేసే క్రమంలో కంపెనీలో 10 శాతం వాటాలను విక్రయించే ప్రతిపాదనకు పీఎన్‌బీ బోర్డు ఆమోదం తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

5-6-2024	
విశాఖ	450–00
చిత్తూరు	563–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	445–00
విజయవాడ	450–00
హైదరాబాద్	480–00
వరంగల్	482–00

అశోక్ లేలాండ్ డ్రైవర్లకు బీమా

చెన్నై: భారీ వాణిజ్య వాహనాల తయారీ దిగ్గజం అశోక్ లేలాండ్ సారథి సురక్ష బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ పాలసీ కింద అశోక్ లేలాండ్ వాహనాన్ని నడిపే డ్రైవర్లకు రూ.10 లక్షల వరకు బీమా కవరేజ్ కల్పిస్తారు. రోడ్డు ప్రమాదంలో మరణించినా, పూర్తి, పాక్షిక అంగవైకల్యం బారినపడ్డా కవరేజ్ ప్రకారం నిర్దేశిత మొత్తాన్ని చెల్లిస్తారు. డ్రైవర్ల పిల్లలకు ప్రత్యేక విద్య బోనస్ కల్పిస్తారు. 'లాజిస్టిక్స్, రవాణా రంగాలకు మా డ్రైవర్ల సహకారాన్ని ఎంతో విలువైనదిగా భావిస్తున్నాం. డ్రైవర్ల భద్రత, శ్రేయస్సు పట్ల మా అంకితభావానికి సారథి సురక్షా పాలసీ నిదర్శనం' అని అశోక్ లేలాండ్ ఎండీ, సీఈవో శేణు అగర్వాల్ తెలిపారు.



కౌలాలంపూర్‌లో జోయాలుక్కాస్ అతిపెద్ద షోరూమ్

జోయాలుక్కాస్ తన 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో ఆధునికీకరించిన అతిపెద్ద జ్యువెలరీ షోరూమ్‌ను ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో జాన్ పాల్ అలుక్కాస్ (మేనేజింగ్ డైరెక్టర్, ఇంటర్నేషనల్ ఆపరేషన్స్), సోనియా అలుక్కాస్ (గ్రూప్ డైరెక్టర్) తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



లెన్స్‌కార్ట్‌కు పెట్టుబడులు

- రూ. 1,670 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: ఐవేర్ రిటైలర్ లెన్స్‌కార్ట్ సెకండరీ ఇన్వెస్ట్‌మెంట్‌గా 20 కోట్ల డాలర్లు(రూ. 1,670 కోట్లు) సమీకరించింది. అవెండస్ సమాచారం ప్రకారం టిమాసెక్, ఫిడిలిటీ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్ కంపెనీల నుంచి నిధులను సమకూర్చుకుంది. దీంతో లెన్స్‌కార్ట్‌లో టిమాసెక్ పెట్టుబడులు రెట్టింపుకావడంతోపాటు.. జాబితాలో కొత్తగా ఫిడిలిటీ మేనేజ్‌మెంట్ చేరింది. వెరసి గత 18 నెలల్లో లెన్స్‌కార్ట్ బిలియన్ డాలర్లు(సుమారు రూ. 8,300 కోట్లు) సమీకరించినట్లయ్యింది.



జైప్రకాశ్ అసోసియేట్స్‌పై దివాలా చర్యలు

ఆదేశించిన ఎన్‌సీఎల్‌టీ

న్యూఢిల్లీ: రుణ సంక్షోభంలో కూరుకుపోయిన జైప్రకాశ్ అసోసియేట్స్ (జేఏఎల్)పై దివాలా చట్టం కింద చర్యలు తీసుకోవాలంటూ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) అలహాబాద్ బెంచ్ ఆదేశించింది. ఇందుకోసం తాత్కాలిక పరిష్కార నిపుణుడిని నియమించింది. ఐసీఐసీఐ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దాఖలు చేసిన దివాలా పిటిషన్ల విషయంలో ఎన్‌సీఎల్‌టీ ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది. జేపీ గ్రూప్‌లో కీలకమైన జేఏఎల్ ప్రధానంగా నిర్మాణం, హాస్పిటాలిటీ తదితర వ్యాపారాలు సాగిస్తోంది. కంపెనీ 2037 కల్లా మొత్తం రూ. 29,805 కోట్ల రుణాలను (వడ్డీతో కలిపి) కట్టాల్సి ఉండగా ఇందులో రూ. 4,616 కోట్లు 2024 ఏప్రిల్ 30 నాటికి చెల్లించాల్సి ఉంది. దీన్ని చెల్లించడంలో సంస్థ విఫలమైంది. ప్రభుత్వ అనుమతుల్లో జాప్యం వల్ల లిక్విడిటీ కొరత ఏర్పడటమే డిఫాల్ట్ కావడానికి కారణమంటూ జేఏఎల్ వినిపించిన వాదనలను తోసిపుచ్చిన ఎన్‌సీఎల్‌టీ తాజా ఆదేశాలిచ్చింది.

జాబ్ పాయింట్

ఎన్ఐఎన్‌లో ఉద్యోగాలు

హైదరాబాద్‌లోని ఐసీఎంఆర్(ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్)కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్(ఎన్ఐఎన్)..వివిధ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 44
» **పోస్టుల వివరాలు:** టెక్నికల్ అసిస్టెంట్ -08, టెక్నీషియన్ 1- 14 పోస్టులు, ల్యాబొరేటరీ అటెండెంట్ 1–22 పోస్టులు.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుకు నెలకు రూ.35,400–1,12,400; టెక్నీషియన్ 1 పోస్టుకు నెలకు రూ.19,900– రూ.63,200; ల్యాబొరేటరీ అటెండెంట్ 1 పోస్టుకు నెలకు రూ.18.000–రూ.56,900 అందుతుంది.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష తదితరాల ఆధారంగా ఎంపిక ప్రక్రియ చేపడతారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభం:** 23.05.2024
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 16.06.2024
» **అడ్మిట్ కార్డుల డౌన్‌లోడ్:** జూన్/జూలై 2024
» **పరీక్ష తేది:** జూలై 2024
» **వెబ్‌సైట్:** https://www.nin.res.in

రాజమహేంద్రవరం సీటీఆర్ఐలో యంగ్ ప్రొఫెషనల్ పోస్టులు

రాజమహేంద్రవరంలోని ఐకార్- సెంట్రల్ టొబాకో రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీటీఆర్ఐ).. కాంట్రాక్ట్ ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **పోస్టుల వివరాలు:** యంగ్ ప్రొఫెషనల్ 1, యంగ్ ప్రొఫెషనల్ 2.
» **విభాగాలు:** ఫుడ్ ప్రాసెసింగ్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, బయోకెమిస్ట్రీ.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 21–45 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** యంగ్ ప్రొఫెషనల్ 1 పోస్టుకు నెలకు రూ.30,000; యంగ్ ప్రొఫెషనల్ 2 పోస్టుకు నెలకు రూ.42,000 వేతనం లభిస్తుంది.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులు పంపాల్సిన చిరునామా:** డైరెక్టర్, ఐసీఏఆర్– సీటీఆర్ఐ, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ చిరునామాకు నేరుగా లేదా పోస్టు ద్వారా పంపించాలి.
» **వెబ్‌సైట్:** https://ctri.icar.gov.in

ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో అప్రెంటిస్

చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ.. 2024–25 సంవత్సరంలో యాక్ట్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

» **మొత్తం యాక్ట్ అప్రెంటిస్ ఖాళీల సంఖ్య:** 1010
» **స్టయిపెండ్:** నెలకు రూ.6000 నుంచి రూ.7000.
» **ట్రేడులు:** కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెషినిస్ట్, పెయింటర్, వెల్డర్, ఎంఎల్‌టీ రేడియాలజీ, ఎంఎల్ పాథాలజీ, పీఏఎస్ఏఏ.
» **అర్హత:** ట్రేడును అనుసరించి కనీసం 50 శాతం మార్కులతో పదో తరగతి, సంబంధిత ట్రేడులో ఐటీఐ, పన్నెండో తరగతి(ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 21.06.2024 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక ప్రక్రియ:** అకడెమిక్ మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం:** 22.05.2024
» **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేది:** 21.06.2024
» **వెబ్‌సైట్:** https://pb.icf.gov.in/act/

టీహెచ్ఎస్‌టీఐలో ప్రాజెక్టు అసోసియేట్ పోస్టులు

ఫరీదాబాద్‌లోని ట్రాన్స్‌లేషనల్ హెల్త్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్‌లో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 3
» **పోస్టుల వివరాలు:** రీసెర్చ్ అసోసియేట్ -3: 1 పోస్టు; ప్రాజెక్టు అసోసియేట్-2: 1 పోస్టు; ప్రాజెక్టు అసోసియేట్: 1 పోస్టు.
» **అర్హత:** సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** రీసెర్చ్ అసోసియేట్–3 పోస్టుకు నెలకు రూ.67000, ప్రాజెక్టు అసోసియేట్ -2 పోస్టుకు నెలకు రూ.35000, ప్రాజెక్టు అసోసియేట్ పోస్టుకు నెలకు రూ.31,000.
» **వయసు:** రీసెర్చ్ అసోసియేట్ పోస్టుకు 40 ఏళ్లు, ప్రాజెక్టు అసోసియేట్ పోస్టుకు 35ఏళ్లు మించకూడదు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేది:** 15.06.2024
» **వెబ్‌సైట్:** https://thsti.res.in

» గ్రాడ్యుయేట్ వీసా రద్దు చేయనున్నారనే వార్తలు
» ఇప్పటికే పలు వీసాల నిబంధనలు కఠినతరం
» భారత విద్యార్థులపై భారీ ప్రభావం చూపే అవకాశం
» బ్రిటన్‌కు తగ్గుతున్న భారత విద్యార్థుల సంఖ్య

యూకే.. గ్రాడ్యుయేట్ వీసా ఉండేనా!

యూకే.. మన దేశ స్టడీ అబ్రాడ్ విద్యార్థులకు ముఖ్య గమ్యస్థానం! అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా తర్వాత ఎక్కువ మంది భారతీయ విద్యార్థులు ఆసక్తి చూపుతున్న దేశం బ్రిటన్! ఈ దేశ యూనివర్సిటీలు అందిస్తున్న కోర్సులు, కోర్సుల కాల వ్యవధి, వాటికి అంతర్జాతీయంగా ఉన్న గుర్తింపు, గ్రాడ్యుయేట్ వీసా వంటి కారణాలతో ఎక్కువ మంది యూకే వైపు మొగ్గు చూపుతున్నారు. కాని యూకే ప్రభుత్వం ఇటీవల గ్రాడ్యుయేట్ వీసా పథకాన్ని రద్దు చేసే ప్రయత్నాలు ప్రారంభించింది. దీంతో ఇక యూకేలో ఉన్నత విద్య ఆశలకు ఫుల్‌స్టాప్ పెట్టుకోవాల్సిందేనా! అనే సందేహం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో.. యూకే గ్రాడ్యుయేట్ వీసా విధానం, భారతీయ విద్యార్థులకు ప్రయోజనాలు తదితర వివరాలు..

విదేశీ విద్య విద్యార్థులను ఆకట్టుకునే ఉద్దేశంతో యూకే ప్రభుత్వం 2021లో గ్రాడ్యుయేట్ రూట్ వీసా పేరుతో.. కొత్త వీసా విధానానికి రూపకల్పన చేసింది. దీని ప్రకారం–ఆ దేశ యూనివర్సిటీల్లో బ్యాచిలర్ డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ, పీహెచ్‌డీ కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులు.. మరికొంత కాలం యూకేలోనే ఉండి పోస్ట్ స్టడీ వర్క్ అవకాశాలు పొందొచ్చు. బ్యాచిలర్ డిగ్రీ, పీజీ కోర్సుల విద్యార్థులు రెండేళ్లు, పీహెచ్‌డీ అభ్యర్థులు మూడేళ్ల పాటు పోస్ట్ స్టడీ వర్క్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. గ్రాడ్యుయేట్ వీసా మంజూరైతే.. జాబ్ ఆఫర్ లెటర్ లేకపోయినా.. అక్కడే ఉండి ఉద్యోగాన్వేషణ చేయొచ్చు. కొలువు లభిస్తే గ్రాడ్యుయేట్ వీసా కాల పరిమితి ముగిశాక.. స్కిల్డ్ వర్కర్ వీసాకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అలా స్కిల్డ్ వర్కర్ వీసా మంజూరైతే.. యూకేలోనే మరింత కాలం ఉద్యోగం చేసే అవకాశం లభిస్తుంది.

రద్దు ప్రయత్నాలు

ఇప్పటికే పలు రకాల వీసాల విషయంలో కఠిన నిబంధనలను తెచ్చిన యూకే ప్రభుత్వం.. గ్రాడ్యుయేట్ వీసాపైనా దృష్టి పెట్టింది. ఈ విధానం ద్వారా వస్తున్న విదేశీ విద్యార్థుల కారణంగా దేశంలోని యువతకు ఉద్యోగ అవకాశాలు తగ్గుతున్నట్లు బ్రిటన్ సర్కారు భావిస్తోంది. దీంతో మూడేళ్ల క్రితం ప్రారంభించిన గ్రాడ్యుయేట్ వీసా స్కీమ్‌ను రద్దు చేయనున్నారనే వార్తలు వచ్చాయి.

ఇంకా సమీక్ష దశలోనే

యూకే గ్రాడ్యుయేట్ వీసా రద్దు చేయనుందనే వార్తలపై ఆ దేశ ప్రభుత్వం తాజాగా స్పందించింది. వీసా రద్దు ప్రతిపాదన ఇంకా సమీక్ష దశలోనే ఉందని తెలిపింది. అంతేకాకుండా గ్రాడ్యుయేట్ వీసాను ప్రస్తుత రూపంలోనే కొనసాగించాలని 'ద యూకే మైగ్రేషన్ కమిటీ' ఇటీవల సిఫార్సు చేసింది. దీంతో.. ఇప్పటికే అక్కడ చదువుతున్న భారత విద్యార్థులకు, అదేవిధంగా ఈ అకడమిక్ సంవత్సరంలో అడుగుపెడుతున్న విదేశీ విద్యార్థులకు గ్రాడ్యుయేట్ రూట్ వీసా పొందే విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మన విద్యార్థులకు ప్రతికూలం

యూకే ప్రభుత్వం గ్రాడ్యుయేట్ రూట్ వీసాను రద్దు చేస్తే.. భారత విద్యార్థులపైనే ఎక్కువ ప్రతికూల ప్రభావం పడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఎందుకంటే.. యూకేలో.. యూజీ, పీజీ, పీహెచ్‌డీల కోసం అడుగు పెడుతున్న అంతర్జాతీయ విద్యార్థుల్లో భారత విద్యార్థులే 80 శాతం మేరకు ఉంటున్నారు. ఇప్పటికే ఇతర వీసాల్లో నిబంధనల కారణంగా భారత విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. ముఖ్యంగా గ్రాడ్యుయేట్ స్టూడెంట్స్.. డిపెండెంట్స్‌ను తీసుకురాకూడదనే నిబంధనతో విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పట్టిందని చెబుతున్నారు.

గ్రాడ్యుయేట్ వీసా.. అర్హతలు

విద్యార్థులు గ్రాడ్యుయేట్ వీసాకు దరఖాస్తు చేసుకునే నాటికి యూకేలో ఉండాలి. ప్రస్తుతం స్టూడెంట్ వీసా లేదా విద్యాభ్యాసం కోసం ఇచ్చే టైర్–4 జనరల్ వీసా కలిగుండాలి. యూకే విద్యా విధానం నిబంధనల ప్రకారం–నిర్దేశించిన కనీస కాలపరిమితితో ఆయా కోర్సులు పూర్తి చేసి ఉండాలి. ఉదాహరణకు పీజీని కనీసం 12 నెలల వ్యవధిలో స్టూడెంట్ వీసా లేదా, టైర్–4 జనరల్ వీసా ద్వారా చదివుండాలి.

స్టూడెంట్ వీసా ముగిసేలోపే

గ్రాడ్యుయేట్ వీసాకు దరఖాస్తు చేసుకుని పోస్ట్ స్టడీ వర్క్ అవకాశం పొందాలనుకునే విద్యార్థులు.. తమ స్టూడెంట్ వీసా లేదా టైర్–4 జనరల్ వీసా కాలపరిమితి ముగిసేలోపే గ్రాడ్యుయేట్ వీసాకు దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థులు తమ కోర్సులకు సంబంధించి సర్టిఫికెట్లు పొందకముందే గ్రాడ్యుయేట్ వీసాకు దరఖాస్తు చేసుకోవచ్చు. అందుకోసం తాము కోర్సులు చదివిన ఇన్‌స్టిట్యూట్ లేదా కాలేజీల నుంచి కోర్సు పూర్తి చేసుకున్నట్లు ధ్రువీకరణ పొందాల్సి ఉంటుంది.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు

గ్రాడ్యుయేట్ వీసాకు దరఖాస్తు చేయాలనుకునే విద్యార్థులు ఈ ప్రక్రియ మొత్తాన్ని ఆన్‌లైన్‌లో పూర్తి చేయాలి. నిర్దేశిత డాక్యుమెంట్లను అందించాల్సి ఉంటుంది. అవి.. పాస్‌పోర్ట్ ఐడెంటిటీ ప్రూఫ్, స్కాలర్‌షిప్ లేదా స్పాన్సర్‌షిప్ ప్రొవైడర్ నుంచి ధ్రువీకరణ పత్రం, కోర్సు ప్రవేశ సమయంలో ఇచ్చే కన్ఫర్మేషన్ ఆఫ్ యాక్సెప్టెన్స్ ఫర్ స్టడీస్ (సీఏఎస్) రిఫరెన్స్ నెంబర్, బయో మెట్రికల్ రెసిడెన్స్ పర్మిట్‌లను సిద్ధంగా ఉంచుకోవాలి. పీహెచ్‌డీ విద్యార్థులకు అకడమిక్ టెక్నాలజీ అప్రూవల్ స్కీమ్ సర్టిఫికెట్ కూడా అవసరం.



ఎనిమిది వారాల్లో నిర్ణయం

ఆన్‌లైన్‌లో గ్రాడ్యుయేట్ వీసాకు దరఖాస్తు చేసుకున్నాక.. సదరు దరఖాస్తును పరిశీలించి తుది నిర్ణయం తీసుకోవడానికి గరిష్టంగా ఎనిమిది వారాల సమయం పడుతుందని యూకే ఇమిగ్రేషన్ వర్గాలు పేర్కొంటున్నాయి. దరఖాస్తుకు ఆమోదం లభిస్తే.. ఈ–మెయిల్ లేదా యూకే ఇమిగ్రేషన్ పోర్టల్‌లో దానికి సంబంధించిన ధ్రువీకరణను తెలుసుకోవచ్చు.

గ్రాడ్యుయేట్ వీసా.. ప్రయోజనాలు

గ్రాడ్యుయేట్ వీసాతో విదేశీ విద్యార్థులకు పలు ప్రయోజనాలు ఉన్నాయి. ముఖ్యంగా కోర్సు పూర్తయ్యాక అక్కడే ఉండి ఉద్యోగాన్వేషణ సాగించే అవకాశం ఉంది. అంతేకాకుండా ఒకటి కంటే ఎక్కువ ఉద్యోగాలు చేసుకునే వీలుంది. దీంతోపాటు స్వయం ఉపాధి అవకాశాలు, స్వచ్ఛంద సేవ చేయడం, గ్రాడ్యుయేట్ వీసా కాల పరిమితి సమయంలో యూకే నుంచి స్వదేశానికి లేదా ఇతర దేశాలకు వెళ్లి, మళ్లీ యూకేకు తిరిగిరావచ్చు. ఈ విధానంతో విద్యార్థులు గ్రాడ్యుయేట్ వీసాకు దరఖాస్తు చేసుకుని.. ఆ వీసా కాల పరిమితి సమయంలో అక్కడే ఉండి ఉద్యోగం సొంతం చేసుకుని పర్మనెంట్ రెసిడెన్సీ పొందొచ్చు.

ఉన్నత విద్య

యూకే ఉన్నత విద్యకు సంబంధించి భారత విద్యార్థులకు ప్రధానంగా కలిసొచ్చే అంశం.. మాస్టర్స్ డిగ్రీ (పీజీ)ని ఏడాది వ్యవధిలోనే పూర్తి చేసుకునే అవకాశం ఉండటం. ఈ కోర్సులను భారత్‌లోని రెండేళ్ల పీజీ కోర్సులకు తత్సమాన అర్హతగా గుర్తిస్తున్నారు. ఏడాది వ్యవధిలోనే పీజీ పూర్తి చేసుకోవచ్చనే ఉద్దేశంతో మన విద్యార్థులు యూకేకు పయనమవుతున్నారు. దీంతోపాటు ఇతర దేశాలతో పోల్చుకుంటే యూకేలో అకడమిక్ వ్యయాలు కొంత తక్కువగా ఉండడం కూడా కలిసొచ్చే అంశంగా చెప్పొచ్చు.

టైర్-4కు ఆదరణ ఎక్కువ

గ్రాడ్యుయేట్ రూట్ వీసాతో పాటు పలు రకాల వీసాలు యూకేలో అందుబాటులో ఉన్నాయి. వీటిని టైర్ –1 నుంచి టైర్– 6గా వర్గీకరించారు. విదేశీ విద్యార్థులకు ఉన్నత విద్య కోసం ఇచ్చే టైర్ –4 వీసాకు ఎక్కువ ఆదరణ లభిస్తోంది. యూకేలో ఉద్యోగం కోస టైర్–2 వీసాలను మంజూరు చేస్తున్నారు. ఉద్యోగం పొందిన అభ్యర్థులు.. జాబ్ ఇచ్చిన యాజమాన్యం నుంచి స్పాన్సర్‌షిప్ లెటర్‌ను అందించాల్సి ఉంటుంది. అక్కడే టైర్–2 కేటగిరీ వీసాతో విద్యను అభ్యసించి పోస్ట్ స్టడీ వర్క్ ఉద్యోగాన్వేషణ సాగిస్తూ.. ఉద్యోగం సొంతం చేసుకున్న విద్యార్థులు తమ టైర్–2 వీసాను టైర్–4 వీసాగానూ మార్చుకునే అవకాశం ఉంది.

టైర్-5.. టెంపరరీ వర్క్ వీసా

యూకే అందిస్తున్న వీసాల్లో మరో ముఖ్యమైన వీసా.. టైర్–5 టెంపరరీ వర్క్ వీసా. వేరే దేశంలో ప్రధాన కార్యాలయం ఉండి..యూకేలో క్లయింట్లను కలిగి ఉన్న సంస్థలు.. యూకేలోని ఆ క్లయింట్ల కార్యాలయంలో కొద్ది కాలం పాటు పని చేసే అవకాశం కల్పిస్తూ.. టైర్–5 వీసా మంజూరు చేస్తారు.

వినూత్న కోర్సులు

వినూత్న కోర్సులకు నెలవుగా యూకేను పేర్కొనొచ్చు. వీటిని ప్రధానంగా నాలుగు విభాగాలుగా వర్గీకరించొచ్చు. అవి.. ఆర్ట్స్ అండ్ హ్యుమానిటీస్; ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ; నేచురల్ సైన్సెస్; మెడికల్ సైన్సెస్. యూకే యూనివర్సిటీలకు ఆర్ట్స్ అండ్ హ్యుమానిటీస్ కోర్సులను అందించడంలో ప్రపంచవ్యాప్తంగా మంచి పేరుంది. యూనివర్సిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్, యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జ్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్(ఎల్ఎస్ఈ), యూనివర్సిటీ కాలేజ్ లండన్ (యూసీఎల్), ద యూనివర్సిటీ ఆఫ్ ఈడెన్‌బర్గ్‌లకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉంది.

గ్రాడ్యుయేట్ రూట్ వీసా..ముఖ్యాంశాలు

- 2021, జూలై 1 నుంచి అమల్లోకి వచ్చిన గ్రాడ్యుయేట్ వీసా విధానం.
- బ్యాచిలర్, పీజీ విద్యార్థులు రెండేళ్లు, పీహెచ్‌డీ అభ్యర్థులు మూడేళ్లు అక్కడే ఉండి పోస్ట్ స్టడీ వర్క్ అవకాశాలు అన్వేషించుకునే అవకాశం.
- ఉద్యోగం సొంతం చేసుకున్నాక.. వర్క్ వీసాకు బదిలీ చేసుకునే అవకాశం.
- కోర్సుల సర్టిఫికెట్లు రాకముందే గ్రాడ్యుయేట్ వీసాకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు.